ఈనాడు

కరీంనగర్ 6-1-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 147

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



THE GREAT 2018 SALE
ఎదురుచూపులు ఇక అంతమయ్యాయి.
అత్యద్భుతమైన పిజన్ న్యూ ఇయర్ సేల్ మళ్ళీ వచ్చింది.
Pigeon®
Hot Auto Clean
Black Pearl Chimney 60
Feather Touch LED Control
7 Years Warranty
Baffle Filter with Oil Collector
Air Flow (m3h) 1100
Black Pearl Chimney 60 + Blackline 4 Burner Oval ZZ Glass Cooktop
COMBO MRP ₹27,685
OFFER PRICE ₹13,995
Blackline 4 Burner Oval ZZ Glass Cooktop
550W Powerful Motor
2 Years Warranty on Motor
Prime Mixer Grinder + Deluxe Pressure Cooker 3L
COMBO MRP ₹4,240
OFFER PRICE ₹2,018
4-in-1 Starter Kit (Pressure Cooker IB 5L + Junior Pressure Pan + Flat Tawa 250 IB + Kadai 200 IB with Stainless Steel Lid)
COMBO MRP ₹3,695
OFFER PRICE ₹2,018
Induction Base
Favourite 2 Burner Glass Cooktop + Favourite Duo Pack (Flat Tawa 250 + Fry Pan 240)
COMBO MRP ₹4,590
OFFER PRICE ₹2,018
Rapido Cute Induction Cooktop + 2-in-1 Starter Kit (Favourite Cooker IB 3L + 250 Tawa IB)
COMBO MRP ₹4,430
OFFER PRICE ₹2,018
Induction Base
Egnite Electric Kettle 1L + Flask 500 ml + Gale Iron + Handy Chopper + Radiance Emergency LED Lamp
COMBO MRP ₹3,775
OFFER PRICE ₹2,018
STOVEKRAFT
PRESSURE COOKERS | HARD ANODISED COOKWARE | NON-STICK COOKWARE | LPG COOKTOPS AND HOBS | INDUCTION COOKTOPS | CHIMNEYS | MIXER GRINDERS | EMERGENCY LAMPS | SMALL APPLIANCES
www.stovekraft.com/pigeon
Follow Pigeon Kitchen Appliances on
Toll Free Service Helpline (Monday to Saturday - 9:00 am to 6:00 pm): 1800 425 66666 | Missed Call: 9740034444 | SMS <TALK> to 9740034444 | Email: customercare@stovekraft.com

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 6-1-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 147

రూ. 5-00. పేజీలు 18+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

మేలోనే.. రూ.4 వేలు

- ఆ నెల 15లోగా తొలివిడత నగదు అందజేత
- ఈ ఏడాది నుంచే వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం
- అమలు మార్గదర్శకాలపై పోచారం అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం
- ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- సాగుకయ్యే ఖర్చును పొందుపరుస్తాం
- రైతులకు పెట్టుబడి, మద్దతుకు నిధి కేటాయింపు
- రైతు సమన్వయసమితుల ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు
- కేంద్రం అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలి
- వ్యవసాయ సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్



ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలోని రైతులకు ఈ ఏడాది నుంచే వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం (ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్ స్కీం)ను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. మే 15 నాటికి మొదటి విడత ఎకరానికి రూ.4 వేల చొప్పున పెట్టుబడిని అందిస్తామన్నారు. ఈ పథకాన్ని ఎలా అమలు చేయాలి. రైతులకు నేరుగా డబ్బులివ్వాలా? బ్యాంకుల ద్వారా అందించాలా? సాగుభూములను ఎలా గుర్తించాలి? ఏ ప్రాతిపదిక పెట్టుబడి అందించాలి? అనే అంశాలపై అధ్యయనం చేయడానికి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతామని తెలిపారు. సాగు అభివృద్ధికయ్యే ఖర్చును ముందే అంచనా వేసి బడ్జెట్‌లో పొందుపరుస్తామని, రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతో పాటు మద్దతు అందించడానికి కొంత నిధిని కూడా కేటాయిస్తామన్నారు. మద్దతు ధరలపై నిజాయితీగా వ్యవహరిస్తామని, వరి, మక్కలు, పప్పుల వంటి సంప్రదాయ పంటలతో పాటు పసుపు, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలు, మామిడి, బత్తాయి నిమ్మ లాంటి పండ్లకు మంచి ధర తేవడమే తమ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పంటలను సమన్వయ సమితుల ద్వారా నేరుగా కొనుగోలు చేసి, తిరిగి అమ్ముతామని, నష్టం వచ్చినా భరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా అన్ని పంటలకు మద్దతు ధరలను ప్రకటించాలని, దీనిపై కేంద్రంతో మాట్లాడతామని, పార్లమెంటులోని తమ పార్టీ ఎంపీలు దీనిని ప్రస్తావిస్తారన్నారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో ఆయన వ్యవసాయంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల కొంత మార్పు వచ్చింది. రైతులకు మేలు జరుగుతోంది. అంతిమంగా రైతులు పండించిన పంటకు మంచి ధర రావాలన్నది మా ప్రభుత్వం ముందున్న లక్ష్యం. రాష్ట్రంలో పండించిన ప్రతి పంట మార్కెట్ (మిగతా 2లో)

కల్తీలపై కన్నెర్ర

కల్తీ విత్తనాలను అరికట్టడంతో గత ఏడాది విజయవంతమయ్యాం. ఈ ఏడాది కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. విత్తనాల తయారీదారులు, అమ్మకందారుల వివరాలు, ఫొటోలను ముందే సేకరించాలి. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా వెంటనే స్పందించాలి. ఎరువుల కొరత రాకుండా స్టాక్ పెట్టుకున్నారు. అయినా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలి. పంటలకు చీడ, పీడలు రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. రైతులను చైతన్య పరచాలి.



నల్గొండ జిల్లా ఉస్మాన్‌కుంటకు చెందిన కేతావత్ సిరి, సుక్కు దంపతులు.. ఐదో కుమార్తెను డిసెంబరు 2న నల్గొండలోని శిశుగృహంలో చేర్పించారు. తర్వాత తల్లి తట్టుకోలేకపోయింది. ఏడు రోజులకు తిరిగి బిడ్డను ఇంటికి తెచ్చుకున్నారు. తల్లిదండ్రులు పనులకు వెళ్లిపోగా, పెద్దకుమార్తె ఆ చిన్నారిని చూసుకుంటోంది. మొత్తం ఐదుగురిలో ఇద్దరు అనారోగ్యం కారణంగా చనిపోయారు.

తండా.. తల్లిడిల్లుతోంది!

మగబిడ్డ పుడితేనే అమ్మ పిలుపు

ఆడబిడ్డ పుడితే అంతేసంగతి

చనుబాలకు నోచుకోని చిన్నారులెందరో!

గిరిజన ప్రాంతాల్లో కొనసాగుతున్న సాంఘిక దురాచారం

బిడ్డను కంటే తల్లికాదు!
మగబిడ్డను కంటేనే తల్లి!!

పదిమంది ఆడ పిల్లలకు జన్మనిచ్చినా గొడ్రాలు అంటూ హేళన. అసలు అమ్మాయి పుడితే చాలు... ఈసడింపు! గుక్కపట్టి ఏడ్చినా, బిడ్డకు పావెడు పాలిచ్చేందుకు వీల్లేని పరిస్థితులు. తల్లి కడుపులోంచి కన్నుతెరిచిన ఆడబిడ్డ నేరుగా శిశుగృహాల్లోని ఊయల్లోకి వెళ్లాల్సిందే. లేదంటే... భూగర్భంలో సేదతీరాల్సిందే. నవమాసాలు మోసి కన్న బిడ్డలను చూడని తల్లులెందరో. తెలంగాణ గిరిజన ప్రాంతాల్లో నేటికీ వెంటాడుతున్న సాంఘిక దురాచారమిది!

- 'ఈనాడు' ప్రత్యేక కథనం -7లో

తెలివితక్కువ ప్రతిపాదన

- హెచ్1బీ వీసాల పొడిగింపును నిలిపివేస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ
- కొంత మంది కాంగ్రెస్ శాసనకర్తల హెచ్చరిక

10లో

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

- కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ వెల్లడి
- ముగిసిన శీతాకాల సమావేశాలు

10లో



ఇసుక మాఫియాపై గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

- గవర్నర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు
- సీఎం, ఆయన కుమారుడికి సంబంధాలున్నాయన్న నేతలు
- మీరెలా చెబుతారన్న నరసింహన్
- గవర్నర్, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం!

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అక్రమ ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందంటూ తెలంగాణ కాంగ్రెస్ నేతలు శుక్రవారం గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్ష నేతలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డి.కె.అరుణ, సంపత్‌కుమార్ తదితరులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇసుక అక్రమాలపై అవినీతి నిరోధకశాఖ చేత సమగ్ర విచారణ జరిపించి (మిగతా 2లో)

కాకి వాగులో ఇసుక లభ్యత లేదు

- కారేగాం ప్రమాదంలో మృతి చెందిన సాయిలు వీఆర్ఏ కాదు
- అతని మృతితో ఇసుకకు ఎటువంటి సంబంధం లేదు
- 'ఈనాడు'లో యథార్థం రాశారు
- కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేత

-6లో

నెలకో రోజు పుస్తకాల సంచి వద్దు

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- 2019-20 నుంచి ఆన్‌లైన్ ప్రవేశాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెలకు ఒకరోజు విద్యార్థులు పుస్తకాల సంచి లేకుండా బడికి వెళ్లే (నో స్కూల్ బ్యాగ్ డే) విధానం అమలు చేస్తామని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. ప్రస్తుతం ఈ విధానం కర్ణాటకతో పాటూ పలు రాష్ట్రాల్లో అమల్లో ఉందన్నారు. ఇప్పటికే బడి సంచి బరువు తగ్గింపుపై జీఓ జారీ చేశామని, ప్రస్తుతం (మిగతా 2లో)

ఔషధమే.. వ్యాధిస్తోంది

- చీటికి మాటికి మందుల వినియోగంతో అనర్థాలే
- వైద్యుని చీటీ లేకుండానే కొనుగోళ్లు
- ఇటీవల కాలంలో పెరిగిన ధోరణి
- ఊపిరితిత్తులు, కాలేయంపై తీవ్ర ప్రభావం



ఈనాడు, హైదరాబాద్: కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి కాళ్లు చేతులు లాగుతున్నాయనీ, నీరసంగా ఉంటోందని ఇటీవల హైదరాబాద్‌లో ఓ వైద్యుణ్ని సంప్రదించాడు. వైద్య పరీక్షల్లో అతని రెండు మూత్రపిండాలూ దెబ్బతిన్నాయని నిర్ధారణ అయింది. చెడు అలవాట్లు లేకపోయినా ఎందుకిలా జరిగింది? అనే దిశగా వైద్యుడు అతన్ని లోతుగా విచారించాడు. 'ఐదారేళ్ల కిందట ఒళ్లు నొప్పులతో స్థానిక వైద్యుణ్ని సంప్రదించగా 'ఐబూప్రొఫెన్' ఔషధాన్ని రాసిచ్చాడని, నొప్పులున్న ప్రతి సందర్భంలోనూ వైద్యుని ప్రమేయం లేకుండా అదే ఔషధాన్నే వాడుతున్నానని' రోగి చెప్పడంతో వైద్యుడిని విషయం బోధపడింది. నొప్పిమాత్రలను దీర్ఘకాలం వాడటం వల్ల మూత్రపిండాలకు ముప్పుంటుందని తెలుసుకోలేని రోగి.. ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నాడు. ఆయనొక్కడే (మిగతా 2లో)

కాళేశ్వరం పరిశీలనకు 7న కేంద్ర బృందం రాక

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు కేంద్ర బృందం రాష్ట్రానికి రానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని అనుమతులు కేంద్ర జలసంఘం నుంచి రావాల్సి ఉంది. పెట్టుబడి ప్రయోజనం, సాగునీటి ప్రణాళికకు సంబంధించి డైరెక్టరేట్ల నుంచి అనుమతి కోసం కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిని పరిశీలించిన జలసంఘం ఇంజినీర్లు కొన్ని సందేహాలను లేవనెత్తినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 225 టీఎంసీలను వినియోగించుకోనుండటం, ఇందులో 180 టీఎంసీలను మేడిగడ్డ నుంచి మళ్లించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ (మిగతా 2లో)

ఇదీ సంగతి!



వ్యవసాయ భూములు 1.42 కోట్ల ఎకరాలు

- దస్త్రాల ప్రక్షాళనతో స్పష్టత
- 2.38 కోట్ల ఎకరాల భూ దస్త్రాలకు పచ్చజెండా
- జిల్లాల్లో కొనసాగుతున్న ఉన్నతాధికారుల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగు భూముల వివరాల్లో పూర్తి స్పష్టత వచ్చింది. 1956వ సంవత్సరం తర్వాత భూముల లెక్కలు తేల్చడం ఇదే ప్రథమం. 30 జిల్లాల పరిధిలో సాగవుతున్న భూముల విస్తీర్ణం 1.42 కోట్ల ఎకరాలుగా తేలింది. రాష్ట్ర ప్రభుత్వం సాగుకు పెట్టుబడి అందించేందుకు వీలుగా సాగు భూములు, వాటి యజమానులు ఎవరో తేల్చేందుకు భూదస్త్రాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబరు 15వ తేదీన ప్రారంభమైన ఈ ప్రక్రియ డిసెంబరు 31న ముగిసింది. అనంతరం జిల్లాల వారీగా సమాచారం క్రోడీకరించి తుదినివేదికను సిద్ధం చేశారు. ఇందులో రెవెన్యూ బృందాలు మొత్తం 2.50 కోట్ల ఎకరాల భూమికి సంబంధించిన దస్త్రాలను వడపోశాయి. గ్రామస్థాయిలో 54 రకాల అంశాలకు సంబంధించి భూముల వివరాలు సేకరించాయి. గ్రామసభల అనంతరం దస్త్రాలను పరిశీలించి నవీకరించాయి. ప్రభుత్వ భూములు, వినియోగంలో ఉన్న సాగు భూములు, లేనివీ. పక్కాగా లెక్కలు తీశాయి. ప్రత్యేకంగా రిజిస్టరు నిర్వహించి రికార్డు చేశాయి.

10878 గ్రామాల్లో పరిశీలన: మొత్తం 30 జిల్లాల పరిధిలోని 10,878 గ్రామాల్లో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ బృందాలు పరిశీలించాయి. దీంతో ఏయే భూముల దస్త్రాల పరిస్థితి ఏమిటన్నది తేటతెల్లమైంది. రెవెన్యూ, సివిల్ కోర్టుల్లో వ్యాజ్యాలు నడుస్తున్న భూములకు సంబంధించిన సమాచారం స్పష్టత రావాల్సి ఉంది. పరిశీలన పూర్తయిన భూముల్లో 2.38 కోట్ల ఎకరాలకు సంబంధించిన దస్త్రాలకు పచ్చజెండా ఊపారు. దాదాపు 71 లక్షల మంది రైతులు ఉన్నట్లు భూ దస్త్రాల పరిశీలనలో తేలింది. 1.42 కోట్ల ఎకరాల సాగు భూమిని గుర్తించారు. ఇప్పటికే లక్షల ఎకరాల వ్యవసాయ భూములు వ్యయసాయేతర రంగాలకు మళ్లినట్లు గుర్తించగా.. పడావుగా ఉంచిన విస్తీర్ణం కూడా భారీగానే ఉన్నట్లు అధికారుల లెక్కల్లో తేలింది.

ఎప్పటికప్పుడు సమాచార నమోదు: భూదస్త్రాల ప్రక్షాళన సమాచారం మండలాల నుంచి ఎప్పటికప్పుడు రాజధాని చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికోసం ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్ ప్రోగ్రాం(ఎల్ఆర్‌యూపీ) పేరుతో ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించారు. గ్రామస్థాయిలో పరిశీలన పూర్తయి, స్పష్టత వచ్చిన భూములకు సంబంధించిన సమాచారం ఎప్పకప్పుడు దీనిలో నమోదు చేశారు. డిసెంబరు 31 నాటికి గ్రామ స్థాయిలో పరిశీలన పూర్తికాగా సమాచార నమోదు నేటికీ కొనసాగుతోంది. ప్రభుత్వ భూముల సమాచారం ధ్రువీకరించిన తర్వాత రైతులందరికీ అందుబాటులో ఉంచేందుకు మాభూమి(వెబ్‌ల్యాండ్)లో ఉంచనున్నారు. భూ ప్రక్షాళన ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, ఇప్పటికీ ఎవరైనా రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలన చేస్తున్నట్లు క్షేత్రస్థాయిలో అధికారులు చెబుతున్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ నూతనంగా ప్రారంభించిన దివ్యాంగుల జాతీయ పార్కు ఇది

దివ్యాంగులకు మూడు శాతం ఇళ్లు కేటాయిస్తాం

- వారి కోసం ప్రత్యేక ఐటీ పార్కు
- కాంగ్రెస్ ఎప్పటికీ అధికారంలోకి రాలేదు
- మంత్రి కేటీఆర్
- గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపాటు

-3లో

మూడో వారంలో బీసీ సంక్షేమ పథకాలు

- ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- బ్యాంకుల అనుసంధానం లేకుండా రుణాలు
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి

-2లో

కర్ణాటకలో యోగి ఆదిత్యనాథ్ ప్రచారం!

దిల్లీ: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే కర్ణాటక, త్రిపుర రాష్ట్రాల్లో భాజపా తరఫున ప్రచారం నిర్వహించనున్నారు. ఇదే అంశమై ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిత్యనాథ్‌లు చర్చించుకున్నారని సమాచారం. శుక్రవారం దిల్లీ వచ్చిన యోగి ఆదిత్యనాథ్ ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. లఖ్‌నవూలో త్వరలో నిర్వహించనున్న పెట్టుబడిదారుల సమావేశం గురించి వివరించటానికి యోగి వచ్చారని, ఇదే సమయంలో కర్ణాటక, త్రిపురలలో ఎన్నికల ప్రచార అంశమూ చర్చకు వచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రధానికి గీతా రహస్యం పుస్తకం ప్రతిని ఆదిత్యనాథ్ అందజేస్తున్నట్లుగాఉన్న చిత్రాన్ని ప్రధాని కార్యాలయం ట్విటర్‌లో పోస్ట్ చేసింది.

అమృత వ్యాజ్యంపై 25లోపు సమాధానం ఇవ్వండి

తమిళనాడు ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఆదేశం

చెన్నై, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత కుమార్తెగా హక్కులు కోరుతూ అమృత దాఖలు చేసిన వ్యాజ్యంపై ఈ నెల 25లోపు సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. జయలలిత కుమార్తెనంటూ బెంగళూరుకు చెందిన అమృత హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే

మూడో వారంలో బీసీ సంక్షేమ పథకాలు

- ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- బ్యాంకుల అనుసంధానం లేకుండా రుణాలు
- మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి



బీసీ సంక్షేమంపై శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, జోగు రామన్న, అజ్మీరా చందూలాల్, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

ఈనాడు, హైదరాబాద్: బీసీ సంక్షేమం కోసం ఈ నెల మూడోవారంలో సీఎం కేసీఆర్ పథకాలు ప్రారంభించనున్నారని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. 2018-19 ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంక్షేమ సంవత్సరమని పేర్కొన్నారు. నాయిబ్రాహ్మణ, రజక, విశ్వబ్రాహ్మణ, సంచార జాతుల అభివృద్ధి కోసం నూతన పథకాలు అమలు చేయాలని నిర్ణయించామన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో కులసంఘాలు, అధికారులతో సమావేశమై బీసీ సంక్షేమంపై నివేదిక సిద్ధం చేశామని, త్వరలోనే సీఎం కేసీఆర్‌కు అందించనున్నామని చెప్పారు. శుక్రవారమిక్కడ మంత్రులు జోగురామన్న, జగదీష్‌రెడ్డి, చందూలాల్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు సంక్షేమ అధికారులు అశోక్‌కుమార్, బుర్రావెంకటేశం, అనితా రాజేంద్ర, సైదా, మల్లయ్యభట్టు, రాజశేఖర్, చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. బ్యాంకుల అనుసంధానం లేకుండా లబ్ధిదారులకే నేరుగా రాయితీ ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఎంబీసీల సంక్షేమంలో భాగంగా సంచార జాతులకు రూ.లక్ష రుణాన్ని ఇవ్వనున్నామని, నాయిబ్రాహ్మణులకు కొత్త దుకాణాలు పెట్టుకునేందుకు, ఆధునికీకరించేందుకు నిధులు అందిస్తామన్నారు. తొలుత సంచార జాతులు, ఆ తర్వాత రజక, నాయిబ్రాహ్మణ, విశ్వకర్మలకు వృత్తుల వారీగా నిధులు ఇస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పథకాల అమలుపై చర్చలు నిర్వహించారు. లబ్ధిదారుల నమోదుకు ప్రత్యేక పోర్టల్ సిద్ధం చేయాలని సమావేశంలో మంత్రులు నిర్ణయించారు. ఒక్కోకులం నుంచి కనీసం మూడు వేల కుటుంబాలకు ప్రయోగాత్మకంగా సహాయం చేయాలని, ఆ తర్వాత మిగతా అర్హులకు విస్తరించాలన్న ఆలోచన చేశారు. లబ్ధిదారులకు వ్యాపారాల నిర్వహణ కోసం అవసరమైన అనుమతి (ట్రేడ్‌లైసెన్సు) ఇప్పించేందుకు బీసీ సంక్షేమశాఖ, జీహెచ్ఎంసీ కలిసి ప్రత్యేక మేళా నిర్వహించాలని తీర్మానించారు. పథకాలను గ్రామ, మండల, జిల్లా, జీహెచ్ఎంసీ స్థాయిల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

తండాలను గ్రామపంచాయతీలు చేస్తాం

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని తండాలన్నింటినీ గ్రామ పంచాయతీలుగా చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. గిరిజనులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. తెలంగాణ గిరిజన విద్యార్థి సంఘం 11వ వార్షికోత్సవ సభను శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు లునావత్ నెహ్రూ నాయక్ అధ్యక్షతన జరిగిన సభకు ఈటల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాములునాయక్, ప్రొఫెసర్ చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు: కేంద్రం

దిల్లీ: సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. డిజిటల్ లావాదేవీల్లో భద్రతపై రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మూడేళ్లలో సైబర్ నేరాల కేసులు పెరిగాయని.. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు మంత్రి వివరించారు. బాలల అశ్లీల వెబ్‌సైట్లను అధికసంఖ్యలో నిషేధించినట్లు తెలిపారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలను ఉటంకిస్తూ 79 అంతర్జాల చౌర్య(ఫిషింగ్) ఘటనలు 22 ఆర్థికసంస్థలను ప్రభావితం చేసినట్లు వివరించారు. అలాగే 13 ఘటనల ప్రభావం ఏటీఎంలు, పీవోఎస్‌లు, యూపీలపై పడినట్లు తెలిపారు. క్రెడిట్‌కార్డుల మోసాలపై ఆర్‌బీఐ పలు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. భీమ్ యాప్‌కు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు నమోదుకాలేదని వివరించారు.

స్టెంట్ల అధిక ధరలపై 40 ఫిర్యాదులు

దిల్లీ: హృద్రోగాలకు వినియోగించే స్టెంట్లను, ఆసుపత్రులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ)కు ఇంతవరకు 40 ఫిర్యాదులు అందినట్లు ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. ఈమేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ ఎల్. మాండవీయ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఔషధ ధరల నియంత్రణ నిబంధనల కింద ఆయా ఆసుపత్రులపై చర్యలు చేపట్టినట్లు వివరించారు.



ప్రగతి భవన్‌లో వ్యవసాయంపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ప్రభుత్వ సలహాదారులు అనురాగ్‌శర్మ, రాజీవ్‌శర్మ, మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జోగు రామన్న, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి

మేలోనే.. రూ.4 వేలు

(మొదటి పేజీ తరువాయి)

నెట్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతు ధరల కోసం ఎలాంటి విధానాలను పాటిస్తున్నారో అధ్యయనం చేయాలి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో పర్యటించి నివేదిక ఇవ్వాలి. దీనికి అనుగుణంగా ప్రభుత్వ విధానం ఉంటుంది. రైతులు సుస్థిరంగా ఉంటేనే రాష్ట్రం ప్రశాంతంగా ఉంటుంది. వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సమైక్య రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు చర్యలు చేపట్టాం. సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. చెరువులను పునరుద్ధరించాం. నిరంతర విద్యుత్‌నిస్తున్నాం, ఎరువులు, విత్తనాల కొరతను నివారించాం. ప్రతి అయిదువేల ఎకరాలకొక విస్తరణాధికారిని నియమించాం. రైతులను సంఘటిత శక్తిగా మార్చేందుకు సమన్వయసమితులను తెచ్చాం. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని బలోపేతం చేశాం. ఈ ఏడాది నుంచే రైతులకు ఎకరానికి రూ. ఎనిమిదివేల సాయం అందించబోతున్నాం.

కేంద్రం ఉదారంగా ఉండాలి: మద్దతు ధరల విషయంలో కేంద్రం ఉదారంగా ఉండాలి. వరి,మక్కలకు మద్దతు ధరకు రూ. 2 వేలుగా ప్రకటించాలి. దేశంలో పండే అన్ని పంటలను పరిగణనలోనికి తీసుకొని మద్దతు ధర ప్రకటించాలి. మార్కెట్ ఉన్న, నాణ్యత గల పంటలే కావాలి. రాష్ట్రంలో ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలు ఎన్ని అనే విషయంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నాం. దానికి అనుగుణంగా క్రాప్‌కాలనీలను నిర్ధారించి, పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. మంచి మార్కెట్ ఉన్న పంటలు, నాణ్యత రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని రైతులను కోరతాం. రాష్ట్రంలో ఏ ఎకరంలో ఏ పంట వేశారనే లెక్కలు వ్యవసాయ శాఖ వద్ద ఉండాలి. రెవెన్యూ శాఖపై ఆధారపడవద్దు.

పోచారం, హరీశ్, అధికారులపై ప్రశంసలు: రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను అందించే విషయంలో మంత్రి పోచారం, ముఖ్యకార్యదర్శి పార్థసారథిల నాయకత్వంలోని అధికారులు విశేష కృషి చేశారు. వారికి అభినందనలు. పెట్టుబడి మద్దతు పథకం ఇలాగే విజయవంతం కావాలి. పోచారం అధ్యక్షతన ఏర్పాటయ్యే మంత్రివర్గ ఉపసంఘంలో మంత్రులు ఈటల, హరీశ్, తుమ్మల, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సభ్యులుగా ఉంటారు.

- రాష్ట్రంలోని కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల ఇతర పెండింగు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేయడానికి హరీశ్‌రావు, ఇతర అధికారులు బాగా కష్టపడుతున్నారు.
- ట్రాన్స్‌కో సీఎండీ విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలందించి కేంద్రం నుంచి సీబీఐపీ పురస్కారం పొందడం తెలంగాణకే గర్వకారణం

భూ రికార్డుల ప్రక్షాళన: తెలంగాణలో భూరికార్డుల ప్రక్షాళన పూర్తయింది. రాష్ట్రంలో 71,75,096 వ్యవసాయ ఖాతాలున్నాయి. 1,42,12,826.17 ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంది. ఈ కార్యక్రమాన్ని వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, కలెక్టర్లు విజయవంతంగా పూర్తి చేశారు. త్వరలో రైతులకు కొత్త పాస్ పుస్తకాలిస్తాం. ఇప్పటి నుంచి భూముల క్రయవిక్రయాలు జరిగిన వెంటనే ఆ వివరాలు రాష్ట్ర అధికారుల వద్ద నమోదు కావాలి. భూముల మ్యుటేషన్‌పై అధికారం తహసీల్దార్లకు అప్పగిస్తున్నాం. ఇక ఆర్డీవోల దగ్గరికి వెళ్లాల్సిన అవసరంలేదు. రాష్ట్రంలో 22.50 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల కొత్త గోదాములు అందుబాటులోకి వస్తాయి. అన్ని గోదాములు కలిసి 53 లక్షల సామర్థ్యంతో రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉంది. వీటిల్లో ఎరువులు, విత్తనాలు కూడా నిల్వ చేసుకోవచ్చు.' సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, జోగురామన్న, మహేందర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎండీసీ ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్‌ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌లు, ప్రభుత్వ సలహాదారులు రాజీవ్‌శర్మ, అనురాగ్‌శర్మ, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ఉన్నతాధికారులు పార్థసారథి, వెంకట్రాంరెడ్డి, వాకాటి కరుణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అక్రమ అరెస్టుపైనా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలకు, గవర్నర్ నరసింహన్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగినట్లు ఆ పార్టీ నాయకుల ద్వారా తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన తర్వాత కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పరిస్థితులను ఆయనకు వివరించారు. సీఎం, ఆయన కుమారుడు, బంధువుల పాత్ర ఇసుక మాఫియాలో ఉందని, అందుకే అక్రమ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతోందని ఉత్తమ్ చెప్పారని తెలిసింది. దీంతో గవర్నర్ ఆగ్రహానికి లోనయ్యారని సమాచారం. 'హౌ కెన్ యు టెల్ చీఫ్ మినిస్టర్ అండ్ హిజ్ సన్? యూ కాంట్ టెల్ చీఫ్ మినిస్టర్, యూ కాంట్ టెల్ చీఫ్ మినిస్టర్స్ సన్ (ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు ఉన్నారని మీరు ఎలా చెబుతారు? ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు ఉన్నారని మీరు చెప్పలేరు)' అని ఆయన ఆగ్రహంగా అన్నట్లు తెలిసింది. మందకృష్ణ అలా చేసి ఉండాల్సింది కాదనీ అన్నారు.

వాకౌట్ చేస్తా

గవర్నర్ వ్యాఖ్యలపై ఉత్తమ్ సహా కాంగ్రెస్ నేతలు అభ్యంతరం చెప్పారు. దీంతో నేతలకు, నరసింహన్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుందని సమాచారం. సమావేశాన్ని నేను వాకౌట్ చేస్తా అని గవర్నర్ అనడంతో వాగ్వాదం మరింత పెరిగిందని తెలిసింది. రాష్ట్రంలో ఏం జరుగుతుందో మీకు తెలుసా? ప్రజలు నిరసన తెలియజేసే ధర్నా చౌక్‌ను తీసేశారు.. మంద కృష్ణ గాంధేయ మార్గంలో తన కార్యాలయంలోనే నిరసన దీక్షకు దిగితే అరెస్టు చేస్తారా? అని గవర్నర్‌ను కాంగ్రెస్ నేతలు నిలదీసినట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. వీరి మధ్య దాదాపు 15 నిమిషాలు వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.

ఇసుక మాఫియా ఆగడాలు వివరించాం

గవర్నర్‌తో సమావేశం అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాజ్‌భవన్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. 'నేరెళ్ల ఘటనను మరిచిపోకముందే తాజాగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగాం గ్రామంలో వీఆర్ఏ సాయిలును ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసింది. ఘటన జరిగిన వెంటనే పోలీసులు ఆ గ్రామాన్ని దిగ్బంధనం చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? సాయిలు కుటుంబానికి రూ. 25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలి. గుత్తేదారుపై హత్య కేసు నమోదు చేయాలి. ఇసుక మాఫియా, అధికార పార్టీ నేతల ఆగడాలపై గవర్నర్‌కు వివరించాం. గతంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు దళితులను పోలీసులు చిత్రహింసలు పెట్టారు. బాధిత రైతులు జిల్లా ఎస్పీపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇసుక విధానంపై నిపుణులు, అఖిలపక్ష నేతలతో పునఃసమీక్ష జరిపి, సరైన విధానం రూపొందించాలని కోరాం. ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షాన్ని దిల్లీ తీసుకువెళ్తానని శాసనసభలో చెప్పిన సీఎం మాట నిలబెట్టుకోలేదు. అందుకే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గాంధేయ మార్గంలో తన కార్యాలయంలో నిరసన చేపట్టారు. ఆయనను అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు. కృష్ణ మాదిగను వెంటనే విడుదల చేసి, కేసులను భేషరతుగా ఎత్తివేయాలని గవర్నర్‌కు వినతిపత్రం అందజేశాం. ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు' అని ఉత్తమ్ చెప్పారు. మాజీ ఎంపీలు సర్వే సత్యనారాయణ, మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి దానం నాగేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, ఉపాధ్యక్షుడు నాగయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద తదితరులు గవర్నర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

సమావేశం సుహృద్భావంగా జరిగింది: రాజ్‌భవన్‌వర్గాలు

మరోవైపు శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందంతో గవర్నర్ నరసింహన్ సమావేశం సుహృద్భావ వాతావరణంలో సాగిందని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రి రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ ప్రతినిధిబృందం గవర్నర్‌కు వినతిపత్రాన్ని సమర్పించిందని, అందులోని అంశాలను పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారని పేర్కొంది. రాజ్‌భవన్ ఎల్లవేళలా గౌరవాన్ని, నిష్పాక్షికతను పాటిస్తుందని తెలిపింది. గవర్నర్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఆ ప్రకటనలో పేర్కొంది.

ఔషధమే.. వ్యాధిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

కాదు..అత్యధికులు ఇలాంటి అలవాటుతో లేనిపోని ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. సాధారణ జలుబు, దగ్గు మొదలుకుని గొంతు నొప్పి, ఇతర ఇన్‌ఫెక్షన్ల కారణంగా జ్వరం, ఒళ్లు నొప్పులు, మోకాళ్ల నొప్పులు, తలనొప్పి తదితర పలు అనారోగ్యాలకూ తమ ఇష్టానుసారంగా ఔషధాలను వినియోగించే ధోరణి తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. పత్రికలు, ప్రసార మాధ్యమాల వల్ల ఆరోగ్యంపై కొంతమేర అవగాహన పెరగడం..అంతర్జాలంలో అన్ని వ్యాధులకూ ఔషధాల సమాచారం లభ్యమవడం..గతంలో ఇదే జబ్బుకు వైద్యుడు రాసిచ్చిన చీటీ అందుబాటులో ఉండడం..వైద్యుని సంప్రదింపులు ఖరీదైన ప్రక్రియ కావడం వంటి కారణాలతో చాలామంది సొంతంగా మందుల్ని వినియోగించుకోవడం ఇటీవలి కాలంలో ఎక్కువైందని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఔషధ దుకాణదారులు తమను సంప్రదించే వారు చెప్పే వ్యాధి లక్షణాల ఆధారంగా మందులు ఇస్తుండటం కూడా దీనికి దోహదం చేస్తోందంటున్నారు. ఈ ధోరణి వల్ల చాలామంది దీర్ఘకాలంలో తీవ్ర అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని పేర్కొంటున్నారు.

నిబంధనలు తోసిరాజని

సాధారణ జలుబు, దగ్గు, జ్వరం వంటి కొన్ని అనారోగ్య సమస్యలకు వైద్యుని చీటి లేకుండానే రోగులకు ఔషధాలను విక్రయించేందుకు ఔషధ దుకాణదారులకు అనుమతులున్నాయి. యాంటీబయాటిక్స్ వంటి ఔషధాలు మాత్రం వైద్యుని చీటి మేరకే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించి కొందరు అన్ని రకాల ఔషధాలను వైద్యుల చీటి లేకుండానే యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు

—డాక్టర్ విజయ్ ఎల్దండి, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల నిపుణులు



యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల దీర్ఘకాలంలో శరీరంలో నిరోధకత పెరుగుతుంది. భవిష్యత్తులో మరోసారి ఆ యాంటీబయాటిక్‌ను వినియోగించాల్సిన సందర్భం ఎదురైతే మాత్రం ఆ ఔషధం పనిచేయదు. దానికన్నా ప్రభావితమైనది ఇవ్వాల్సి ఉంటుంది. చాలామంది మళ్లీ అవే సమస్యలు ఎదురైనప్పుడు గతంలో వైద్యుడిచ్చిన చీటిలోని మందులనే వినియోగిస్తున్నారు. నిజానికి యాంటీబయాటిక్స్‌ను వైద్యుడు సూచించిన మేరకు నియమిత రోజుల్లో తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంటుంది. ఉపశమనం కలిగిందికదాని మధ్యలో మానేయడమూ ప్రమాదకరమే.

వైద్యుని సూచన తప్పనిసరి

—డాక్టర్ మనోహర్, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి



నొప్పిమాత్రలు తరచూ వాడడం వల్ల మూత్రపిండాలు వైఫల్యం చెందుతాయి. ముఖ్యంగా మధుమేహుల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువ. జీర్ణకోశంలో అల్సర్లు, రక్తస్రావం జరగడం వంటి సమస్యలు, కాలేయం దెబ్బతినే ప్రమాదమూ ఉంది. ఏ ఔషధాన్నయినా వైద్యుని సూచనల ప్రకారం తీసుకోవడం మేలు. వేర్వేరు రకాల ఔషధాలను ఒకేసారి వేసుకునే సందర్భాల్లో కొన్నిసార్లు శరీరంలో ప్రతికూల స్పందనలు ఎదురుకావొచ్చు. వీటిని గ్రహించకుండా వినియోగిస్తే రోగాలు కొనితెచ్చుకున్నట్టే.

నెలకో రోజు పుస్తకాల సంచి వద్దు

(మొదటి పేజీ తరువాయి)

బృందాలు ప్రభుత్వ పాఠశాలల్లో అమలును పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న దక్షిణ భారత్ సైన్స్ ప్రదర్శన విశేషాలను వెల్లడించేందుకు శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్ని ప్రశ్నలకు బదులిస్తూ ప్రతి నెలా ఒక శనివారం నాడు బడి సంచి రహిత రోజుగా చేస్తామని తెలిపారు. 2019-20 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలను ఆన్‌లైన్ విధానంలో జరపాలని నిర్ణయించామని చెప్పారు. వచ్చే ఏడాది(2017-18)కి వెబ్‌సైట్లు ఉన్న పాఠశాలలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి ప్రవేశాలు చేయాలని జీఓలో పేర్కొన్నామన్నారు. సైన్స్ ప్రదర్శనలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి నుంచి విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఒక్కో రాష్ట్రం నుంచి 50 అంశాల చొప్పున మొత్తం 300 అంశాలు ఉంటాయన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ సంచాలకురాలు శేషుకుమారి, హైదరాబాద్ డీఈఓ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

6-1-2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
పంచమి: రా. 11-00 తదుపరి షష్ఠి
మఖ నక్షత్రం: ఉ. 7-53 తదుపరి పుబ్బ
అమృత ఘడియలు: ఉ.శే. 7-07 వరకు
తిరిగి రా. 12-53 నుంచి 2-26 వరకు
వర్జ్యం: మ. 3-57 నుంచి 5-09 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-34 నుంచి 8-02 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-36

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.0	31.0
మెదక్	10.3	32.1
రామగుండం	10.7	29.4
కరీంనగర్	13.0	29.0
హన్మకొండ	13.0	30.0
హైదరాబాద్	13.3	29.4
తిరుపతి	14.2	29.0
నిజామాబాద్	14.0	28.0
విశాఖపట్నం	15.0	28.6
మహబూబ్‌నగర్	16.6	31.2
ఖమ్మం	18.0	31.0
విజయవాడ	18.5	29.7

కాళేశ్వరం పరిశీలనకు 7న కేంద్ర బృందం రాక

(మొదటి పేజీ తరువాయి)

నీటి వినియోగం, దాని ద్వారా వచ్చే ప్రయోజనాలపై కొన్ని సందేహాలు, కొంత అదనపు సమాచారాన్ని కోరిన జలసంఘం ప్రత్యక్షంగా ప్రాజెక్టును సందర్శించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. జలసంఘంలోని ప్రాజెక్టు అడ్వైజరీ కమిటీ ముఖ్య ఇంజినీరు సీకేఎల్ దాసు నేతృత్వంలోని బృందం ఈనెల 7న హైదరాబాద్‌కు చేరుకుంటుంది. మూడు రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలిస్తుంది. అధికారులతోనూ సమావేశం కానుంది.



శుక్రవారం చెన్నైలో 4వ తమిళనాడు అంతర్జాతీయ బెలూన్ ఉత్సవాలకు సన్నాహకంగా నిర్వహించిన కార్యక్రమంలో భారీ బెలూన్‌ల ప్రదర్శన

దివ్యాంగులకు మూడు శాతం ఇళ్లు

- వారి కోసం ప్రత్యేక ఐటీ పార్కు
- కాంగ్రెస్ ఎప్పటికీ అధికారంలోకి రాలేదు
- మంత్రి కేటీఆర్
- గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపాటు

హైదరాబాద్ - న్యూస్‌టుడే



శుక్రవారం హైదరాబాద్‌లో దివ్యాంగుల జాతీయ పార్కును ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్లలో దివ్యాంగులకు మూడు శాతం కేటాయిస్తామని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తా సమీపంలో రూ.2.13 కోట్లతో నిర్మించిన జాతీయ దివ్యాంగుల పార్కును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఉద్యానవనం హైదరాబాద్‌కు గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని ఆరు కార్పొరేషన్‌ల పరిధిలోనూ ఈ తరహా పార్కుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు ఉపాధి కల్పన కోసం నగరంలో ప్రత్యేక ఐటీ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కామారెడ్డి జిల్లాకు చెందిన బాన్సువాడ తెదేపా నాయకుడు భోజ్యానాయక్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తాన్‌సింగ్ తదితరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్, వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిల సమక్షంలో తెరాసలో చేరిన సందర్భంలో మంత్రి మాట్లాడుతూ.. గుజరాత్‌లో అందరూ ఏకమైనా కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, తెలంగాణలో ఎప్పటికీ రాదన్నారు. గడ్డాలు పెంచితే సన్యాసులు అవుతారు తప్ప గబ్బర్‌సింగ్‌లు కాలేరని ఎద్దేవా చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో మరణించింది వీఆర్ఏ కాదని, నిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీ గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదు చేసిందని విమర్శించారు.

కార్పొరేటర్‌కు రూ.50 వేల జరిమానా

మూసారాంబాగ్ శ్రీపురం కాలనీలో రూ.1.2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టు ప్రారంభోత్సవానికి హాజరైన కేటీఆర్ ఓ కార్పొరేటర్, ఇద్దరు మాజీ కార్పొరేటర్లు తన పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ సునరితారెడ్డికి రూ.50 వేలు, మాజీ కార్పొరేటర్లు అస్లాం, చెకోలేకర్ శ్రీనివాస్‌లకు చెరో రూ.25 వేలు జరిమానా విధించాలని కమిషనర్ జనార్దన్‌రెడ్డిని ఆదేశించారు.

గ్రూపు-1 అధికారుల దైనందిని ఆవిష్కరణ

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా బంగారు తెలంగాణ సాధనలో అధికారులు ప్రధాన పాత్ర పోషించాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. శుక్రవారం తన నివాసంలో తెలంగాణ గ్రూపు-1 అధికారుల సంఘం దైనందిని-2018ను మంత్రి ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ఇతర నేతలు హన్మంతునాయక్, శశికిరణాచారి, అలోక్‌కుమార్, రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ సినిమా దశదిశ' పుస్తకావిష్కరణ: కవి, సినీ విమర్శకుడు వారాల ఆనంద్ రచించిన 'తెలంగాణ సినిమా దశ దిశ' అనే పుస్తకాన్ని మంత్రి కె.తారకరామారావు హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు.

తెలంగాణ ప్రగతి అపూర్వం

- ఫ్రాన్స్ రాయబారి ప్రశంస
- కేటీఆర్‌తో భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మూడున్నరేళ్లలోనే అపూర్వ ప్రగతి సాధించిందని, టీహబ్ తెలంగాణకు తలమానికమని ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ ప్రశంసించారు. శుక్రవారం ఆయన ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్‌తో కలిసి మంత్రి కేటీఆర్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ తెలంగాణలో వనరులు, పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వ విధానాలను ఆయనకు వివరించారు. తెలంగాణలో వైమానిక, రక్షణ, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణ ఉందని చెప్పారు. అనంతరం జీగ్లర్ మాట్లాడుతూ 'భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్య శతాబ్దాలుగా సాంస్కృతిక సంబంధాలున్నాయి. ఇంకా అనేక ఫ్రాన్స్ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడుల పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇక్కడ ట్రామ్ తరహా రవాణా సౌకర్యం కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నాం. త్వరలోనే 50 ప్రముఖ సంస్థల పెట్టుబడిదారులతో ఇక్కడికి వస్తా.' అని పేర్కొన్నారు.



యూజీసీ ఛైర్మన్ ధీరేంద్రపాల్‌సింగ్‌ను కలిసిన ఎంపీ వినోద్‌కుమార్, పాపిరెడ్డి, కోమల్‌రెడ్డి, వెంకటరమణ

కరీంనగర్‌లో ఉర్దూ వర్సిటీ ప్రాంగణానికి సహకరించాలి

యూజీసీ ఛైర్మన్‌కు ఎంపీ వినోద్‌కుమార్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్: ఉర్దూ మాట్లాడే వారి ప్రయోజనార్థం కరీంనగర్‌లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ) ప్రాంగణం ఏర్పాటుకు సహకరించాలని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ పాపిరెడ్డి యూజీసీ ఛైర్మన్ ధీరేంద్రపాల్‌సింగ్‌ను కోరారు. కరీంనగర్, సమీప ప్రాంతాల్లో ఉర్దూ మాట్లాడేవారి సంఖ్య అధికమని పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం దిల్లీలో ఆయన్ను కలిసి విన్నవించారు. తెలంగాణలో ఉన్నత విద్య చదివిన వారికి ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ధీరేంద్రపాల్‌కు పాపిరెడ్డి వివరించారు. నాణ్యమైన విద్యను అందించడంలో తెలంగాణ ప్రభుత్వ కృషిని సింగ్ అభినందించారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి 12బీ హోదాతో వర్సిటీ బలోపేతానికి అధిక నిధులు ఇవ్వాలని శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి కోరారు. ఎంపీ వినోద్‌కుమార్, ఇతర అధికారులు భారత ఫార్మసీ మండలి కార్యదర్శి అర్చన ముద్గల్‌ను కలిసి శాతవాహన వర్సిటీలో ఫార్మా కోర్సులకు సహకరించాలని కోరారు.

ఐదు కాదు.. 12 శాతం తిరిగివ్వండి

- తెలంగాణలో గుత్తేదారుల డిమాండ్
- వర్క్ కాంట్రాక్ట్‌లపై జీఎస్టీ నేపథ్యంలోనే..

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వర్క్ కాంట్రాక్ట్‌లపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నేపథ్యంలో తమకు 12 శాతం తిరిగివ్వాలని గుత్తేదారులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ అంశంపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, గుత్తేదారు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత వర్క్ కాంట్రాక్ట్‌లపై 12 శాతం పన్ను విధిస్తున్నారు. ఇందులో 5శాతాన్ని గుత్తేదారులకు తిరిగి చెల్లిస్తున్నారు. అయితే తమకు 12 శాతం తిరిగివ్వాలని గుత్తేదారులు డిమాండ్ చేస్తున్నారు. సిమెంట్ సహా ఇతర వాటిలో 7శాతం దాకా ఇన్‌పుట్ క్రెడిట్ ద్వారా గుత్తేదార్లకు వెనక్కి వస్తుంది కాబట్టి ఐదు శాతం తిరిగి చెల్లిస్తే చాలన్నది అధికారుల వాదన. అయితే గుత్తేదారులు తాము ఇన్‌పుట్ క్రెడిట్ తీసుకోవడం సాధ్యం కాదని, 12 శాతం వెనక్కి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. శుక్రవారం సమావేశంలో దీనిపై తుదినిర్ణయానికి రాలేకపోయారు.

నీటిపారుదలశాఖకు రూ.1400 కోట్లు విడుదల

తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదలశాఖకు ప్రభుత్వం రూ.1400 కోట్లను విడుదల చేసింది. ప్రాజెక్టుల కింద సహాయ, పునరావాసానికి, బిల్లుల చెల్లింపునకు ఈ మొత్తాన్ని విడుదల చేశారు.

మధ్యాహ్న భోజనానికి 'నాఫెడ్' కందిపప్పు

ఈనాడు, హైదరాబాద్: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పెంచడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. భోజనానికి అవసరమైన కందిపప్పును జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) ద్వారా సరఫరా చేయాలని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వారానికి రెండుసార్లు సాంబారు, రెండుసార్లు పప్పు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రోజుకు 20 గ్రాములు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 30 గ్రాముల చొప్పున పప్పు వివిధ రూపాల్లో అందించాలి. పప్పు ధరలు కొన్నిసార్లు విపరీతంగా పెరిగిపోతుండటంతో వంట ఏజెన్సీలు పప్పు పెట్టడం తగ్గిస్తున్నాయి. ఈ క్రమంలో తామే సరఫరా చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. జూన్ నుంచి దీని అమలుకు కేంద్రం అంగీకరించింది. 24 లక్షల మంది విద్యార్థులకు ఏటా 10 వేల టన్నుల కందిపప్పు అవసరమని అంచనా వేశారు.

భూ మార్కెట్ విలువ నిర్ధారణ పరిధి అధికారులది

- సింగిల్ జడ్జి ఉత్తర్వులను పాక్షికంగా రద్దు చేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాదు: భూముల మార్కెట్ విలువను నిర్ధారించే అధికారం అధికారులదని, ఈ వ్యవహారంలో కోర్టులు జోక్యం చేసుకోలేవని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. భూముల మార్కెట్ విలువను సవరిస్తూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను సస్పెండ్ చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై ధర్మాసనం స్పష్టతనిచ్చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల వల్ల స్వచ్ఛందంగా భూములిచ్చిన వారికి ఎకరా రూ.6 లక్షల చొప్పున చెల్లిస్తున్న పరిహారాన్నే.. మార్కెట్ విలువగా నిర్ణయించినట్లవుతుందని పేర్కొంది. స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ఇచ్చే పరిహారానికి సమానంగా(రూ.ఆరు లక్షలు).. మార్కెట్ విలువను నిర్ణయించకపోవడం సరికాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను పాక్షికంగా రద్దు చేసింది. ఈ అంశంపై ఏజీ వాదనతో ఏకీభవించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అక్కడే సస్పెన్షన్ ఎత్తివేతకు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సర్కారుకు సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా సిద్దిపేట జిల్లా కలెక్టర్ భూముల మార్కెట్ విలువను సవరించారని, దీంతో తమ భూములకు సరైన విలువ దక్కలేదని పేర్కొంటూ తొగుట మండలం వేములఘాట్ వాసి నర్సింహారెడ్డితోపాటు మరో 23 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ ప్రాంతంలోని ఎకరా భూమికి రూ.6 లక్షలు పరిహారం చెల్లించి ప్రభుత్వ భూసేకరణ చేసిందని.. అదే ప్రాంతంలోని ఎకరా భూమికి ఇప్పుడు మార్కెట్ విలువను రూ.85 వేలుగా నిర్ధారించారన్నారు. దీంతో కలెక్టర్ ఉత్తర్వులను సింగిల్ జడ్జి సస్పెండ్ చేశారు. ఆ ఉత్తర్వులపై సర్కారు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది.

దంత సమస్యలున్న వృద్ధులకు అనారోగ్య ముప్పు ఎక్కువ!

లండన్: దంత సమస్యలతో బాధపడే వృద్ధులు.. అనారోగ్యం బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తాజా అధ్యయనంలో తేలింది. దైనందిక చర్యలు చేయలేకపోవడం, కింద పడిపోవడం, కదల్లేకపోవడంతో పాటు మరణ ముప్పు పొంచి ఉందని వెల్లడైంది. బ్రిటన్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం చేపట్టారు. 40 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న పురుషులపై 1978-1980లో ఓసారి.. వారిలో జీవించి ఉన్నవారిపై 2010-12లో మరోసారి పరీక్షలు చేపట్టారు. ఎత్తు, బరువు, శరీర కొలతలు, ఇతర ఆరోగ్య సంబంధిత వివరాలను సేకరించారు. దంతపరీక్షలూ నిర్వహించారు. 20% మందికి పళ్లు లేవని.. 64% మందికి 21 దంతాల కన్నా తక్కువగా ఉన్నాయని గుర్తించారు. 54% మందికి దంతవ్యాధులు ఉన్నాయని.. 29% మందిలో పొడిబారిన నోటికి సంబంధించిన లక్షణాలు కనిపించాయని పేర్కొన్నారు.

దిల్లీలో సీఆర్పీఎఫ్ వాహనం చోరీ

దిల్లీ: కేంద్ర రిజర్వు పోలీస్ బలగాల(సీఆర్పీఎఫ్)కు చెందిన ఎస్‌యూఈ వాహనం చోరీకి గురికావటంపై భద్రతా సంస్థలు అప్రమత్తత హెచ్చరికలను జారీ చేశాయి. జమ్మూకశ్మీర్ నంబరు ప్లేట్‌తో ఉన్న తెల్లని సుమో విక్టా డిసెంబరు 29-30 తేదీల్లో దిల్లీలోని ఆర్కేపురం ప్రాంతంలో ఉన్న సీఆర్పీఎఫ్ శిబిరం వద్ద తస్కరణకు గురైంది. ముగ్గురు వ్యక్తులు దానిని తీసుకెళ్తున్న దృశ్యం సీసీ కెమేరాల్లో నమోదైంది.

7తో ముగియనున్న టీఆర్‌టీ గడువు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) గడువు ఈనెల 7వ తేదీతో ముగియనుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. దరఖాస్తులో వ్యక్తిగత వివరాలు సరిగా నమోదు చేయని అభ్యర్థులకు వాటిని సరిచేసుకునేందుకు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్లో అవకాశమివ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌కు కొత్త రూపు

- శాఖల వారీగా స్పష్టంగా కేటాయింపులు
- వివరంగా ఉద్యోగుల వేతనాలు
- ఆమోదించిన వాటికే పెరుగుదల
- ఎకరాకు రూ.8 వేలు వ్యవసాయశాఖ ప్రతిపాదనల్లో
- ఆర్థిక శాఖ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌కు కొత్త రూపు తేవడానికి ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. రానున్న (2018-19) ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కీలక మార్పులకు నాంది పలకడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. శాఖల వారీగా కేటాయింపులపై మరింత స్పష్టత ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దనుంది. రాష్ట్రంలోని అన్ని రకాల ఉద్యోగుల వేతనాలు సహా పథకాలు, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి కేటాయింపులను బడ్జెట్ ప్రతిపాదనల్లో స్పష్టంగా ఇవ్వాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి అధికారిక ఆదేశాలు ఉన్నవి, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినవాటిని ప్రతిపాదనల్లో చేర్చాలని స్పష్టం చేసింది. ఈనెల 8లోపు అన్ని శాఖలు ఆన్‌లైన్‌లో బడ్జెట్ ప్రతిపాదనలు అందజేయాల్సి ఉంది. గత బడ్జెట్‌లో కేటాయింపులు, బడ్జెట్ విడుదల ఉత్తర్వులు, నిధుల విడుదల, వ్యయం తదితర అంశాల్లో పూర్తి స్పష్టత ఇవ్వాలని సూచించారు. గత ఏడాది బడ్జెట్ కంటే శాఖలో ప్రత్యేక పరిస్థితులు, కొత్త పథకాలు ఉంటే తప్ప భారీ పెరుగుదల లేకుండా చూడాలని తెలిపారు. సాధారణ పెరుగుదల మేరకు బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. శాఖల వారీగా వ్యయాల్లో గందరగోళాలకు తావులేకుండా చేయనున్నారు.

పథకాల కేటాయింపులపై మరింత స్పష్టత: పథకాలు, కార్యక్రమాల వారీగా కేటాయింపులను చూపనున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలైన సాగునీరు, వ్యవసాయం ఈ రెండూ మూల కేంద్రంగా బడ్జెట్ కసరత్తు జరుగుతోంది. రైతులకు ఈసారి ఎకరాకు రూ.8000 చొప్పున (ఖరీఫ్, రబీ) నుంచి రైతులకు అందజేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వ్యవసాయ శాఖ బడ్జెట్‌లో ప్రతిపాదించనున్నారు. గత బడ్జెట్లలో కేటాయింపులు ఉన్న రుణ మాఫీ నిధుల అంశం ఈసారి బడ్జెట్‌లో ఉండదు. దీని స్థానంలో రైతులకు ప్రోత్సాహకంగా ఇచ్చే మొత్తం చేరనుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలకు స్పష్టతతో.. కొరత లేకుండా నిధులను బడ్జెట్ ప్రతిపాదించాలని శాఖాధిపతులకు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి అన్ని స్థాయుల్లో ఉద్యోగుల వేతనాల మొత్తాన్ని స్పష్టం చేయాలని ఆదేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలు శాఖల నుంచి సచివాలయంలోని శాఖాధిపతులకు ఈనెల 8లోపు చేరాల్సి ఉంది. సచివాలయంలోని శాఖాధిపతులు బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు 10లోపు పంపాలి.

జేఈఈ మెయిన్‌కు 12 లక్షల మంది

- తెలంగాణ నుంచి సుమారు 78 వేల దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్‌కు తెలంగాణ నుంచి 78 వేల మంది హాజరు కానున్నారు. దరఖాస్తుల సమర్పణ, రుసుముల చెల్లింపునకు తుది గడువు జనవరి 2వతేదీతో ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల మంది దరఖాస్తు చేయగా.. తెలంగాణ నుంచే 78 వేల మంది దరఖాస్తులు అందినట్టు సీబీఎస్ఈ వర్గాలు తెలిపాయి. జేఈఈ మెయిన్ రాత పరీక్ష ఏప్రిల్ 8న, ఆన్‌లైన్ పరీక్షలు 15, 16 తేదీల్లో జరగనున్నాయి. ర్యాంకులను అదే నెల 30వ తేదీన ప్రకటిస్తారు. గత ఏడాది తెలంగాణ నుంచి సుమారు 80 వేల మంది దరఖాస్తు చేశారు. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నగరాల్లో దీనికి సంబంధించిన పరీక్ష కేంద్రాలు ఉన్నాయి.

బీసీలది ఆత్మగౌరవ పోరాటం: కృష్ణయ్య

నారాయణగూడ, న్యూస్‌టుడే: బీసీలది సాదాసీదా ఉద్యమం కాదని, ఆత్మగౌరవ పోరాటమని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పునరుద్ఘాటించారు. హక్కుల సాధనకు ఉద్యమం ఒక్కటే మార్గమని, గొంతు విప్పకపోతే ప్రభుత్వాలు దిగిరావని పేర్కొన్నారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (టీఈబీసీఈడబ్ల్యూఏ) 12వ రాష్ట్ర మహాసభ శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. సంఘాధ్యక్షుడు కె.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల పాలక మండళ్లలో 50 శాతం డైరెక్టర్ పోస్టులను బీసీ అధికారులతో భర్తీ చేయాలన్నారు. టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థల పాలకమండళ్లలో బీసీల ప్రాతినిధ్యం తక్కువగా ఉందన్నారు. దీనిపై ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు కసరత్తు చేస్తున్నారని, త్వరలోనే తీపి కబురు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పీఆర్‌సీలో అన్యాయం జరగదన్నారు. ఎన్‌పీడీసీఎల్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎండీ రఘుమారెడ్డిని కోరారు. టీఎస్‌పీసీడీసీఎల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సూచన మేరకు 24గంటల విద్యుత్‌కు అంగీకరించామని, వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో కొంత ఇబ్బంది ఉండవచ్చు, కాబట్టి ఇంజినీర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సభలో సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బ్రహ్మేంద్ర, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు శేఖర్‌బాబు, సత్యానారాయణ, కార్యదర్శి హరివర్ధన్, కొమరవెల్లి రవీందర్, టీఎస్ ట్రాన్స్‌కో నేత అశోక్ పాల్గొన్నారు.

'ప్రభుత్వానికే రేషన్ బియ్యం విక్రయించే కుట్ర'

ఈనాడు, హైదరాబాద్: రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి విక్రయించే కుట్రను భగ్నం చేసినట్లు పౌర సరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లాలో మిల్లర్ల నుంచి కొనుగోలు చేసిన బియ్యం నిల్వలను మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సీడబ్ల్యూసీ గోదాములో నిల్వ చేసినట్లు తెలిపారు. నిఘా బృందం తనిఖీచేసి గోదాములో ఉన్న 1080 (50 కిలోలు) బస్తాలను రేషన్ బియ్యంగా గుర్తించామన్నారు. మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, గోదాము ఇన్‌ఛార్జిపై వేటు వేసినట్లు వివరించారు. నాగర్‌కర్నూలు జిల్లాలోని శ్రీరాములుకు చెందిన శ్రీనివాసరైస్ మిల్లు, మల్లేష్‌కు చెందిన వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ నుంచి రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి పౌర సరఫరాల శాఖకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. ఈపాస్ విధానంతో అక్రమాలు సాధ్యంకాదన్నారు. గతంలోనే డీలర్ల నుంచి బియ్యం కొని మిల్లు యజమానులు నిల్వచేసుకుని కుట్రకు పాల్పడినట్లు స్పష్టం చేశారు.

సిరిసిల్లలో సన్న బియ్యం వెనక్కు: సిరిసిల్లలో బియ్యం మిల్లుల యజమానుల నుంచి కొనుగోలు చేసిన 11 వేల బస్తాల సన్న బియ్యంలో నాణ్యత లేనట్లు గుర్తించి వెనక్కి పంపిస్తున్నట్లు ఆనంద్ తెలిపారు. ఒక్కో బస్తాలో 10 శాతానికి మించి నూకలు ఉండొద్దని, సిరిసిల్లలో సాంకేతిక సిబ్బంది తనిఖీల్లో 35 శాతం ఉన్నట్లు గుర్తించామన్నారు.

ఈనాడు

తలసరి వైఫల్యాల చరిత్ర

అంతర్జాతీయ క్రీడావేదికలపై గట్టిపోటీని తట్టుకొని ప్రతిష్ఠాత్మక పతకాలు ఒడిసి పట్టడంలో సువిశాల భారతావని ఆనవాయితీగా ఎందుకు చతికిలపడుతోంది? లోక్‌సభా ముఖంగా క్రీడామంత్రిత్వ శాఖ వెల్లడించిన తాజా సమాచారంలో అందుకు సమాధానం దాగి ఉంది! 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను తమ శాఖ క్రీడల పద్దుకు ప్రత్యేకించిన మొత్తాన్ని రూ.1,393.21 కోట్లుగా పేర్కొన్న అమాత్యులు రాజ్యవర్ధన్‌సింగ్ రాఠోడ్, గత జనగణన ప్రకారం 121 కోట్ల దేశ జనాభాను పరిగణించి, రోజుకు తలసరి వ్యయం మూడు పైసలుగా లెక్కతేల్చారు. రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ ప్రభుత్వేతర సంస్థలు క్రీడల కోసం చేస్తున్న ఖర్చును ఇందులో చేర్చలేదన్న మంత్రివర్యులు- 'ఖేలో ఇండియా' ఖాతానూ ప్రస్తావించలేదు. 2018ని క్రీడాసంవత్సరంగా నిర్వహిస్తామంటూ మూడేళ్ల వ్యవధిలో ప్రాథమిక సదుపాయాల పరికల్పన, శిక్షణల నిమిత్తం రూ.1,756 కోట్లు వ్యయీకరిస్తామని గత నెలలోనే ప్రకటించారు. ప్రస్తుత దేశ జనాభా 132 కోట్లకు పైబడిన తరుణంలో ఈ అరకొర తలసరి వ్యయం లెక్కలే స్పష్టీకరిస్తున్నాయి, మన క్రీడావైఫల్యాలకు కేంద్రబిందువు ఎక్కడుందో! జనాభా ప్రాతిపదికన భారత్‌కు ఏ రకంగానూ సాటిరాని జమైకాలో క్రీడల పద్దుకింద తలసరి వ్యయం 19పైసలు, యూకేలో 50పైసలు, అమెరికాలో 22 రూపాయలు. ఇటీవలి రియో పోటీల్లో- ఆరున్నర కోట్ల జనాభా కలిగిన యూకే 67 పతకాలు కొల్లగొట్టింది. సుమారు 32 కోట్ల జనసంఖ్యతో అమెరికా 121 పతకాలు సాధించింది. భారత్ స్కోరే దిగ్భ్రాంతపరచింది. అక్కడ మనకు దక్కిన పతకాలు రెండే. అంటే సుమారు 65 కోట్లమందికి ఒకటి. వరస చేదు అనుభవాలనుంచి గుణపాఠాలు నేర్చి, క్రీడల సముద్ధరణకు సమధికంగా కేటాయింపులు పెంచడంలో ఇక ఎంతమాత్రం జాగు పనికిరాదు!

రెండే క్రీడాంశాలు ఎంచుకొని ఒలింపిక్స్‌లో కెన్యా 100, జమైకా 78 పతకాలు గెలుపొందాయంటూ- ఇండియా సైతం ఏ పది విభాగాల్లోనో పోటీకి పరిమితమైతే మేలని 'నీతి ఆయోగ్' మొన్నీమధ్య సూచించింది. ఏయే క్రీడాంశాల్లో పోటీపడాలన్నది సన్నద్ధత ప్రాతిపదికన నిర్ణయించాలి. బరిలోకి దిగాక గెలిచి తీరగలమన్న ఆత్మవిశ్వాసం రగిలించే స్థాయిలో శిక్షణ కార్యక్రమాలుండాలి. వాటన్నింటికీ ఇంధనం సమధిక కేటాయింపులే! వేరేమాటల్లో, పిండికొద్దీ రొట్టె! నిరుడు భారత మహిళల ఐస్ హాకీ జట్టు ఆన్‌లైన్‌లో విరాళాలు కూడగట్టి- పరికరాలు, ప్రయాణఖర్చులు, బస ఏర్పాట్లకు సొంతంగా కాసులు సమకూర్చుకొని బ్యాంకాక్ పయనం ఆరంభించాల్సి వచ్చింది. అటువంటి ప్రహసనాలు క్రీడాకారులకు, దేశానికి తలవంపులు! రియో బరిలో ఆరు నూరైనా మెరుగ్గా రాణించి తీరాలన్న పట్టుదలతో 374మంది అథ్లెట్లపై మౌలిక వసతులు, శిక్షణ తదితరాలన్నింటికీ కలిపి 350 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,200 కోట్లు) వెచ్చించిన యూకే- సగర్వంగా రెండో స్థానాన నిలిచింది. సమధిక కేటాయింపులొక్కటే కాదు- ప్రపంచ స్థాయి శిక్షణ వసతులు సమకూర్చడంలో కనబరచిన శ్రద్ధాసక్తులు, మెరికల్లాంటి కోచ్‌లను కొలువుతీర్చడంలో అలుపెరగని శ్రమ... అన్నీ కలగలిసి అక్కడ దండిగా పతకాల పంట పండించాయి. ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలూ తమ క్రీడాకారులకు అత్యున్నత స్థాయి శిక్షణ అందించడం కోసం ఎన్ని వ్యయప్రయాసలకైనా వెనుదీయడంలేదు. విస్తృత మౌలిక వసతుల పరికల్పనకు విశేష ప్రాధాన్యం ఇవ్వడంలో దక్షిణ కొరియా, ఫిన్లాండ్, స్పెయిన్ వంటివీ పోటీపడుతున్నాయి. క్రీడాభ్యున్నతి పట్ల వాటి ప్రత్యేక శ్రద్ధ, నిబద్ధతలు పతకాల పట్టికలో మెరుపులుగా ప్రతిఫలిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మరిన్ని అకాడమీలు, శిక్షణ కేంద్రాలు నెలకొల్పుతామంటున్న మోదీ ప్రభుత్వం- ఇప్పటికే ఉన్నవి, కొత్తగా రానున్నవి అత్యున్నత స్థాయిప్రమాణాలు అందుకొనేందుకు సకల జాగ్రత్తలూ తీసుకోవాల్సి ఉంది!

జనాభాలో ఎకాయెకి 65 శాతం యువత కలిగిన భారత్ విశ్వక్రీడాంగణాల్లో మరెంతో మిన్నగా పాటవ ప్రదర్శన చేయాలన్న ప్రధాని మోదీ ఆకాంక్ష, యావత్ జాతి అభిమతానికీ ప్రతిధ్వని. ఆ స్వప్నం సాకారమయ్యేందుకు బడుల్లోనే బీజావాపనం జరగాలన్న సచిన్ తెందుల్కర్ ప్రభృతుల సూచనలకు చురుగ్గా మన్నన దక్కాలి. దేశవ్యాప్తంగా ఆటస్థలాలు కలిగిన విద్యాలయ ప్రాంగణాలెన్ని ఉన్నాయని ఆరాతీస్తే- ఆ గణాంకాల్లో ఏళ్ల తరబడి వేళ్లూనుకున్న నిర్లక్ష్యం, అలసత్వాలు ప్రస్ఫుటమవుతాయి. ఆసేతు హిమాచలం ప్రతి పాఠశాలలో ఆటస్థలం, క్రీడాసామగ్రి విధిగా ఉండాలన్న చట్ట నిబంధనలు నీరోడుతున్నాయి. వేలసంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీకావడంలేదు! పునాదిని పటిష్ఠీకరించి, పసి వయసులోనే ప్రతిభావంతుల్ని అక్కున చేర్చుకొని అసమాన శిక్షణతో రాటుతేల్చడమే పొరుగున జనచైనా విజయరహస్యం. ఆ ఒరవడిని పుణికి పుచ్చుకోవడమే కాదు- క్రీడల్లో పాల్గొంటున్నవారిని పైమెట్టు ఎక్కించడంపైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. దక్షిణాసియా స్థాయి క్రీడల్లో వందల సంఖ్యలో పతకాలు కొల్లగొడుతున్న భారత్ ఒలింపిక్స్‌లో ధాటిగా నెగ్గుకు రాలేకపోవడం తెలియజెబుతున్నదేమిటి? దేశంలో సహజ ప్రతిభకు కొదవ లేదు. ప్రత్యర్థి ఎవరన్నదానితో నిమిత్తం లేకుండా ఎక్కడైనా జయభేరి మోగించగలిగేలా వారిని రాటుతేల్చే బలమైన వ్యవస్థను అవతరింపజేయాలి. కుళ్లు రాజకీయాల్లో మునిగితేలుతున్న క్రీడాసమాఖ్యలను, సంస్థలను, విభాగాలను సాకల్యంగా ప్రక్షాళించాలి. అందరూ సమష్టిగా కృషి చేస్తే, విఖ్యాత ఉసేన్ బోల్ట్ లాంటి పరుగుల వీరులు ఎందరినో ఆవిష్కరించగల అపార వనరుల గని భారతావని అనడంలో మరోమాట లేదు. ఉన్న పుష్కల వనరుల్ని పదును పెట్టుకోగల కేటాయింపులు, సదుపాయాలు, శిక్షకులతోనే దేశంలో సమధిక క్రీడావికాసం వన్నెలీనేది!

ఆర్థిక సుస్థిరతకు అప్పుల ముప్పు



డాక్టర్ కల్లూరు శివారెడ్డి

భారత ఆర్థిక వ్యవస్థ పలు పెను సవాళ్లు ఎదుర్కొంటోంది. పెరుగుతున్న టోకు ధరల ద్రవ్యోల్బణం, హద్దులు దాటుతున్న ప్రభుత్వ రుణం ఆర్థికవేత్తలను కలవరపెడుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల ఏకీకృత (కన్సాలిడేటెడ్) ద్రవ్యలోటు 7.0 శాతానికి చేరింది. ప్రభుత్వ రుణం ఉండాల్సిన దానికన్నా ఎక్కువ స్థాయికి చేరింది. ప్రజా పద్దులకింద ఉన్న రుణాలు మినహాయిస్తే, కేంద్రప్రభుత్వ రుణం 2017 సెప్టెంబరు చివరినాటికి రూ.65.65 లక్షలకోట్లకు చేరింది. ఇది 2017-18 రెండో త్రైమాసికంకన్నా 2.5శాతం ఎక్కువ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి రుణాలు భారత స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 70శాతానికి చేరాయి. రాష్ట్రాల్లో విస్తరించిన ఆర్థికలోటు, పెరిగిపోయిన ప్రభుత్వరుణం, బలహీనంగా ఉన్న ఆదాయ వనరులు దేశ ఆర్థిక స్థిరత్వానికి సవాళ్లు విసరుతున్నాయి. 2016-17 మొదటి త్రైమాసికంలో 7.9 శాతంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు 2017-18 మొదటి త్రైమాసికంలో 5.7 శాతానికి పడిపోయింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరవాత 2018 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ వడ్డీ చెల్లింపుల మొత్తం ద్రవ్యలోటుకన్నా అధికంగా ఉంటుందన్న హెచ్చరికలు 'బాండ్ మార్కెట్'ను ప్రభావితం చేస్తున్నాయి. ఉన్న రుణాలపై వడ్డీ చెల్లింపులేకాక, పెరుగుతున్న మార్కెట్ రుణాలవల్ల ద్రవ్యలోటుపై గణనీయమైన ఒత్తిడి పడుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడి, పోటీతత్వం తగ్గుతుంది. ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుంది.

ప్రమాద ఘంటికలు

దేశ జీడీపీలో ప్రభుత్వ రుణ శాతం స్థిరంగా ఉండటం లేదా తగ్గుముఖం పట్టి ఉన్నంతవరకూ అప్పులు ప్రభుత్వానికి మోయలేని భారం కావు. రుణ విముక్తి పథకాల జోలికి వెళ్ళకుండా, కొత్త రుణాలు తీసుకోకుండా, ఉన్నవాటిని ఎప్పటికప్పుడు తీర్చేయగల సామర్థ్యం ఉండాలి. ఆర్థిక స్థిరత్వానికి ఇది చాలా ముఖ్యం. రుణాన్ని ఉత్పాదక ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నపుడు అప్పు తప్పు కాదన్న వాదన ఉంది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం 2016-17 మధ్యకాలంలో రూ.4,83,069 కోట్లు వడ్డీ చెల్లింపులు చేసింది. అదే కాలంలో మార్కెట్‌నుంచి బాండ్ల జారీ ద్వారా రూ.7,24,526 కోట్ల రుణం తీసుకుంది. వడ్డీ చెల్లింపులు ఈ రుణాల్లో 66.67 శాతం! అంటే మార్కెట్ నుంచి రుణంగా తీసుకున్న ప్రతి రూపాయిలో రూ.66.67 పైసలు- చేసిన రుణాలపై వడ్డీకే సరిపోయింది! అదేవిధంగా రాష్ట్రాలు సైతం 2016-17లో రూ.2,54,249 కోట్ల మేర వడ్డీ చెల్లింపులు చేశాయి. రూ.3,81,979 కోట్లు మార్కెట్‌నుంచి అప్పుగా తెచ్చుకున్నాయి. అంటే చేసిన అప్పుల్లో 66.56 శాతం వాటి వడ్డీ చెల్లింపులకే పోయింది! ఇది ప్రమాదకర పరిస్థితి. దీనివల్ల ద్రవ్యలోటు ఇనుమడిస్తుంది. ద్రవ్యోల్బణం ఎగబాకుతుంది. ప్రస్తుత ఖాతా లోటు విస్తరిస్తుంది. మదుపరుల్లో విశ్వాసం సన్నగిల్లుతుంది. ఈ అప్పులు తిరిగి చెల్లించేందుకు ముందుతరాలు గరిష్ఠ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రుణాలు మితిమీరితే ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి అవకాశాల్లో సమానత్వం దెబ్బతింటుంది. ప్రైవేట్ పెట్టుబడులు కుదించుకుపోతాయి.

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు వికేంద్రీకరణ పంథాలో జోరుగా ముందుకు వెళుతున్నాయి. దీనివల్ల ప్రజలకు వస్తు సేవల పంపిణీలో, పెట్టుబడుల సమీకరణలో రాష్ట్రాల బాధ్యతలు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రాల సమీకృత వ్యయ అవసరాలకు అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటోంది. సొంత ఆదాయ వనరులు, కేంద్రం ద్వారా వచ్చే ఆదాయ బదలాయింపులకన్నా ఖర్చు అధికం. దీనివల్ల రాష్ట్రాలు తమ ఖర్చులు తీర్చుకోవడానికి రుణాలపై ఆధారపడుతున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం (2003) తరహాలోనే రాష్ట్రాల స్థాయిలోనూ చట్టాలు రూపొందించి, రాష్ట్ర స్థూలోత్పత్తిలో ద్రవ్యలోటు మూడు శాతానికి మించకుండా చర్యలు తీసుకోవాలని దేశంలోని రాష్ట్రాలు లక్ష్యం నిర్దేశించుకున్నాయి. దీనివల్ల 2004-05నుంచి రాష్ట్రాల రుణ స్థితిలో గణనీయమైన మెరుగుదల వచ్చింది. వివిధ రాష్ట్రాలకు 2010-'14 కాలానికి ఆర్థిక సంఘం నిర్దేశించిన రుణ లక్ష్యాలకు దేశంలో అధిక సంఖ్యాక రాష్ట్రాలు కట్టుబడ్డాయి. కొంతకాలంగా ఆర్థిక వృద్ధిలో మందగమనం రాష్ట్రాలను ప్రతికూలంగా ప్రభావితం చేసింది. మొత్తం రెవిన్యూలో రాష్ట్రాల సొంత (పన్ను, పన్నేతర) ఆదాయాల శాతం 2007-08లో 58.3 శాతం. అది 2016-17 నాటికి 53.6 శాతానికి తగ్గింది. అదే సమయంలో రాష్ట్రాల రెవిన్యూ ఆదాయంలో 'గ్రాంట్స్-ఇన్-ఎయిడ్' 15 శాతం నుంచి 21 శాతానికి పెరిగింది. కేంద్రంనుంచి రాష్ట్రాలకు అందే పన్నులు 2007-08లో 24.3 శాతం ఉంటే, 2016-17నాటికి అది 25.7 శాతానికి చేరింది. అంటే 'గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ లేక



సొంతవనరులే తరుణోపాయం

పోతే రాష్ట్రాలు రెవిన్యూ లోటు చూపించాల్సి ఉంటుంది. అప్పుడు నిర్వహణ ఖర్చుల పరంగా రాష్ట్రాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయి. 14వ ఆర్థికసంఘం సిఫార్సుల అమలు తరవాత కూడా ఈ పరిస్థితిలో మార్పురాలేదు. జీఎస్‌డీపీలో రాష్ట్రాల మొత్తం ఖర్చు శాతం కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని మించింది! 2016-17లో రాష్ట్రాల ఉమ్మడి ఆర్థిక లోటు జీడీపీలో 3.6 శాతానికి చేరుకుంది. అంతకుముందు ఏడాది ఇది 2.6 శాతం మాత్రమే. దీనివల్ల కేంద్ర, రాష్ట్రాల ఏకీకృత ద్రవ్యలోటు 2015-16నాటి 6.7 శాతం నుంచి 2016-17లో 7.5 శాతానికి పెరుగుతుందని ఆర్‌బీఐ హెచ్చరించింది.

విద్యుచ్ఛక్తి రంగంలో సంస్కరణల కోసం కేంద్రప్రభుత్వం 2015లో ప్రవేశపెట్టిన ఉజ్వల్ డిస్కం హామీ యోజన (ఉదయ్) రాష్ట్రాల రుణాలు పెంచింది. దీనికితోడు కేంద్ర వేతనసంఘ సిఫార్సుల మేర రాష్ట్రాల్లో సైతం వేతన సవరణలు, రుణమాఫీలు, జీఎస్‌టీ అమలువల్ల ఆదాయంలో ఉన్న అనిశ్చితి రాష్ట్రాల ఆర్థికలోటును పెంచుతున్నాయి. ఉదాహరణకు 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఉదయ్‌లో చేరిన ఎనిమిది రాష్ట్రాలు రూ.98,960 కోట్ల విలువగల బాండ్లు జారీ చేశాయి. దీనివల్ల 2015-16లో రాష్ట్రాల అప్పుల్లో 17.4శాతం పెరుగుదల కనిపించింది. 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ; 2017లో యూపీ, పంజాబ్, మహారాష్ట్ర వ్యవసాయ రుణ మాఫీ ప్రకటించాయి. మొత్తం జీడీపీలో ఈ రుణ మాఫీ సుమారు ఒక శాతం ఉంటుంది! రాష్ట్రాలు తమ ఆర్థిక లోటులో 85 శాతాన్ని మార్కెట్ రుణాల ద్వారానే సమకూర్చుకుంటాయి. మార్కెట్ రుణాలపై అతిగా ఆధారపడటం వల్ల మార్కెట్లో బాండ్ల విలువ (రిటర్న్స్) పెరిగి, అప్పులపై వడ్డీ చెల్లింపులు అధికమవుతాయి. దానివల్ల ఆర్థిక లోటును మరింత విస్తరిస్తుంది. ఆర్థిక లోటును మార్కెట్ రుణాలతో భర్తీ చేయడంవల్ల మూలధన వ్యయం, జీడీపీ నిష్పత్తి సైతం తగ్గుతుంది.

ముందున్న సవాళ్లు

పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థలో కొంతకాలంగా మందగమనం ఏర్పడింది. జీడీపీ వృద్ధిరేటు తగ్గితే రుణ-జీడీపీ శాతం మరింత పెరుగుతుంది. అది ప్రభుత్వ ఆదాయ వసూళ్ల లక్ష్యంపై ప్రభావం చూపుతుంది. దానివల్ల ద్రవ్యలోటు పెరుగుతుంది. బ్యాంకుల మూలధన సమీకరణ (రీక్యాపిటలైజేషన్), రుణమాఫీలు, విద్యుత్ బోర్డుల అప్పులను రాష్ట్రాల రుణాలుగా మార్చడం వంటి విధానాల ముఖ్య ఉద్దేశం- విఫలమైన ప్రైవేటు రుణాలను జాతీయీకరించడమే! బ్యాంక్ రీక్యాపిటలైజేషన్‌వల్ల రుణ-దేశీయోత్పత్తి ఒక శాతం పెరుగుతుందని అంచనా. ఇలాంటి విధానాలపై ప్రభుత్వాలు పునరాలోచించుకోవాలి. కేంద్ర ప్రభుత్వ ప్రాథమిక లోటు (మొత్తం లోటులో వడ్డీ చెల్లింపులు మినహాయిస్తే) జీడీపీలో 0.7 శాతం. అది రాష్ట్రాల్లో దాదాపు రెండు శాతంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరో పదేళ్లలో రాష్ట్రాల రుణాలు జీడీపీలో 35 శాతానికి చేరవచ్చునని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. దానివల్ల రాష్ట్రప్రభుత్వాలు చేసే కొత్త రుణాలపై వడ్డీభారం పెరగడమే కాక ఉన్న రుణాలకు తిరిగి రేటును నిర్ణయించేటప్పుడు ఎక్కువ వడ్డీ కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రాలు తమ రుణంపై కేంద్రం కంటే ఎక్కువ వడ్డీరేటు చెల్లిస్తున్నాయి. ఎన్‌కే సింగ్ కమిటీ 2022-23 నాటికి కేంద్ర రుణ-జీడీపీని 38.7 శాతానికి, రాష్ట్రాల్లో 20 శాతానికి, కేంద్ర ద్రవ్యలోటును 2.5 శాతానికి తగ్గించాలని కొత్త ఆర్థిక ఏకీకృత మార్గదర్శక ప్రణాళికను సిఫార్సు చేసింది. కేంద్రం ఈ సిఫార్సులకు ఆమోదం తెలుపలేదు. పైగా ఎన్‌కే సింగ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న 15వ ఆర్థిక సంఘానికి నూతన ఆర్థిక ఏకీకృత ప్రణాళిక రూపొందించాలంటూ కొత్త బాధ్యతలు కట్టబెట్టింది. అంటే ఇంకొంతకాలం జీడీపీలో ద్రవ్యలోటును మూడు శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కేంద్రం దూరంగా ఉంటుందన్న మాట! అన్ని స్థాయుల్లోనూ ఆర్థిక క్రమశిక్షణ సాకారం కాకపోతే ఆర్థిక ఏకీకృత ప్రణాళిక సాధ్యం కాదు. ఆర్థిక నిర్వహణ గాడితప్పుతున్నప్పుడు రాష్ట్రాలూ కేంద్రం తరహాలోనే చట్టసభ ఆమోదం తీసుకొని ముందడుగు వేయాలి. రాష్ట్రాలు ప్రస్తుతం రెవిన్యూ మిగులు కోసం పోరాడుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఫలితంగా తమ అభివృద్ధి అవసరాలకోసం రాష్ట్రాలు స్వయంగా వనరులు సమకూర్చుకోవాల్సి వస్తోంది. రుణాలు తగ్గించుకుని, ఆర్థిక స్థిరీకరణ దిశగా రాష్ట్రాలు మరలాల్సిన అవసరం ఉరుముతోంది. మునుముందు భారత్‌లో ఆర్థిక వృద్ధి సుమారు 7.5 శాతంగా ఉండవచ్చని రేటింగ్ ఏజెన్సీలు అంచనా వేశాయి. ఇందుకోసం పన్నుల ఆదాయం పెంచుకోవాలి. వినియోగదారుల రుసుముల(యూజర్ ఛార్జీలు)ను సహేతుకంగా నిర్ణయించి అమలు చేయాలి. ప్రభుత్వరంగ సంస్థల పనితీరునూ మెరుగుపరచాలి. అప్పుడే రుణభారం తగ్గి, ఆర్థిక రథం సరైన బాటపడుతుంది!

(రచయిత- ఆర్థిక రంగ నిపుణులు)

రాష్ట్రాల ఆర్థిక ముఖచిత్రం (జీఎస్‌డీపీలో రాష్ట్రాల రుణ శాతం)

రాష్ట్రం	2013–14	2014–15	2015–16	2016–17	రాష్ట్రం	2013–14	2014–15	2015–16	2016–17
ఉత్తర్ ప్రదేశ్	28.2	30.1	35.3	35.5	మధ్యప్రదేశ్	22.0	22.6	22.8	23.1
పశ్చిమ్ బంగ	36.7	34.6	32.5	33.8	హరియాణా	19.9	21.2	25.9	26.3
రాజస్థాన్	23.3	24.2	31.1	30.4	గుజరాత్	23.3	22.6	22.5	22.5
పంజాబ్	30.6	30.5	32.9	32.6	మహారాష్ట్ర	18.8	18.0	17.6	17.6
కేరళ	27.0	27.3	27.2	27.7	ఒడిశా	17.3	15.8	16.4	17.9
ఝార్ఖండ్	20.1	20.1	23.6	23.7	ఛత్తీస్‌గఢ్	12.6	13.2	14.6	15.8
ఆంధ్రప్రదేశ్	21.4	23.3	23.0	23.0	కర్ణాటక	17.0	17.2	16.9	16.9
జమ్మూకశ్మీర్	46.7	48.0	47.1	48.8	తమిళనాడు	18.5	17.0	17.9	19.1
బిహార్	27.9	26.6	27.9	28.0	తెలంగాణ	–	14.2	15.4	17.2

ఆధారం: రిజర్వుబ్యాంకు గణాంకాలు


అండమాన్‌లో పారాహుషార్

మూడువైపులా సముద్రతీరం ఉన్నప్పటికీ దాయాది దేశం పాక్‌తో ఉన్న వైరం రీత్యా పశ్చిమ దిశలో సాగర పరిరక్షణకు భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. 2008లో పాక్ ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారానే వాణిజ్య రాజధాని ముంబయిలో మారణహోమం సృష్టించారు. దీంతో సుదీర్ఘంగా ఉన్న సముద్ర తీరం వెంబడి పటిష్ఠ రక్షణ ఏర్పాట్లు చేసింది. వీటితోపాటు అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అంశాలు శరవేగంగా మారుతున్నాయి. హిందూ మహాసముద్రంలో తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు చైనా వ్యూహాలు రూపొందించడంతో- దిల్లీ కూడా తూర్పు, దక్షిణ సాగరతీరాలపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. చైనా యుద్ధ, వాణిజ్యనౌకలకు హిందూ మహాసముద్రంతోపాటు బంగాళాఖాతం ప్రధాన రవాణామార్గాలుగా మారడంతో అండమాన్ దీవులను రక్షణాత్మకంగా తీర్చిదిద్దేందుకు ఇండియాలో సన్నాహాలు చేస్తోంది. తూర్పుతీరంలో బంగాళాఖాతానికి దక్షిణ భాగంలో ఉన్న అండమాన్ నికోబార్ దీవులు- రక్షణపరంగా భారత్ ఆధిపత్యం సాధించేందుకు అవకాశాలు కల్పిస్తున్నాయి. మలక్కా జలసంధికి సమీపంలో ఈ దీవులు ఉండటం అత్యంత వ్యూహాత్మకంగా కలిసివచ్చే అంశమని అంతర్జాతీయ రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇండొనేసియా, మలేసియాల మధ్య ఉన్న మలక్కా జలసంధి తూర్పు, పశ్చిమ ఆసియా దేశాల మధ్య కీలకమైన జలమార్గం. మధ్యప్రాచ్యం నుంచి చైనాకు చమురు రవాణా నౌకలు ఈ జలసంధి ద్వారానే రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ దీవుల ద్వారానే ఇండియాకు చెందిన ప్రత్యేక ఆర్థిక ప్రాంతం 30 శాతం ఉండటం గమనార్హం.

పెరుగుతున్న ప్రాధాన్యం

దాదాపు 550కు పైగా ద్వీపాల సమాహారమే అండమాన్ నికోబార్ దీవులు. ఉత్తరంలో మియన్మార్, దక్షిణాన ఇండొనేసియా వరకు ఈ ద్వీపాలు విస్తరించి ఉన్నాయి. బ్రిటిష్ హయాములో అనేకమంది స్వాతంత్ర్య యోధులకు ద్వీపాంతర కారాగారశిక్షను ఇక్కడ అమలు చేశారు. భారత్‌కు దక్షిణ భాగంలో చివరి ప్రాంతమైన ఇందిరాపాయింట్ ఉన్న క్యాంప్‌బెల్ బే (గ్రేట్ నికోబార్ దీవి) ఇక్కడే ఉంది. అండమాన్, నికోబార్ దీవులను 10 డిగ్రీల ఛానెల్ వేరుచేస్తోంది. ఇందిరా పాయింట్‌కు సమీపంలోను ఆరు డిగ్రీల ఛానెల్ ఉంది. ఈ రెండు మార్గాల ద్వారానే తూర్పు ఆసియా దేశాలకు వెళ్లే అన్ని నౌకలు ప్రయాణించి మలక్కా జలసంధిని చేరుకోవాల్సి ఉంటుంది. దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం చలాయించేందుకు చైనా కుయుక్తులు పన్నుతోంది. ఇందుకు భిన్నంగా మన సార్వభౌమాధికార పరిధిలోనే అండమాన్ దీవులు ఉండటంతో హిందూమహాసముద్రం, బంగాళాఖాతం పరిధిలో భారత్ తిరుగులేని సైనికశక్తిగా ఆవిర్భవించేందుకు అవకాశాలు ఉన్నాయన్నది నిర్వివాదం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇండియానే కీలకశక్తిగా అమెరికా గుర్తించిన నేపథ్యంలో దీన్ని పూర్తిస్థాయి సైనిక స్థావరంగా తీర్చిదిద్దాలని కేంద్రప్రభుత్వం యోచిస్తోంది. 2001లో అప్పటి ప్రధాని వాజ్‌పేయీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు అండమాన్‌లో త్రివిధ దళాల సమీకృత కమాండ్‌ను ఏర్పాటుచేసింది. అనంతరం యూపీఏ ప్రభుత్వం దీని పటిష్ఠతకు అంతగా శ్రద్ధ చూపలేదు. 'తూర్పు వైపు చూపు' విధానంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 'తూర్పు దిశగా కార్యాచరణ'కు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నారు. ప్రస్తుతం తూర్పు తీరంలో విశాఖలో తూర్పు నౌకాదళ కమాండ్ ఉంది. అండమాన్ దీవులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే మరో నౌకాదళ కేంద్రానికి అవకాశముంటుంది. రక్షణాత్మకంగా అనేక కీలకాంశాలు ఉండటంతో వీటిని ఎప్పటికీ మునగని యుద్ధనౌకగా కొందరు రక్షణ నిపుణులు అభివర్ణించడం విశేషం. దాదాపు 800 కి.మీ. పొడవునా విస్తరించిఉన్న అండమాన్ సముదాయం భారత్‌కు ఒక నిఘా హెచ్చరికల కేంద్రంగా పని చేయడంతో పాటు రక్షణాత్మకంగా ప్రకృతిసిద్ధమైన కోటగా ఉంది. మలక్కా జలసంధి ద్వారా ఏటా 80 వేల నుంచి లక్ష వరకు రవాణానౌకలు తిరుగుతుంటాయి. ఇక్కడ ఎలాంటి అలజడి ఏర్పడినా తూర్పు ఆసియా దేశాలకు ముఖ్యంగా చైనాకు పశ్చిమాసియా నుంచి వచ్చే దిగుమతులపై ప్రభావం పడే అవకాశముంది. చైనా యుద్ధనౌకలు హిందూమహాసముద్రంలోకి ప్రవేశించాలంటే ఇదే కీలకమైన మార్గం. అయితే దక్షిణ చైనా సముద్రంలో చైనా పెత్తనాన్ని అంగీకరించని ఇండొనేసియా తదితర దేశాలు భారత్‌తో కలిసి సంయుక్తంగా నిఘా నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. వీటితో పాటు శరణార్థుల అక్రమ తరలింపు, మాదక ద్రవ్యాల సరఫరా, దొంగచాటుగా ఆయుధాల రవాణాకు ఈ దీవులను మాఫియా శక్తులు వినియోగిస్తున్నట్లు భారత నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ భద్రతను పూర్తిస్థాయిలో పెంచాల్సిన అవసరం ఉంది.

అండమాన్‌లో పహారా కేంద్రాలు



శత్రుదుర్భేద్యంగా రక్షణ వ్యవస్థ

అత్యంత కీలకమైన ప్రాంతంలో ఈ ద్వీపాలు ఉండటంతో హిందూ మహాసముద్రంలో డ్రాగన్ చొరబాటును అడ్డుకునే సౌలభ్యముంది. ఇక్కడ 550కు పైగా దీవులు ఉన్నాయి. కేవలం 38 దీవుల్లోనే నివాసప్రాంతాలున్నాయి. జరవాస్, సెంటినలీస్ తదితర ఆటవిక తెగలకు చెందినవారు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఇష్టం పడటంలేదు. వీరి జీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేపట్టాలని పర్యావరణ సంఘాలు కోరుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దీవుల మధ్య సరైన రవాణా సదుపాయాలు లేవు. జపాన్ ఆర్థికసాయంతో మౌలిక సదుపాయాలకు రూపకల్పన జరుగుతోంది. షిబ్‌పూర్, క్యాంప్‌బెల్ బే ప్రాంతాల్లో నావికాదళ కేంద్రాల్నీ విస్తరింపజేస్తున్నాయి. దిగ్లిపూర్ నుంచి రాజధాని పోర్ట్‌బ్లెయిర్ వరకు 240 కి.మీ. పొడవైన రైలుమార్గ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇతర దేశాల నౌకలు అక్రమంగా భారత సముద్రజలాల్లోకి ప్రవేశించకుండా ఉండేందుకు యుద్ధనౌకల నుంచి అణ్వాయుధాలు ప్రయోగించగలిగే క్షిపణుల సదుపాయం ఉండాలని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మౌలిక సౌకర్యాల విస్తరణ

పోర్ట్‌బ్లెయిర్‌లో త్రివిధ దళాల కమాండ్ ఉండటంతో అనేక ద్వీపాల్లో సాయుధ దళాలను, భారీ ఆయుధ సామగ్రిని మోహరించేందుకు చర్యలు చేపడుతున్నారు. అమెరికా, జపాన్ సహకారంతో సముద్రంలో ఎలాంటి ధ్వనినైనా పసిగట్టే 'సెన్సర్ల'ను అమర్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిద్వారా అక్రమంగా ప్రవేశించే జలాంతర్గాములు, నౌకలను అడ్డుకోవచ్చు. దేశ ప్రధాన భూభాగానికి సుదూరంగా ఉండే దీవుల్లో అంతర్జాల సదుపాయం తక్కువగా ఉంది. డిజిటల్ అనుసంధానం కోసం చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయిర్ వరకు సముద్రగర్భంలో ఆప్టిక్ ఫైబర్ కేబుల్ నిర్మాణం ఈ ఏడాది పూర్తికానుంది. దీని ద్వారా బ్రాడ్‌బ్రాండ్ వినియోగం పెరగడంతో పాటు అంతర్జాలం ద్వారా ప్రభుత్వసేవలు త్వరితంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దీపావళి సందర్భంగా ఇక్కడ పర్యటించి రక్షణ అంశాలపై చర్చించారు. క్యాంప్‌బెల్ బేలోని ఐఎన్ఎస్ బాజ్‌లో రన్‌వేను విస్తరించనున్నారు. ఇక్కడ నుంచే మలక్కా జలసంధిలో నౌకల సంచారంపై నిఘా పెట్టవచ్చు. అమెరికా, జపాన్, ఇండొనేసియా తదితర దేశాల సహకారంతో ప్రారంభమైన పథకాలు పూర్తయితే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అండమాన్ ద్వీపాలు పూర్తిస్థాయి సైనిక స్థావరంగా అవతరించి శత్రుదుర్భేద్యంగా మారనున్నాయి.


– కొలకలూరి శ్రీధర్

త్యాగ రాగ సుధ

రాగ తాళాల్ని సొగసుగా జతపరచిన ధన్యజీవి త్యాగయ్య. పరమాత్మ గుణగణాల్ని దివ్యంగా గానం చేసిన సప్త స్వర శోభితుడాయన! సంగీతానికి గల సమ్మోహన శక్తి అది. నాదోపాసన ద్వారా భగవంతుడి దరి చేరవచ్చని నిరూపించిన ఆ వాగ్గేయకారుడు, మహోన్నత భక్తి సాధనలోనే తరించాడు. వేంకటేశ్వరుణ్ని గానం చేసి అన్నమయ్య, మువ్వగోపాలుణ్ని స్మరించి క్షేత్రయ్య చరితార్థులయ్యారు. రామభక్తితో భజన సాగించి కంచెర్ల గోపన్న, సంగీత నృత్య కళల్ని దైవానుగ్రహంగా భావించి నారాయణ తీర్థులు ధన్యులయ్యారు. వారి కోవకు చెందిన త్యాగరాజు ఎంతటి సంగీతజ్ఞుడో అంతటి సాహితీ ద్రష్ట. ఆయన రచనలు ద్రాక్షా పాకం వంటివి. ఆ కీర్తనలు పండిత పామర రంజకాలు.

తరతరాలకూ గానామృతాన్ని పంచిపెట్టిన త్యాగరాజుకు కళలన్నీ వారసత్వంగా అబ్బినవే! తాత గిరిరాజ కవి గురించి బంగాళరాగ కృతిలో 'గిరిరాజసుతా తనయ' అంటూ స్తుతించాడు. కొన్ని అపురూప రాగాల్ని సాధన చేసి గురువు శొంఠి వేంకటరమణయ్య మన్ననలు పొందాడు. చెంచు కాంభోజి, సుపోషిణి, వీర వసంత రాగాలు- గానం చేయడానికి కష్టతరమైనవి. ఎందరో సంగీత సాధకులు అలాంటి రాగాలను ఆలపించేందుకే జంకేవారు. కానీ త్యాగయ్య ఆ రాగాలనే జతకూర్చి కీర్తనలు రాశాడు. 'తొలి నేను చేసిన పూజా ఫలమిలాగే' (కోకిల ధ్వని) కీర్తనను అపురూప రాగంలోనే గానం చేశాడు. గురువు ఇంట చేసిన కచేరీలో 'ఎందరో మహానుభావులు' కీర్తన (శ్రీరాగం)లో స్వరపరచి పాడాడు. ఇది పంచరత్న కృతుల్లో అయిదోది.

త్యాగయ్య సంగీత సంప్రదాయంలో ఎన్నో విశేషాల్ని పరిశోధించాడు. 'సంగతి' అనే ప్రక్రియను ప్రారంభించింది ఆయనే! దివ్యనామ సంకీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలకు తానే ఆద్యుడు. 'రామ రామ నీవారముగామా (ఆనందభైరవి), ఉయ్యాలలూగవయ్య (నీలాంబరి) వంటివి ఉత్సవ సంప్రదాయ కీర్తనలు. ఇలాంటి కీర్తనలే ఖరహరప్రియ, హరికాంభోజి రాగాల్లోనూ ఉన్నాయి. శబ్దాన్ని కాలంతో మేళవించి వినసొంపుగా మార్చే విలక్షణమైన ప్రక్రియ సంగీతమని త్యాగరాజు భావన. పల్లవి, అనుపల్లవి, చరణం ప్రక్రియలకూ ఆద్యుడై నిలిచాడు. సామవేదంలో పేర్కొన్నవాటిలో అర్హమైన ఆరు రాగాలను ఎంచుకొని, తన కీర్తనల కోసం వినియోగించడం మరో విశేషం.



'దయజూచుటకిది వేళరా' కీర్తనను త్యాగయ్య గానవర్ధిని రాగంలో స్వరపరచాడు. ఇలాంటి పలు అపురూప రాగాలకు జీవం పోశాడాయన. ధన సంపాదనపై అనురక్తి కన్నా శ్రీరాముడిపై భక్తి కలిగి ఉండటమే గొప్ప అని తలచాడు. 'నిధి చాల సుఖమా...

అంతర్యామి

రాముని సన్నిధి సేవ సుఖమా' (కల్యాణి), 'ఎంత రానీ తనకెంత పోనీ నీ చెంత విడువజాల శ్రీరామా(హరికాంభోజి) వంటి కీర్తనలతో 'సంగీతం అనేది భగవంతుడి ప్రేమను పొందే మార్గం' అని చాటాడు. శ్రీరామ వియోగ బాధను తట్టుకోలేక, 'నగుమోము గనలేని నా జాలి తెలిసీ నను బ్రోవగ రారాదా' అంటూ ఆర్తిపడ్డాడు. 'జగమేలే పరమాత్మా... ఎవరితో మొరలిడుదూ' అని వేడుకోవడం త్యాగయ్య భక్తిభావానికి పరాకాష్ఠ.

ఆయన సాహిత్యం అసామాన్యమైనది. 'ఇంద్ర నీలమణి సన్నిభావ ఘన చంద్రసూర్య నయనా ప్రమేయ', 'పరమ భాగవత మౌనివర శశి విభాకర సనకస నందన దిగీశ సుర కింపురుష' వంటి పద సమాసాలు త్యాగయ్య అగణిత ప్రతిభకు ఘన నిదర్శనాలు. ఆయనకు సామాజిక స్పృహ అధికం. ఆ రచనల్లో జాతీయాలు కొల్లలుగా కనిపిస్తాయి. 'శాంతము లేక సౌఖ్యము లేదు,' 'తలకు వచ్చిన బాధ తలపాగకు చేటు' వంటివీ ఆ వాగ్గేయకారుడి చతురతకు ప్రతీకలు. రామ మంత్ర ప్రభావంతో నాదోపాసకుడైన త్యాగరాజు- భక్తి రాజ్యానికి రారాజు!

– అప్పరుసు రమాకాంతరావు

కశ్మీరులో మంచు తుపాను

9 మంది గల్లంతు

జమ్ము: కుప్వారా జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉక్కిరిబిక్కిరి చేసిన మంచు తుపాను ధాటికి మొత్తం 9 మంది గల్లంతైనారు. టాటా సుమో వాహనంలో కుప్వారా నుంచి కర్నాకు 8 మంది ప్రయాణిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. అదే ప్రాంతంలో సరిహద్దు రహదారుల సంస్థ ఉద్యోగి ఒకరు కూడా గల్లంతైనారు. పోలీసు బృందాలు, సైన్యం, విపత్తు స్పందన దళం సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అంతకుముందు తుఫాను ప్రభావిత ప్రాంతం నుంచి తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఈ దళాలు రక్షించాయి.

పర్యావరణ నియంత్రణపై చర్చ

ఈనాడు, దిల్లీ: ప్రాజెక్టుల మదింపు, పర్యావరణ పరిస్థితుల పరిశీలనకు, అనుమతుల మంజూరుకు, కాలుష్య కారకులపై జరిమానా విధించడానికి ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటుచేయాలని సుప్రీం కోర్టు జారీచేసిన ఆదేశాలపై అధ్యయనానికి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆధ్వర్యంలో ప్రత్యేక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసినట్లు కేంద్ర పర్యావరణశాఖ సహాయమంత్రి మహేశ్ శర్మ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. దీనిపై ఇప్పటికే టీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన నివేదిక పరిశీలనకు ఎర్నెస్ట్ అండ్ యంగ్, అమర్‌చంద్ అండ్ మంగల్ దాస్ సంస్థలను కన్సల్టెంట్‌గా నియమించినట్లు తెలిపారు.

★ రాష్ట్ర ప్రభుత్వాలనుంచి కేంద్రానికి రూ.1.52 లక్షల కోట్ల రుణాలు రావాల్సి ఉన్నట్లు ఆర్థికశాఖ సహాయ మంత్రి పొన్‌రాధాకృష్ణన్ తెలిపారు. 2016-17 నాటికి ఏపీ నుంచి రూ.9,304.64 కోట్లు, తెలంగాణ నుంచి రూ.8,061 కోట్లు రావాల్సి ఉన్నట్లు వెల్లడించారు.

చెన్నమనేనికి ఊరట

పౌరసత్వంపై కేంద్రం ఉత్తర్వుల అమలును నిలిపివేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: భారత పౌరసత్వం వ్యవహారంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు ఉమ్మడి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన భారత పౌరుడు కాదంటూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల అమలును ఆరు వారాలపాటు నిలిపివేస్తూ శుక్రవారం ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నమనేని పౌరసత్వానికి సంబంధించిన అన్ని రికార్డులను తమ ముందుంచాలనీ, పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ విచారణ కమిటీ గత ఏడాది ఆగస్టు 31న ఇచ్చిన ఉత్తర్వులతోపాటు వాటిని సమర్థిస్తూ కేంద్ర హోంశాఖ డిసెంబరు 13న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ చెన్నమనేని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ ఎస్.వి.భట్ విచారణ చేపట్టారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఆరు నెలలపాటు కేంద్రం ఉత్తర్వుల అమలును నిలిపి వేస్తూ, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉన్నందున రికార్డులు సమర్పించి కౌంటరు దాఖలు చేయాలంటూ కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.

చట్టప్రకారమే పౌరసత్వం: చెన్నమనేని

వేములవాడ, న్యూస్‌టుడే: పౌరసత్వం పొందేందుకు నిబంధనలను ఉల్లంఘించనప్పుడు తనపై అభియోగాలు మోపడం హేయమైన చర్య అని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గడ్డ కట్టిస్తున్న చలి

- అంగారకుడిపై కన్నా తక్కువగా ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న ఈశాన్య, తూర్పు అమెరికా
- ఉష్ణోగ్రతలు మైనస్ 40 డిగ్రీలకు పడిపోయే అవకాశం
- 'బాంబు తుపాను'తో భీకర వాతావరణ పరిస్థితులు

న్యూయార్క్: 'బాంబు తుపాను'తో అమెరికాలో భీకర వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. శుక్రవారం దాని ప్రభావం దారుణంగా ఉంది. తూర్పు అమెరికా గడ్డకట్టించే చలిగాలులతో వణుకుతోంది. ఆర్కిటిక్ ఔట్‌బ్రేక్‌గా పిలిచే ప్రతికూల వాతావరణంతో లక్షల మంది భీతిల్లుతున్నారు. ఎనిమిది రాష్ట్రాల్లో అడుగు లోతున మంచు పేరుకుపోయింది. కనెక్టికట్, మైనె, మసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్, న్యూజెర్సీ, న్యూయార్క్, రోడ్ ఐలాండ్, వర్జీనియాలో కనీసం అడుగులోతున మంచు పేరుకుపోయింది. దీంతో వాహనాలు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. బోస్టన్ వీధులను మంచుతో కూడిన వరద ముంచెత్తింది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని పలు కోస్తా ప్రాంతాలనూ ఈ వరద ముంచెత్తింది. వర్జీనియా, ఉత్తర కరోలినా, న్యూయార్క్, బోస్టన్ సహా తూర్పు తీరం వెంబడి వేల గృహాలకు విద్యుత్తు సౌకర్యం నిలిచిపోయింది. దీంతో ఇళ్లల్లో హీటర్లు పని చేయక ప్రజలు అల్లాడుతున్నారు. ఎముకలు కొరికే చలిగాలులు, హిమపాతంతో చాలా పాఠశాలలు, కార్యాలయాలు మూతపడ్డాయి. ఈ ప్రతికూల వాతావరణం కారణంగా ఈ వారంలో కనీసం 19 మంది మరణించారు. ఈ వారాంతంలో గడ్డకట్టించే చలిగాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. ఆర్కిటిక్ ఔట్‌బ్రేక్‌తో ఈశాన్య అమెరికాలో మైనస్ 20 నుంచి మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోతాయని నిపుణులు చెబుతున్నారు. ఈశాన్య అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో అంగారకుడిపైన ఉన్న అత్యధిక ఉష్ణోగ్రతల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని భావిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం అంగారకుడిపై అత్యధిక ఉష్ణోగ్రత మైనస్ 2 డిగ్రీల ఫారెన్‌హీట్‌గా నమోదయింది. అంటే సుమారు మైనస్ 19 డిగ్రీల సెల్సియస్ లాంగ్ ఐలాండ్, ఆగ్నేయ కనెక్టికట్ ప్రాంతాల్లో గంటకు 88.5 కిలోమీటర్ల వేగంతో గడ్డకట్టించే చలిగాలులు వీసే అవకాశం ఉందని, ఫలితంగా ఫ్రాస్ట్‌బైట్, హైపోథర్మియా (శరీర ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడం) ముప్పు కూడా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు షెల్టర్లలో ఉన్న జంతువులు గడ్డకట్టి చనిపోతున్నాయి. అమెరికా-కెనడా సరిహద్దుల్లోని నయగార జలపాతం కూడా గడ్డకట్టింది. ఉత్తర ఫ్లోరిడా, ఆగ్నేయ జార్జియాలో రహదారులను మూసేశారు. ఇక్కడి కోస్తా ప్రాంతాల్లో గవర్నర్ నాథన్ డీల్.. అత్యయక స్థితిని ప్రకటించారు.



న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయంలో భారీగా పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న సిబ్బంది

ప్రయాణాలకు తీవ్ర అంతరాయం: గురువారం దేశవ్యాప్తంగా 5వేలకు పైగా విమానసేవలు రద్దుకాగా శుక్రవారం 1,400కు పైగా విమానాలను రద్దు చేశారు.

మేడారంలో మొదలైన మొక్కులు

- దర్శనానికి తరలివస్తున్న భక్తులు

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: మేడారానికి అప్పుడే భక్తుల తాకిడి మొదలైంది. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు సమ్మక్క, సారలమ్మ ఉత్సవం జరగనుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామం మహాజాతరకు వేదిక కానుంది. వివిధ రాష్ట్రాల్లోని గిరిజనులు, గిరిజ నేతరులు లక్షలాదిగా తరలి వస్తారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో మేడారం జనసంద్రంగా మారుతుంది. అప్పటి రద్దీని దృష్టిలో ఉంచుకుని దూరప్రాంతాల వారు, జాతరప్పుడు వీలుకాని వారు కొందరు ముందుగానే అమ్మలను పూజించేందుకు వస్తున్నారు. జాతర సమయంలో రద్దీ వలన చిన్న పిల్లలు, వృద్ధులతో తరలిరావడం ఇబ్బందికరం కావడంతో ముందుగానే వచ్చి మొక్కులు అప్పగిస్తున్నారు. గత ఆదివారమైతే లక్షాయాభైవేలమంది అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి సెలవులు కనుక రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. చాలామంది ప్రత్యేక వాహనాల్లో తరలి వస్తున్నారు. జంపన్నవాగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరిస్తున్నారు. తర్వాత అమ్మల గద్దెల వద్ద ఎత్తుబెల్లం, చీరసారె, పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకుంటున్నారు. అనంతరం జంపన్నవాగు, చిలకలగుట్ట, ఊరట్టంవాగు తదితర ప్రాంతాల్లో సేదతీరుతున్నారు. వంటలు చేసుకొని సామూహికంగా భోజనాలు చేస్తున్నారు. మార్గమధ్యలో రామప్ప, లక్నవరం సరస్సు తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు.



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

చురుగ్గా ఏర్పాట్లు

మహాజాతరకు సుమారు కోటిమందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం 20 శాఖలకు గానూ రూ.80.55 కోట్లు కేటాయించింది. విద్యుత్తు, రహదారులు, స్నానఘట్టాలు, తాగునీరు, అంతర్గత రోడ్లు, ఆర్టీసీ బస్టాండు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, అంతర్గత రహదారులు తదితర పనులు పూర్తి కావస్తున్నాయి. జాతరకు 15 రోజుల ముందే అన్నీ పూర్తిచేసేందుకు అధికారులు కృషిచేస్తున్నారు.

కుమారుల నుంచి రక్షణ కల్పించండి

'కృషి' వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌లపై తల్లిదండ్రుల ఫిర్యాదు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: తమ కుమారుల నుంచి ప్రాణరక్షణ కల్పించాలని కృషి బ్యాంకు మాజీ ఛైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌లపై వారి తల్లిదండ్రులు కొసరాజు విజయసింహ, బేబీసరోజిని దంపతులు శుక్రవారం కృష్ణా జిల్లా పెదపారుపూడి పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశారు. కొసరాజు వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌లు గురువారం సాయంత్రం పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడలో నివసిస్తున్న తల్లిదండ్రుల ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా విజయసింహ పేరున ఉన్న 20 ఎకరాలు, బేబీసరోజిని పేరున ఉన్న ఆరెకరాల భూమిని తమ పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేశారు. అందుకు విజయసింహ దంపతులు అంగీకరించలేదు. ఆస్తి తమ పేరున రాయకుంటే చంపేస్తామని హెచ్చరించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందర చేశారు. భూమికి సంబంధించిన దస్తావేజులు, పాస్‌పుస్తకాలు, ఈసీల కోసం గాలించారు. అవి కనిపించకపోవడంతో తల్లిదండ్రులపై దౌర్జన్యానికి దిగి చేయిచేసుకున్నారు. వాటిని రెండు రోజుల్లో తమకు అప్పగించకపోతే చంపుతామని బెదిరించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై దుర్గా ప్రసాద్ తెలిపారు.

నేరెళ్ల ఘటనపై నేడు పాదయాత్ర

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అనుమతించినా, అనుమతించకున్నా తమ పాదయాత్ర ఆగబోదని వామపక్ష, ప్రజా సంఘాలు స్పష్టం చేశాయి. శుక్రవారం మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నేరెళ్ల ఘటనకు నిరసనగా ఈ నెల 6న సిద్ధిపేట నుంచి నేరెళ్లకు పాదయాత్ర చేసేందుకు అనుమతించాలంటూ డీసీపీకి లేఖ రాశామన్నారు. అనుమతిస్తామని డీసీపీ తెలిపారని, అడ్డంకులు సృష్టించినా పాతయాత్ర కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు పెచ్చుమీరాయని ఆందోళన వ్యక్తంచేశారు. అడ్డుకున్న వాళ్లను ట్రాక్టర్లతో తొక్కించి మరీ చంపడం దానికి నిదర్శనమన్నారు. మృతి చెందిన వీఆర్ఎ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమినేని వీరభద్రం మాట్లాడుతూ...ఇసుక దందాలకు అధికార పార్టీ అండదండాలున్నాయని ఆరోపించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు చలపతి, రమాదేవి, తెలంగాణ ఐకాస ప్రతినిధి వెంకట్‌రెడ్డి, జానకిరాములు తదితరులు మాట్లాడారు.

తలాక్ బిల్లుపై తెరాస, వైకాపాల వైఖరి స్పష్టం చేయాలి: షబ్బీర్‌అలీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తలాక్ బిల్లుపై తెరాస, వైకాపాలు తమ వైఖరి స్పష్టం చేయాలని మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడుతూ తలాక్ బిల్లులో కొన్ని సవరణలు చేయాలని కాంగ్రెస్ సూచించినా పట్టించుకోకుండా భాజపా సంఖ్యాబలంతో లోక్‌సభలో బిల్లు మూజువాణి ఓటుతో నెగ్గించుకుందన్నారు. రాజ్యసభలో భాజపాకు సంఖ్యాబలం లేదన్నారు. బిల్లును కాంగ్రెస్ సహా 17 పార్టీలు వ్యతిరేకిస్తుండగా ఎన్డీయేలో భాగస్వామ్యం కాని తెరాస, ఏపీలోని వైకాపాలు తమ నిర్ణయాన్ని స్పష్టం చేయకుండా వాకౌట్ చేశాయన్నారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

- అన్ని వర్గాలతో కలిసి వెళ్లాలి
- యువతకు ప్రాధాన్యమివ్వాలి
- బూత్ కమిటీలపై దృష్టి
- రాష్ట్ర నాయకులకు అధిష్ఠానం దిశానిర్దేశం

ఈనాడు, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేస్తోంది. ఐదారు అంశాలపై దృష్టి సారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అభ్యర్థులను ముందుగానే ప్రకటించే యోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. రైతులు, విద్యార్థులు, యువత ఇలా వివిధ వర్గాలకు సంబంధించిన అంశాలపై పని చేయడంతో పాటు పార్టీని ప్రజలకు దగ్గరగా తీసుకెళ్లడానికి అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించినట్లు పార్టీ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ఎన్నికల వరకు ఎలా ఉండాలో ఆ పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా చూడటంతో పాటు, యువత, విద్యార్థులపై దృష్టిసారించడం, దళితులు, బలహీనవర్గాలకు దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపట్టడం, నాయకులు ఐక్యతగా పని చేయడం, అధికారంలోకి వస్తే ఏం చేస్తామో ఇప్పటి నుంచే చెప్పడం, బూత్‌ల వారీగా కార్యకర్తలను సిద్ధం చేయడం తదితర అంశాలు ఇందులో ఉన్నాయి.

ముందుగానే అభ్యర్థుల ప్రకటన

ఇప్పటికే ఉన్న పార్టీలు, కొత్తగా వస్తాయని భావిస్తున్న పార్టీ ఇలా అందరితో కలిసి వెళ్లాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి తెరాస లబ్ధిపొందకుండా చూడాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. కనీసం 60 శాతం అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ముందుగానే నిర్ణయించి పని చేసుకోవాలని సూచించాలనే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్టీ తదితర బలహీనవర్గాలకు సంబంధించి చేపట్టబోయే కార్యక్రమాలను వారిదగ్గరకు తీసుకెళ్లడం, ఆయా వర్గాలకు సముచిత స్థానం కల్పించి వారికి నమ్మకం కలిగించడం ప్రధానమని సూచించినట్లు తెలిసింది. యువత, విద్యార్థులు, అంగన్‌వాడీలపై కూడా ఎక్కువగా కేంద్రీకరించాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా తెలుస్తోంది. ఈ వర్గాలతో పనిచేయడం, పార్టీలో ప్రాధాన్యమివ్వాలని అధిష్ఠానం సూచించినట్లు రాష్ట్ర స్థాయి ముఖ్యనాయకుడొకరు తెలిపారు. వివిధ సామాజిక అంశాలపై టి.మాస్ తదితర సంఘాలు పని చేస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీరి డిమాండ్లను పరిష్కరిస్తామనే నమ్మకం కలిగించి ఆయా సంఘాల మద్దతు పొందేలా చూడాలనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. బూత్‌ల కమిటీలపై ఇప్పటి నుంచే దృష్టి సారించనుంది. ప్రతి 12 నుంచి 15 కుటుంబాలకు ఒక కార్యకర్తను నియమించి.. శిక్షణ ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. గుజరాత్, పంజాబ్‌లలో అనుసరించిన ఈ వ్యూహం ఫలితాలిచ్చిందని రాష్ట్ర నాయకులకు సూచించినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో సూక్ష్మస్థాయి ప్రణాళిక అవసరమని కాంగ్రెస్ భావిస్తోంది.

జాతీయ స్థాయి పదవుల్లో ప్రాధాన్యం

నాయకులు తమ మధ్య ఉన్న విబేధాలను పక్కన పెట్టి ఎన్నికల్లో కలిసి పనిచేయడంపై కూడా కాంగ్రెస్ అధిష్ఠానం ఎక్కువ దృష్టి కేంద్రీకరించినట్లు పార్టీ నేతలు చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌గాంధీ త్వరలోనే వివిధ కమిటీలను నియమించే అవకాశం ఉంది. ఇందులో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు జాతీయ స్థాయి పదవుల్లో ప్రాధాన్యమిచ్చే అవకాశం ఉంది. తెలంగాణలోని ముఖ్యనాయకులకు కూడా పదవులు లభించనున్నాయి. రాష్ట్ర, జిల్లా కమిటీలు కూడా ఏర్పాటు కానున్నాయి. ప్రజా సమస్యలపై పని చేయడం, పార్టీ యంత్రాంగాన్ని ఎన్నికలకు సిద్ధం చేయడం, విపక్షాల ఓట్లు చీలకుండా చూడటం ముఖ్యమని రాష్ట్ర నాయకులకు అధిష్ఠానం స్పష్టం చేసినట్లు తెలిసింది.

గజ్వేల్‌లో పదివేలమందితో నిరాహారదీక్ష

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం పదివేలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఆయుత ధర్మదీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛను విధానంలో రాష్ట్రంలో 1.22 లక్షల మంది ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని వివరించారు. సీపీఎస్ రద్దుతో పాటు ఇందులో కొనసాగుతూ మృతి చెందిన లేదా పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీని ఇవ్వాలని, పింఛను ప్రయోజనాలను అందించాలని కోరుతూ పదివేలమందితో నిరాహారదీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆయుత ధర్మదీక్ష నిర్వహించుకునేందుకు అనుమతిని పోలీసులు రద్దు చేయగా హైకోర్టు అనుమతి ఇచ్చిందని ఆ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో విజయం దక్కించుకోవాలి

- భాజపా మహిళామోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయ రహత్కర్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: తెలంగాణలో విజయం దక్కించుకోవడానికి అవసరమైన ప్రణాళికతో ముందుకు సాగాలని భాజపా మహిళామోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయ రహత్కర్ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర మహిళామోర్చా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా అవతరించిందనీ, దేశవ్యాప్తంగా 13.50 కోట్ల మందితో పార్టీ సభ్యత్వం ఉండగా, 3.50 కోట్లమంది మహిళా సభ్యులు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో మహిళామోర్చా కీలకపాత్ర పోషించాలనీ, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ముమ్మారు తలాక్ రద్దు ప్రయోజనాలను వివరించాలని సూచించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ధరావతు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. తెలంగాణలో తెరాస ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. నారీ భేరీ మోగితే అధికార పీఠాలు కదులుతాయని, తెలంగాణలో 2019లో అదే జరుగుతుందని చెప్పారు. మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, ప్రధానకార్యదర్శి నాగ పరిమళ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలపై వివక్ష చూపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో భాజపా శాసనసభా పక్షనేత కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రరావు, పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం.కాంతారావు, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



విజయ రహత్కర్

విత్తన సంస్థలపై కొనసాగుతున్న ఆదాయపన్నుశాఖ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: వాస్తవ ఆదాయానికి, చెల్లిస్తున్న పన్నులకు మధ్య పొంతన లేదన్న అనుమానంతో ఆదాయపన్నుశాఖ అధికారులు ప్రముఖ విత్తన సంస్థలైన నూజివీడు సీడ్స్, కావేరీ సీడ్స్ సంస్థల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. గురువారం మొదలైన ఈ తనిఖీలు శుక్రవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ రెండు సంస్థల కార్యాలయాలు, ఇళ్లపై సోదాలు జరుగుతున్నాయి. ఆదాయపన్నుశాఖ దర్యాప్తు విభాగంలోని అన్ని బృందాలూ ఇందులో పాల్గొంటుండటం గమనార్హం. ఈ సందర్భంగా పలు కీలక ధ్రువపత్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషించిన తర్వాత పన్నుల ఎగవేతపై స్పష్టత రానుంది.

ఇక ఎప్పటికప్పుడు పేదరికం అంచనా

- నిర్దిష్ట కాలావధుల్లో సెక్-2011 ను తాజా పర్చనున్న కేంద్రం

ఈనాడు–దిల్లీ: దేశంలో ప్రస్తుత పేదరిక స్థితిగతులను గుర్తించడానికి సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ-సెక్)ను ఎప్పటికప్పుడు తాజాపర్చాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు ఉద్దేశించిన పైలట్ ప్రాజెక్టును ఈ నెల చివరిలో అధికారులు ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో తొలుత ఈ ప్రాజెక్టును చేపడతారు. ఇందుకోసం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ త్వరలో ఒక కేబినెట్ నోట్‌ను ప్రవేశపెట్టనుంది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం లభించిన తర్వాత పది జిల్లాల్లో ప్రయోగాత్మక గణన చేపట్టే అవకాశం ఉంది. దక్షిణ, ఉత్తర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య జోన్లుగా వర్గీకరించి ఒక్కో జోన్‌లో రెండు జిల్లాల్లో గణన చేపడతారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన యాప్‌ను కూడా పరీక్షిస్తారు. ప్రయోగాత్మక ప్రాజెక్టు తుది ఫలితాలను బట్టి ఈ నమూనాలను తర్వాత దేశవ్యాప్తంగా అమలు చేస్తారు. కొత్తగా అర్హులైన వారిని జాబితాలో తప్పనిసరిగా చేర్చే లక్ష్యంతోనే నిర్దిష్ట కాలావధుల్లో క్రమం తప్పకుండా సామాజిక-ఆర్థిక కుల గణన చేపట్టనున్నారు. అదే సమయంలో పేదరిక ప్రమాణాలను దాటి ఎగువకు వెళ్లిన వారి పేర్లు వాటంతటవే జాబితా నుంచి తొలగిపోయేలా చేస్తారు. అయితే ఈ కార్యక్రమం పేరులో ఉన్నట్లు ఈ గణనకు కులంతో సంబంధం ఉండదు. కులంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి ఆర్థిక స్థితి వివరాలను మాత్రమే తాజా పరుస్తారు. లబ్ధిదారులు పేదరికం నుంచి బయటపడడానికి ప్రభుత్వ పథకాలు ఉపకరించాయో లేదో మదింపు వేయడానికే డేటాబేస్‌ను తాజాపర్చాలనుకుంటున్నట్లు ఒక అధికారి వివరించారు. ప్రధాని గ్రామీణ ఆవాస్ యోజన సహా ముఖ్యమైన సామాజిక సంక్షేమ పథకాలను సెక్‌తో అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుండడం గమనార్హం.

- గ్రామీణ, పట్టణ కుటుంబాల సామాజిక-ఆర్థిక స్థితిగతుల అధ్యయనమే సెక్-2011.
- ముందుగా నిర్వచించిన పరామితుల ఆధారంగా కుటుంబాలకు సెక్ ర్యాంకులను కేటాయిస్తుంది.
- సెక్- 2011లో మూడు గణన అంశాలున్నాయి. 1) గ్రామీణాభివృద్ధి శాఖ.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన జనగణన. 2) గృహనిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూలన శాఖ పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన జనగణన. 3) హోం మంత్రిత్వశాఖ, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, భారత జనగణన కమిషనర్ ఆధ్వర్యంలో రెండు ప్రాంతాల్లో నిర్వహించిన కులగణన.

మధుమేహ చిన్నారులకు ఉచిత చికిత్స

ఈనాడు హైదరాబాద్: మధుమేహంతో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు 'డయాబ్ ఎయిడ్' సంస్థ పూర్తి ఉచితంగా చికిత్స అందించనుంది. టైప్-1 మధుమేహం బారినపడిన 16 ఏళ్లలోపు పిల్లలకు తాము నెలనెలా పరీక్షలు, ఇన్సులిన్, ఇతర ఔషధాలు, వైద్యుల సంప్రదింపు వంటివన్నీ ఉచితంగా అందజేయనున్నట్టు సంస్థ నిర్వాహకులు డా॥ పి.ఇంద్రసేనారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. మధుమేహ చికిత్సకు నెలనెలా సగటున రూ.2,500 నుంచి రూ.3000 వరకూ ఖర్చవుతుందని, నిరుపేదలకు దీన్ని భరించటం కష్టమైనందున తాము ఉచిత సేవలను అందిస్తున్నామని ఆయన వివరించారు. ఇందుకోసం చిన్నారులు ఈ నెల 20వ తేదీ లోపు హైదరాబాద్ పంజాగుట్టలోని 'కాంతి శిఖర అపార్ట్‌మెంట్'లో ఉన్న డయాబ్ ఎయిడ్ కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నిర్వాహకులను 9848039111, 8019363625, 9912119527, 040-66617111 ఫోన్ నంబర్లలో కూడా సంప్రదించొచ్చు. అయితే ఈ కార్యక్రమంలో భాగంగా తాము సిరంజీతో తీసుకునే ఇన్సులిన్ మందు సీసాలనే ఉచితంగా అందిస్తున్నామని, ఇన్సులిన్ పెన్నులు కాదని ఆయన స్పష్టం చేశారు.

కాఫర్ డ్యాం నిర్మాణానికి పచ్చ జెండా

ఈనాడు-అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యాంను యథాతథంగా నిర్మించుకునేందుకు ఆమోదం లభించింది. ప్రధాన డ్యాంతో జత చేయకుండా 2300 మీటర్ల పొడవునా నిర్మించుకోవచ్చని డ్యాం ఆకృతుల కమిటీ తేల్చి చెప్పింది. కేంద్ర జలవిద్యుత్తు పరిశోధన కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) కమిటీ సమర్పించిన ప్రతిపాదనలు ఆచరణ సాధ్యం కాదని అందరితో చర్చించిన మీదట స్పష్టం చేసింది. జెట్ గ్రౌటింగ్ పనులు ప్రారంభించుకునేందుకు అనుమతించింది. కాఫర్ డ్యాం ఆకృతులు సమర్పించి ఆమోదం పొందవచ్చని సూచించింది. దీంతో రెండు నెలలుగా పెండింగులో ఉన్న ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అనుమతి లభించినట్లయింది. దిగువ కాఫర్ డ్యాంలో జెట్‌గ్రౌటింగు పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. దిల్లీలో శుక్రవారం మధ్యాహ్నం పాండ్యా నేతృత్వంలో పోలవరం డ్యాం ఆకృతుల కమిటీ భేటీ జరిగింది.

అభివృద్ధి నామ సంవత్సరం

- రాజధాని చుట్టూ హెచ్‌ఎండీఏ ప్రణాళికలు
- రూ. 5 వేల కోట్ల సమీకరణకు యత్నాలు
- ఆకాశమార్గాలు, రోడ్ల నిర్మాణంపై దృష్టి

ఈనాడు – సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి


బాలానగర్ వద్ద నిర్మించనున్న ఆరు వరుసల వంతెన నమూనా

హైదరాబాద్‌లో ఈ ఏడాదంతా అభివృద్ధి కార్యక్రమాలే.. మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) రూ. 5,000 కోట్ల మేర నిధులను సమీకరించి హైదరాబాద్ చుట్టుపక్కల భారీ ఆకాశమార్గాలు, రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. వివిధ రకాల పథకాలతో నిధుల సమీకరణకు ఏడాదిన్నర కాలంగా చేపట్టిన ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి. అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) కోసం వచ్చిన దాదాపు 85,000 దరఖాస్తుల ద్వారా కూడా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే 50,000 దరఖాస్తులను దాదాపుగా పరిష్కరించారు. ఈ రూపంలో దాదాపు రూ. 800 కోట్ల మేర ఆదాయం రానుంది. అక్రమ భవనాల క్రమబద్ధీకరణ ద్వారా మరో రూ. 200 కోట్ల మేర సంపాదించవచ్చని అంచనా వేశారు. హెచ్‌ఎండీఏ ఉప్పల్ దగ్గర 150 ఎకరాలను అభివృద్ధి చేసింది. అందులో కొంతభాగం ఆ భూములను ఇచ్చిన రైతులకు ఇవ్వగా మరికొంత స్థలం మిగిలింది. ఇక్కడ మరో 70 ఎకరాల స్థలాన్ని లే అవుట్ వేసి విక్రయించాల్సి ఉంది. ఈ రూపంలో ఇక్కడ కనీసం రూ. 800 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. హెచ్‌ఎండీఏకు నగరం చుట్టుపక్కల వివిధ జిల్లాల్లో దాదాపు 95 ప్రాంతాల్లో ఖాళీ స్థలాలున్నాయి. వీటన్నింటిని ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా రూ. 400 కోట్ల మేర వస్తుందని భావిస్తున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో దాదాపు 200 ఎకరాల భూములు ఉన్నాయి. వీటి విక్రయం ద్వారా దాదాపు రూ. 1500 కోట్లను సేకరించాలని నిర్ణయించారు. ఇవేకాకుండా రైతుల దగ్గర భూ సమీకరణ ద్వారా భూములను తీసుకుని అతి పెద్ద టౌన్‌షిప్ రూపొందేలా వెంచర్లను వేయాలని నిర్ణయించారు. అభివృద్ధి చేశాక సగం రైతులకు అప్పగిస్తారు. సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల నుంచి ఇప్పటికే పలువురు రైతులు భూములు ఇవ్వడానికి ముందుకువస్తున్నారు. ఈ రూపంలో కనీసం రూ.1500 కోట్లను ఆర్జించాలని అధికారులు భావిస్తున్నారు. ఇలా మొత్తం రూ.5,000 కోట్ల సేకరణకు ప్రయత్నిస్తున్నారు.

ఇవీ ప్రణాళికలు

పార్యడైజ్- మేడ్చల్ మధ్య రూ. 1200 కోట్లతో హెచ్‌ఎండీఏ ఆకాశమార్గం నిర్మించబోతోంది. బాలానగర్ దగ్గర రూ. 350 కోట్లతో, రాజీవ్‌దారిలో హైదారాబాద్ నుంచి లోతుకుంట వరకు ఆరు వరసల ఆకాశామార్గాన్ని రూ. 1900 కోట్లతో నిర్మించనుంది. ఉప్పల్ నుంచి గౌరారం వరకు ఆరు వరుసల రోడ్డును రూ. 280 కోట్లతో, ఆరాంఘర్ నుంచి మామిడిపల్లి వరకు రోడ్డును, కిస్మత్‌పూర్ బ్రిడ్జితోపాటు మరికొన్ని పనులను చేపట్టడానికి ప్రణాళికను సిద్ధం చేసింది.

ఆకాశమార్గాలకు ప్రణాళిక

–చిరంజీవులు, హెచ్‌ఎండీఏ కమిషనర్

వివిధ రకాల పథకాలు స్థలాల అమ్మకాల ద్వారా రాజధానితోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో భారీ ఎత్తున ఆకాశ మార్గాలను నిర్మించబోతున్నాం. కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు ఉన్న రోడ్లను విస్తరించడానికి ప్రణాళికను రూపొందించాం. ఇప్పటికే కొన్ని పనులకు టెండర్లను పిలవగా కొన్నింటిని మొదలుపెట్టాం.



మృతి చెందిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. గంగులూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కొండెగామ్ అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్తున్న పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఓ మహిళా మావోయిస్టుతో పాటు మరో మావోయిస్టు మృతి చెందారు. ఎదురుకాల్పుల అనంతరం సంఘటనాస్థలం నుంచి పోలీసులు పేలుడు సామగ్రి, తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన మావోయిస్టుల వివరాలు తెలియాల్సి ఉంది. ఎదురుకాల్పుల ఘటనను బీజాపూర్ జిల్లా ఎస్పీ అహిరే ధ్రువీకరించారు.

ఎయిమ్స్‌కు నిధులు విడుదల చేయండి

కేంద్రమంత్రి నడ్డాకు ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుకు తగిన నిధులు కేటాయించాలని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ కేంద్రమంత్రితో భేటీ అయిన నర్సయ్యగౌడ్ బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా పలుసార్లు నిధులు విడుదల చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు.

బాధ్యతలు చేపట్టిన రాజేశ్వర్ తివారీ

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్ తివారీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన ఇటీవలి ఐఏఎస్ అధికారుల బదిలీల్లో రెవెన్యూ శాఖకు మారారు. ఈ నేపథ్యంలో తొలి రోజు ఆయన భూదస్త్రాల ప్రక్షాళన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రికి ప్రక్షాళన నివేదిక అందజేసే కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

21న బీసీ ఉద్యోగుల మహాసభ

ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిరంజన్‌తో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు, జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత, సంపన్నశ్రేణి నిబంధనల రద్దు, బీసీ కులాల జనగణన, ఖాళీ పోస్టుల భర్తీ డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రులు హన్స్‌రాజ్ గంగారాం, రామ్‌దాస్ అథవాలే, రాష్ట్ర మంత్రులు జోగు రామన్న, ఈటల రాజేందర్ హాజరవుతున్నారని చెప్పారు.

గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

అబిడ్స్,న్యూస్‌టుడే: గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ కోసం అతని తరపు న్యాయవాదులు వేసిన బెయిల్ పిటిషన్‌ను హైదరాబాద్‌లోని 14వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ కేసులో బాధితురాలి తరపున వాదిస్తోన్న పీపీ కృష్ణయ్య బెయిల్ ఇవ్వవద్దంటూ గట్టిగా వాదనలు వినిపించారు. దీంతో న్యాయమూర్తి.. గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు నివేదించడంతో బెయిల్‌ను నిరాకరిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. మరోసారి సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేసేందుకు నిందితుని తరపు న్యాయవాదులు ప్రయత్నిస్తున్నారు.


మా లోగోను పొరపాటుగా వాడారు

అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు

ఈనాడు, హైదరాబాద్ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తింపు రద్దు చేసిన ఎన్‌జీవో సంస్థల్లో అక్కినేని ఫౌండేషన్ సంస్థ కూడా ఉన్నట్లు చెబుతూ, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా లోగోను పొరపాటుగా కొన్ని ప్రసారమాధ్యమాల్లో వాడారు. అయితే అక్కినేని ఫౌండేషన్‌కు, తమ సంస్థకు సంబంధం లేదని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో తెలిపారు. అక్కినేని ఫౌండేషన్ భారతదేశంలో నాగేశ్వరరావు స్థాపించిన ఎన్‌జీవో సంస్థ అని, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థను ఏఎన్ఆర్ మరణానంతరం 2014లో అమెరికాలో ఏర్పాటు చేశామని ప్రసాద్ తెలిపారు.

కాకి వాగులో ఇసుక లభ్యత లేదు

- కారేగాం ప్రమాదంలో మృతి చెందిన సాయిలు వీఆర్ఏ కాదు
- అతని మృతితో ఇసుకకు ఎటువంటి సంబంధమూ లేదు
- 'ఈనాడు'లో యథార్థం రాశారు
- కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేత


మాట్లాడుతున్న కామారెడ్డి పాలనాధికారి సత్యనారాయణ, ఎస్పీ శ్వేత

ఈనాడు డిజిటల్, కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో గురువారం మృతి చెందిన సాయిలు గ్రామ రెవెన్యూ సహాయకుడు కాదని, ఇతని మరణానికి, ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ కారణం కాదని కలెక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. పిట్లం మండలం కారేగాం శివారులో ఘటనా స్థలిని పరిశీలించిన ఆయన శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఎస్పీ శ్వేత, జేసీ సత్తయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకి వాగులో ఇసుక లేదని, ఆ వాగులో రాళ్లతో కూడిన దొడ్డు ఇసుక మాత్రమే లభిస్తుందన్నారు. సాయిలు మృతికి కారణమైన ట్రాక్టర్ పక్క గ్రామంలో ఇటుకను దింపి వస్తోందన్నారు. సాయిలు వీఆర్ఏనే కాదని అతని చిన్నాన్న నీరడి సాయిలు గ్రామ సహాయకునిగా మార్దాండ గ్రామంలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రమాదం జరిగిన తరువాత మరో ట్రాక్టర్‌లో గ్రామస్థులు వాడుకునే దొడ్డు ఇసుకను తీసుకుని వస్తుండగా ప్రమాదాన్ని గమనించి, సమీపంలో ఉన్న ఓ రైతును నిద్రలేపి డ్రైవర్ విషయాన్ని వెల్లడించారని తెలిపారు. ఈ ట్రాక్టర్‌లో ఇంకా ఐదుగురు కూలీలు ఉన్నారన్నారు. ఒక్క 'ఈనాడు' పత్రికలో మాత్రమే యథార్థం రాశారని, క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలు సేకరించి ఇచ్చారని కలెక్టర్ చెప్పారు.

మద్యం మత్తులో సాయిలు: సాయిలు మృతికి గల కారణాలను ఎస్పీ శ్వేత వివరిస్తూ మృతుడు తన భార్యతో గొడవ పడి కూతురు స్వగ్రామమైన కంబాపూర్ వెళ్లేందుకు బయలు దేరాడన్నారు. మద్యం సేవించి ఉండడంతో దారి మధ్యలోనే నిద్రపోయాడని, ఈ సమయంలో అటువైపు నుంచి ఇటుకను దింపి వస్తున్న ట్రాక్టర్ అతని తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. తన భర్త ట్రాక్టర్ ఢీకొనడం వలన మృతి చెందాడని సాయిలు భార్య గురువారం ఉదయం ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. ఇందులో ఎక్కడా ఇసుక ట్రాక్టర్ అని పేర్కొనలేదన్నారు. మృతుడు మద్యం సేవించి ఉన్నాడని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పోస్టుమార్టం వివరాలు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

కళాశాలల ఖిల్లా తెలంగాణ

- లక్ష మంది విద్యార్థులకు రాష్ట్రంలో 59 విద్యాసంస్థలు
- జాతీయ సగటున అయితే 28 కళాశాలలు
- ఎక్కువ కళాశాలలున్న మూడో జిల్లా హైదరాబాద్
- అఖిల భారత ఉన్నత విద్య సర్వే 2016-17లో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రతి లక్ష మంది విద్యార్థులు(18-23 వయసు)కు అత్యధిక కళాశాలలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ సగటు కంటే రెట్టింపు సంఖ్యలో ఇక్కడ కళాశాలలు ఉండటం విశేషం. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మంది విద్యార్థులకు సగటున 28 కళాశాలలు ఉండగా తెలంగాణలో మాత్రం 59 ఉన్నాయి. అఖిల భారత ఉన్నత విద్య సర్వే(ఏఐఎస్‌హెచ్‌ఈ) 2016-17 ఈ అంశాలను పేర్కొంది. దేశవ్యాప్తంగా 2016 డిసెంబరు నుంచి 2017 సెప్టెంబరు వరకు సర్వే చేసిన కేంద్ర మానవ వనరుల శాఖ నివేదికను శుక్రవారం దిల్లీలో విడుదల చేసింది. సర్వేలో 864 విశ్వవిద్యాలయాలు, 40,026 కళాశాలలు, 11,669 ఒకే కోర్సు ఉన్న విద్యాసంస్థలు భాగస్వాములయ్యాయి. గతేడాది సర్వేలో తెలంగాణలో సగటున 60 కళాశాలలు ఉండగా ఈసారి అది 59కి తగ్గింది. అయినా రాష్ట్రానిదే అగ్రస్థానం.

సర్వేలో తెలంగాణ అంశాలివీ

- అత్యధిక కళాశాలలున్న 50 జిల్లాలను ఎంపిక చేయగా 1025 కళాశాలలతో బెంగళూరు, 635తో జైపూర్, 487 కళాశాలలతో హైదరాబాద్ మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నాయి. నల్గొండ జిల్లా 289 కళాశాలతో 10వ స్థానంలో నిలవడం విశేషం. ఏపీలో గుంటూరు 309 కళాశాలలతో 8వ స్థానంలో ఉంది.
- అత్యధిక కళాశాలలున్న 8 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లు నిలిచాయి. తెలంగాణాది 6వ స్థానం.
- ప్రపంచవ్యాప్తంగా 162 దేశాలకు చెందిన 47,575 మంది భారత్‌లో చదువుతున్నారు. అత్యధికంగా కర్ణాటకలో 13,050 మంది విద్యనభ్యస్తున్నారు. నాలుగో స్థానంలో తెలంగాణ-3,461, ఏపీ-2,341 మందితో 7వ స్థానంలో నిలిచింది.
- ఉపాధ్యాయుల్లో 10.8 శాతం ఎస్సీలు, 3.6 శాతం ఎస్టీలతో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది.

జాతీయస్థాయి ముఖ్యాంశాలు

- స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) 2012-13లో 21.5 శాతం ఉండగా తాజాగా అది 25.2 శాతానికి ఎగబాకింది. అత్యధికంగా ఎస్సీల్లో 16 నుంచి 21.2 శాతం, ఎస్టీల్లో 11.1 నుంచి 15.4 శాతానికి పెరిగింది.
- బిహార్‌లో లక్ష మంది విద్యార్థులకు 7కళాశాలలే ఉన్నాయి. దేశవ్యాప్తంగా 59.3 శాతం కళాశాలలు గ్రామాల్లో ఉన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా 9.3 శాతం కళాశాలలున్నాయి. 2.6 శాతం మాత్రమే పీహెచ్‌డీ కోర్సును అందిస్తున్నాయి. 20.1 శాతం వాటిల్లో 100 మంది కంటే తక్కువ విద్యార్థులున్నారు.


తిరుమలకు కాలినడకన వస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

గ్రహచారంతో నిందలు మోశా

ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, న్యూస్‌టుడే: గ్రహచారంతో నిందలు మోశానని, కోర్టు కేసుల నుంచి విముక్తి లభించడంతో తిరుమలకు యాత్రకు కాలినడకన వచ్చానని ఏపీ క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు. ఎమ్మార్ కేసు నుంచి ఊరట కలిగిన తరుణంలో శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడానికి ఆయన శ్రీవారి మెట్టు మార్గం నుంచి తిరుమలకు శుక్రవారం సాయంత్రం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "శేషం ఏమైనా మిగిలి ఉంటే కడిగేసుకోవాలని, లౌకిక జీవితంలోకి అడుగుపెట్టాలని తిరుమల యాత్రకు వచ్చాను. తెలిసి తప్పు చేయలేదు. గత జన్మలో చేసుకున్న పాపాలకు ప్రాయచిత్తం అనుభవించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎమ్మార్ కేసు ఉపశమనం శ్రీవారి కృపాకటాక్షాల వల్లే"నని వ్యాఖ్యానించారు.

హైకోర్టుకు సంక్రాంతి సెలవులు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఉమ్మడి హైకోర్టుకు ఈ నెల 8 నుంచి 17 వరకు సెలవులు ప్రకటించారు. అత్యవసర వ్యాజ్యాలపై ఈ నెల 11న విచారణలు జరుగుతాయని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్. మానవేంద్రనాథ్‌రాయ్ ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుతో కూడిన డివిజన్ బెంచ్, జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు సింగిల్ బెంచ్ అత్యవసర పిటిషన్లపై విచారణ చేపడుతుందన్నారు.

భారత్-ఇండోనేసియాల నడుమ బలమైన మైత్రి: సుష్మ

జకార్తా: భారత్, ఇండోనేసియాలు చాలా సన్నిహిత దేశాలని, శాంతి, సుసంపన్నతలో సహజ భాగస్వాములని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ పేర్కొన్నారు. ఇండోనేసియాలో పర్యటిస్తున్న ఆమె.. శుక్రవారం ఇక్కడ ఆ దేశ విదేశాంగ మంత్రి రెట్నో మార్సుదితో చర్చలు జరిపారు. "ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్, ఇండోనేసియాలు రెండు ప్రధాన దేశాలు. ప్రపంచంలోనే అత్యంత గతిశీల ప్రాంతాల్లో ఈ ప్రాంతం కూడా ఒకటి. దీని సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో ఒడిసిపట్టడానికి ప్రయోజనకర బంధాలను మనం వృద్ధి చేసుకోవాలి" అని భేటీ అనంతరం సుష్మ పేర్కొన్నారు. ఇండోనేసియా మంత్రితో చర్చలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయన్నారు. ఈ సందర్భంగా రెండు దేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాలను పూర్తిస్థాయిలో సమీక్షించినట్లు వివరించారు.


ఎమ్మార్ కేసులో కోనేరు మధుపై కేసు కొట్టివేత

- హైకోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: ఎమ్మార్ కేసులో 13వ నిందితుడైన కోనేరు మధుపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ శుక్రవారం ఉమ్మడి హైకోర్టు తీర్పు వెలువరించింది. కోనేరు మధు పాత్రకు సంబంధించి తగిన ఆధారాలు లేవంటూ పేర్కొంది. నేరపూరిత ఉద్దేశాన్ని రుజువు చేసే ఆధారాలు చూపకుండా కేవలం బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేసినంత మాత్రాన నిందితుడిని చేయడం సరికాదని పేర్కొంది. విల్లాలు, ప్లాట్‌ల విక్రయాల్లో, ఎమ్మార్ ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారాల్లో మధు పాత్ర కనిపించలేదంది. నిందితుడి కుమారుడు అయినందున మధును నిందితుడిగా చేర్చడం సరికాదంది. తండ్రి చెప్పడం ద్వారా డబ్బును ఇతని ఖాతాలో జమ చేసినా నిందితుడిగా చేర్చడం సరికాదంటూ మధుపై ఉన్న కేసును కొట్టివేసింది. ఎమ్మార్ విల్లాలకు చెందిన సొమ్ము దుబాయిలోని కోనేరు మధు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో సీబీఐ అతన్ని నిందితుడిగా చేర్చింది. ఎమ్మార్ వ్యవహారంలో ఇద్దరు వ్యక్తులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా తనపై సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కోనేరు మధు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.శివశంకరరావు పలుమార్లు విచారణ చేపట్టి గత నవంబరులో రిజర్వు చేశారు. శుక్రవారం తీర్పు వెలువరిస్తూ ఈ కేసులో కీలక నిందితుడిగా తండ్రి కోనేరు రాజేంద్రప్రసాద్ ఉన్నారని, ఇద్దరు ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా మధును నిందితుడిగా చేర్చడంపై తప్పుబట్టారు. దుబాయి బ్యాంకులో మధు ఖాతాలో పార్థసారథి రూ.1.05 కోట్లు, చల్లా సురేష్ రూ.65 లక్షలు డిపాజిట్ చేసింది వాస్తవమేనని, అయితే ఆ ఇద్దరితో కోనేరు మధు చర్చించలేదన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోలేదన్నారు. తన ఖాతాలో నగదు జమ చేయాలని మధు వీరితో చెప్పలేదన్నారు. అంతేగాక తన ఖాతా వివరాలను వీరికి ఇచ్చినట్లు కూడా ఆధారం లేదన్నారు. కోనేరు మధు కుట్రలో భాగస్వామిగా ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. విచారణ సందర్భంగా మధు పాత్రకు సంబంధించి కీలక ఆధారాలు లభిస్తే తిరిగి నిందితుడిగా చేర్చవచ్చని పేర్కొన్నారు.

ఆర్జిత సేవా టిక్కెట్ల నమోదు గడువు కుదింపు

- తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడి
- అన్యమత కార్యకలాపాల నియంత్రణకు ప్రతి ఉద్యోగికీ తిరునామం షరతు!



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టిక్కెట్ల బుకింగ్‌కు ప్రస్తుతం అనుసరిస్తున్న ఎలక్ట్రానిక్ లాటరీ పద్ధతిలో స్వల్ప మార్పులు చేసినట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమల నుంచి శుక్రవారం డయల్ తితిదే ఈవో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులతో, మీడియాతో ఆయన మాట్లాడారు. భక్తుల సూచనల మేరకు ఆర్జిత సేవా టిక్కెట్ల ఆన్‌లైన్ నమోదు గడువును 7నుంచి 4రోజులకు కుదిస్తున్నట్లు వివరించారు. లాటరీ ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు 3 రోజుల వ్యవధిలోగా ఆన్‌లైన్‌లో సొమ్ము జమ చేయాలని చెప్పారు. 'వచ్చే ఏప్రిల్ మాసంలో జరిగే సేవలకు సంబంధించి 56,593 టిక్కెట్లు విడుదల చేస్తున్నాం. శుక్రవారం ఉదయం 10 నుంచి ఈనెల 9న ఉదయం 10 గంటల్లోపు బుక్ చేసుకోవాలి. 9న మధ్యాహ్నం 12 గంటలకు ఎలక్ట్రానిక్ లాటరీ తీస్తాం. సుప్రభాతం 7,878, తోమాల 120, అర్చన 120, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 2,300 వంతున మొత్తం 10,658 టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. సాధారణ సేవల కింద 45,935 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఉంచాం. వీటిలో విశేషపూజ 1,875, కల్యాణోత్సవం 11,250, ఊంజల సేవ 3 వేలు, ఆర్జిత బ్రహ్మోత్సవం 5,805, వసంతోత్సవం 11,180, సహస్రదీపాలంకరణ సేవా టిక్కెట్లు 12,825 వరకు విడుదల చేశామ'ని ఈవో పేర్కొన్నారు. మార్చి రెండో వారంలో శాశ్వత ప్రాతిపదికన సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్ల జారీని తిరుపతిలోనూ చేపట్టనున్నామని, కౌంటర్లలో భక్తులే నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు తితిదే సిబ్బంది సాయంతో టోకెన్లు జారీ చేస్తామన్నారు. 48 గంటల వ్యవధిలోగా స్వామివారిని దర్శించుకోవాల్సి ఉంటుందన్నారు. భక్తులవసతి కోసం తిరుపతిలో 3 సముదాయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. 2017 సంవత్సరం హుండీ ద్వారా రూ.995 కోట్ల ఆదాయం వచ్చినట్లు, 2016 ఏడాది కంటే 2017లో 7.10 లక్షలమంది అదనంగా స్వామి దర్శనం చేసుకున్నట్లు వివరించారు.

అన్యమతస్థులపై ప్రత్యేక నిఘా: తితిదే ఉద్యోగుల్లో అన్యమతస్థులు, అన్యమత కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు దిశగా దేవస్థానం యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈవో సేకరించిన సమాచారం ప్రకారం 43 మంది అన్యమత కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు తేలింది. వీరిని ప్రభుత్వంలో ఇతర శాఖలకు బదిలీ చేయాలనే విన్నపానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు ఈవో తెలిపారు. ఇకపై ప్రతి ఉద్యోగి తిరునామం ధరించి విధులకు రావాలనే షరతును విధించాలని యాజమాన్యం నిర్ణయించింది.

తండాా... తల్లిడిల్లుతోంది!



నల్గొండ జిల్లాలోని ఉస్మాన్‌కుంటకు చెందిన కేతావత్ సిరి, సుక్కు దంపతులు కూలి పనులకు వెళ్లిపోగా ఇంటి వద్ద ఉన్న చిన్నారి

దేవరకొండ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని చాలా గిరిజన ప్రాంతాల్లో ఆడపిల్లకు జన్మనివ్వడాన్ని పాపంగా చూస్తున్నారు. మగపిల్లాడిని వంశానికి అందించకపోవడం తల్లికి శాపమవుతోంది. ఈసారైనా మగపిల్లాడే పుట్టాలని ఆమె మౌనంగా రోదిస్తోంది. ఇది ఒక్క అమ్మ కథ కాదు. ప్రతి తండా గుడిసెలో కనిపించే కన్నీటి వ్యథ. నల్గొండ జిల్లా దేవరకొండలో గర్భిణి ఉన్న ప్రతి ఇంట ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఇందుకు పేదరికం, ఆకలి, కుటుంబ పరిస్థితులు, సామాజిక దురాచారాలు, నిరక్షరాస్యత, సాధికారతలేమి తదితర కారణాలెన్నో!

కన్నపిల్లలను ప్రభుత్వానికి అప్పగించేందుకు (ఊయల్లో వేసేందుకు) తల్లులు ఇష్టపడట్లేదు. అక్కడ వేయకుంటే తమ బిడ్డలను ఏం చేస్తారోనన్న భయంతో ఒప్పుకొంటున్నారు. మొండికేస్తే విడాకులిచ్చేసి రెండో పెళ్లి చేసుకుంటానంటూ భర్తల నుంచి బెదిరింపులు! 'కన్న పిల్లల్ని దూరం చేసుకోవడం ఇష్టంలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పగించక తప్పలేదు'' అని ఓ బాధితురాలు వాపోయింది. చందంపేట మండలం బాపన్‌మోట్ తండాకు చెందిన వృద్ధురాలు లక్ష్మిపతి మాట్లాడుతూ- ' 'నాకు పది మంది ఆడపిల్లలు. మగపిల్లాడి కోసం భర్తకు రెండో పెళ్లి చేయాల్సి వచ్చింది. పెద్ద కూతురుకు ఇద్దరూ ఆడపిల్లలే. అల్లుడు రెండో పెళ్లి చేయాలంటున్నాడు. ఆడ పిల్లలు పుట్టడం మా తప్పా. ఇదేమంటే మా కడుపులో లోపముందని సూటిపోటి మాటలు అంటున్నారు' ' అని వాపోయింది. గతంలో విక్రయాలు, భ్రూణహత్యలు ఎక్కువగా జరిగేవి. కానీ ఇప్పుడా పరిస్థితి కొంత తగ్గింది. కానీ 'ఊయల' పేరిట తల్లి నుంచి బిడ్డను దూరం చేస్తున్నారు. ఒకసారి చూడాలని తపించినా ఇంటి పెద్దలు అందుకు అంగీకరించట్లేదు. ఆడపిల్ల.. మగపిల్ల ఎవరైనా ఒకటేనని ఎవరైనా చెప్పడానికి వెళ్తే.. మగపిల్లవాడున్న వారిని 'మీకు ఇంటికి దీపం ఉంటే చాలా? మా ఇంటికి దీపం అక్కర్లేదా?'' అని ప్రశ్నిస్తున్నారు. అదే ఆడపిల్లల తల్లిదండ్రులు మాట్లాడితే- ''మగపిల్లల్లేని గొడ్రాలివి. నీవా మాకు చెప్పేది'' అని దెప్పిపొడుస్తున్నారు.



ఆడవాళ్లుగా పుట్టడం, ఆడపిల్లలకు జన్మనివ్వడం తమ తప్పా అని ఆవేదన వ్యక్తం చేస్తున్న చందంపేట మండలం బాపన్‌మోట్‌కు చెందిన లక్ష్మిపతి

కన్నీళ్లతో అప్పగించి

ఈ చిత్రంలో కూలిపని చేసుకుంటున్న తల్లిపేరు బుజ్జి. తొలి సంతానం కూతురు. తర్వాత బాబు. ఆ తర్వాత మళ్లీ ఆడపిల్ల. నాలుగో కాన్పులోనూ ఆడబిడ్డే జన్మించడంతో... మూడు రోజులకే దేవరకొండలోని ఊయల్లో వేసింది. పేదరికం, కుటుంబం గడవడం కష్టమని బిడ్డను అప్పగించానంటూ కన్నీటిపర్యంతమైంది.



గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు...

ఆడబిడ్డ పుట్టిందని తెలియగానే భర్త, అత్తమామల నుంచి వేధింపులు ప్రారంభమవుతాయి. ఆ శిశువును వదిలించుకునేందుకు తల్లికి సరైన ఆహారమివ్వని పరిస్థితులున్నాయి. బాలింత వ్యాధుల నుంచి దూరం చేసేందుకైనా చనుపాలిచ్చేందుకు కనికరించడం లేదు. సరైన బరువుతో పుట్టినా, ఆహారం లేకపోవడంతో ఆ శిశువులు బలహీనంగా మారుతున్నారు. ఆడబిడ్డ పుట్టిన రెండు, మూడు రోజులకే... భర్తో, అత్తో, మామో లేదంటే బాలింత తల్లో ఎవరోకరు వచ్చి శిశు సంక్షేమశాఖ అధికారులకు బిడ్డను అప్పగించి వెళ్తున్నారు. అధికారులు కౌన్సెలింగ్ చేసినా ఉపయోగం ఉండట్లేదు. అప్పగించేందుకు వచ్చినపుడు ఆ చిన్నారిని సంబంధీకులు చేతితో కూడా తాకేందుకు ఇష్టపడటం లేదు! అలాంటి శిశువులను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి బాలింతలతో తాత్కాలికంగా పాలిప్పిస్తున్నారు. ఆ తర్వాత శిశు గృహాలకు తరలిస్తున్నారు. తల్లిపాలకు దూరమై, రోగనిరోధకశక్తి లేక.. గత ఎనిమిది నెలల్లో 13 మంది ఆడశిశువులు చనిపోయారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత దేవరకొండ ప్రాజెక్టు పరిధిలో దాదాపు 120 మందికి పైగా ఆడ బిడ్డలను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించి వెళ్లారు. దేవరకొండ కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక శిశుగృహాన్ని నల్గొండలో నిర్వహిస్తున్నారు. నల్గొండ, దేవరకొండ శిశుగృహాలు 20 మందికే పరిమితం. కానీ, ఇక్కడ 42 మంది బిడ్డలు సంరక్షణలో ఉన్నారు.

నిత్యం నిఘా పెట్టినా...

గిరిజన ప్రాంతాల్లోని మహిళలు రెండోసారి గర్భం దాల్చిన వెంటనే వారిని సంరక్షణ పరిధిలోకి తీసుకొచ్చి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. శిశువు పుట్టినప్పట్నుంచి ఆరేళ్ల వయసొచ్చే వరకూ వివరాలు ఆరాతీస్తున్నారు. 18 ఏళ్ల వయసు అమ్మాయిలు ఎక్కడున్నారు, ఏం చదువుతున్నారన్నది తెలుసుకుంటున్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా పోలీసుల సహకారంతో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. శిశువు అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు తెలిస్తే... రెవెన్యూ, ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యాన మృతదేహాన్ని తవ్వితీసి, పంచనామా చేస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత ఒక్క నల్గొండలోనే శిశు హత్య ఆరోపణలతో తల్లిదండ్రులపై 21 కేసులు నమోదయ్యాయి. శిశువిక్రయాలపై అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం ఇద్దామంటే... సమయానికి ఫోన్ సంకేతాలు సరిగా ఉండట్లేదు. రవాణా వ్యవస్థ అంతంతమాత్రమే. అయినా, అంతర్గతంగా జరుగుతున్న విక్రయాలపై ఇటీవల కేసులు నమోదవుతున్నాయి. శిశుగృహాలకు వచ్చిన చిన్నారుల్ని బాలల సంక్షేమ కమిటీ ఆమోదంతో 'దత్తత కార్యక్రమం' కింద పిల్లల్లేని తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. కొందరు చిన్నారులు విదేశాల్లోని వారికి దత్తతకు వెళ్లారు.

ఎందుకీ వివక్ష?

- తండాల్లోని కుటుంబాల్లో ఎంతమంది మగపిల్లలు ఉంటే అంతగా పలుకుబడి ఉంటోంది.
- మగపిల్లలు లేకుండా ఎంతమంది ఆడపిల్లలను కన్నా.. వారిని పిల్లల్లేని వారిగా చూస్తున్నారు.
- సంఘంలో, బంధువుల్లో ఆడపిల్లలు ఉన్నవారిని చిన్నచూపు చూస్తున్నారు. ఆడబిడ్డలు పుట్టడానికి స్త్రీ కడుపునే కారణంగా నిందిస్తున్నారు.
- తొలి మూడు కాన్పుల్లో ఆడపిల్లలే పుడితే.. మగపిల్లవాడి కోసం భర్తలు రెండో పెళ్లిళ్లకు సిద్ధమవుతున్నారు.
- 'ఆడబిడ్డ పుడితే చంపేయండి' అంటూ బంధువులు, చుట్టుపక్కలవారు ఉచిత సలహాలివ్వడం పరిపాటైంది.

మార్పు తెచ్చే చర్యలేవీ?

నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో ఆడపిల్లలపై వివక్ష అధికంగా ఉంది. ఇక్కడి ప్రజలు జీవనోపాధి కోసం ఏడాదిలో 8 నెలలు వలసవెళ్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సహకార ఆర్థిక సంస్థల ద్వారా రుణాలు అందట్లేదు. గిరిజన తండాల్లో ప్రభుత్వ పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదు. స్థానిక భూముల అభివృద్ధికి అవసరమైన నీటి వసతి కల్పించాల్సి ఉంది. చిన్న కుటుంబం, కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించి, ప్రోత్సాహకాలివ్వాలి.



అమ్ముకునేందుకు అవకాశమివ్వండి

ఆరోగ్యం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు వీలుగా పిల్లలను అమ్ముకోవడానికి అవకాశం ఇవ్వాలంటోంది గాగిలాపురానికి చెందిన నీలిమ! 'ఇప్పటికే రెండుసార్లు అమ్మేందుకు ప్రయత్నిస్తే... అధికారులొచ్చి సాయం చేస్తామని అడ్డుకున్నారు. భర్త లేడు. అత్తకు చేయిలేదు. నా ఆరోగ్యం సరిగాలేదు. పిల్లలకు తిండి పెట్టాలంటే అడుక్కోవాల్సిన పరిస్థితి' అని నీలిమ వాపోయింది.



తన బిడ్డను అప్పగించేందుకు తీసుకొచ్చిన ఝూన్సీతో దేవరకొండ శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారిణి సక్కుబాయి

చిన్నారి భారం మోయలేం

సింగరాజ్‌పల్లి తండాకు చెందిన ఝూన్సీ, బాలు దంపతులకు మూడోసారీ కూతురే. పేదలమనీ, ముగ్గురు ఆడపిల్లలను పోషించలేమని 16 రోజుల వయసున్న మూడోపాపను ఊయల్లో వేసేందుకు గురువారం తీసుకొచ్చింది. కనీసం మూడునెలలైనా పాలిచ్చిన తర్వాత అప్పగించాలని అధికారులు ఎంతగా నచ్చజెప్పినా వినిపించుకోలేదు.

శిశువుల అప్పగింత పెరిగింది

'మా ఇంటి లక్ష్మి' కార్యక్రమంతో శిశు విక్రయాలు, హత్యలు తగ్గాయి. కానీ, ప్రభుత్వానికి బిడ్డలను అప్పగించేవారి సంఖ్య పెరుగుతోంది. గిరిజనులకు ఎంత నచ్చజెప్పినా, కొందరిలో మార్పు రావట్లేదు.

– సక్కుబాయి, సీడీపీవో, దేవరకొండ

తక్కువ బరువుతో వస్తున్నారు

మాకు అప్పగిస్తున్న ఆడశిశువుల బరువు తక్కువగా ఉంటోంది. తల్లిపాలు అందక బలహీనమవుతున్నారు. శిశువుల ఆరోగ్యం కోసం అదనపు భవనం, సిబ్బందిని నియమిస్తున్నాం. కేరళ నుంచి 12 మంది ప్రత్యేక నర్సులు వస్తున్నారు.

– పుష్పలత, జిల్లా మహిళా సంక్షేమ అధికారి, నల్గొండ



తల్లిపట్టు నెగ్గలేదు..

బాపన్‌మోట్ తండాలో సుజాత, స్వామి దంపతులకు ఒక బాబు, ముగ్గురు ఆడపిల్లలు. చివరిపాపను ఊయల్లో వేయాలని భర్త పట్టుబట్టాడు. తల్లి ఒప్పుకోలేదు. పుట్టింటికి వెళ్లిపోయింది. భర్త నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చాడు. కానీ, చివరకు వారు శిశువు భారం మోయలేమంటూ శిశుగృహంలో అప్పగించి, కూలీ పనుల కోసం గుంటూరు వెళ్లిపోయారు.

- రాష్ట్రంలోని వృత్తి విద్యాకళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు. 2018–19 విద్యా సంవత్సరానికి కొత్త వాటిని మంజూరు చేయవద్దు. ఇంజినీరింగే కాదు.. ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలూ వద్దు

- రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఏఐసీటీఈకి పంపిన నివేదికలో పేర్కొన్న అంశమిది.

- 2018–19 విద్యా సంవత్సరానికి కొత్త కళాశాలలు ప్రారంభించాలనుకుంటే ఈనెల 17వ తేదీలోపు రూ.75వేలు చెల్లించి నిరంభ్యంతర ధ్రువపత్రం పొందొచ్చు

- జేఎన్‌టీయూహెచ్ తాజాగా విడుదల చేసిన ప్రకటన ఇది.

సర్కారు ఎడ్డెం.. వర్సిటీ తెడ్డెం..!

కొత్త ఇంజినీరింగ్ కళాశాలలపై తీరు మారని జేఎన్‌టీయూహెచ్

ఈనాడు – హైదరాబాద్

సర్కారు మూడేళ్లుగా కొత్త కళాశాలలను వద్దంటున్నా జేఎన్‌టీయూహెచ్ తీరు మార్చుకోవడం లేదు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆగస్టులో దిల్లీలో నిర్వహించిన సమావేశంలోనూ విద్యాశాఖ అధికారులు ఇదే విషయం చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య ఈ మేరకు ఏఐసీటీఈ ఛైర్మన్‌కు నివేదిక సమర్పించారు. ఇంత జరిగినా జేఎన్‌టీయూహెచ్ మళ్లీ కొత్త కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానించడం గమనార్హం. అంతేకాదు ప్రతి కోర్సులో సీట్లు పెంచుకోవడానికి మొత్తం 13 అంశాలపై దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 17వ తేదీని తుది గడువుగా పేర్కొంది. దీంతో ప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా జేఎన్‌టీయూహెచ్ వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది వద్దంటున్నా ఏఐసీటీఈ రెండు కళాశాలలకు అనుమతులు జారీ చేయగా... ప్రభుత్వం సుప్రీం కోర్టుకు సైతం వెళ్లింది. ఏఐసీటీఈ అధికారులు మాత్రం ఏఐసీటీఈ ప్రాంతీయ కమిటీ సిఫార్సుల మేరకు మంజూరు చేశామని, దానికి జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతే ఛైర్మన్ అని సమాధానమిచ్చింది. దాంతో ఉపకులపతి ఆచార్య వేణుగోపాల్‌రెడ్డిని సైతం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రశ్నించారు.

ఆ అంశాలను తొలగిస్తాం..

దీనిపై జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ఆచార్య వేణుగోపాల్‌రెడ్డిని వివరణ కోరగా కొత్త కళాశాలలకు, సీట్లు పెంచుకోవడానికి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. తాజాగా విడుదల చేసిన 4 పేజీల ప్రకటనలో అనేక అంశాలకు సంబంధించిన రుసుముల వివరాలుంటాయని.. అందులో కొత్త కళాశాలల ఏర్పాటు, సీట్ల పెంపునకు సంబంధించిన రుసుముల వివరాలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. ఆ అంశాలను తొలగిస్తామని చెప్పారు.

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ఇలా..

సంవత్సరం	మొత్తం సీట్లు	భర్తీ	ఖాళీ
2015-16	1,15,912	70,792	45,120
2016-17	1,04,598	71,814	32,784
2017-18	97,961	68,594	29,367



న్యాక్ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్

ఉపాధి కల్పతరువుగా న్యాక్‌ను మార్చండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)ను తీర్చిదిద్దాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, న్యాక్ అధ్యక్షుడు తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. న్యాక్‌లో శిక్షణ తీసుకున్న నిరుద్యోగ యువతీయువకులకు నేరుగా దేశ, విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. న్యాక్ కార్యనిర్వాహక కమిటీ సమీక్షా సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న న్యాక్ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాక్ ఉపాధ్యక్షుడు ఎస్పీ సింగ్, ఇతర అధికారులకు మంత్రి సూచించారు. న్యాక్‌లో శిక్షణ తీసుకున్న వారికే ఉద్యోగ సంస్థలు తొలి ప్రాధాన్యం ఇచ్చేలా సంస్థను తయారు చేయాలని ఆదేశించారు. సమీక్షలో సంస్థ కార్యకలాపాల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమానికి తీసుకొనే కొన్ని చర్యలపై తీర్మానాలు చేశారు.

మహిళా జననేంద్రియాల విచ్ఛిత్తికి పాల్పడితే చర్యలు

స్త్రీ, శిశుసంక్షేమశాఖ సహాయమంత్రి

ఈనాడు, దిల్లీ: కొన్ని వర్గాల్లో మహిళా జననేంద్రియాల విచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలిసిందని, అలాంటి చర్యలకు పాల్పడేవారిని ప్రాసిక్యూషన్ చేస్తామని కేంద్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ సహాయమంత్రి వీరేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. మహిళా జననేంద్రియాల విచ్ఛిత్తిపై మే 12న వివిధ స్వచ్ఛంద సంస్థలతో సమావేశమై చర్చించినట్లు వెల్లడించారు. ఇలాంటి వాటినుంచి బాధితులను రక్షించడానికి ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్-2012, ఐపీసీ-1860, సీఆర్‌పీసీ-1973లో తగిన నిబంధనలు ఉన్నట్లు తెలిపారు. మహిళా జననేంద్రియాల విచ్ఛిత్తికి పాల్పడేవారితోపాటు, ఆ సంస్కృతిని ప్రోత్సహించేవారిని ప్రాసిక్యూషన్ చేస్తామన్నారు.

ఖైదీల విడుదలకు మార్గదర్శకాలు


ఈనాడు, హైదరాబాద్: రాబోయే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖైదీల విడుదల గురించి చర్చించేందుకు శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్రంలోని కేంద్ర కారాగారాల్లో ఉన్న ఖైదీల్లో సత్‌ప్రవర్తన కలిగిన వారిని గుర్తించి, ఈ సందర్భంగా విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్‌త్రివేదీ, జైళ్లశాఖ డీజీ వి.కె.సింగ్, ఐజీ నర్సింహులతోపాటు న్యాయశాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. విడుదలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై చర్చించారు.

'సీనియారిటీ జాబితాలు సిద్ధం చేయండి'

నీటిపారుదల శాఖ ఐదు, ఆరు జోన్ల పరిధిలో 1978 నుంచి 2014 జూన్ ఒకటికి ముందువరకూ ఎంపికైన ఏఈఈ, సహాయ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం శుక్రవారం ఈఎన్‌సీ(పరిపాలన)ని ఆదేశించింది. దీనికోసం అనుభవం ఉన్న ఓ ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సీనియారిటీ జాబితాను రూపొందించి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నకళ్లు పంపించాలని నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు.

కేసీఆర్ కిట్‌పై 'ప్రైవేటు' కన్ను

- తమకూ ఇవ్వాలంటున్న వైద్యకళాశాలు
- సాధ్యాసాధ్యాలపై ఆరోగ్యశాఖ పరిశీలన



ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్ కిట్ పథకంపై రాష్ట్రంలోని ప్రైవేటు వైద్యకళాశాలలు కన్నేశాయి. తమ అనుబంధ ఆసుపత్రులకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నాయి. దీనిపై వైద్యఆరోగ్యశాఖలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పథకాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అమలు చేస్తున్నారు. అక్కడ ప్రసవం చేసుకున్న మహిళలకు కొంత నగదును, ఇతర వస్తువులనూ అందజేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలకు వెళ్తే చాలు కడుపుకోత తప్పడంలేదు. ఈ ఆసుపత్రుల్లో దాదాపు 70 శాతానికి పైగా శస్త్రచికిత్స (సిజేరియన్ల) ద్వారానే ప్రసవాలు చేస్తున్నట్లు అనేక నివేదికల్లో వెల్లడైంది. ఇది పేదలకు ఆర్థికంగా భారంగా మారడమే కాకుండా మహిళల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను నిర్వహిస్తే ఈ కడుపు కోతలకు అడ్డుపడుతుందని తెలంగాణ సర్కారు భావించింది. స్వయానా ముఖ్యమంత్రే ఈ విషయాన్ని వెల్లడించారు. అందులో భాగంగానే 'కేసీఆర్ కిట్'ను ప్రకటించారు.

సర్కారు దవాఖానాల్లో ప్రసవించిన గర్భిణులకు రూ.12 వేలు (అమ్మాయి పుడితే రూ.13 వేలు) నగదును నాలుగు విడతలుగా అందజేస్తున్నారు. ప్రసవానంతరం తల్లీబిడ్డలకు ఉపయుక్తంగా ఉండేలా రూ.2 వేల విలువ చేసే 16 రకాల వస్తువులను ఒక సూట్‌కేసులో పెట్టి మరీ ఇస్తున్నారు. ఈ పథకానికి ఇప్పటికే విశేష ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల కోసం 4 లక్షలకు పైగా గర్భిణులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు వైద్యకళాశాలల ప్రతినిధులు ఇటీవల కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం ముందుంచినట్లు తెలిసింది. తమ కళాశాలల్లో చదువుతున్న వైద్యవిద్యార్థులకు ప్రసవాలపై శిక్షణ లభించేందుకు వీలుగా కేసీఆర్ కిట్‌ను తమ అనుబంధ ఆసుపత్రులకూ అనుమతించాలని ఆరోగ్యశాఖపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా ఉన్నతస్థాయిలో ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. ప్రైవేటు వైద్యకళాశాలల్లో చదివినా వారు మన పిల్లలే కాబట్టి.. వారికి శిక్షణ కోసం అనుమతి ఇవ్వడంలో తప్పేంటనే అభిప్రాయాన్ని కొందరు వైద్యాధికారులు వ్యక్తం చేయగా.. ఒకసారి ప్రైవేటుకు గేట్లు తెరిస్తే అడ్డగోలు దోపిడీకి తెరలేపినట్లు అవుతుందని, ఆ తర్వాత ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు కూడా వరస కడతాయనే అభిప్రాయాన్ని కొందరు వైద్యాధికారులు వ్యక్తంచేసినట్లు తెలిసింది.

శాంతిభద్రతలపై జిల్లాల వారీగా కార్యాచరణ


- సమస్యలకు తగినట్లుగా పోలీసుశాఖ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: వివిధ జిల్లాల్లో నెలకొన్న సమస్యలకు తగినట్లుగా పరిష్కార మార్గాల్ని అనుసరించే దిశగా తెలంగాణ పోలీసు శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి జిల్లాల పర్యటన పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా శాంతి భద్రతలకు సంబంధించి రాబోయే రోజుల్లో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించనున్నారు. ఇటీవల ఆదిలాబాద్‌లో చోటుచేసుకున్న గిరిజనులు, ఆదివాసీల వ్యవహారంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకొని అవసరమైన చర్యలు తీసుకొని స్పందించేందుకు కాస్త సమయం పట్టింది. ఇదే తరహాలో ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన పరిస్థితి నెలకొంది. పైగా సామాజిక మాధ్యమాలు విస్తృతమవుతున్న క్రమంలో చిన్న సమస్య కూడా రకరకాల మలుపులు తిరిగి అంతిమంగా శాంతిభద్రతలకు సవాలుగా మారుతోంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని జిల్లాల వారీగా అక్కడున్న సమస్యలు, రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తవచ్చన్న అంశంపై అధ్యయనం చేస్తూ, నివేదిక సిద్ధం చేస్తున్నారు. సమస్య చిన్నదైనా పూర్తిస్థాయిలో సర్వసన్నద్ధంగా ఉండి పరిస్థితికి తగినట్లుగా ప్రతిస్పందించేలా సిబ్బందిని తీర్చిదిద్దాలనేది వ్యూహం. ఇందుకు తగ్గట్టుగానే నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తూ, ఆయా ప్రాంతాల్లో పని చేసిన అనుభవం ఉన్నవారికే అక్కడ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు.

ఇసుక దందాలపై ప్రత్యేక దృష్టి: మరోవైపు.. ఇసుక వ్యాపారం మాటున జరుగుతున్న వ్యవహారంలో పోలీసుల తీరు వివాదాస్పదమవుతోంది. ఈ దృష్ట్యా ఇసుక తవ్వకాల్లో అక్రమాలు నివారించడం, పోలీసులకు మామూళ్ల మకిలి అంటకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయనున్నారు.

'భీమా-కొరేగావ్' హింసలో నా పాత్ర లేదు: సంభాజీ భిడె

ముంబయి: 'భీమా-కొరేగావ్' పోరాట 200వ వార్షికోత్సవం సందర్భంగా మహారాష్ట్రలో సోమవారం చోటుచేసుకున్న హింస వెనుక తన పాత్ర లేదని శివ్ ప్రతిష్ఠాన్ హిందుస్థాన్ సంస్థ అధిపతి సంభాజీ భిడె స్పష్టం చేశారు. దీనిపై సీబీఐ విచారణను ఎదుర్కొనేందుకైనా తాను సిద్ధమని అన్నారు. మరాఠా పేష్వా సైన్యంపై బ్రిటీష్ సేనలు సాధించిన విజయానికి ప్రతీకగా దళిత నాయకులు 'భీమా-కొరేగావ్' వార్షికోత్సవాన్ని జరుపుకొంటారు. అప్పట్లో బ్రిటీష్ సేనల్లో దళిత మహార్‌వర్గంవారు కూడా ఉన్నారు. అయితే బ్రిటీష్ సేనల విజయంపై సంబరాలు జరుపుకోవడాన్ని ఈసారి కొన్ని హిందుత్వ సంస్థలు వ్యతిరేకించాయి. సోమవారం వార్షికోత్సవ సంబరాల సందర్భంగా చోటుచేసుకున్న హింసలో ఓ దళిత యువకుడు మృతిచెందాడు. దీంతో దళిత సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలకు దిగాయి. ఈ ఘటనలో భిడెను నిందితుడిగా పేర్కొంటూ పుణె పోలీసులు కేసు నమోదుచేశారు.



సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరైన క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఏంజిల్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ ఆన్‌గ్రాహం లోట్జ్

క్రైస్తవుల సేవాభావం ప్రశంసనీయం

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: క్రైస్తవులు శాంతికి ప్రతిరూపమని, వారు నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతుండటం ప్రశంసనీయమని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో శుక్రవారం క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ(సీసీటీ) ఆధ్వర్యంలో బంగారు తెలంగాణ, స్వచ్ఛ భారత్‌ను ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర, భారతదేశ ప్రార్థన దినాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన హోంమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులను అన్నివిధాలా ఆదుకోవడానికి ముందుంటుందన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారిని నేరుగా చంచలగూడ జైలుకే పంపించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ఏంజిల్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ ఆన్‌గ్రాహం లోట్జ్ మాట్లాడుతూ తనకు భారత్ అంటే ఎంతో ఇష్టమన్నారు. నగర మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ నగరంలోని క్రైస్తవులకు సంబంధించిన శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీటీ ముఖ్య సలహాదారులు, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన బిషప్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్యేలు సాయన్న, శ్రీనివాస్‌గౌడ్ క్రైస్తవ ప్రముఖులు పాల్గొన్నారు.

9 నుంచి రిలయన్స్ జియో ఆఫర్లు!

దిల్లీ: రోజుకు 1జీబీ డేటా అందించే నెలవారీ పథకాల ధరల్లో రూ.50 కోత విధించడంతో పాటు, కొన్ని పథకాల్లో డేటా పరిమితిని రోజుకు 1జీబీ నుంచి 1.5 జీబీకి పెంచేందుకు రిలయన్స్ జియో సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 9 నుంచి కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. రూ.199, రూ.399, రూ.459, రూ.499 పథకాల ధర రూ.50 మేర తగ్గుతుంది. రూ.198 (28 రోజులు), రూ.398 (70 రోజులు), రూ.448 (84 రోజులు), రూ.498 (91 రోజులు) పథకాల్లో రోజుకు 1జీబీకి బదులు 1.5 జీబీ 4జీ డేటా లభిస్తుంది. ఒక రోజుకు 1జీబీ డేటా అందించే పథకాన్ని రూ.4కు తగ్గించనుంది. నూతన సంవత్సరం ఆఫర్ కింద, రూ.399తో రీఛార్జి చేసుకున్న వారికి 20 శాతం అదనపు డేటా లభించేలా, పథకం కాలపరిమితిని 2 వారాలు పొడిగించనున్నారు. అన్ని పథకాల్లో ఉచిత కాలింగ్, ఎస్ఎంఎస్‌లు కొనసాగుతాయి.



రెనో కొత్త క్విడ్

ధర రూ.2.67- 3.87 లక్షలు



దిల్లీ: చిన్న కారు క్విడ్‌లో కొత్త వేరియంట్‌ను రెనో ఇండియా విపణిలోకి విడుదల చేసింది. దీని ధర రూ.2.67- 3.87 లక్షలు (ఎక్స్‌షోరూమ్ దిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. క్విడ్ లైవ్ ఫర్ మోర్ రీలోడెడ్ 2018 పేరుతో వచ్చిన ఈ వెర్షన్‌లో, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు వంటి 10 కొత్త సదుపాయలు జోడించినట్లు సంస్థ తెలిపింది. 0.8 లీటర్, 1.0 ఎల్ఎస్‌సీఈ (స్మార్ట్ కంట్రోల్ ఎఫీషియెన్సీ) పవర్‌ట్రైన్స్ ఇంజిన్‌తో ఈ కారు లభించనుంది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) వెర్షన్లు ఉన్నాయి. టచ్‌స్క్రీన్ మీడియా ఎన్ఏవీ వ్యవస్థ, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వన్ టచ్ లేన్ ఛేంజ్ ఇండికేటర్, రేడియో స్పీడ్ ఆధారిత శబ్ద నియంత్రణ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయని కంపెనీ వెల్లడించింది.

ఇనుము ధరలు పెంచక తప్పలేదు

విశాఖ ఉక్కు సీఎండీ మధుసూదన్

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే : ఉత్పత్తి వ్యయం పెరగడంతో ఇనుము ధరలను స్వల్పంగా పెంచక తప్పలేదని విశాఖ ఉక్కు(ఆర్ఐఎన్ఎల్) సీఎండీ పి.మధుసూదన్ పేర్కొన్నారు. విశాఖలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముడి ఇనుప ఖనిజం ధరల్లో పెరుగుదల వల్లే డిసెంబరులో ఉక్కు ధరల్లోను పెరుగుదల చోటు చేసుకుందన్నారు. గడిచిన త్రైమాసికంలో ఉక్కు మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొందన్నారు. అయినా విక్రయాల్లో గణనీయమైన వృద్ధి నమోదైందన్నారు. వచ్చే త్రైమాసికంలో అమ్మకాలు మరింత ఆశాజనకంగా ఉండవచ్చునన్నారు. విశాఖ ఉక్కులో 10 శాతం పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్)పై కేంద్రం నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న ఉత్పత్తి, విక్రయాలు, మార్కెట్ తదితర అంశాలపై ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి తాము నివేదికలు అందిస్తున్నామన్నారు. ఒడిశాలోని ముడి ఇనుప ఖనిజం గనులు కొన్ని నిబంధనలు అతిక్రమించాయని మధుసూదన్ పేర్కొన్నారు.

దిల్లీ నుంచి చెన్నై..చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయిర్‌కు

విస్తారా విమాన సేవల విస్తరణ

ముంబయి: టాటా, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ల సంయుక్త సంస్థ విస్తారా తన సేవలను విస్తరించనుంది. దిల్లీ నుంచి చెన్నైకు రోజూ రెండు విమాన సర్వీసులను ఫిబ్రవరి 15 నుంచి నడపనుంది. చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయిర్ మధ్య కూడా ఒక విమాన సర్వీసును మార్చి 1న ప్రారంభించనుంది. దిల్లీ-చెన్నై మార్గానికి ఒక వైపు టిక్కెట్ రూ.3,099 కాగా.. చెన్నై- పోర్ట్‌బ్లెయిర్ మార్గానికి రూ.3,699. ఈ కొత్త మార్గాలకు సంబంధించి బుకింగ్‌లు ఇప్పటికే మొదలుపెట్టినట్లు కంపెనీ తెలిపింది.

ప్రగతి పరుగు నెమ్మదే

- 2017-18లో జీడీపీ వృద్ధి 6.5 శాతం
- నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి ఇది
- తయారీ, వ్యవసాయ రంగాల పనితీరు పేలవం
- కేంద్ర గణక కార్యాలయం అంచనా


దిల్లీ

దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతి పరుగు నెమ్మదించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి నాలుగేళ్ల కనిష్ఠానికి పడిపోవచ్చంటూ కేంద్ర గణక కార్యాలయం (సీఎస్ఓ) వేసిన అంచనానే ఇందుకు నిదర్శనం. సీఎస్ఓ గణాంకాల ప్రకారం 2017-18లో వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గే అవకాశం ఉంది. 2016-17లో జీడీపీ వృద్ధి 7.1 శాతం కాగా.. అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాల్లో (2015-16; 2014-15) వరుసగా 8%, 7.5 శాతం చొప్పున నమోదైంది. '2016-17లో నమోదైన 7.1 శాతంతో పోలిస్తే 2017-18లో జీడీపీ వృద్ధి 6.5 శాతానికి తగ్గొచ్చని అంచనా వేస్తున్నామ'ని 2017-18 జాతీయాదాయంపై తొలి ముందస్తు అంచనాలను ప్రకటిస్తూ సీఎస్ఓ వెల్లడించింది. స్థూల విలువ జోడింపు కూడా (జీవీఏ) 6.1 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. 2016-17లో జీవీఏ 6.6 శాతంగా ఉంది. వ్యవసాయ రంగ వృద్ధి 4.9 శాతం నుంచి 2.1 శాతానికి తగ్గే అవకాశం ఉందని తెలిపింది. అలాగే తయారీ రంగ పురోగతి కూడా 7.9 శాతం నుంచి 4.6 శాతానికి నెమ్మదించొచ్చని తెలిపింది. జీడీపీ వృద్ధి తగ్గేందుకు ఈ రెండు రంగాల పేలవ ప్రదర్శనే ప్రధాన కారణమని సీఎస్ఓ వెల్లడించింది. ఇవే కాకుండా పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు లాంటివి కూడా దేశ ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాల పనితీరుపై ప్రభావం చూపాయి.

తలసరి ఆదాయంలో 8.3% క్షీణత

దేశ ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతిబింబమైన తలసరి ఆదాయం 2017-18లో 8.3 శాతం క్షీణించి రూ.1,11,782 కోట్లకు పరిమితం అయ్యే అవకాశం ఉందని సీఎస్ఓ వెల్లడించింది. 2016-17లో తలసరి ఆదాయం 9.7 శాతం పెరిగి రూ.1,03,219గా నమోదుకావడం గమనార్హం. వాస్తవ రూపేణా (2011-12 ధరల వద్ద) తలసరి ఆదాయం రూ.86,660గా ఉండొచ్చని పేర్కొంది. 2016-17లో ఇది రూ.82,266గా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయ వృద్ధి రేటు (వాస్తవ రూపేణా) 5.7 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గొచ్చని సీఎస్ఓ అంచనా వేసింది.

వృద్ధిపై జీఎస్‌టీ ప్రభావం కొంత మేర ఉందని ప్రధాన గణక అధికారి టి.సి.ఎ.అనంత్ తెలిపారు. అయితే వృద్ధి పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయని తెలిపారు. 'పూర్తి ఆర్థిక సంవత్సరం గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే రెండో అర్ధభాగంలో 7 శాతం వృద్ధి ఉన్నట్లు అనుకోవచ్చు. ఈ ప్రకారం చూస్తే ఆర్థిక వ్యవస్థ బలంగా పురోగమిస్తున్న విషయం అర్థమవుతోంది. పెట్టుబడుల్లోనూ ప్రగతి కనిపిస్తోంద'ని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ మరింత వృద్ధి చెందుతుందని నీతిఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.



దేశీయ ఫారెక్స్ నిల్వలు పైపైకి..

ముంబయి: వరుసగా రెండో వారం దేశ విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు సరికొత్త గరిష్ఠానికి చేరాయి. డిసెంబరు 29తో ముగిసిన వారానికి విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 4.444 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.29000 కోట్లు) పెరిగి జీవన కాల గరిష్ఠమైన 409.366 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.26,60,000 కోట్లు)కు చేరాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) పేర్కొంది. విదేశీ కరెన్సీ ఆస్తుల్లో పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 3.53 బిలియన్ డాలర్లు పెరిగి 404.921 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు 4.423 బిలియన్ డాలర్లు పెరిగి 385.103 బిలియన్ డాలర్లకు చేరాయి. బంగారు నిల్వలు 20.716 బిలియన్ డాలర్లుతో స్థిరంగా ఉన్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) వద్ద దేశ ప్రత్యేక ఉపసంహరణ హక్కులు(ఎస్‌డీఆర్) 8.9 మిలియన్ డాలర్లు పెరిగి 1.511 బిలియన్ డాలర్లకు చేరగా, ఐఎంఎఫ్‌లో దేశ నిల్వల స్థానం 12.1 మిలియన్ డాలర్లు అధికమై 2.035 బిలియన్ డాలర్లుగా నమోదయినట్లు రిజర్వు బ్యాంకు గణాంకాలు వెల్లడించాయి.

శుభవార్త

ఎస్‌బీఐ 'కనీస నిల్వ' తగ్గింపు?

- జరిమానా పైనా త్వరలో సమీక్ష
- రిటైల్ ఎండీ పి.కె.గుప్తా

ముంబయి: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతాదారులకు ఊరట కలిగించే విషయమిది. పొదుపు ఖాతాల్లో నెలవారీ సగటు కనీస నిల్వ పరిమితితో పాటు అది లేకుంటే విధిస్తున్న జరిమానాను కూడా తగ్గించే దిశగా నిర్ణయం తీసుకోనున్నట్లు బ్యాంక్ సంకేతాలిచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, ఏప్రిల్-నవంబరు నెలల్లోనే నెలవారీ సగటు నిల్వ తగినంత లేని ఖాతాదారుల నుంచి జరిమానాగా ఎస్‌బీఐ వసూలు చేసిన మొత్తం రూ.1,771 కోట్లకు చేరింది. బ్యాంక్ రెండో త్రైమాసిక లాభం కంటే ఇది అధికం కావడంతో, సర్వత్రా విమర్శలు వచ్చాయి. అందువల్ల నెలవారీ సగటు నిల్వతో పాటు జరిమానా మొత్తాలను సవరించనున్నామని ఎస్‌బీఐ తెలిపింది.



40.5 కోట్ల పొదుపు ఖాతాలను కలిగిన ఎస్‌బీఐ, 2017 ఏప్రిల్ 1 నుంచి నెలవారీ సగటు నిల్వ నిర్వహించని ఖాతాదారుల నుంచి జరిమానా వసూలు చేయడం ప్రారంభించింది. మెట్రో నగరాల్లో నెలకు సగటున రూ. 5,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 ఉండాలని, లేకపోతే జరిమానా విధిస్తామని అప్పట్లో ప్రకటించింది. కనీస నిల్వ మొత్తం ఎక్కువగా ఉందని విమర్శలు రావడంతో, మెట్రో నగరాలు - పట్టణాల్లో నెలవారీ సగటు నిల్వను రూ.3,000కు తగ్గించింది. ఇంతకన్నా తగ్గితే విధించే జరిమానాను కూడా రూ.50-100 నుంచి రూ.30-50 (పన్నులు అదనం)కి తగ్గించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో కనీస సగటు నిల్వ రూ.2,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 కన్నా తగ్గితే రూ.20-40 జరిమానా (పన్నులు అదనం) వసూలు చేస్తోంది. గత నవంబరు వరకూ జరిమానాగా వసూలు చేసిన మొత్తమే రూ.1,771.67 కోట్లని ఆర్థిక శాఖ వెల్లడించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో, కనీస నిల్వ మొత్తాన్ని, జరిమానాను కూడా తగ్గించాలనే నిర్ణయానికి వచ్చింది. 'వీటిపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. ఏప్రిల్‌లో నిర్ణయించిన మొత్తాలను, గత అక్టోబరులో సవరించాం. మరోసారి సమీక్షించాలని నిర్ణయించాం' అని ఎస్‌బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.కె.గుప్తా ఇక్కడ చెప్పారు. త్వరలోనే నిర్ణయం వెలువరిస్తాం అని తెలిపారు.


కొత్త నోటు

చాక్లెట్ రంగు.. వెనక కోణార్క్ దేవాలయం


త్వరలో కొత్త రూ.10 నోటు తేనున్న ఆర్‌బీఐ

ముంబయి: చాక్లెట్ రంగులో కొత్త రూ.10 నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అందుబాటులోకి తేనుంది. 'మహాత్మాగాంధీ సిరీస్‌లో, ఆర్‌బీఐ గవర్నరు ఉర్జిత్ ఆర్ పటేల్ సంతకంతో త్వరలోనే కొత్త రూ.10 నోటు రానుంద'ని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నోటుకు వెనకాల ప్రసిద్ధ కోణార్క్ సూర్య భగవాన్ దేవాలయ చిత్రం ఉంటుంది. దేశ సాంస్కృతిక సంపదకు ప్రతీకగా ఈ దేవాలయ చిత్రాన్ని ముద్రించారు. నోటుకు ముందు వైపు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రం, అశోక స్థూపం ముద్ర, వాటర్ మార్క్‌లు, నోటు సంఖ్య (అంకెల పరిమాణం పై నుంచి కిందకు వచ్చేసరికి పెరుగుతూ ఉంటాయి). వెనకాల కోణార్క్ దేవాలయంతో పాటు ముద్రణా సంవత్సరం, స్వచ్ఛ భారత్ చిహ్నం, నినాదం, దేశ భాషల్లో పది రూపాయిలు, హిందీ దేవనగరి లిపిలో 10 అంకె ముద్రించి ఉంటాయి. కొత్త నోటు వచ్చినప్పటికీ.. ఇప్పటివరకు చలామణిలో ఉన్న ఇతర రూ.10 సిరీస్ నోట్లన్నీ చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ పేర్కొంది.






ధీమా



భవన నిర్మాణదార్లకు త్వరలో బీమా పథకం

కోయంబత్తూర్: గృహ నిర్మాణదార్లు (బిల్డర్లు), స్థిరాస్తి ప్రాజెక్టుల అభివృద్ధికర్తల (డెవలపర్లు) కోసం త్వరలోనే కొత్త బీమా పథకాన్ని న్యూ ఇండియా అస్యూరెన్స్ (ఎన్ఏఐసీ) అందుబాటులోకి తేనుంది. స్థలాలు (టైటిల్స్), ప్రాజెక్టుల వ్యయాలకు సంబంధించి అనుకోని పరిణామాల వల్ల కలిగే నష్టాల నుంచి కాపాడుకునేందుకు బిల్డర్లు, డెవలపర్లు తప్పకుండా బీమా పథకాన్ని తీసుకోవాలన్న రెరా (స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం) నిబంధనలకు అనుగుణంగా ఈ బీమా పథకాన్ని తెస్తున్నట్లు న్యూ ఇండియా అస్యూరెన్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు జి.శ్రీనివాసన్ తెలిపారు. స్థలాల విషయంలో అవకతవకలు జరిగిన సందర్భంలో న్యాయ సహాయాన్ని కూడా కంపెనీ అందిస్తుందని పేర్కొన్నారు. ఆరోగ్య బీమా పథకాలను సరళీకరించడంపై కసరత్తు చేస్తున్నామని వివరించారు.

సూచన



రుణ మాఫీ హామీలు మంచిది కాదు

ఆర్‌బీఐ మాజీ గవర్నరు సూచించారు: జైట్లీ

దిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు రుణ మాఫీ హామీలు ఇస్తుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు అంత మంచిది కాదని ఆర్‌బీఐ మాజీ గవర్నరు ఒకరు హెచ్చరించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. ఇలాంటి హామీల వల్ల రుణాలు చెల్లించగల ఆర్థిక స్తోమత ఉన్నవారు కూడా ఉద్దేశపూర్వకంగా అప్పులు కట్టడం ఆపేస్తారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. కేంద్ర ఎన్నికల అధికారికి రాసిన లేఖలో ఆయన పై విషయాలను పొందుపరిచారని లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ మంత్రి తెలిపారు. అయితే ఆర్‌బీఐ మాజీ గవర్నరు పేరు, లేఖ రాసిన తేదీ వివరాలను జైట్లీ వెల్లడించారు. నాబార్డ్, సిడ్బి సంయుక్తంగా నిర్వహించిన ఓ సదస్సులో కూడా రుణ మాఫీ, రాయితీల హామీల వల్ల రుణాల చెల్లింపు క్రమశిక్షణ దెబ్బతింటుందని ఆయన చెప్పారని మంత్రి తెలిపారు.

సీఏల సేవలకు విలువ కట్టలేం

- యువత జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలి
- విద్యార్థుల సదస్సులో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

ఈనాడు - హైదరాబాద్

'కంపెనీలు, వ్యక్తులు తమ ఆర్థిక, వ్యూహాత్మక లక్ష్యాలు చేరడానికి చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) మార్గం సుగమం చేస్తారు. సమర్థమైన అకౌంటెంట్, కంపెనీకి విలువ కట్టలేని ఆస్తి' అని మార్గదర్శి చిట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) సీహెచ్ శైలజా కిరణ్ అన్నారు. ఖాతాల సమర్పణ (రిపోర్టింగ్ స్టాండర్డ్స్) ప్రమాణాలు మరింత కఠినతరం అవుతున్నాయని, జవాబుదారీతనం పెరుగుతున్న నేపథ్యంలో ఆడిటర్ల బాధ్యతలు పెరుగుతున్నాయని వివరించారు. చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ) కేవలం పన్నుల లెక్కలు, చెల్లింపులపైనే కాక విలువ చేర్చిన ఇతర సేవలపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)కు చెందిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) హైదరాబాద్‌లో సీఏ విద్యార్థుల సదస్సును రెండు రోజుల పాటు నిర్వహిస్తోంది. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో గౌరవ అతిథిగా శైలజా కిరణ్ ప్రసంగించారు. 'దాదాపు 27 సంవత్సరాలుగా మార్గదర్శి చిట్ ఫండ్ నిర్వహిస్తున్నాను. నా దృష్టి ఎప్పుడు వ్యాపార అభివృద్ధిపైనే ఉంటుంది. లాభాలు, పన్ను చెల్లింపుల గురించి నేనెప్పుడు పట్టించుకోలేదు. అవన్నీ ఆడిటర్లే చూసుకుంటారు. గత పదిహేనేళ్లుగా నేను ఆడిటర్లనే కలవలేదు' అని శైలజా కిరణ్ తెలిపారు. కంపెనీ పాలన, నష్టభయం నిర్వహణ, అంతర్గత నియంత్రణలు సమర్థంగా పని చేస్తున్నాయన్న భరోసా కంపెనీ యాజమాన్యానికి అంతర్గత ఆడిటర్లు, చార్టర్డ్ అకౌంటెంట్ల నుంచే లభిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ద్రవ్య విధానాలను రూపొందించడంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని.. కోట్ల మంది జీవితాలను అవి ప్రభావితం చేస్తాయని గుర్తు చేశారు. సీఏలు ప్రజల ప్రయోజనాల రక్షకులని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోతే ఆ నమ్మకాన్ని కోల్పోతారని శైలజా కిరణ్ అన్నారు. సమగ్రత, వృత్తిపరమైన బాధ్యతలు, ప్రవర్తన, గోప్యత మొదలైన వాటిలో విలువలు పాటించాలన్నారు. కంపెనీల్లో వినూత్నతను ప్రోత్సహించడానికి సానుకూల దృక్పథంతో వ్యవహరించడం అవసరమని తెలిపారు. జాతి, భావి తరాల భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని యువతకు ఉద్బోధించారు. అందరికీ ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రావాలని, పేదరికంపై విజయం సాధించాల్సి ఉందన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని మంచి స్థితికి చేరిన వారు, అవి లేని వారికి సహకారం అందించాలని, అసాధ్యాలను యువత సుసాధ్యం చేయగలదని చరిత్ర చెబుతోందని శైలజా కిరణ్ అన్నారు.

ఎన్నో మార్పులు వస్తున్నాయ్

అకౌంటింగ్ వృత్తిలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, పురోభివృద్ధి చెందుతున్న కంపెనీలు తమ అకౌంటెంట్లు, ఆడిటర్లను వ్యూహాత్మక భాగస్వాములుగా స్వీకరిస్తున్నాయని, కంపెనీ కీలక నిర్ణయాల్లో పాలుపంచుకునేలా చేస్తున్నాయని ముఖ్య అతిథిగా విచ్చేసిన సైయెంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, నాస్కామ్ మాజీ ఛైర్మన్ బి.వి.ఆర్.మోహన్ రెడ్డి తెలిపారు. సైబర్ భద్రత పరంగా ఆడిటర్లకు అనేక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని, బిగ్ డేటా, అనలిటిక్స్ సాంకేతిక పరిజ్ఞానాలు అకౌంటింగ్ నిపుణులకు కొత్త సవాళ్లతోపాటు అవకాశాలను తీసుకురాగలవని అభిప్రాయపడ్డారు. సీఏ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడానికి శిక్షణ కేంద్రాలపై ఆధారపడొద్దని, అవి నిజమైన నిపుణులుగా తీర్చిదిద్దలేవని ఐసీఏఐ మాజీ అధ్యక్షుడు ఎం.దేవరాజా రెడ్డి అన్నారు. ఐసీఏఐలో 2.7 లక్షల మందికి సభ్యత్వం ఉందని, ఇందులో 30 వేల మంది సీఏలు విదేశాల్లో పని చేస్తున్నారని చెప్పారు. దాదాపు 8.5 లక్షల మంది విద్యార్థులు సీఏ కోర్సు పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నారని చెప్పారు. తొమ్మిది దేశాల్లో భారత సీఏలకు గుర్తింపు ఉందని, వచ్చే 5-10 సంవత్సరాల్లో దాదాపు 100 దేశాల్లో గుర్తింపు లభించగలదని, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ అతుల్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ భారత చార్టర్డ్ అకౌంటెంట్ విద్యార్థుల సంఘం (సికాసా) హైదరాబాద్ శాఖ ఛైర్మన్ పంకజ్ కుమార్ త్రివేది, దక్షిణ భారత ప్రాంతీయ మండలి (సిర్క్) హైదరాబాద్ శాఖ ఛైర్మన్ ఆర్.చెంగల్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఎ.వేంకటేశ్వర రావు తదితరులు ప్రసంగించారు.



జ్యోతి వెలిగించి సీఏ విద్యార్థుల సదస్సును ప్రారంభిస్తున్న మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్. చిత్రంలో బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, దేవరాజా రెడ్డి, అతుల్ కుమార్ గుప్తా, చెంగల్‌రెడ్డి, వేంకటేశ్వర్లు తదితరులు

ఈ ఏడాది కంపెనీల ఆర్థిక ఫలితాలు బాగుంటాయని కోటక్ మహీంద్రా ఏఎమ్‌సీ ఎండీ నీలేశ్ షా పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం భారీగా వ్యయాలు చేస్తుందని, జీఎస్‌టీ ప్రయోజనాల వల్ల కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు 12-15 శాతం మేర పెరగవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు ప్రారంభంలో ఏర్పడిన ప్రతికూలతలు కనుమరుగై, సత్ఫలితాలు ఏర్పడతాయని, ఇందువల్ల కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని కోజెన్సిస్ ఇంటర్వ్యూలో నీలేశ్ పేర్కొన్నారు. ముఖ్యాంశాలు..

మార్చి తరవాత.. జోరే

- పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీతో సానుకూల ఫలితాలు
- కార్పొరేట్ కంపెనీల ఆదాయంలో రెండంకెల వృద్ధి

ఇంటర్వ్యూ
కోటక్ మహీంద్రా ఏఎమ్‌సీ ఎండీ నీలేశ్ షా

ఈ ఏడాది కంపెనీల ఫలితాలు రాణించగలవన్న అంచనా ఉన్నప్పటికీ.. ఈక్విటీల నుంచి ప్రతిఫలాలు ఓ మోస్తరుగా ఉండొచ్చు. ద్రవ్యలోటు, ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉండడం; తక్కువ పన్ను వసూళ్లు ఇందుకు కారణంప. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యయాలు పెంచాల్సి వస్తుంది. దీనికనుగుణంగా ఆదాయాలను కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈక్విటీలపై ప్రభుత్వం దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధించే హక్కు ఉందని మార్కెట్లో ఓ వర్గం భయపడుతోంది. అయితే ప్రభుత్వం ఎస్టేట్ సుంకం వంటివి తీసుకు వస్తుందని నేను భావిస్తున్నా.

పనితీరు గమనించే పెట్టుబడులు పెట్టాలి

కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పుట్టుకువస్తున్న వ్యాపారాలు పాత ధోరణిలోని వ్యాపారాలను నాశనం చేస్తున్నాయి. అంటే ఎప్పటి నుంచో ఉన్న కంపెనీలు లేదంటే కొత్త కంపెనీలు అని కాకుండా.. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నిలదొక్కుకునే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం మంచిది. చిన్న కంపెనీయా, మధ్యస్థాయా లేదా పెద్ద కంపెనీయా అని కాకుండా.. వాటి పనితీరు ఆధారంగా పెట్టుబడులు పెట్టడం మంచిది. 2017లో చిన్న కంపెనీలు పెద్ద కంపెనీల కంటే మూడు రెట్ల ప్రతిఫలాలు అందించాయి. అయితే 2018లో అలా ఉండకపోవచ్చు.

అక్టోబరు-మార్చిలో రెండంకెల వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి సగంపై పెద్ద నోట్ల రద్దు ప్రభావం కనిపించింది. అయినా అక్టోబరు-మార్చిలో కార్పొరేట్ ఆదాయాల్లో రెండంకెల వృద్ధి(12-15%) నమోదుకావొచ్చు. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో తక్కువ వృద్ధి కూడా ఇందుకు కారణం. వచ్చే మార్చి తరవాత జీఎస్‌టీ లేదా పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఉండకపోవచ్చు కాబట్టి కంపెనీలు రాణించవచ్చు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యయాలు చేయవచ్చన్న అంచనాలు ఇందుకు నేపథ్యం.

మార్పు కనిపిస్తోంది..

దేశీయులు నగదు, బంగారాన్ని అలాగే అట్టేపెట్టుకుని ఉండేవారు. ఇపుడు పరిస్థితి మారుతోంది. ఇంట్లో డబ్బులు పెట్టుకోవడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని తెలుసుకున్నారు. అదే సమయంలో ప్రభుత్వం కూడా బ్యాంకు ఖాతాల్లోకి నగదు వెళ్లేలా, డిజిటల్ లావాదేవీలకు మళ్లేలా చేసింది.

బడ్జెట్‌పై అంచనాలు..

ద్రవ్యలోటు పెరుగుతోంది. జీఎస్‌టీ వసూళ్లు తక్కువగా ఉన్నాయి. ముడి చమురు ధరలు పెరుగుతూ ఉన్నాయి. అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతూ ఉంది. కరెంట్ ఖాతా లోటూ అధికమవుతోంది. కాబట్టి రాబోయే బడ్జెట్లో పన్ను వసూళ్లను పెంచాల్సిన అవసరం ఉంది. ఈక్విటీలపై దీర్ఘకాల మూలధన పన్ను విధించకపోవచ్చు.



సెన్సెక్స్ ▲ 184	34154	
నిఫ్టీ ▲ 54	10559	
రూపాయి 63.37 ▲	04 పైసలు	(ఒక అమెరికా డాలరుకు)
బంగారం 29,575 ▲	85 రూ.లలో	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)
వెండి 38,725 ▲	25 రూ.లలో	ముంబయిలో కిలో
ముడి చమురు 67.60 ▼		(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,163	+88
నాస్‌డాక్	7,120	+42
నిక్కీ 225 (జపాన్)	23,715	+208
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,489	−11
షాంఘై(చైనా)	3,392	+07
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,724	+28
డాక్స్ (జర్మనీ)	13,320	+152

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.64	66.83
పౌండ్ స్టెర్లింగ్	78.17	90.66
యూరో	69.58	80.71
జపనీస్ యెన్/100	51.09	59.25
ఆస్ట్రేలియా డాలరు	45.26	52.36
సింగపూర్ డాలరు	43.43	51.44
థాయ్ బాత్/100	178.90	213.97
బహ్రెయిన్ దీనార్	156.09	178.87
కువైట్ దీనార్	173.71	216.25
సౌదీ రియాల్	15.32	18.17
యూఏఈ దిర్హమ్	15.69	18.34
మలేషియా రింగిట్	14.14	17.38



శుక్రవారం నిఫ్టీ కదలికలు



మార్కెట్ కబుర్లు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలను ఈ నెల 12న ఐటీ దిగ్గజం **ఇన్ఫోసిస్** ప్రకటించనుంది. ఫలితాలు మధ్యాహ్నం 3.45 గంటలకు విడుదల కావొచ్చు.
- ఓఎన్‌జీసీ నుంచి రూ.1,483 కోట్ల (229 బిలియన్ డాలర్లు) విలువైన ఆఫ్‌షోర్ కాంట్రాక్ట్ దక్కించుకున్నట్లు **ఎల్ అండ్ టీ హైడ్రోకార్బన్ ఇంజినీరింగ్** వెల్లడించింది.
- సంస్థలు, వాణిజ్య ప్రాజెక్టుల నిర్మాణ నిమిత్తం రూ.395.21 కోట్ల కొత్త ఆర్డర్లు చేజిక్కించుకున్నట్లు **అహ్లువాలియా కాంట్రాక్ట్స్** తెలిపింది. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫైర్‌ఫైటింగ్ సేవలు ఇందులో ఉన్నట్లు వివరించింది.
- రుణాల ఊబిలో ఉన్న **ఉత్తమ్ గాల్వా స్టీల్స్‌**లో 2.38 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా ఎరిస్కా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ విక్రయించింది. విక్రయానికి ముందు కంపెనీలో ఎరిస్కాకు 5.49 శాతం వాటా ఉండేది.
- సిపీ పాలీయురథేన్స్‌లో మెజారిటీ వాటాను రూ.96.4 కోట్లకు రసాయన సంస్థ **పిడిలైట్ ఇండస్ట్రీస్** కొనుగోలు చేయనుంది. రెసిన్ ఫ్లోరింగ్, ఫ్లోర్ కోటింగ్ విపణిలో వృద్ధి చెందేందుకు ఈ కొనుగోలు దోహదపడనుంది. సిపీలో 70 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు పిడిలైట్ వెల్లడించింది.

కొత్త శిఖరాన రెపరెపలు

● తాజా జీవనకాల గరిష్ఠానికి సెన్సెక్స్, నిఫ్టీ ● కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు

● రూ.1.13 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

సూచీలు తాజా జీవనకాల గరిష్ఠాలను అధిరోహించాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు దన్నుగా నిలవడంతో మదుపర్లు కొనుగోళ్లతో ముంచెత్తారు. సెన్సెక్స్ 34,000 పాయింట్లను మళ్లీ అందుకోగా, నిఫ్టీ 10,550 పాయింట్ల పైకి చేరింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల బలోపేతానికి అదనంగా రూ.80,000 కోట్ల వ్యయానికి లోక్‌సభ ఆమోదం తెలపడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. అంతకుముందు అమెరికా ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీ డోజోన్స్ చరిత్రలో తొలిసారిగా 25,000 పాయింట్ల పైకి చేరడంతో ఆసియా మార్కెట్లు దూకుడు ప్రదర్శించాయి. ఐరోపా మార్కెట్లు అదే జోరు కొనసాగించాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. వరుసగా అయిదో వారం సూచీలు లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 97.01 పాయింట్లు, నిఫ్టీ 28.15 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి. సూచీల జోరు నేపథ్యంలో మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.1.13 లక్షల కోట్లు పెరిగి రూ.153.77 లక్షల కోట్లకు చేరింది.

34000 ఎగువకు: సెన్సెక్స్ ఉదయం బలంగా 34,000 పాయింట్ల ఎగువన ప్రారంభమైంది. రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 34,188.



సమీక్ష

85 పాయింట్ల వద్ద జీవన కాల గరిష్ఠాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణ ఎదుర్కొన్న సూచీ.. 184.21 పాయింట్లు పెరిగి 34,153.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌కు ఇది రికార్డు ముగింపు కావడం విశేషం. డిసెంబరు 29 ముగింపైన 34,056.83 పాయింట్లను సూచీ అధిగమించింది. ఇక నిఫ్టీ సైతం 10,566.10 పాయింట్ల వద్ద రికార్డు గరిష్ఠాన్ని తాకింది. చివరకు 54.05 పాయింట్ల లాభంతో 10,558.85 దగ్గర స్థిరపడింది. డిసెంబరు 26 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు.

ఐడియా గగనం: టెలికాం సంస్థ ఐడియా సెల్యులార్ షేర్లు వరుసగా రెండో రోజూ మెరిశాయి. వొడాఫోన్‌తో విలీనానికి ముందు రూ.6,750 కోట్లు సమీకరించనున్నట్లు కంపెనీ ప్రకటించడంతో ఐడియా షేరు ఇంట్రాడేలో 12.91 శాతం దూసుకెళ్లింది. చివరకు 10.67 శాతం లాభంతో రూ.115.65 వద్ద ముగిసింది.

- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు దూసుకెళ్లడంతో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలైన హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు 1.01 శాతం వరకు డీలాపడ్డాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 23 లాభాలతో ముగిశాయి. యెస్ బ్యాంక్ అత్యధికంగా 5.03% లాభపడింది. అదానీ పోర్ట్స్ 3.71%, భారతీ ఎయిర్‌టెల్ 3.36%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.17%, డాక్టర్ రెడ్డీస్ 2.40%, టీసీఎస్ 1.31%, టాటా స్టీల్ 1.26%, హెచ్‌డీఎఫ్‌సీ 1.20%, ఏషియన్ పెయింట్స్ 1%, ఐటీసీ 0.86%లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఓఎన్‌జీసీ (0.83%), ఐసీఐసీఐ బ్యాంక్ (0.70%), ఎస్‌బీఐ (0.60%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో.. టెలికాం సూచీ 2.75% మెరిసింది. మన్నికైన వినిమయ వస్తువులు 1.25%, టెక్ 0.89%, స్థిరాస్తి 0.75%, ఎఫ్‌ఎమ్‌సీజీ 0.74% చొప్పున రాణించాయి.

అనూహ్యంగా.. అత్యంత వేగంగా

● డోజోన్స్ తొలిసారి 25000కు

● అమెరికాను గొప్పగా తీర్చిదిద్దుతున్నాం: ట్రంప్



వాషింగ్టన్: అమెరికాను గొప్పగా తీర్చిదిద్దడం అనుకున్నదాని కంటే వేగంగా జరుగుతోందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. డోజోన్స్ పారిశ్రామిక సూచీ తొలిసారి 25000 పాయింట్ల మైలురాయిని అధిగమించడమే ఇందుకు సంకేతమని పేర్కొన్నారు. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాకు మించి నమోదుకావడం, డోజోన్స్‌తో పాటు ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ సూచీలు కూడా రికార్డు జోరు కనబరచాయని గుర్తు చేశారు. డోజోన్స్ అత్యంత వేగంగా 1000 పాయింట్లు అధిగమించి చరిత్ర సృష్టించిందన్నారు. 'అమెరికా ప్రజలు కలలు కనడం ఆపితే, సాధించడానికి ఏమీ ఉండదు. సాధించలేం కూడా. అమెరికాను తిరిగి గొప్పగా తీర్చిదిద్దాలన్న మన ఆశయ సాధన అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. ఎవరూ ఊహించని విధంగా ఇది జరుగుతోంద'ని వైట్ హౌస్ సమావేశం సందర్భంగా వీడియో సందేశంలో ట్రంప్ తెలిపారు. క్రిస్మస్‌కు ముందు తాను చేసిన చరిత్రాత్మక పన్నుల సంస్కరణ దస్త్రం, ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతోందని అన్నారు. 'వందలు, వేల మంది అమెరికన్లు అత్యధిక వేతనాలు అందుకుంటున్నారు. భారీగా బోనస్‌లు లభిస్తున్నాయి. పింఛన్ కేటాయింపులు పెరిగాయి. ఇదంతా పన్ను సంస్కరణ చలవేన'ని ఆయన చెప్పారు. 'దాదాపు 60కి పైగా కంపెనీలు వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. మరికొన్ని కనీస వేతనాన్ని గంటకు 15 డాలర్లు పెంచాయి. ఇదంతా అవి స్వచ్ఛందంగా చేశాయని నేను అనడం లేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణమైంద'ని ట్రంప్ చెప్పారు. పన్ను తగ్గింపులతో కలిగిన ప్రయోజనాన్ని మరిన్ని ఉద్యోగాల సృష్టికి, ఉద్యోగాల వేతనాల పెంపునకు కంపెనీలు వినియోగిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని పేర్కొన్నారు.

కొత్తగా 1,48,000 మందికి ఉద్యోగాలు

డిసెంబరులో అమెరికా కంపెనీలు 1,48,000 మందికి ఉద్యోగాలు కల్పించినప్పటికీ, ఉద్యోగాల కల్పనలో పెరుగుదల స్వల్పంగానే ఉంది. పూర్తి సంవత్సరానికి చూస్తే 21 లక్షల మందికి ఉద్యోగాలను కంపెనీలు ఇచ్చాయి. మరోవైపు వరుసగా మూడో నెల కూడా నిరుద్యోగ రేటు 4.1 శాతంగా కొనసాగింది. 2000 తరవాత ఇదే కనిష్ఠ స్థాయి.

బేయర్‌లో మోన్‌శాంటో విలీనంపై అభ్యంతరాలుంటే చెప్పండి

సీసీఐ ప్రజాభిప్రాయ సేకరణ

దిల్లీ: బేయర్‌లో మోన్‌శాంటో విలీన ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ప్రారంభించింది. ఈ విలీనంతో ఏదేని ప్రతికూల ప్రభావం ఉందని భావిస్తే సంబంధిత వ్యక్తులు/సంస్థలు తగిన ఆధారాలతో 15 రోజుల్లోగా అభిప్రాయాలను సమర్పించొచ్చని ఓ ప్రకటనలో సీసీఐ తెలిపింది. నిరాధార అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమని కూడా అందులో పేర్కొంది. మోన్‌శాంటోలో పూర్తి వాటా కొనుగోలు చేసేందుకు 2016 సెప్టెంబరు 14న ఆ సంస్థతో బేయర్ ఒప్పందం కుదుర్చుకుంది. లావాదేవీ విలువ 6600 కోట్ల డాలర్లు (రూ.సుమారు రూ.4 లక్షల కోట్లు) ప్రతిపాదత లావాదేవీ అనంతరం బేయర్‌కు మోన్‌శాంటో పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అవ్వడమే కాకుండా విలీనం అనంతరం ఏర్పడే సంస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఎరువుల, విత్తనాల సంస్థగా అవతరిస్తుంది. ఇంతకుముందు సన్‌ఫార్మా- ర్యాన్‌బాక్సీ, హోల్సిమ్- లఫార్జె సంస్థల విలీన సమయంలోనూ ఇదే విధంగా ప్రజాభిప్రాయాన్ని సీసీఐ సేకరించింది.

తగ్గిన ఉత్తమ్ గాల్వా స్టీల్స్ నష్టం

దిల్లీ: అక్టోబరు-డిసెంబరులో ఉత్తమ్ గాల్వా స్టీల్స్ రూ.179.9 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నమోదు చేసిన రూ.257.2 కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ సారి నష్టం తగ్గింది. మొత్తం ఆదాయం రూ.1046 కోట్ల నుంచి రూ.680.4 కోట్లకు తగ్గిందని కంపెనీ వెల్లడించింది. విలువ జతచేరిన స్టీల్ ఉత్పత్తులు తయారుచేసే ఉత్తమ్ గాల్వా స్టీల్‌కు 10 లక్షల టన్నుల కోల్డ్ రోల్డ్, 7.5 లక్షల టన్నుల గాల్వానైజ్డ్, 90000 టన్నుల కలర్ కోటెడ్ స్టీల్ తయారీ సామర్థ్యం ఉంది.

అలా చేస్తే ఛార్జీలు పెరుగుతాయ్

● విమాన టిక్కెట్ ధరలపై గరిష్ఠ పరిమితి సరికాదు

● పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసులపై మంత్రి అశోక్ గజపతి రాజు



దిల్లీ: విమాన ఛార్జీలపై పరిమితి విధించడం వల్ల టికెట్ ధరలు పెరుగుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు అభిప్రాయపడ్డారు. విమాన ఛార్జీలకు గరిష్ఠ పరిమితి నిర్ణయించాలని, టికెట్ రద్దు ఛార్జీలను ప్రాథమిక ఛార్జీలో 50 శాతానికి పరిమితం చేయాలన్న పార్లమెంటరీ కమిటీ సిఫారసులపై మంత్రి స్పందించారు. ముందస్తు బుకింగ్ ఛార్జీలతో పోలిస్తే, ప్రయాణ తేదీ సమీపించినపుడు టికెట్ ధరలను విమానయాన సంస్థలు పదింతల మేర పెంచుతున్నాయని పార్లమెంటరీ స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని 'రవాణా, పర్యాటకం, సాంస్కృతికం'పై ఏర్పాటు చేసిన ఈ సంఘం సిఫారసు చేసింది. 'ప్రతి ప్రాంతంలో విమాన టికెట్ గరిష్ఠ ధరను పౌర విమానయాన శాఖ నిర్ణయించాలని కమిటీ సిఫారసు చేస్తోంద'ని గురువారం రాజ్యసభకు సమర్పించిన నివేదిక చెబుతోంది. సాధారణ స్థాయి ధరల కంటే అధిక ధరలు నిర్ణయించడం అనేది కేవలం 1.7 శాతం కేసుల్లోనే జరుగుతోందని, పరిమితి పెడితే 98 శాతం కేసుల్లో టికెట్ ధరలు పెరుగుతాయని పార్లమెంటు బయట విలేకర్లతో గజపతి రాజు పేర్కొన్నారు. 'భారత్‌లో ప్రస్తుతం ఉన్న విమాన టికెట్ ధరల విధానం అంతర్జాతీయంగా అనుసరిస్తున్నదే. మన విమానయాన సంస్థలు అంతర్జాతీయ ప్రమాణాలకు వ్యతిరేకంగా ఏమీ ప్రవర్తించడం లేద'ని పౌర విమానయాన సహాయ మంత్రి జయంత్ సిన్హా పేర్కొన్నారు. ఎవ్వరైనా ఫిర్యాదు చేయాలని తలిస్తే.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియాలను సంప్రదించవచ్చని సలహానిచ్చారు.

కనీస ప్రమాణాలు పాటించాలి: కమిటీ

పార్లమెంటరీ కమిటీ మాత్రం 'అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న ధరల విధానం భారత్ వంటి దేశానికి సరిపోదు. విమానయాన ఇంధన(ఏటీఎఫ్) ధరలు తగ్గినా.. ఆ ప్రయోజనాలను సంస్థలు ప్రయాణికులకు బదిలీ చేయలేద'ని అభిప్రాయపడింది. విమానాల రీషెడ్యూలింగ్, రద్దు, ఇతరత్రా వంటి అంశాల్లో కనీస ప్రమాణాలను పాటించడంలో ఎటువంటి ఏకరూపకత కనిపించడం లేదు. ప్రైవేటు విమానయాన సంస్థలు ఆకర్షణీయ ఆఫర్లతో విమాన టికెట్ విక్రయించినా, రద్దు చేసుకుంటే మొత్తం ధరను మినహాయించుకుంటున్నారు. రద్దు ఛార్జీలు టికెట్ మూల ధరలో 50 శాతం కంటే ఎక్కువగా ఉండకుండా చూసుకోవాల'ని సిఫారసు చేసింది. చెక్-ఇన్ విషయంలో ఎక్కువ సమయం పట్టి విమానం ఎక్కలేకపోయినా.. అదనపు రేట్లతో మళ్లీ టికెట్ బుక్ చేసుకోవల్సిందిగా బలవంతం చేస్తుంటారని కమిటీ విమర్శించింది.

ఇండిగో ప్రవర్తన సరికాదు: ఉద్యోగులు, ప్రయాణికుల పట్ల ఇండిగో సంస్థ ప్రవర్తనపై పార్లమెంటరీ స్థాయీ సంఘం మండిపడింది. అది సంస్థాగత సమస్య అని.. వినియోగార్లతో స్నేహపూరితంగా మెలగాలని సలహానిచ్చింది.

ఎన్‌ఏసీఎల్ రూ.300 కోట్ల సమీకరణ


ఈనాడు, హైదరాబాద్: విస్తరణ ప్రణాళికలకు అవసరమైన నిధుల కోసం ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్ రూ.300 కోట్లు సమీకరించనుంది. ఇందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అనేక కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేయాలని, దేశీయ మార్కెట్‌లో విస్తరించడంతోపాటు ఎగుమతులను పెంచుకోవాలని, జీవ ఉత్పత్తులు, క్రిమిసంహారకాల ఇంటర్మీడియేట్ల ఉత్పత్తుల తయారీని విస్తరించాలని కంపెనీ భావిస్తోంది. ఇందుకు నిధులను సమీకరించాలని నిర్ణయించింది. వాటాదారులు, ఇతర అనుమతులకు అనుగుణంగా ఈ నిధులను సమీకరిస్తుంది. వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 3న జరుగుతుంది. కంపెనీకి చెందిన శ్రీకాకుళం యూనిట్‌కు భారత జాతీయ భద్రత మండలి నుంచి 'సురక్ష పురస్కార్' అవార్డు లభించింది.

యెస్ బ్యాంక్



రూ.317.50 వద్ద ప్రారంభమై రూ.317.45- 337.90 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.317.10తో పోలిస్తే రూ.15.75 (4.97%) లాభంతో రూ.332.85 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 3,07,20,675.

భారతీ ఇన్‌ఫ్రాటెల్



రూ.381.45 వద్ద మొదలై రూ.371.50- 381.45 మధ్య చలించి క్రితం ముగింపు రూ.379.05తో పోలిస్తే రూ.6.45 (1.70%) నష్టంతో రూ.372.60 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 15,76,172 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

సెంచురీ టెక్స్‌టైల్స్	1454.45	టాటా స్టీల్	776.90
ఎల్ అండ్ టీ	1328.95	కల్పతరు పవర్	504.00
జీఎం బ్రూవరీస్	1171.50	హెక్సావేర్ టెక్నాలజీస్	360.00
టైటన్	913.95		
జెట్ ఎయిర్‌వేస్	883.45		
ఎస్కార్ట్స్	805.00		

52 వారాల కనిష్ఠం (రూ.లలో)

న్యూలాండ్ ల్యాబ్స్	838.70
బాంబే రేయాన్	95.95

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
05/01	5,812	5,230	581	3,985	3,742	243
04/01	4,624	4,412	212	3,817	3,491	325
03/01	4,529	4,433	96	3,081	3,350	−269
02/01	3,162	2,640	523	3,230	3,166	65
01/01	770	444	326	2,499	3,800	−1,300

5వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	395	వరంగల్	397
చిల్లరగా(ఒక గుడ్డు)	4.55	విశాఖపట్నం	400
బెంగళూరు	395	చెన్నై	405
6న		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	393	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 423.80 (409.85) 5448214
AMBUJA CEMEN 273.90 (273.45) 1304360
ASIAN PAINTS 1185.25 (1172.05) 1151320
AUROBIND PHA 671.15 (668.30) 1520200
AXIS BANK LT 563.25 (559.90) 3249056
BAJAJ AUTO L 3279.85 (3264.45) 113508
BAJAJ FINANC 1814.50 (1754.00) 984327
BHARTI AIRTE 540.00 (523.00) 7218024
BHARTI INFRA 372.60 (379.05) 1576172
BOSCH LTD 19693.15 (19652.65) 15105
BPCL 487.70 (491.50) 2939239
CIPLA 615.15 (616.75) 1072254
COAL INDIA L 278.75 (277.80) 3344950
DR. REDDYS 2473.40 (2410.80) 639900
EICHER MOTOR 29237.00 (28570.75) 52777
GAIL 494.40 (496.70) 1170141
HCL TECH 900.05 (893.10) 746146
HDFC 1725.20 (1703.20) 2302884
HDFC BANK 1863.60 (1859.90) 717717
HERO MOTOCOR 3744.65 (3738.90) 234199
HINDALCO IND 276.40 (279.80) 7084973
HINDUSTAN UN 1356.55 (1352.25) 568451
HPCL 415.00 (418.85) 3595907
ICICI BANK 312.90 (314.70) 6366054
INDIABULLS H 1198.95 (1183.95) 1208082
INDIAN OIL 383.85 (387.30) 3073155
INDUSINDBANK 1698.20 (1646.60) 1134406
INFOSYS LTD 1012.00 (1015.40) 5512988
ITC 262.90 (261.55) 9211954
KOTAK MAHIND 1003.05 (1000.40) 2147402
LARSEN & TOU 1314.90 (1315.70) 2418902
LUPIN 900.15 (878.15) 2694063
M&M 756.35 (756.00) 1255982
MARUTI SUZIK 9433.85 (9386.25) 732512
NTPC LTD 177.50 (177.10) 10359225
ONGC 198.45 (199.50) 6812787
POWER GRID C 201.25 (200.35) 2769503
RELIANCE IND 923.25 (920.30) 3401905
SBI 306.35 (308.50) 14580575
SUN PHARMA 578.75 (581.20) 4600683
TATA CONSULT 2689.20 (2657.10) 576853
TATA MOTORS 431.60 (429.95) 7021611
TATA STEEL L 770.70 (760.25) 7136203
TECH MAHINDR 525.45 (522.55) 1756809
ULTRATECH 4395.80 (4345.50) 165179
UPL LIMITED 774.20 (781.65) 887317
VEDANTA LIMI 339.55 (339.10) 9693755
WIPRO 309.55 (311.65) 1613205
YES BANK LTD 332.85 (317.10) 30720675
ZEE ENTERTAI 586.85 (580.00) 1568108

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1435.10 (1433.30) 99155
ACC 1809.95 (1801.35) 312489
ASHOK LEYLAN 127.45 (126.95) 8969607
AVENUE SUPER 1243.40 (1203.10) 1244328
BAJAJ FINSER 5127.20 (5062.55) 151818
BANK OFBAROD 161.80 (163.90) 11233822
BEL 182.30 (180.05) 3465350
BHEL 102.35 (100.75) 19274135
BRITANNIA 4644.10 (4626.40) 132058
CADILA HEALT 440.20 (431.50) 1383248
COLGATE PALM 1100.70 (1094.35) 311773
CONTAINER 1379.30 (1376.30) 130239
CUMMINS INDI 957.20 (972.95) 275586
DABUR INDIA 358.20 (355.00) 1200209
DLF LIMITED 259.95 (257.50) 7238574
EMAMI LIMITE 1327.95 (1328.65) 51120
GLAXOSMI CON 6398.45 (6402.80) 1933
GLAXOSMI PHA 2488.20 (2477.55) 12309
GLENMARK PHA 591.60 (589.40) 823697
GODREJ CONSU 990.05 (989.45) 223136
HAVELLS INDI 566.05 (562.85) 1638665
HINDUSTAN ZI 313.80 (317.85) 1255238
ICICI PRU LI 394.15 (379.90) 1232969
IDEA CELLULR 115.80 (104.55) 79361220
INTERGLOBE A 1198.60 (1213.65) 267769
JSW STEEL LT 285.10 (277.15) 8325201
LIC HOUS.FIN 571.25 (567.60) 1746240
MARICO LIMIT 326.95 (323.35) 1392301
MCDOWELL 3953.25 (3688.85) 1226707
MOTHERSON 381.00 (375.35) 3591700
MRF 72905.90 (71219.85) 9189
NHPC LTD 33.55 (33.75) 8775202
NMDC LTD 158.55 (154.75) 6408793
OIL INDIA 380.50 (381.55) 577285
ORACLE FIN S 4101.65 (4060.75) 68647
P&G HYG&HEAL 9326.25 (9309.90) 5368
PETRONET LNG 252.15 (252.70) 1632589
PIDILITE IND 910.20 (905.60) 416415
PIRAMAL ENTE 2853.50 (2819.30) 103510
PNB 176.00 (176.45) 15500426
POWER FIN CO 125.05 (125.30) 3271513
RURAL ELEC C 161.45 (161.95) 4050226
SAIL 97.40 (97.90) 19505394
SHREE CEMENT 18964.50 (17978.35) 26615
SHRIRAM TRAN 1480.05 (1468.85) 699800
SIEMENS 1286.70 (1277.05) 178651
SUN TV LTD 1037.95 (1028.20) 1065076
TATA POWER 99.55 (99.60) 11646646
TITAN IND 909.70 (892.90) 4036882
TORRENT PHAR 1420.75 (1393.90) 271607

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 215.55 (209.60) 3929454
ADANI ENTERP 193.15 (183.30) 11521764
ADANI POWER 46.40 (44.25) 47663047
ALL BANK 73.05 (73.60) 2095696
AMARA RAJA 862.00 (839.75) 638787
ANANT RAJIND 78.95 (73.95) 15773837
ANDHRA BANK 58.70 (59.40) 2694216
APOLLO HOSPI 1196.30 (1160.10) 232491
APOLLO TYRES 280.60 (270.90) 5282717
APTECH 361.05 (358.20) 270781
BAJAJ ELECT. 567.65 (540.35) 2190561
BAJAJ HIND 17.30 (17.05) 5805402
BAJAJ HOLDIN 2829.80 (2828.50) 10840
BALAJI TELE 160.00 (159.50) 168082
BALLARPUR IN 18.30 (18.45) 3176005
BALRAMPUR CH 139.90 (137.15) 2291139
BANK OF MAHA 23.65 (23.60) 1237293
BANK OFINDIA 172.25 (174.65) 2954958
BATA INDIA 764.80 (767.35) 418312
BGR ENERGY S 140.40 (141.25) 159134
BHARAT FORGE 738.85 (726.95) 1719262
BHUSHAN STEE 68.95 (68.70) 3289373
BIOCON LTD 540.95 (541.65) 816697
BOMBAY DYE 277.90 (279.10) 1755114
CANARA BANK 364.85 (362.55) 1993083
CEAT LIMITED 1977.50 (1941.15) 675479
CENTRAL BANK 76.05 (76.75) 844943
CHAMBAL FERT 159.15 (160.65) 374070
CHENNAI PETR 422.85 (423.30) 513644
CITY UNIBANK 176.00 (176.70) 613721
CORPO BANK 41.15 (41.30) 294229
COX & KINGS 272.60 (270.00) 195427
D B REALTY L 74.75 (71.20) 3051403
DELTA CORP L 303.40 (306.40) 1103865
DENA BANK 26.70 (26.95) 4589290
DHANALAKBANK 30.45 (29.65) 1004209
DIVIS LAB 1107.65 (1106.55) 568810
EDELWEISS CA 292.70 (285.35) 2816594
EID PARRY 382.80 (379.75) 187512
EIH 154.00 (151.35) 162418
ESSAR SHIPPI 31.65 (32.40) 209346
ESTER INDUST 60.90 (60.50) 166272
EXIDE INDUST 227.10 (222.10) 1687260
FEDERAL BANK 112.10 (108.65) 11491142
FINOLEX CABL 713.60 (696.60) 44561
G E SHIP LTD 411.65 (407.50) 75103
GAMMON INFRA 3.50 (3.60) 7920891
GATI LIMITED 139.25 (136.80) 1749010
GAYATRI PROJ 215.30 (212.90) 658445
GITANJALIGEM 73.70 (74.00) 6026729
GMR INFRASTR 21.20 (21.05) 36937018
GODREJ IND 616.30 (612.45) 407281
GRASIM IND 1214.20 (1170.30) 1010643
GUJ ALK&CHEM 790.60 (760.50) 249802
GUJ NRE COKE 1.50 (1.55) 18191901
HCL INFOSYS 59.80 (59.45) 4110562
HDFC BANK 1865.00 (1880.00) 75000
HEXA TECH 358.70 (352.00) 1180162
HIMACHAL FUT 33.10 (33.90) 11968476
HINDU MOTORS 9.25 (9.30) 899451
HOUSING DEV 63.95 (62.15) 24187288
IDBI 63.80 (64.40) 5704149
IDFC 64.45 (61.70) 10466801
IFCI 30.60 (29.20) 37744897
IL&FS TRANS 94.35 (94.20) 1153993
INDBULLS REL 221.25 (219.25) 4868931
INDIA CEM 199.05 (190.35) 11848536
INDIAN BANK 379.25 (380.15) 750983
INDO RAMA SY 47.65 (44.75) 1961506
INDRAPRASTHA 329.85 (329.05) 1698453
INGERSOLL-R 888.60 (873.60) 54867
IOB 24.15 (23.05) 5906944
IPCA LAB 583.55 (580.15) 119346
IRB INFRA DE 243.60 (236.75) 2671591
J&K BANK 81.65 (81.55) 326451
JAI CORP 205.20 (202.75) 6864179
JAIN IRRIGAT 134.85 (136.25) 13697522
JAYPEE INFRA 23.25 (23.10) 5620207
JET AIRWAYS 870.55 (865.20) 3235147
JINDAL SAW 159.75 (163.75) 3329617
JINDAL STEEL 239.05 (244.55) 22890636
JK LAKSHMI C 447.60 (447.90) 120445
JK PAPER LIM 162.60 (164.05) 3154172
JM FINANCIAL 157.35 (157.35) 675327
JP ASSOCIATS 25.10 (24.40) 67847289
JSW ENERGY L 91.60 (91.05) 5196211
JUBILANT FOO 1904.35 (1838.75) 1270276
JUBILANT ORG 770.30 (787.15) 227074
JYOTHY LABS 385.15 (380.45) 292691
JYOTI STRUC 13.40 (13.60) 1081431

ఘనం (+)

నిఫ్టీ	5న	మార్పు %
YES BANK	332.85	4.97
BAJAJ FINANCE	1814.50	3.45
ADANI PORT	423.80	3.40
BHARTI AIRTEL	540.00	3.25
INDUSIND BANK	1698.20	3.13
DR. REDDYS LAB	2473.40	2.60
LUPIN	900.15	2.51

గ్రహణం (-)

నిఫ్టీ	5న	మార్పు%
BHARTI INFRATEL	372.60	-1.70
HINDALCO	276.40	-1.22
UPL	774.20	-0.95
HPCL	415.00	-0.92
INDIAN OIL CORP	383.85	-0.89
BPCL	487.70	-0.77
SBI	306.35	-0.70

KARNATA BANK 157.70 (155.45) 5646084
KEC INTL LTD 373.50 (372.75) 382564
KOLTE PATIL 372.70 (357.50) 757601
KPIT CUMMINS 202.25 (203.80) 2096910
L&TFIN.HOLD 175.15 (172.40) 4094056
LAK VIL BANK 148.60 (148.20) 593215
M & M FINANC 484.30 (478.75) 2175919
MANAPPURAM G 120.00 (119.80) 4135304
MMTC LIMITED 70.85 (71.20) 2201857
MOSER-BEAR 6.10 (5.70) 5161071
MPHASIS LTD 714.00 (715.85) 107123
MRPL 128.55 (128.20) 1124339
MTNL 28.95 (29.35) 3800327
NAGARJUNA OI 4.60 (4.80) 1492845
NCC LIMITED 132.05 (132.65) 4058801
NETWORK18 FI 60.60 (60.25) 5203993
NEULAND LAB 845.65 (868.60) 58947
NIIT LTD 111.85 (104.60) 4157579
NIIT TECHNOL 669.50 (653.15) 424659
OMAXE LTD 228.80 (228.30) 577441
ONMOBILE GLO 62.50 (64.10) 603602
ORIENT PAPER 163.45 (153.80) 3191591
ORIENTALBANK 124.30 (124.00) 2225337
PARSVNATH DE 29.00 (29.65) 424715
PATEL ENGG 83.15 (83.70) 1666252
PFIZER 2049.50 (2040.75) 14299
POLARIS SOFT 394.85 (385.70) 177535
POWERTRADING 119.75 (120.40) 1171852
PRAJ IND 122.85 (120.15) 8619699
PRISM CEMENT 134.90 (120.85) 4453504
PUNJ LLOYD 26.50 (26.15) 4640057
PUNJAB & SIN 50.05 (50.10) 118721
PURAVANKARA 163.05 (163.90) 347098
PVP VENTURES 8.15 (7.80) 733459
PVR LIMITED 1419.00 (1399.00) 305612
RADICO KHAIT 319.10 (308.00) 4396180
RAJESH EXPOR 820.55 (847.75) 784342
RALLIS INDIA 274.65 (274.55) 620881
RAMCO IND 297.30 (291.55) 167059
RAMCO SYS 541.00 (558.35) 91046
RAMKY INFRA 226.20 (223.70) 195781
RAYMOND 1109.50 (1097.30) 632508
RELIANCE CAP 600.80 (596.35) 6704346
RELIANCE COM 34.00 (33.30) 423033249
RELIANCE INF 578.15 (565.55) 4467467
RELIANCE POW 58.70 (58.45) 28059455
ROLTA INDIA 78.90 (77.65) 7087331
SAGAR CEMENT 1083.45 (1099.50) 116163
SAREGAMA 832.70 (840.25) 100030
SHANTHI GEAR 167.55 (160.45) 810594
SHIPPNG CORP 96.25 (96.50) 1719588
SHREE RENUKA 16.90 (17.10) 2968594
SINTEX IND 27.00 (26.60) 6580426
SOBHA DEVELO 605.55 (610.00) 279488
SOUTHINDBANK 32.90 (31.30) 26131714
SRS LIMITED 1.70 (1.65) 3032526
STERLITE TEC 341.00 (335.10) 4467126
SUN PHARMA 508.15 (509.60) 227451
SUND FASTNER 566.05 (569.20) 127650
SUZLON ENERG 15.55 (15.80) 40521579
SYND. BANK 79.50 (80.65) 2862032
TATA CHEM 757.60 (754.40) 844578
TATA COFFEE 167.70 (166.00) 1379031
TATA COMMUN 672.20 (674.70) 447487
TATA GLOBAL 312.95 (312.25) 1896601
TATA METALIK 849.35 (855.80) 144140
TATA MOT DVR 253.70 (255.00) 2139946
THE INDIAN H 132.80 (125.90) 3416479
TORRENT POWE 280.45 (280.60) 1060647
TRIVENI ENGG 77.85 (77.55) 422139
TTK PRESTIGE 8042.40 (7718.45) 18475
TV TODAY NET 429.55 (429.00) 78760
TV18 BROADCA 63.60 (60.00) 14813244
TVS MOTOR 766.95 (766.55) 472957
UCO BANK 32.80 (33.30) 1980612
UNION BANK 145.30 (147.50) 3766980
UNITECH 9.95 (9.50) 189709284
UNITED BANK 18.45 (18.55) 1434419
UNITED BREWE 1151.35 (1078.85) 1422783
USHA MARTIN 25.35 (25.55) 2789576
VADILAL INDU 972.55 (982.05) 15418
VENKYS 2731.75 (2716.45) 42619
V-GUARD IND 237.85 (235.35) 1754856
VIJAYA BANK 68.00 (67.95) 2094100
VIP 352.05 (360.75) 992091
VOLTAS 646.35 (645.70) 1027065
ZEE LEARN LI 45.15 (45.75) 314549
ZUARI GLOBAL 246.70 (246.50) 67339
ZYDUS WELLNE 1033.95 (1003.05) 13712

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 9.25 (7.71) 188418
ALPHAGEO 931.90 (928.85) 5685
AMAR RAJA BA 862.30 (839.85) 40063
ANDHRA BANK 58.65 (59.45) 209443
ANDHRA CEMEN 14.54 (13.98) 252011
ANDHRA PAPER 346.55 (332.45) 72438
ANDHRA PETRO 64.25 (61.20) 156981
ANDHRA SUGAR 551.25 (521.30) 8760
ANJANI PORTL 266.05 (247.80) 14970
ASTRA MICROW 121.30 (118.90) 81318
AUROBINDO PH 671.10 (668.65) 94188
AVANTI FEEDS 2694.10 (2547.85) 24922
AVON ORG 17.10 (17.10) 46608
BALAJI AMIN 660.45 (618.85) 39958
BARTRONICS 16.71 (15.92) 120120
BHAGIRA CHEM 357.85 (345.95) 16381
BHAGYA NAG 50.70 (51.85) 23896
BN RATHI SEC 53 (54.05) 18281
BRILLIANT SE 13.46 (12.82) 809325
CONT COFFEE 302.75 (299.80) 8619
COROMAN FERT 568 (576.10) 7436
CYIENT LIMIT 576.40 (575.90) 122639
DECCAN CEMEN 644.45 (602.65) 14391
DIVI'S LAB 1105.15 (1103.15) 19494
DIVYA GRANIT 111.45 (106.15) 3305
DR REDDY 2467.35 (2409.50) 70815
GATI CORPN 138.85 (137.10) 302838
GAYATRI PROJ 214.95 (212.75) 67975
GMR INFRASTR 21.25 (21.15) 3360277
GOLDST INFRA 209.05 (205.85) 44704
GRANULES (I) 139.35 (134.90) 234268
GVK POWER 20.10 (20.10) 1148405
HBL NIFE POW 73.50 (72.80) 194685
HERITAGE FOO 830.95 (825.20) 2066
HYD INDUS 1608.05 (1594.30) 2855
IDL INDUSTRS 587.75 (603.35) 1636
INNAREDY COM 4.98 (4.90) 265929
IVRCL INFRAS 6.19 (6.51) 785335
KAKATIYA CEM 413.25 (402.10) 38991
KAVERI SEED 538.85 (534.55) 82234
KCP LTD 157.95 (161.35) 107166
KNR CONSTRUC 313.30 (309.20) 20314
LANCO INDUS 401.30 (403.25) 28501
LANCO INFRAT 1.70 (1.62) 1800985
LAURUS LABS 551.40 (542.85) 20213
MADHUCON PRO 36.85 (36.85) 45733
MIC ELECTRON 9.38 (9.41) 109955
MOLD-TEK.TEC 76.65 (74.50) 6354
MOLDTK PLA 327.50 (332.65) 5655
NAGARJAGRICH 63.90 (64) 103163
NATCO PHARMA 998.90 (974.15) 35668
NAVA BH VENT 172.80 (171.70) 247919
NCC 131.90 (132.60) 405370
NCL IND 278 (282.05) 26555
NETTLINX 88.55 (84.25) 29862
NEULAND LAB 845.40 (869.55) 12436
NIHAR INFO 13.60 (14.01) 560
OIL COUNTRY 62.25 (62.30) 73747
PANYAM CEMEN 65.60 (62.75) 128707
PENNER IND 76.70 (68.45) 1551380
PIONEER DIST 218.90 (201.70) 24597
PITTI LAMIN 103.75 (103.55) 19891
POKARNA 247.60 (221.65) 121127
PREMIER EXPL 446.90 (462.80) 1864
PRISM CEMENT 135.40 (120.95) 505502
PRUDENTL PHA 6.10 (6.04) 536901
RAIN INDUSTR 421.20 (431.85) 555425
SAGAR CEM 1095.80 (1104.50) 18847
SAMPRE NUTRI 87.60 (87.45) 43284
SATVAH. ISPA 37.25 (35.35) 132393
SMS PHARMA 100.20 (101.40) 23695
SREE RAYAL A 82.45 (80.60) 635800
SRINIVASA SH 92.50 (93.65) 57470
STEEL EXCHAN 43.95 (46.25) 17095
SUJANA METAL 1.69 (1.73) 36810
SUJANA UNIVE 0.93 (0.89) 703603
SURYALAKSH.C 107.50 (97.15) 106824
SUVEN PHARMA 215.10 (215.30) 134016
TAJ GVK HOTE 181.35 (180.50) 6970
TANLA 41.20 (41.20) 192706
TERA SOFTWAR 70.90 (70.25) 23801
VICEROY HOTE 20.40 (19.75) 319115
VIMTA LABS 173.25 (172.80) 5127
VISAKA IND 755.70 (774.40) 60685
VIVIMED LABS 105.95 (104.45) 202556
YBRANT DIGIT 5.99 (5.84) 2513738
ZENTECH 153.60 (152.15) 114668

గాయాలను మాన్చుకునే రోబోలు!



వాషింగ్టన్: గాయాలను స్వయంగా మాన్చుకునే కొత్త తరం రోబోల సృష్టికి బాటలు పడుతున్నాయి. మనుషుల కండరాల తరహాలో పనిచేసే మెత్తటి పరికరాలను అమెరికాలోని కొలరాడో విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. హైడ్రాలికల్లీ ఆంప్లిఫయిడ్ సెల్ఫ్-హీలింగ్ ఎలక్ట్రోస్టాటిక్ (హేసెల్) ఆక్చ్యుయేటర్లుగా వీటికి వారు పేరుపెట్టారు. చవకైన పదార్థాలతోనే తయారయ్యే ఇవి ఎలక్ట్రికల్ డ్యామేజీలను తమకు తాముగా నయం చేసుకోగలవని పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త పరికరాలు అందుబాటులోకి వస్తే.. ఇక రోబోల్లో కదలికలు, చర్యల కోసం మోటార్లు, పిస్టన్లు బిగించాల్సిన అవసరం ఉండదు. సున్నితమైన వస్తువులను పట్టుకోవడం నుంచి పెద్ద పెద్ద బరువులను ఎత్తడం లాంటి భిన్నమైన పనులను కూడా ఈ ఆక్చ్యుయేటర్లు చేసేస్తాయి. భిన్న రకాల కదలికలను ప్రదర్శించగల ఈ హేసెల్ ఆక్చ్యుయేటర్లు.. సామర్థ్యం, వేగం, మన్నికలో మానవుల కండరాల కన్నా మెరుగ్గా ఉంటాయని పరిశోధకులు తెలిపారు.

పగడపు దిబ్బలకు భూతాపం దెబ్బ!



మెల్‌బోర్న్: భూతాపం పెరిగిపోతుండటంతో సముద్రాల్లోని పగడపు దిబ్బలకు ముప్పు పొంచిఉన్నట్లు తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. సముద్రజలాలు వేడెక్కిపోతుండటంతో వీటిని తయారుచేసే జీవులకు రక్షణగా నిలిచే కవాటాలు క్రమేపీ మూసుకుపోతున్నట్లు తెలిపింది. జలాలు ఒక స్థాయికి వేడెక్కినప్పుడల్లా ప్రకృతిపరంగా పగడపు దిబ్బలు తెల్లబారిపోయే ప్రక్రియ (కోరల్ బ్లీచింగ్) జరుగుతుంటుంది. ఉష్ణ మండల ప్రాంతాల్లో - 1980లకు ముందు ఒక్కో 'బ్లీచింగ్'కు మధ్య 25-30 ఏళ్ల విరామం ఉండగా.. 2010 తర్వాత అది ఆరేళ్లకు తగ్గిపోయినట్లు ఆస్ట్రేలియాలోని పగడపు అధ్యయన సంస్థ డైరెక్టర్ టెర్రీ హ్యూజెస్ తెలిపారు. ఈ ప్రక్రియలు పెరిగే కొద్దీ పగడపు జీవులు చనిపోయి.. దిబ్బలు (రీఫ్‌లు) నాశనమవుతాయని, అవి మళ్లీ తయారు కావడానికి కనీసం దశాబ్దకాలం పడుతుందని శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. ఎల్‌నినోలు వేగంగా తయారవుతుండటంతో గత 50ఏళ్లుగా వాతావరణం వేడెక్కుతోందని.. ఇవి పగడాలకు ప్రమాదకరంగా మారినట్లు అమెరికాకు చెందిన శాస్త్రవేత్త సీ మార్క్ ఎయాకిన్ తెలిపారు. ఇలా ఆస్ట్రేలియా (క్వీన్స్‌లాండ్)లోని గ్రేట్ బేరియర్ రీఫ్ 1998 నుంచి 4సార్లు బ్లీచింగ్‌కు గురైనట్లు వెల్లడించారు.

8 గంటల నిద్ర లేకపోతే కుంగుబాటు!



న్యూయార్క్: రాత్రుళ్లు తగినంతగా నిద్రించకపోతే ఆరోగ్యపరంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. రాత్రిపూట 8 గంటల కంటే తక్కువ సమయం నిద్రించే వ్యక్తులు కుంగుబాటుకు గురయ్యే ముప్పుందని వెల్లడించింది. చిన్నచిన్న విషయాలకే బాధపడటం, ప్రతికూల ఘటనలను పదేపదే తల్చుకోవడం వంటి లక్షణాలు కాస్త ఎక్కువగా ఉన్న వ్యక్తులపై అమెరికాలోని బింఘామ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తాజా అధ్యయనం నిర్వహించారు. వారు ఎప్పుడు నిద్రిస్తున్నారు? ఎంతసేపు నిద్రిస్తున్నారు? వంటి అంశాలను తెలుసుకున్నారు. అనంతరం భావోద్వేగాలను రేకెత్తించే చిత్రపటాలను చూపించి.. వారి ఏకాగ్రతను పరిశీలించారు. రాత్రుళ్లు 8 గంటలకంటే తక్కువ సమయం నిద్రిస్తున్న వ్యక్తులు ప్రతికూల చిత్రపటాలు, ఆలోచనల నుంచి బయటపడలేకపోతున్నట్లు గుర్తించారు. ఈ ధోరణి వారిలో కుంగుబాటుకు కారణమయ్యే ముప్పుందని పేర్కొన్నారు. 8 గంటల నిద్ర ఉన్నవారు ప్రతికూల ఆలోచనల నుంచి తమ దృష్టిని మళ్లించగలుగుతున్నట్లు తెలిపారు.

..ఆ గర్భనిరోధక ఔషధంతో పెరుగుతున్న హెచ్ఐవీ ముప్పు!



జొహాన్స్‌బర్గ్: గర్భనిరోధక సాధనంగా ఉపయోగించే ఓ ఔషధం మహిళల్లో హెచ్ఐవీ సోకే ముప్పును పెంచుతున్నట్లు తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో 'డిపాట్-మెడ్రాక్సీ ప్రొజెస్టిరాన్ అసిటేట్(డీఎంపీఏ)' అనే ఔషధాన్ని గర్భనిరోధక సాధనంగా ఎక్కువగా వినియోగిస్తుంటారు. దాన్ని 3 నెలలకు ఒకసారి సూదిమందు రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ ఔషధాన్ని ఉపయోగించే మహిళల్లో హెచ్ఐవీ సోకే ముప్పు 40 శాతం పెరుగుతున్నట్లు దక్షిణాఫ్రికా పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఇందుకు స్పష్టమైన కారణాలను మాత్రం వారు వెల్లడించలేదు. రోగ నిరోధక వ్యవస్థను కాస్త క్రియారహితం చేయడం, జననాంగం వద్ద రక్షణ పొరను ప్రభావరహితంగా మార్చడం ద్వారా హెచ్ఐవీ సోకే ముప్పును డీఎంపీఏ పెంచుతుండొచ్చని అభిప్రాయపడ్డారు. డీఎంపీఏలకు బదులుగా ఇతర గర్భనిరోధక సాధనాలను ఉపయోగించడం మేలని సూచించారు.

అమ్మాయిల్లో ఆటిజం గుర్తించడం కష్టమే!



న్యూయార్క్: అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో ఆటిజంను తొలిదశల్లో గుర్తించడం కష్టమని తాజా అధ్యయనమొకటి తెలిపింది. నలుగురితో కలివిడిగా ఉండటం, వేషధారణ వంటి సామాజికపరమైన అంశాల్లో అమ్మాయిలు కాస్త ఎక్కువగా ఇబ్బంది పడుతుండటమే ఇందుకు కారణమని వెల్లడించింది. పాఠశాల విద్యనభ్యసిస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలపై తాము తాజా పరిశోధన నిర్వహించినట్లు అమెరికాలోని 'ఆటిజం స్పెక్ట్రం రుగ్మతల పరిశోధక కేంద్రం' శాస్త్రవేత్త అల్లిసన్ రట్టో తెలిపారు. ఆటిజం లక్షణాలు అమ్మాయిలు, అబ్బాయిల్లో వేర్వేరుగా ఉండే అవకాశముందన్న వాదనను తమ అధ్యయన ఫలితాలు బలపరిచినట్లు చెప్పారు. ఆటిజంతో బాధపడుతున్న అబ్బాయిలతో పోలిస్తే.. అమ్మాయిలు(ఆటిజం ఉన్నవారు) రోజువారీ పనులు చేసుకోవడంలో ఎక్కువ ఇబ్బంది పడుతున్నట్లు తాము గుర్తించామన్నారు. కాబట్టి అబ్బాయిలకు చేసే పరీక్షలతోనే అమ్మాయిల్లోనూ ఆటిజంను గుర్తించడం సులువు కాదని అభిప్రాయపడ్డారు. ఆటిజం లక్షణాలు లింగంపై కూడా ఆధారపడి ఉంటాయని గుర్తించిన తొలి అధ్యయనం ఇదే కావడం గమనార్హం.

జీవిత భాగస్వామి పరిమళంతో ఒత్తిడి చిత్తు!



టొరంటో: ఒత్తిడిలో ఉన్నప్పుడు జీవిత భాగస్వామి సువాసన కూడా ఓ ఔషధంగా పనిచేస్తుందని కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ పరిశోధకుల తాజా అధ్యయనం తేల్చింది. భాగస్వామి పక్కన లేకున్నా.. వారి చొక్కాల నుంచి వచ్చే పరిమళమూ ఒత్తిడిని చిత్తు చేసేందుకు దోహదపడుతుందని గుర్తించింది. తాజా పరిశోధనల్లో భాగంగా కొంతమంది పురుషులను ఎంచుకొని.. వారు 24 గంటలపాటు టీషర్ట్ ధరించేలా చూశారు. వారు వాసన సంబంధిత ఉత్పత్తులేవీ వినియోగించకుండా, పొగ తాగకుండా జాగ్రత్త పడ్డారు. అనంతరం వారి వాసన టీషర్టుల్లో ఇమిడిపోయేలా ప్రత్యేక పరిస్థితుల్లో నిల్వ ఉంచారు. తర్వాత సదరు వ్యక్తుల జీవిత భాగస్వాములను పిలిపించి.. క్రమరహిత పద్ధతిలో వారికి టీషర్టులను అందజేశారు. వాటి వాసన చూపించారు. ఆపై వారిలో ఒత్తిడి పెంచేలా ముఖాముఖీలు నిర్వహించి.. మరోసారి క్రమరహితంగా టీషర్టుల వాసన చూపించారు. అనంతరం మహిళలందరి లాలాజలాన్ని విశ్లేషించారు. ముఖాముఖి అనంతరం జీవిత భాగస్వామి టీషర్టును వాసన చూసిన మహిళల లాలాజలంలో ఒత్తిడిని సూచించే కార్టిసాల్ హార్మోన్ తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. భాగస్వామి కాకుండా ఇతరుల దుస్తుల వాసన పీల్చినవారిలో కార్టిసాల్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఘ్రాణశక్తి కాస్త ఎక్కువగా ఉంటుందని.. అందుకే తమ పరిశోధనలో మహిళలే భాగస్వామి చొక్కాల వాసన పీల్చేలా చూశామని పరిశోధకులు తెలిపారు.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్!

- **ఈ నెల 29 నుంచి పార్లమెంటు సమావేశాలు**

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని శుక్రవారం భేటీ అయిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సిఫార్సు చేసింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ నెల 29న పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారని, అదే రోజు ఆర్థిక సర్వే సభ ముందుకు వస్తుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ వెల్లడించారు. తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతాయి. కొంత విరామం తర్వాత మార్చి 5 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు రెండో విడత బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. సమావేశాలపై కేబినెట్ కమిటీ సిఫార్సులను రాష్ట్రపతికి పంపిస్తారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి.

తలాక్ బిల్లుపై ఏకాభిప్రాయ సాధనకు యత్నం

శీతాకాల సమావేశాలు 13 పని దినాల పాటే కొనసాగినప్పటికీ అర్థవంతంగా జరిగాయని కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ వైఖరి వల్లే ముమ్మారు తలాక్ బిల్లుకు ఆటంకం ఎదురైందని విమర్శించారు. ఈ బిల్లుకు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందేలా చూడడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అనంత్‌కుమార్ స్పష్టం చేశారు. మహిళా సాధికారికత గురించి ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మాట్లాడతారని, కానీ దీనిపై చర్యకు ఉపక్రమించేటప్పటికి పారిపోతారని విమర్శించారు. తలాక్ బిల్లును సెలెక్టు కమిటీకి పంపించాలంటూ రాజ్యసభలో కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజైన 29న పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల తొలి దశలోనే బిల్లు ఆమోదం పొందేలా చూస్తామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఏకాభిప్రాయ సాధనకు యత్నిస్తామని, అత్యవసర ఆదేశాన్ని తీసుకురాకపోవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి.

లోక్‌సభలో 12 బిల్లుల ఆమోదం

శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో తలాక్ సహా 12 బిల్లులు ఆమోదం పొందాయి. మొత్తం 61 గంటల 48 నిమిషాల పాటు సమావేశాలు జరగగా, 15 గంటల సమయం వృథా అయింది. ఈ సమావేశాల్లో రాజ్యసభ 9 బిల్లులను ఆమోదించింది.

మన్మోహన్‌తో మోదీ ఆత్మీయ కరచాలనం

రాజ్యసభలో శుక్రవారం అపురూప దృశ్యం ఆవిష్కృతమయింది. ప్రధాని మోదీ.. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వద్దకు వెళ్లి ఆయనతో కరచాలనం చేశారు. కొద్దిసేపు ముచ్చటించారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా ఇరువురూ వాగ్బాణాలు విసురుకోవడం విదితమే. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ వెంకయ్య నాయుడు ప్రకటించిన అనంతరం ఈ సన్నివేశం చోటుచేసుకుంది. డిప్యూటీ ఛైర్మన్ కురియన్, కాంగ్రెస్ నేత కరణ్‌సింగ్‌ల వద్దకు కూడా వెళ్లి మోదీ కరచాలనం చేశారు. పదవీ విరమణ చేసిన కరణ్‌సింగ్, జనార్దన్ ద్వివేదీ, పర్వేజ్ హష్మీలకు రాజ్యసభ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు.



పాత చిత్రం

పాక్‌కు రూ.7,290 కోట్ల సాయం నిలిపివేత

అమెరికా ప్రభుత్వం నిర్ణయం

వాషింగ్టన్: ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడం లేదన్న కారణంతో పాకిస్థాన్‌కు ఏటా ఇచ్చే 1.15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7,290 కోట్లు) భద్రత సాయాన్ని అమెరికా ప్రభుత్వం శుక్రవారం నిలిపివేసింది. ఇందులో 2016 సంవత్సరానికి కాంగ్రెస్ ఆమోదించిన 255 మిలియన్ డాలర్ల (రూ.1,616 కోట్లు) విదేశీ మిలటరీ నిధులు (ఫారిన్ మిలటరీ ఫండింగ్- ఎఫ్ఎంఎఫ్) కూడా ఉన్నాయి. ఇదికాకుండా రక్షణ శాఖ సంకీర్ణ మద్దతు నిధుల (కొయిలేషన్ సపోర్ట్ ఫండ్స్ -సీఎస్ఎఫ్) కింద 2017 సంవత్సరానికి కేటాయించిన మొత్తం 900 మిలియన్ డాలర్లను, ముందు సంవత్సరాల్లో ఖర్చుకాకుండా మిగిలిన నిధులను కూడా రద్దు చేసింది. 'పాకిస్థాన్ ప్రభుత్వం అఫ్గాన్ తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ గ్రూపులపై కచ్చితమైన చర్యలు తీసుకొనే వరకు ఆ దేశానికి కేటాయించిన జాతీయ భద్రత సహాయాన్ని రద్దు చేస్తున్నట్టు ధ్రువీకరిస్తున్నామ"ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హీథర్ నౌవెర్ట్ విలేకరులకు తెలిపారు.

కాల్పుల విరమణను మరోసారి ఉల్లంఘించిన పాక్

జమ్ము: కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ మరోసారి ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణరేఖ వెంబడి.. తేలికపాటి, స్వయంచలిత ఆయుధాలతో పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. శుక్రవారం మధ్యాహ్నం ఇది చోటుచేసుకుందని.. భారతసేనలు దీటుగా స్పందించాయని పోలీసులు తెలిపారు.

ఆత్మావలోకనం చేసుకోండి

- **పార్లమెంట్ కార్యకలాపాలకు అంతరాయాలు కలిగించడం సరికాదు**
- **రాజ్యసభ సభ్యులకు ఛైర్మన్ వెంకయ్యనాయుడు సూచన**

దిల్లీ: అంతరాయాలతో రాజ్యసభ 34 గంటల సమయాన్ని కోల్పోయిందని, సభ్యులు తమ ప్రవర్తనపై ఆత్మావలోకనం చేసుకోవాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు సూచించారు. ఈ నెల 15న శీతాకాల సమావేశాలను ప్రారంభించిన రాజ్యసభ శుక్రవారం నిరవధికంగా వాయిదా పడింది. మధ్యాహ్నం ఒంటిగంటకు సభను వాయిదా వేసే ముందు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "సభ తన బాధ్యతలను చాలా వరకు నెరవేర్చినా కార్యకలాపాల సమయాన్ని గణనీయంగా నష్టపోవడం ద్వారా, అంతరాయాల కారణంగా ప్రజల గౌరవాన్ని కొంత వరకు కోల్పోయింది. లోతైన చర్చలు, విజ్ఞప్తులు ప్రజాస్వామ్యబద్ధమే అయినా అంతరాయాలు కలిగించడం మాత్రం సరికాదు. ఈ విషయమై సభ్యులు లోతుగా ఆత్మవిమర్శ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా." అని అన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడే సమయంలో ప్రధాని మోదీ సభలోనే ఉన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి పూర్తి సెషన్ ఇదేనని చెప్పారు. పార్లమెంట్ రాజకీయ సంస్థే అయినప్పటికీ రాజకీయాలకు కొనసాగింపు మాత్రం కాదని స్పష్టం చేశారు. దేశం ముందున్న సామాజిక-ఆర్థిక లక్ష్యాలను సాధించాల్సిన ముఖ్య సంస్థ అని చెప్పారు. పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఇది కీలకమన్నారు. ఈ సమావేశాల్లో మొత్తం 19 ప్రైవేటు బిల్లులను ప్రవేశపెట్టగా ఒక బిల్లుపై పూర్తి స్థాయి చర్చ జరిగిందని చెప్పారు. సభ మొత్తం 41 గంటల పాటు కార్యకలాపాలను నిర్వహించింది.



రాజ్యసభ కొత్త సంవత్సర కాలమానిని ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో కేంద్ర మంత్రి జైట్లీ, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ కురియన్

రాహుల్‌గాంధీపై సభా హక్కుల నోటీసుపై త్వరలో నిర్ణయం: రాహుల్‌గాంధీపై భాజపా ఎంపీ భూపేందర్ యాదవ్ ప్రతిపాదించిన సభాహక్కుల నోటీసుపై వీలయినంత త్వరలో నిర్ణయం తీసుకుంటానని వెంకయ్య తెలిపారు. అయితే ఈఅంశం లోక్‌సభ పరిధిలోకి వస్తుందని చెప్పారు. రాజ్యసభాపక్ష నేత, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై రాహుల్ దురుద్దేశపూర్వకంగా ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారని పేర్కొంటూ భూపేందర్ గత నెల 28న 187వ నిబంధన కింద నోటీసు ఇచ్చారు.

ఉత్తర కొరియా 'భస్మాసుర క్షిపణి'!

- **సొంత నగరంపైనే కూలిన అస్త్రం**

లండన్: ఉత్తర కొరియాకు చెందిన క్షిపణి ఒకటి. . ప్రయోగించిన కొద్దిసేపటికే విఫలమై, ఆ దేశంలోని ఒక నగరాన్ని తాకినట్లు వార్తలు వచ్చాయి. గత ఏడాది ఏప్రిల్ 28న ఈ ఘటన జరిగింది. నాడు హ్వాసాంగ్-12 అనే మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా పరీక్షించింది. అయితే అది మార్గమధ్యంలోనే విచ్ఛిన్నమై, టోక్‌చోన్ అనే నగరంపై పడిందని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఆ నగరంలో 2 లక్షల మంది జనాభా ఉంటోంది. అక్కడి పారిశ్రామిక లేదా వ్యవసాయ భవన సముదాయాన్ని తాకి క్షిపణి విస్ఫోటం చెందినట్లు విశ్లేషిస్తున్నారు. అమెరికా నిఘా వర్గాల సమాచారం, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చినట్లు ఆ కథనాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో ఎవరైనా మరణించారా అన్నది చెప్పలేమని పేర్కొన్నాయి. ఉత్తర కొరియా ప్రభుత్వ గోప్యతే ఇందుకు కారణమని వివరించాయి. క్షిపణి పరీక్షలు జరిపేటప్పుడు ముందస్తు హెచ్చరికలు చేసే అలవాటు ఆ దేశానికి లేదు. ఫలితంగా పొరుగునున్న దేశాలకు అది సాధారణ పరీక్షా లేక తమపై దాడి చేస్తున్నారా అన్నది అర్థం కాదు.

లోక్‌పాల్‌పై కేంద్రానిది అంతులేని జాప్యం: రాహుల్

దిల్లీ: లోక్‌పాల్ నియామకం విషయంలో మోదీ సర్కారు అంతులేని జాప్యం చేస్తోందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం విమర్శించారు. లోక్‌పాల్‌కు సంబంధించిన చట్టాన్ని చేసిన నాలుగేళ్ల తర్వాత కూడా ఇంతవరకూ నియామకం ఊసే లేదని ఆయన పేర్కొన్నారు. ఎన్నాళ్ల పాటు ఈ బూటకపు బాకా ఊదుతారంటూ తీవ్రంగా ప్రశ్నించారు. ఇంతకీ...'ప్రజాస్వామ్య పరిరక్షకులు'....జవాబుదారీ తనానికి వైతాళికులుగా చెప్పుకునే వారు ఆలకిస్తున్నారా? అంటూ ట్వీట్ చేశారు

లాలూకు శిక్ష ఖరారు నేడు

రాంచీ: దాణా కుంభకోణంలో దోషులుగా తేలిన ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, మరో 10 మందికి సీబీఐ న్యాయస్థానం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శిక్షలను ఖరారు చేయనున్నట్లు ఆయన తరపు న్యాయవాది వెల్లడించారు. తనకు విధించబోయే శిక్షపై వాదనలు వినిపించేందుకు లాలూ, బిర్సాముండా కేంద్ర కారాగారం నుంచి దృశ్య శ్రవణ విధానం (వీడియో కాన్ఫరెన్స్)లో సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి శివపాల్‌సింగ్ ఎదుట హాజరయ్యారు. వయసు పైబడటంతో పాటు, అనారోగ్యం కారణంగా తనపై కనికరం చూపాలంటూ ఈ సందర్భంగా లాలూ న్యాయమూర్తికి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. కాగా దోషులందరి తరపు వాదనలు శుక్రవారం పూర్తయ్యాయి. లాలూకు 1-7 ఏళ్ల మధ్య జైలుశిక్ష పడే అవకాశం ఉందని న్యాయవాది తెలిపారు.


నవకల్పనలతో సత్వరాభివృద్ధి సాధించండి

- **115 వెనుకబడిన జిల్లాల కలెక్టర్లకు ప్రధాని మోదీ లక్ష్య నిర్దేశం**
- **అంబేడ్కర్ జయంతి నాటికి ఫలితాలు కనిపించాలంటూ మూడు నెలల గడువు విధింపు**

దిల్లీ

దేశంలో వెనుకబడిన ప్రాంతాలు శీఘ్రగతిన అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు సరికొత్త ఆలోచనలు చేసి వాటిని కార్యరూపంలోకి పెట్టాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి అయిన ఏప్రిల్ 14వ తేదీ నాటికి ఆ అభివృద్ధి ఫలాలు స్పష్టంగా కనిపించాలంటూ మూడు నెలల గడువును నిర్దేశించారు. శుక్రవారం దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో నిర్వహించిన 'అభిలషణీయ జిల్లాల రూపాంతరీకరణ' సదస్సులో 115 జిల్లాల కలెక్టర్లు, ఇన్‌ఛార్జి అధికారుల ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవటం ద్వారా శాశ్వత సంతృప్తిని పొందే అవకాశం ఈ జిల్లాల అధికారులకు లభించిందని తెలిపారు. ప్రగతి ఫలాలను అందుబాటులోకి తీసుకురావటం ద్వారా ఆశావాద, సానుకూల వాతావరణాన్ని సృష్టించాలని, ప్రజల ఆలోచనాధోరణిని మార్చటానికి విజయ గాథలు దోహదపడతాయని చెప్పారు. "ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని మనం జరుపుకుంటాం. నవకల్పనలతో అభివృద్ధికి దూరంగా ఉన్న జిల్లాల్లోని నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావటానికి ఈ మూడు నెలల సమయాన్ని సమర్పిద్దాం" అని మోదీ తెలిపారు. ఈ 115 జిల్లాలు సాధించే అభివృద్ధి నూతన భారతదేశ ఆవిష్కరణకు పునాది కావాలని ఆకాంక్షించారు. అత్యుత్తమ పనితీరు కనబరచిన జిల్లాను తాను స్వయంగా సందర్శిస్తానని వెల్లడించారు. ఒక ప్రాంతం వెనుకబడి ఉందంటే అక్కడి ప్రజలకు అన్యాయం జరిగినట్టేనని చెబుతూ ప్రాంతీయ అసమానతలకు దారితీసే పరిస్థితులకు అవకాశమివ్వరాదని స్పష్టం చేశారు. ప్రతికూల మనస్తత్వాల్లో మార్పు తీసుకురావాలంటే విజయాలను సజీవ సాక్ష్యాలుగా చూపాలని, అందుకు అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని చెప్పారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన అంబేడ్కర్ ఆశయాల్లో భాగంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కృషి జరగాలన్నారు. ప్రజల ఆకాంక్షలతో ప్రభుత్వ పథకాలు జతకలవాలని, ఒక్కసారి దేశ ప్రజలు నిర్ణయం తీసుకుంటే ఆ పని ఎంత కష్టమైనా సాధించి తీరుతారని మోదీ వివరించారు. జన్‌ధన్ ఖాతాల ప్రారంభం, మరుగుదొడ్ల నిర్మాణం, గ్రామాల విద్యుద్దీకరణ పథకాల విజయాన్ని ఆయన ఉదహరించారు. 2022నాటికి 'నూతన భారత' ఆవిష్కరణ అన్న మోదీ లక్ష్య సాధనలో భాగంగా సదస్సును నిర్వహించారు. 115 జిల్లాల్లో అభివృద్ధి పనుల సమన్వయం, పరిశీలన బాధ్యతలను కేంద్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులకు అప్పగించారు. వీరిలో అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శుల స్థాయి అధికారులున్నారు. అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి పౌష్టికాహారం, విద్య, మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, జలవనరులు, వామపక్ష తీవ్రవాద నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై దృశ్యరూపక వివరణ ఇచ్చారు.




దిల్లీలో కలెక్టర్ల సదస్సు సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రధాని మోదీ


ఆ పుస్తకంలో అన్నీ అసత్యాలే

ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తనపై వెలువడిన కొత్త పుస్తకాన్ని 'అసత్యాలమయం'గా అభివర్ణించారు. మరోవైపు.. దాని విడుదలను అడ్డుకోవడానికి ఆయన తరపు న్యాయవాదులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 'ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ద ట్రంప్ వైట్‌హౌస్' అనే ఈ పుస్తకాన్ని మైఖేల్ వుల్ఫ్ అనే రచయిత రాశారు. ఈ పుస్తకం రాయడం కోసం వైట్‌హౌస్‌లోకి వుల్ఫ్‌నకు అనుమతి ఇవ్వలేదని ట్రంప్.. ట్విటర్‌లో పేర్కొన్నారు. నిజానికి ఈ పుస్తకాన్ని రెండు రోజుల తర్వాత విడుదల కావాల్సి ఉంది. దాన్ని అడ్డుకునేందుకు ట్రంప్ న్యాయవాదులు విఫలయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఆ పుస్తకం విడుదల కార్యక్రమాన్ని ముందుకు జరిపారు. శుక్రవారమే విడుదల చేస్తున్నారు. "మీరు పుస్తకాన్ని రేపే కొని, చదవొచ్చు. అధ్యక్షుడికి కృతజ్ఞతలు" అని వుల్ఫ్ ట్విటర్‌లో ప్రతిస్పందించారు. ఈ పుస్తకంలో వుల్ఫ్.. ట్రంప్, ఆయన కుటుంబంపై తీవ్ర విమర్శలు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయంతో ట్రంప్.. అయోమయానికి గురైనట్లు చెప్పారు. ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆస్వాదించలేదని, వైట్‌హౌస్‌కు ఆయన భయపడ్డారని పేర్కొన్నారు. మరోవైపు అధ్యక్షుడు, ఆయన కుటుంబంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ వైట్‌హౌస్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బ్రానన్‌కు ట్రంప్ న్యాయవాది నోటీసులు పంపారు.



న్యూయార్క్‌లో అమ్మకానికి ఉంచిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ద ట్రంప్ వైట్‌హౌస్' పుస్తకాలు



గురువారం ఫ్లోరిడాలో నిర్వహించిన వేలంలో రూ.4.5 కోట్లు పలికిన 1880 నాటి నాలుగు డాలర్ల నాణెం ఇది

విమానంలో యువతికి లైంగిక వేధింపులు.. భారతీయుడి అరెస్టు

వాషింగ్టన్: విమానంలో పక్క సీటులో కూర్చున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన భారతీయుడిని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి లాస్‌వెగాస్ నుంచి డెట్రాయిట్ వెళ్తున్న విమానంలో ప్రభు రామమూర్తి అనే 34 ఏళ్ల వ్యక్తి తన భార్యతో కలిసి ప్రయాణిస్తున్నాడు. అతని పక్క సీటులోనే ఉన్న 22 ఏళ్ల యువతి తాను నిద్రిస్తున్న సమయంలో రామమూర్తి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడంటూ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. విమానం కిందకు దిగగానే పోలీసులు రామమూర్తిని అరెస్టు చేసి మిచిగాన్ కోర్టులో హాజరుపరిచారు. విమానంలో తాను నిద్ర మాత్ర వేసుకుని గాఢ నిద్రపోయానని, ఆ యువతే తన మోకాళ్లపై పడుకుందని చెప్పిన రామమూర్తి వాదనను జడ్జి విశ్వసించలేదు. నిందితుడు, అతని భార్య తాత్కాలిక వీసాపై అమెరికాలో ఉన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ బెయిల్ ఇచ్చేందుకు జడ్జి తిరస్కరించారు.

తెలివితక్కువ ప్రతిపాదన

- **వలసదారులు లేకుండా గొప్ప దేశంగా ఎలా అవతరిస్తుందని అమెరికా కాంగ్రెస్ శాసనకర్తల ప్రశ్న**

వాషింగ్టన్: హెచ్1-బి వీసా పొడిగింపును నియంత్రించాలన్న ట్రంప్ ప్రభుత్వ యోచనకు కొంత మంది అమెరికా శాసనకర్తలు, కొన్ని లాబీయింగ్ గ్రూపుల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. హెచ్1బి వీసా పొడిగింపు లేకుండా చేస్తే అమెరికాలో ప్రతిభావంతులు లేకుండా పోతారని వీరంతా హెచ్చరిస్తున్నారు. 'అమెరికా ఉత్పత్తులే కొనాలి-అమెరికా పౌరులనే నియమించుకోవాలి' అన్న ట్రంప్ విధానంలో భాగమైన ఈ ప్రతిపాదనను అంతర్గత భద్రతా విభాగం ఉన్నతాధికారులు రూపొందిస్తున్నారు. ఆయా రంగాల్లో అర్హత ఉన్న అమెరికా పౌరుల లభ్యత లేని పక్షంలో అత్యంత నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగులను అమెరికా కంపెనీలు నియమించుకోవడానికి తాత్కాలిక వీసాలను మంజూరు చేసే కార్యక్రమమే హెచ్1బి. ఈ వీసా ప్రాథమిక గడువు ముగిసినా గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు మరోసారి గడువు పెంచే అవకాశం ప్రస్తుతం ఉంది. అయితే ఈ గడువును పొడిగించకూడదని ట్రంప్ యంత్రాంగం ఇప్పుడు యోచిస్తోంది. గత జనవరిలో ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుంచి హెచ్1బిపై ఆయన యంత్రాంగం కఠిన నియంత్రణలు విధించడానికి కసరత్తు చేస్తూ వస్తోంది. "హెచ్1-బి వీసాదారులపై ఇంతటి కఠిన నియంత్రణలు విధించడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయి. అమెరికా సమాజంలో ప్రతిభావంతులు, అనుభవజ్ఞుల కొరత ఏర్పడుతుంది. మన ముఖ్య భాగస్వామి అయిన భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయి." అని డెమొక్రటిక్ పార్టీకి చెందిన ప్రముఖ శాసనకర్త తుల్సి గబార్డ్ స్పష్టం చేశారు. "ఈ ప్రతిపాదన కారణంగా భారత్‌కు చెందిన 5లక్షల మంది నుంచి 7,50,000 మంది వరకు వెనక్కు వెళ్లిపోవాల్సి రావచ్చు. వీరిలో చాలా మంది చిన్న చిన్న వ్యాపారాల యజమానులు, ఉద్యోగాల సృష్టికర్తలు. వీరంతా అమెరికా ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి, బలోపేతం చేయడానికి సహకరిస్తున్నారు. ఈ మేధో వలస కారణంగా నవ్య ఆవిష్కరణ పథం నిలిచిపోతుంది. 21వశతాబ్దపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మనం పోటీ పడే సామర్థ్యం తగ్గిపోతుంది." అని హెచ్చరించారు.

"ఇది తీవ్రంగా గందరగోళపరిచే అంశం. స్టెమ్ (విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, ఇంజినీరింగ్, గణితం) రంగాలకు వెన్నెముకగా నిలిచే లక్షల మంది నైపుణ్య సిబ్బందిని వెనక్కి పంపించడం వల్ల అమెరికా ఫస్ట్ అజెండా ఏ విధంగా ముందుకెళ్తుంది?" అని హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్)కు చెందిన శుక్లా ప్రశ్నించారు. స్థానికులకు ఆధునిక శిక్షణ ఇవ్వడాన్ని మెరుగుపర్చడంపై ప్రాధాన్యం కొనసాగించాలని అయితే హెచ్1బి వీసా పొడిగింపును నిలిపివేస్తే అమెరికా ఆర్థికవ్యవస్థను దెబ్బకొట్టడమేనని భారతీయ అమెరికన్ శాసనకర్త రాజా కృష్ణమూర్తి హెచ్చరించారు. అమెరికా కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టకుండా ఉద్యోగాలను మరింతగా విదేశాలకు తరలించేలా ప్రోత్సహించడమేనని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనను తక్షణం తిరస్కరిస్తారని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రతిపాదన వలసదారుల వ్యతిరేకమని మరో శాసనకర్త రో ఖన్నా అన్నారు. "నా తల్లిదండ్రులు గ్రీన్‌కార్డుపైనే ఇక్కడకు వచ్చారు. సుందర్‌పిచాయ్, ఎలన్ మస్క్, సత్య నాదెళ్ల కూడా అంతే. వలసదారులు, వారి పిల్లలకు అమెరికాలో స్థానం లేదని ట్రంప్ అంటున్నారు. అది తప్పు మాత్రమే కాదు. తెలివితక్కువతనం. మిస్టర్ ప్రెసిడెంట్... మేము లేకుండా అమెరికా నిజంగా గొప్పదిగా ఉంటుందా?" అని ఆయన ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

ఇమిగ్రేషన్ వాయిస్‌కు చెందిన అమన్ కపూర్ స్పందిస్తూ ఈ ప్రతిపాదన పూర్తిగా తప్పన్నారు. దీని వల్ల దాదాపు 15లక్షల మంది భారతీయులు మూకుమ్మడిగా వెనక్కు వెళ్లిపోవాల్సి వస్తుందని చెప్పారు.

ఛాంపియన్


భువనేశ్వర్ (4/87)

ఎగిసి పడ్డారు..!

వాళ్లిద్దరూ నిలబడితేనే..

టీమ్‌ఇండియా ముందు అతిపెద్ద సవాల్. దక్షిణాఫ్రికాకు ఆధిక్యం కోల్పోకూడదంటే ఇంకా 258 పరుగులు చేయాలి భారత్. చేతిలో ఉన్న వికెట్లు ఏడే. ఆందోళన కలిగించే విషయమేంటంటే ఇక మిగిలిన ప్రధాన బ్యాట్స్‌మన్ ఇద్దరే. సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడగల పుజారా ఒకవైపు.. వన్డేల్లో మేటి బ్యాట్స్‌మన్‌గా పేరొందినా ఇంకా టెస్టుల్లో నిరూపించుకునే పనిలో ఉన్న రోహిత్ మరోవైపు ఉన్నారు. పరిస్థితులను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్న దక్షిణాఫ్రికా పేసర్లు పేస్, బౌన్స్, స్వింగ్‌తో ఇప్పటికే సత్తా చాటారు. ఇంకా బంతిపై మెరుపు కూడా పోలేదు. రెండో రోజు ఉదయం వారి బౌలింగ్ మరింత ప్రమాదకరంగా మారొచ్చు. మరి భారత బ్యాట్స్‌మెన్ ఎలా కాచుకుంటారో..! నిలబడితే.. పరుగులు చేయడం కష్టమేం కాదని దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ నిరూపించారు. మరి మన బ్యాట్స్‌మెన్ ఏ మేరకు నిలుస్తారో చూడాలి.

దక్షిణాఫ్రికా 12/3..

భారత్ సత్తాకు అసలైన పరీక్షగా భావిస్తోన్న కఠిన సిరీస్‌లో ఇంత కంటే మంచి ఆరంభముంటుందా..? పేస్‌తో పంచ్ ఇద్దామనుకున్న ప్రత్యర్థికి ఇంతకంటే గొప్ప సమాధానముంటుందా..? భువనేశ్వర్ కుమార్ బంతిని అటూ ఇటూ స్వింగ్ చేస్తూ బ్యాట్స్‌మెన్‌ను వణికిస్తుంటే భారత అభిమాని మనసు సంతోషంతో ఉప్పొంగింది..! దక్షిణాఫ్రికా కాస్త కోలుకున్నా.. వారి గడ్డపై 286 పరుగులకే పడగొట్టామన్నా ఆనందం కనిపించింది..!

టీమ్‌ఇండియా 28/3

అభిమాని ముఖంలో ఉదయం ఎంత సంతోషం కనిపించిందో.. రోజు ముగిసేలోపు అంతకంటే ఎక్కువ ఆందోళన దర్శనమిచ్చింది! పేస్ పిచ్‌పై బౌలర్లు విజృంభించిన వేళ.. బ్యాట్స్‌మెన్ ఎప్పట్లానే తమ బలహీనతను భయపెట్టారు..! పిచ్ పేసూ, స్వింగుకు సహకరిస్తే.. నిలవలేని పాత అలవాటును ఇంకా మానలేదన్నట్టుగా.. ఇప్పటికే ముగ్గురు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మిగతావాళ్లు ఏం చేస్తారో..? తొలి రోజే ఆసక్తికర మలుపులు తిరిగిన కేప్‌టౌన్ టెస్టుపై పట్టు బిగించే జట్టేదో? ఏదైనా ఇప్పుడు బ్యాట్స్‌మెన్ చేతుల్లోనే..!

● సత్తాచాటిన భారత బౌలర్లు
● దక్షిణాఫ్రికా 286 ఆలౌట్

కేప్‌టౌన్

దక్షిణాఫ్రికా, భారత్ మధ్య ఫ్రీడం టెస్టు సిరీస్ అంచనాలకు తగ్గట్టే ఆసక్తికరంగా ఆరంభమైంది. తొలి టెస్టులో పేస్ అనుకూల పిచ్‌పై అనుకున్నట్లే రెండు జట్ల పేసర్లు సత్తా చాటారు. ఇటు భువనేశ్వర్ (4/87) స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థిని బెంబేలెత్తించగా.. అటు స్టెయిన్ (1/13) నేతృత్వంలోని దక్షిణాఫ్రికా పేస్ దళం నిప్పులు చెరిగే బంతులతో భారత బ్యాట్స్‌మెన్‌ను భయపెట్టింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను 286 (73.1 ఓవర్లు) పరుగులకే ముగించిన టీమ్‌ఇండియాకు ఆ ఆనందం అరగంటైనా నిలవలేదు. స్టెయిన్, ఫిలాండర్ (1/13), మోర్నీ మోర్కెల్ (1/0) తమ పేస్ ప్రతాపాన్ని రుచిచూపిస్తూ గంటలోనే ముగ్గురిని ఔట్ చేశారు. తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్ 28/3తో కష్టాల్లో పడింది. చెతేశ్వర్ పుజారా (5), రోహిత్ (0) క్రీజులో ఉన్నారు. నిలదొక్కుకుంటే ఈ పిచ్‌పై పరుగులు సాధించొచ్చని దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మెన్ డివిలియర్స్ (65; 84 బంతుల్లో; 11×4), డుప్లెసిస్ (62; 104 బంతుల్లో 12×4) ఇప్పటికే నిరూపించారు. మరి మన జట్టులో అలా నిలిచి పోరాడేవారెవరో..!

మెరుపులా..: ఇన్నింగ్స్ మూడో బంతికే వికెట్.. మూడో ఓవర్లో మరో వికెట్.. ఇంకో ఓవర్ గడిచిందో లేదో ఇంకో వికెట్.. తర్వాతి బ్యాట్స్‌మన్ ప్యాడ్స్ కట్టుకుని సిద్ధమయ్యేలోపు.. మైదానంలోని బ్యాట్స్‌మన్ అడుగులు పెవిలియన్ వైపు పడ్డాయి! టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకుని తప్పు చేశామేమో అని దక్షిణాఫ్రికా చింతించేలా చేశాడు భువనేశ్వర్. శుక్రవారం తొలి టెస్టు మొదటి రోజు భువనేశ్వర్ ధాటికి దక్షిణాఫ్రికా ఒక దశలో 12/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇన్నింగ్స్ మూడో బంతికి ఆఫ్‌స్టంప్ ఆవల ఊరించే బంతితో ఎల్గర్ (0)ను ఔట్ చేసిన అతడు.. ఆ తర్వాతి ఓవర్లో మరో ఓపెనర్ మార్‌క్రమ్ (5)ను పెవిలియన్ పంపాడు. ఒకే ఓవర్లో వరుస ఔట్ స్వింగర్లతో పరీక్షించిన అతడు ఓవర్ ఆఖరి బంతిని పదునైన ఇన్‌స్వింగర్‌తో మార్‌క్రమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఇక ఆ తర్వాతి ఓవర్లో దక్షిణాఫ్రికా ఆపద్బాంధవుడు హాషీమ్ ఆమ్లా (3)ను ఔట్ చేశాడు. ఆఫ్‌స్టంప్ ఆవల దూసుకెళ్తున్న బంతిని వేటాడి ఆమ్లా ఔటయ్యాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌కే జట్టులోని నాలుగు, ఐదో నంబర్ బ్యాట్స్‌మెన్ క్రీజుకి వచ్చేశారు. ఆ దశలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ నిలబడటమే కష్టంగా కనిపించింది.

తొందరపడి..: ఆరంభంలోనే మూడు వికెట్లు పడ్డప్పటికీ దక్షిణాఫ్రికా అతి జాగ్రత్తకు పోకుండా ఎదురుదాడి చేసి వేగంగా పరుగులు రాబట్టింది. ఒకవైపు భువనేశ్వర్ వికెట్లు తీస్తుంటే మిగతా బౌలర్లు క్రమశిక్షణ తప్పారు. ఓవర్‌పిచ్ బంతులు వేస్తూ.. లైన్ తప్పి.. ప్యాడ్‌లపై ఎక్కువగా బంతులు వేసేందుకు ప్రయత్నించి మూల్యం చెల్లించుకున్నారు. అరంగేట్ర బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా (1/73) పేలవ బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా స్కోరు బోర్డు శరవేగంగా సాగింది. షమి, పాండ్య కూడా గతి తప్పి బౌలింగ్ చేశారు. భారత బౌలర్ల తొందరపాటును బాగానే ఉపయోగించుకున్నారు డివిలియర్స్, డుప్లెసిస్. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత ఈ మధ్యనే టెస్టుల్లోని పునరాగమనం చేసిన డివిలియర్స్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. నాలుగో వికెట్‌కు డుప్లెసిస్‌తో కలిసి అతను 114 పరుగులు జోడించాడు. దీంతో లంచ్ సమయానికి దక్షిణాఫ్రికా 107/3తో ఫర్వాలేదనిపించింది. ఐతే విరామం తర్వాత గాడిన పడిన టీమ్‌ఇండియా పేసర్లు మళ్లీ విజృంభించారు. డివిలియర్స్‌ను ఔట్ చేసి బుమ్రా నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని విడదీయగా.. డుప్లెసిస్‌ను హార్దిక్ పాండ్య (1/53) ఔట్ చేశాడు. ఆ తర్వాత వేగంగా పరుగులు సాధించిన డికాక్ (40 బంతుల్లో 43).. భువనేశ్వర్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ సాహాకు చిక్కాడు. ఫిలాండర్ (23) వికెట్‌ను షమి (1/47) తీసుకున్నాడు. టీ విరామానికి దక్షిణాఫ్రికా 230/7తో నిలిచింది. టెయిలెండ్ బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేసే బాధ్యతను అశ్విన్ (2/21) తీసుకున్నాడు. మోర్కెల్ (2)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని అతడు దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు అతడు తెరదించాడు.

టపటపా: దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ త్వరగానే ముగిసింది.. వికెట్ కూడా పడకుండా భారత్ రోజును ముగిస్తే బాగుండని భారత అభిమానులు భావిస్తుంటే.. నిప్పులు చెరిగే బంతులతో బ్యాట్స్‌మెన్‌ను పరీక్షించారు దక్షిణాఫ్రికా పేసర్లు స్టెయిన్, ఫిలాండర్. ప్రశాంతంగా కనిపించిన విజయ్


మోర్కెల్ బౌలింగ్‌లో కోహ్లి(5) ఔట్

● బ్యాట్స్‌మెన్ విఫలం
● టీమ్‌ఇండియా 28/3

(1) మంచి బంతులను వదిలేస్తూ.. ప్రమాదకర బంతులను అడ్డుకుంటూ ఫర్వాలేదనిపించాడు. మరోవైపు ధావన్ (16; 13 బంతుల్లో 3×4) కాస్త ఇబ్బంది పడుతున్నా.. ఫోర్లతో స్కోరు బోర్డును కదిలించాడు. ఇలాగే ఓ గంట ఆడితే సరిపోయేది. ఐతే.. ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో ఆఫ్‌స్టంప్ ఆవల విసిరిన ఓ బంతిని కవర్‌డ్రైవ్ ఆడే ప్రయత్నంలో స్లిప్‌లో ఎల్గర్‌కు క్యాచ్ ఇచ్చాడు విజయ్. ఆ తర్వాతి ఓవర్లో ధావన్ ఔటయ్యాడు. స్టెయిన్ బౌలింగ్‌లో అతడికే సులభమైన క్యాచ్ ఇచ్చాడు. విరాట్ కోహ్లి (5) పదిహేను నిమిషాలు క్రీజులో ఉన్నాడంతే. ఆఫ్‌స్టంప్ ఆవల బంతులు ఎదుర్కొనే విషయంలో బలహీనతను ప్రదర్శిస్తూ.. మోర్కెల్ బంతిని ఆడబోయి వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు.

రహానె కాదు రోహిత్: జట్టు ఎంపికలో టీమ్‌ఇండియా రెండు ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకుంది. గత రికార్డులను పరిగణనలోకి తీసుకోని వ్యూహ బృందం.. ప్రస్తుతం ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేసింది. విదేశీ పిచ్‌లపై మంచి రికార్డు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఫామ్‌లో లేకపోవడంతో రహానెను పక్కన పెట్టారు. ఇటీవల సొంతగడ్డపై చక్కటి ఫామ్ కనబరిచిన రోహిత్‌ను ఎంచుకున్నారు. అలాగే పరిమిత ఓవర్ల క్రికెట్లో అద్భుతంగా రాణిస్తున్న బుమ్రా ఎంపిక ఆశ్చర్యపరిచింది. టెస్టుల్లో నిలకడగా రాణిస్తున్న ఉమేశ్, శ్రీలంకతో సిరీస్‌తో ఫామ్‌లోకి వచ్చిన ఇషాంత్‌లను కాదని.. అతడికి టెస్టుల్లో అరంగేట్రం చేసే అవకాశమిచ్చారు.

> **"అద్భుతంగా ఆరంభించాం. మధ్యలో పట్టు తప్పాం. ఇంకాస్త మెరుగ్గా బౌలింగ్ చేసి ఉండాల్సింది. 25 నుంచి 30 పరుగులు అధికంగా ఇచ్చామనిపిస్తోంది. దక్షిణాఫ్రికా పిచ్‌లు పెద్దగా స్వింగ్‌కు సహకరించవు. అందుకే సరైన లెంగ్త్‌లో బంతులు వేయడంపై దృష్టిసారించాను. ఆఫ్‌స్టంప్ ఆవల ఎలాంటి బ్యాట్స్‌మన్ అయినా ఇబ్బంది పడతాడు. ఆ బలహీనతను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించాను"**
> – భువనేశ్వర్ కుమార్

ఆట సాగిందిలా..

దక్షిణాఫ్రికా బ్యాటింగ్

లంచ్ వరకు
ఓవర్లు: 26
పరుగులు: 107
వికెట్లు: 3

లంచ్-టీ మధ్య..
ఓవర్లు: 27
పరుగులు: 123
వికెట్లు: 4

టీ తర్వాత..
ఓవర్లు: 20.1
పరుగులు: 56
వికెట్లు: 3

భారత్ బ్యాటింగ్
ఓవర్లు: 11
పరుగులు: 28
వికెట్లు: 3

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 0; మార్‌క్రం (ఎల్బీ) భువనేశ్వర్ 5; ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3; డివిలియర్స్ (బి) బుమ్రా 65; డుప్లెసిస్ (సి) సాహా (బి) పాండ్య 62; డికాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43; ఫిలాండర్ (సి) షమి 23; కేశవ్ మహారాజ్ రనౌట్ 35; రబాడ (సి) సాహా (బి) అశ్విన్ 26; స్టెయిన్ నాటౌట్ 16; మోర్నీ మోర్కెల్ (ఎల్బీ) (బి) అశ్విన్ 2; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం** (73.1 ఓవర్లలో ఆలౌట్) **286**

వికెట్ల పతనం: 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221, 8-258, 9-280

బౌలింగ్: భువనేశ్వర్ 19-4-87-4; షమి 16-6-47-1; బుమ్రా 19-1-73-1; పాండ్య 12-1-53-1; అశ్విన్ 7.1-1-21-2

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1; ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16; పుజారా బ్యాటింగ్ 5; కోహ్లి (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 5; రోహిత్ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (11 ఓవర్లలో 3 వికెట్లకు) **28**

వికెట్ల పతనం: 1-16, 2-18, 3-27

బౌలింగ్: ఫిలాండర్ 4-1-13-1; స్టెయిన్ 4-1-13-1; మోర్నీ మోర్కెల్ 2-2-0-1; రబాడ 1-0-1-0

ఆసీస్‌దే పైచేయి

● తొలి ఇన్నింగ్స్‌లో 193/2.. ఇంగ్లాండ్ 346
● యాషెస్ చివరి టెస్టు

సిడ్నీ: యాషెస్ సిరీస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం చలాయిస్తోంది. ఇంగ్లాండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకే పరిమితం చేసిన ఆసీస్.. అనంతరం బ్యాటింగ్ ఆరంభించి రెండో రోజు, శుక్రవారం ఆట ఆఖరుకు 193/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ డకౌటైనప్పటికీ.. వార్నర్ (56; 104 బంతుల్లో 6×4), ఖవాజా (91 బ్యాటింగ్; 204 బంతుల్లో 7×4, 1×6), స్టీవ్ స్మిత్ (44 బ్యాటింగ్; 88 బంతుల్లో 3×4) రాణించి ఆసీస్‌ను మంచి స్థితికి తీసుకెళ్లారు. ఖవాజా, స్మిత్ అభేద్యమైన మూడో వికెట్‌కు 107 పరుగులు జోడించారు. **స్మిత్ టెస్టుల్లో 6 వేల పరుగులు పూర్తి చేశాడు. అతడికిది 61వ టెస్టు. బ్రాడ్‌మన్ (45 టెస్టులు) తర్వాత టెస్టుల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయిని అందుకున్నది స్టీవెనే.** అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 233/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. ఇంకో 113 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది. మొయిన్ అలీ (30), కుర్రాన్ (39), బ్రాడ్ (39) పోరాడారు.


స్మిత్ (44 బ్యాటింగ్)

ఛాంప్స్ మహారాష్ట్ర, హిమాచల్

జాతీయ సీనియర్ కబడ్డీ

ఈనాడు, హైదరాబాద్: కాసాని కృష్ణ ముదిరాజ్ స్మారక జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్లు సర్వీసెస్, ఇండియన్ రైల్వేలకు చుక్కెదురైంది. తొలి మ్యాచ్ నుంచి చివరి పోరు వరకు స్ఫూర్తిమంతమైన ఆటతీరుతో రాణించిన మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్‌లు ఛాంపియన్లుగా నిలిచాయి. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల ఫైనల్లో మహారాష్ట్ర 34-29తో సర్వీసెస్‌పై విజయం సాధించింది. మహారాష్ట్ర సారథి రిషాంక్ జట్టును ముందుండి నడిపించాడు. సూపర్ రైడ్ సహా మొత్తం 18 పాయింట్లు కొల్లగొట్టి మహారాష్ట్రను విజేతగా నిలిపాడు. మహిళల ఫైనల్లో హిమాచల్‌ప్రదేశ్ 38-25తో ఇండియన్ రైల్వేపై గెలుపొందింది. అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జేఎస్ గహ్లోత్, భారత కబడ్డీ సమాఖ్య అధ్యక్షురాలు మృదుల్ బదౌరియా, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి, టోర్నీ కోశాధికారి వీరేశ్ కాసాని తదితరులు విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు అందజేశారు.



సెరెనా ఆడట్లేదు

మెల్‌బోర్న్: అమెరికన్ టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్‌ను ఏడాది విరామం తర్వాత మళ్లీ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో చూడబోతున్నామని ఉత్సాహంగా ఉన్న అభిమానులకు షాక్. త్వరలో ఆరంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆడట్లేదు. ఈ టోర్నీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు సెరెనా ప్రకటించింది. గర్భం దాల్చడం వల్ల నిరుడు ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత సెరెనా ఆటకు దూరమైంది. బిడ్డకు జన్మనిచ్చిన నాలుగు నెలలకే.. గత నెల చివరి వారంలో ఆమె మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టింది. అబుదాబి ఓపెన్‌లో పోటీ పడింది. ఐతే ఆ టోర్నీ సందర్భంగా తన ఆట, శరీర స్థితి చూసుకున్నాక.. ఇంకొన్ని రోజులు విరామం అవసరమని ఆమె నిర్ణయించుకుంది. "అబుదాబిలో ఆడాక మళ్లీ ఆటలో కొనసాగే స్థితికి చేరువగా ఉన్నాననిపించింది కానీ నేను ఆశించిన స్థాయిలో మాత్రం కాదు. అందుకే నేను మరి కొంత సమయం తీసుకోవాలనుకుంటున్నా" అని సెరెనా చెప్పింది. పురుషుల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారుడు ఆండీ మర్రే కూడా ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

శేష్‌నారాయణపై వేటు

ఈనాడు, హైదరాబాద్: ఊహించినట్లే హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శి శేష్‌నారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. సెలెక్షన్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణలు.. ఎపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న కారణంతో శేష్‌నారాయణను సస్పెండ్ చేసినట్లు హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేకానంద్ శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. శేష్‌పై వచ్చిన ఆరోపణలపై అతనికి ఛార్జ్‌షీట్ ఇచ్చినట్లు చెప్పారు. శేష్ వ్యవహారంపై పూర్తి వివరాలతో హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ నర్సింహారెడ్డికి నివేదిక ఇచ్చినట్లు పేర్కొన్నారు. అంబుడ్స్‌మన్ ఆర్నెల్ల లోపు తన అభిప్రాయాన్ని హెచ్‌సీఏకు చెప్తారని వివరించారు. ఈలోపు ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులు రోజువారీ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో తెలంగాణ టీ20 లీగ్‌కు అద్భుతమైన స్పందన లభిస్తుందని వివేక్ తెలిపారు.

యాపిల్ లాంటి టమాటా..!

- ఇజ్రాయెల్ విత్తనాల ఆధారంగా కొత్త వంగడం అభివృద్ధి
- కొలిక్కి వచ్చిన ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలు
- ఏడాదిలో విపణిలోకి వచ్చే అవకాశం

ఈనాడు - హైదరాబాద్

యాపిల్ పండు పరిమాణంలో టామాటా కాస్తే ఎలా ఉంటుంది? ఒక్కో టమాటాను కనీసం 300 నుంచి 400 గ్రాముల బరువు తూగేలా పెంచడం సాధ్యమేనా? ఈ దిశగా గత కొంత కాలంగా పరిశోధనలు సాగిస్తున్న రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు మాత్రం ఇది సాధ్యమేనంటున్నారు. మరో ఏడాదిలో ఈ తరహా విత్తనాన్ని విపణిలోకి అందుబాటులోకి తెస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



కొండాలక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు పండించిన పెద్ద పరిమాణం టమాటా

మన దేశంలో పండే సంకర లేదా దేశవాళీ టమాటా సగటు బరువు 80 నుంచి 100 గ్రాములు మాత్రమే. ఇజ్రాయెల్‌లో పండే వాటి పరిమాణం సగటున 300 నుంచి 400 గ్రాముల వరకూ ఉంటుంది. అక్కడ హరిత పందిళ్లలో టామాటా సాగు చేస్తుండగా. మనం ఇప్పటికీ సంప్రదాయ పద్ధతుల్లోనే సాగుచేస్తూ వస్తున్నాం. దీనికి భిన్నంగా తెలంగాణ రాష్ట్రంలో పెద్ద పరిమాణం టామాటాలు పండించేందుకు అనువైన విత్తనాన్ని అభివృద్ధి చేసేందుకు కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు దాదాపు రెండేళ్ల నుంచి పరిశోధనలు సాగిస్తున్నారు.

పరిశోధన ఇలా..

ఇందులో భాగంగా ఇజ్రాయెల్ నుంచి 30 నుంచి 35 రకాల విత్తనాలు తెప్పించారు. అందులో పరిమాణానికి కారణమైన జన్యు పరమైన అంశాలను గుర్తించారు. వీటిని స్థానిక వంగడాలతో సంకరం చేసి సాగు చేయడం వల్ల మేధోహక్కుల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని భావించిన శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయం వైపు మొగ్గు చూపారు. ఇజ్రాయెల్ విత్తనంలోని జన్యు అనుకూలతలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్పు చేసి కొత్త విత్తనాలను సృష్టించారు. 'వాటిని ఇప్పటికే రెండు విడతల్లో పరీక్షలు చేయగా.. అనుకూల ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం తుది పరీక్షల్లో భాగంగా 30 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పండించేందుకు సిద్ధమవుతున్నాం. తద్వారా ఖరీఫ్, రబీలలో దిగుబడి ఎలా ఉంటుందో పరిశీలిస్తాం. ఈ ప్రక్రియ ఏడాదిలో పూర్తవుతుంది. తర్వాత విత్తనాలు అధికారికంగా విపణిలోకి విడుదల చేసే అవకాశం ఉంటుంది.' అని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

వాణిజ్య అవసరాలకు అనుగుణంగా..




పెద్ద పరిమాణంలో(300 నుంచి 400 గ్రాములు) ఉండే టమాటాలు వాణిజ్య అవసరాలకు బాగా ఉపయోగపడతాయి. చిప్స్, సాస్‌లు, పచ్చళ్ల తయారీ.. ఇతర వాణిజ్య అవసరాలకు వీటిని ఎక్కువగా వాడుకోవచ్చు. రైతులకు కూడా లాభసాటిగా ఉంటుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని మా బృందం చేస్తున్న పరిశోధనలు దాదాపు కొలిక్కి వచ్చాయి. మరో ఏడాదిలో రైతులకు విత్తనాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– సైదయ్య, సహాయ ప్రొఫెసర్, తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

సూర్యుడి కన్నా 200 రెట్లు భారీ తారలు

- పొరుగు గెలాక్సీలో పుష్కలంగా పెద్ద నక్షత్రాలు



లండన్: మన పాలపుంత నక్షత్ర మండలానికి పొరుగునున్న గెలాక్సీలో భారీ తారలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ఖగోళశాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. సూర్యుడితో పోలిస్తే.. ఈ భారీ తారల పరిమాణం పది రెట్ల కన్నా ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు.

భారీ నక్షత్రాలపై శాస్త్రవేత్తలకు ఎక్కువ ఆసక్తి కలగడానికి ప్రధాన కారణం.. పరిసరాలపై అవి చూపే భారీ ప్రభావమే. ఆ తారల్లో ఇంధనం నిండుకున్నాక.. సూపర్‌నోవా అనే భారీ విస్ఫోటంతో అవి పేలిపోతాయి. ఫలితంగా.. న్యూట్రాన్ తారలు, కృష్ణబిలాలు వంటి వింత ఖగోళ వస్తువులు పుట్టుకొస్తాయి. పాలపుంతకు సమీపంలో ఉన్న 'లార్జ్ మెగాలానిక్ క్లౌడ్' గెలాక్సీలోని నక్షత్ర జనన ప్రాంతమైన '30 డోరాడస్'లోని దాదాపు వెయ్యి భారీ తారలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించారు. వీటిలో 250 నక్షత్రాల ద్రవ్యరాశి.. సూర్యుడి కన్నా 15 నుంచి 200 రెట్లు ఎక్కువగా ఉంది. వీటిపై మరింత నిశితంగా పరిశీలన జరిపారు. "సూర్యుడి కన్నా 200 రెట్లు పెద్దగా ఉన్న నక్షత్రాలు విస్తృతంగా కనిపించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవలి వరకూ వాటి ఉనికిపై వివాదం ఉండేది. అయితే 300 రెట్లు పెద్ద నక్షత్రాలూ ఉంటాయని మా పరిశోధన తేల్చింది" అని హ్యూగ్స్ సనా అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు.

విశ్వంలో సూర్యుడి కన్నా పది రెట్లు పెద్దగా ఉండే నక్షత్రాలు ఒక్క శాతం లోపే ఉంటాయన్న అంచనా ప్రస్తుతం ఉంది. అయితే ఊహించినదాని కన్నా అవి ఎక్కువ సంఖ్యలోనే ఉంటాయని తాజా పరిశోధనలో వెల్లడైంది.

3వ విమానవాహక నౌక నిర్మాణ పనులు ప్రారంభించిన చైనా

బీజింగ్: చైనా అమ్ములపొదిలో మరో విమానవాహక నౌక చేరేందుకు రంగం సిద్ధమవుతోంది. షాంఘైలో 2వ విమానవాహక నౌక నిర్మాణం పూర్తికావస్తుండగానే.. అత్యాధునిక ప్రయోగ వ్యవస్థతో 3వ విమానవాహక నౌక నిర్మాణాన్నీ చైనా తాజాగా ప్రారంభించినట్లు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వార్తాసంస్థ వెల్లడించింది. 2014లో చైనా తమ తొలి విమానవాహక నౌకను ప్రారంభించింది. 2వది ఈ ఏడాదే ఆ దేశ నౌకాదళంలో చేరనుంది. మరోవైపు జలాంతర్గాములు, క్షిపణులు, నౌకలను నాశనం చేసే సరికొత్త విధ్వంసక అస్త్రాన్ని చైనా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. హిందూమహాసముద్రం, దక్షిణ చైనా సముద్రాల్లో దాన్ని మోహరించే అవకాశాలున్నాయి.

లోక్‌సభలో వినియోగదారుల పరిరక్షణ బిల్లు

దిల్లీ: మార్కెట్‌లోని వివిధ మోసాల నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన వినియోగదారుల పరిరక్షణ బిల్లును శుక్రవారం లోక్‌సభలో కేంద్రమంత్రి రాంవిలాస్ పాసవాన్ ప్రవేశపెట్టారు. తప్పుడు ప్రకటనలు ఇస్తే రూ.50 లక్షల వరకు జరిమానా, అయిదేళ్ల వరకు జైలు శిక్ష; కల్తీ చేస్తే రూ.10 లక్షల జరిమానా, జీవిత కాల జైలు శిక్ష విధించాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు వివాదాల పరిష్కారానికి అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థ ఏర్పాటు చేసే బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు.

22 నుంచి వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కేంద్రం నాలుగేళ్లకోసారి నిర్వహించే పులులు, వన్యప్రాణుల లెక్కింపు ప్రక్రియ ఈనెల 22 నుంచి దేశవ్యాప్తంగా మొదలవుతుందని, తెలంగాణలోనూ సర్వే చేపడతామని అటవీ సంరక్షణ ప్రధానాధికారి పీకే ఝా వెల్లడించారు. సర్వేకు అటవీశాఖ సన్నద్ధత, మానవవనరులు, సాంకేతిక సౌకర్యాలపై అన్ని జిల్లాల అటవీ అధికారులతో పీకే ఝా శుక్రవారం దూరదృశ్య సమావేశం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. సిబ్బంది కొరత ఉన్నచోట నైపుణ్యమున్న అటవీ అధికారి పర్యవేక్షణలో ఔత్సాహికులు, విద్యార్థుల సహకారం తీసుకోవచ్చని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ చర్యలపై ఆరా తీసిన ఆయన దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం నిరంతరం సమీక్షిస్తోందన్నారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు.

రవాణాశాఖలో చేతివాటం

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- గుట్టురట్టుచేసిన కొత్త సాఫ్ట్‌వేర్
- అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు

ఈనాడు - హైదరాబాద్

ఇదో రకం దోపిడీ. ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన సొమ్ము పక్కదారి పడుతోంది. సర్కారుకు ఏటా పదుల కోట్ల రూపాయల్లో ఆదాయానికి గండిపడుతోంది. రెండో వాహనం కొనుగోలు చేసిన ప్రతి వాహనదారుడి నుంచి అదనంగా రెండు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉండగా, రవాణాశాఖలోని కొంత మంది సిబ్బంది వాహనదారుల వివరాల్లో స్వల్ప మార్పులు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన అదనపు సొమ్మును నొక్కేస్తున్నారు. రవాణాశాఖ వాహనదారుల నుంచి మూడు రకాల పన్నులను వసూలు చేస్తుంది. ద్విచక్ర వాహనాలకు 9 శాతం, రూ. 10 లక్షల లోపు విలువ చేసే వాహనాలపై 12 శాతం, అంతకుమించి ఖరీదైన వాహనాలపై 14 శాతం పన్ను వసూలు చేస్తుంది. అదే వ్యక్తి రెండో వాహనం కొంటే వాహనం విలువపై రెండు శాతం మొత్తాన్ని అదనంగా చెల్లించాలి. వాహన ఖరీదు ఆధారంగా ఆ పన్ను భారీగానే ఉంటుంది. ఇక్కడే అక్రమాలకు తెరలేస్తోంది. రవాణాశాఖలోని కొందరు సిబ్బంది కొనుగోలుదారులతో కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడుతున్నారు. కొనుగోలుదారు పేర్లలో చిన్నచిన్న మార్పులతో నమోదుచేసి రికార్డులకు దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రవాణాశాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తుండడంతో ఈ డొంక కదిలింది.



వెల్లడైంది ఇలా...

రెండో వాహనం అక్రమాలను గుర్తించేందుకు సమీకృత ప్రజా సమాచార కేంద్రం (ఇంటిగ్రేటెడ్ పీపుల్ ఇన్ఫర్మేషన్ హబ్-ఐపీఐహెచ్) పేరిట తెలంగాణ ఐటీ శాఖ ఓ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఇది ఆధార్ సంఖ్య నుంచి వాహనదారు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్ నంబరు.. ఇలా అన్నింటిని జల్లెడట్టి ఆ వాహనదారుడి రెండో వాహనం ఉందో లేదో గుర్తిస్తుంది. దీంతో అక్రమాలకు ఆస్కారం లేకుండాపోయింది. ఇలా గత ఏడాది నవంబరు 13 నుంచి డిసెంబరు 31 వరకు అంటే 50 రోజుల వ్యవధిలో 11,993 మంది వాహనదారుల నుంచి రెండో వాహనం పన్ను రూపంలో రూ. 5.97 కోట్లు వసూలైంది. 2016లో ఇదే కాలవ్యవధిలో కేవలం 6,248 వాహనాల నుంచి రూ. 3.35 కోట్లు మాత్రమే జమ అయింది. అంటే కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా 50 రోజుల్లో రూ. 2.62 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి అదనంగా లభించినట్లయింది. దీనినిబట్టి చూస్తే ఏడాది మొత్తంలో ప్రభుత్వం ఎంత మొత్తం కోల్పోయిందో అర్థంచేసుకోవచ్చు. దీనిపై దృష్టి పెట్టిన అధికారులు ఇప్పటికే కొందరు సిబ్బందికి నోటీసులు ఇవ్వగా మరికొందరిని సస్పెండ్ చేసింది. ఖజానాకు గండిపడిన మొత్తం ఎవరి జేబులోకి వెళ్లిందో నిగ్గుతేలాల్సి ఉంది.

రెండో వాహనాలు... పన్ను వసూలు తీరు...

వ్యవధి	వాహనాల సంఖ్య	వసూలు చేసిన మొత్తం
2018 జనవరి 1 నుంచి 4 వరకు	796	రూ. 40.16 లక్షలు
2017 జనవరి 1 నుంచి 4 వరకు	546	రూ. 29.39 లక్షలు
వ్యత్యాసం	250	రూ. 10.77 లక్షలు
2017 డిసెంబరు 1 నుంచి 31 వరకు	6,751	రూ. 3.36 కోట్లు
2016 డిసెంబరు 1 నుంచి 31 వరకు	3,812	రూ. 2.00 కోట్లు
వ్యత్యాసం	2,939	రూ. 1.36 కోట్లు
2017 నవంబరు 13 నుంచి 30 వరకు	4,920	రూ. 2.43 కోట్లు
2016 నవంబరు 13 నుంచి 30 వరకు	2,237	రూ. 1.25 కోట్లు
వ్యత్యాసం	2,638	రూ. 1.18 కోట్లు



యువకుడి అపహరణ తుపాకీతో బెదిరించి చెల్లితో పెళ్లి

పట్నా: బొకారో ఉక్కు కర్మాగారంలో జూనియర్ మేనేజరుగా పనిచేస్తున్న వినోద్‌కుమార్(29) అనే ఇంజినీర్‌ను మొకామా ప్రాంతానికి చెందిన ఓ యువతి సోదరుడు సురేంద్రయాదవ్ అపహరించుకుని వివాహవేదిక వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే పీటల మీద ఉన్న తన సోదరి నుదుట సింధూరం దిద్ది వివాహం చేసుకోవలసిందిగా యాదవ్ బెదిరించారు. బిగ్గరగా ఏడుస్తూ...తనకీ పెళ్లి వద్దని ఆ దుండగుల కాళ్లావేళ్లా పడుతున్న వినోద్‌కుమార్‌కు అక్కడున్న వధువు తరపు మహిళలంతా నచ్చచెప్పినట్లు స్థానిక మీడియా తెలిపింది. చివరకు యాదవ్ తుపాకీ తీసి వినోద్‌కుమార్‌ను బెదిరించి మరీ ...తన సోదరి మెడలో తాళి కట్టించేశారు. ఈ లోగా వినోద్ కుమార్ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదవ్‌పై అపహరణ కేసు నమోదు చేశారు.

ఆరెస్సెస్ భవనం పేల్చివేత కేసులో నిందితుడి అరెస్టు

దిల్లీ: చెన్నైలోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంపై 1993లో జరిగిన బాంబు దాడి కేసులో నిందితుడిగా ఉన్న ముస్తాక్ అహ్మద్‌ను సీబీఐ శుక్రవారం అరెస్టు చేసింది. 24 ఏళ్లుగా అతడు.. చట్టం కళ్లుగప్పి తిరుగుతున్నాడు. చెన్నై శివార్లలో అతడిని అరెస్టు చేసినట్లు సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ తెలిపారు. నాటి దాడిలో ఆర్‌డీఎక్స్ పేలుడు పదార్థాన్ని ఉపయోగించారు. ఫలితంగా బహుళ అంతస్తుల భవనం కూలిపోయింది. ఇందులో 11 మంది బలయ్యారు.

మద్దతు ధరలు రైతులకు చేరట్లేదు: కేంద్రం

దిల్లీ: పంటలపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధరలు రైతులకు చేరట్లేదని.. వారికి సరైన ప్రతిఫలం దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర వ్యవసాయమంత్రి రాధామోహన్ సింగ్ అన్నారు. దిల్లీ, కోల్‌కతా మధ్య ఉన్న ప్రాంతాల్లో తాను స్వయంగా ఈ పరిస్థితిని చూసినట్లు.. శుక్రవారం రాజ్యసభలో ఆయన వెల్లడించారు. మెరుగైన వ్యవస్థను తెచ్చేందుకు రాష్ట్రాలు, నీతి ఆయోగ్‌తో సంప్రదింపులు చేపట్టామని రాధామోహన్ వివరించారు.

మహిళా ఖైదీల స్థితిగతులపై అధ్యయనం!

దిల్లీ: దేశంలోని 144 కేంద్రీయ కారాగారాల్లోని మహిళా ఖైదీల పరిస్థితులపై కేంద్రప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యు), కొన్ని స్వచ్ఛంద సంస్థలతో కలిసి అధ్యయనాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి మేనకాగాంధీ శుక్రవారం తెలిపారు. కారాగారాలన్నిటికీ ప్రశ్నావళిని పంపారు. తర్వాత ఎన్‌సీడబ్ల్యు బృందాలు జైళ్లను సందర్శిస్తాయి. అనంతరం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసులు చేస్తాయి. వాటిని ఆ తర్వాత శాసనసభల ముందుంచుతాయి.

విశ్రాంత ఉద్యోగికీ వేతనం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ పొంది విధులు నిర్వర్తించకపోయినా నెల జీతం అందిస్తున్న వైనం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరిగింది. మూడు నెలల క్రితం పదవీ విరమణ పొందిన పీవీ సుధాకర్ అనే రికార్డ్ అసిస్టెంట్‌కు రెండు నెలలుగా వేతనం ఆయన బ్యాంకు ఖాతాలో జమవుతోంది. ఈ విషయం గుర్తించిన అకౌంట్స్ విభాగం ఉద్యోగులు, అధికారులు పొరపాటును సవరించేందుకు యత్నాలు చేపట్టారు. విశ్రాంత ఉద్యోగిని పిలిపించి వేతనం డబ్బులను వాపసు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. సదరు ఉద్యోగి ససేమిరా అనడంతో విషయం బయటకు పొక్కింది. గతంలోనూ ఉద్యోగ విరమణ పొందిన ఓ ఉద్యోగికి దేవస్థానం అధికారులు ఇలా వేతనం చెల్లించారు.

'ప్రత్యేక పరిశీలన జాబితా'పై పాక్ ఆగ్రహం

ఇస్లామాబాద్: మత స్వేచ్ఛకు తీవ్ర ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ తమ దేశాన్ని 'ప్రత్యేక పరిశీలన జాబితా'లో పెడుతూ అమెరికా తీసుకున్న నిర్ణయంపై పాకిస్థాన్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ జాబితా రూపకల్పనలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలను ఇది ప్రతిబింబిస్తోందని తెలిపింది. ఈ జాబితాలో ఉన్న ఏకైక దేశం పాకిస్థానే కావడం గమనార్హం. "మైనార్టీలపై తీవ్రస్థాయి వేధింపులకు పేరుపడ్డ దేశాలను ఈ జాబితాలో చేర్చకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇది ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఈ జాబితాకు విశ్వసనీయత లేదు" అని పాక్ విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి వల్ల పాకిస్థాన్.. తమకు మరింత చేరువవుతుందని చైనా అధికారిక పత్రిక 'గ్లోబల్ టైమ్స్' పేర్కొంది. దీనివల్ల రెండు దేశాల మధ్య రక్షణ, ఆర్థిక సంబంధాలు మరింత వృద్ధి చెందుతాయని వివరించింది.

మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి జిగ్నేశ్, ఖలీద్ ఆరోపణలు

దిల్లీ: భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ తమను లక్ష్యంగా చేసుకుంటున్నాయని దళిత నాయకుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మెవాని, జేఎన్‌యూ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్ ఆరోపించారు. 'భీమా-కొరేగావ్' వార్షికోత్సవానికి ముందురోజు పుణెలో జరిగిన కార్యక్రమంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారన్న ఆరోపణలతో వీరిద్దరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలేవీ తాము చేయలేదని.. జిగ్నేశ్, ఖలీద్ అన్నారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

ఈనాడు
విజేత
sports@eenadu.in
కరీంనగర్, శనివారం, జనవరి 6, 2018

వయసు 12.. ఆట 23


త్రిష
క్రికెట్

అండర్-23 జట్టంటే క్రీడాకారుల వయసు 23 ఏళ్లకు మించకూడదు! ఆ వయసు కంటే ఎంత తక్కువున్నా పర్వాలేదు. ఐతే నిబంధనలు అనుమతించినప్పటికీ మూణ్నాలుగేళ్లు తక్కువ వయసున్న వాళ్లు ఈ జట్టులో ఉంటారే తప్ప.. అండర్-23 జట్టులో 15 ఏళ్ల లోపున్న వారుండటం దాదాపు అసాధ్యం! కానీ హైదరాబాద్ అండర్-23 జట్టులో సభ్యురాలైన త్రిష వయసు కేవలం 12 ఏళ్లు మాత్రమే. ఏదైనా రికార్డు కోసం నామమాత్రంగా ఇలా జట్టులో చోటిచ్చారనుకుంటే పొరబాటే. చిన్నతనంలోనే సంచలన ప్రదర్శనతో తనను పెద్ద వయసు విభాగాల్లోకి కూడా ఎంపిక చేయక తప్పని పరిస్థితి కల్పించిందా అమ్మాయి. తన పేరు త్రిష. మూడేళ్ల వయసులోనే బ్యాట్ పట్టి క్రికెట్ సాధన చేసిన త్రిష.. ఎనిమిదేళ్లకే హైదరాబాద్ అండర్-16 జట్టులో చోటు సంపాదించింది. 11 ఏళ్లకే అండర్-19 జట్టుకూ ఎంపికైంది. పన్నెండేళ్లకే అండర్-23 జట్టులోనూ సభ్యురాలైంది. ఆల్‌రౌండర్ అయిన త్రిష రెండు నెలల కిందట గుంటూరులో జరిగిన సౌత్ జోన్ అండర్-19 టోర్నీలో త్రిష సంచలనాలు రేపింది. కేరళపై 3/9.. గోవాపై 2/9.. కర్ణాటకపై 4/18, 56 పరుగులు.. ఇలాంటి ప్రదర్శనలతో టోర్నీలో తన పేరు మార్మోగేలా చేసింది. భద్రాచలానికి చెందిన త్రిష.. క్రికెట్ కోసమే కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చింది. భారత పురుషుల క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్‌కు చెందిన అకాడమీలో ఆమె శిక్షణ తీసుకుని త్వరితగతిన ఎదిగింది. త్రిష గురించి శ్రీధర్ మాట్లాడుతూ.. "నాలుగైదేళ్లుగా ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా త్రిషను గమనిస్తుంటా. తెల్లవారుజామునే బ్యాటింగ్ సాధన చేస్తూ, కనిపిస్తుంది. భద్రాచలం లాంటి చిన్న పట్టణం నుంచి వచ్చి.. హైదరాబాద్ అండర్-19 జట్టుకు ఆడుతుండటం ఆశ్చర్యకరం" అన్నాడు.

నవ యువ ఘన తరం

వీవీఎస్ లక్ష్మణ్ వారసుడు ఎవరు?
మిథాలీరాజ్ తర్వాత మహిళా క్రికెట్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం ఉంటుందా?
మరో సానియా కోసం మనం నిరీక్షించాలా?
సైనా నెహ్వాల్, సింధుల తర్వాత ఎవరున్నారనే సందేహాలకు సమాధానంగా మేమున్నామంటున్నారీ యువ కిశోరాలు...
స్టార్ క్రీడాకారులను చూస్తూ ఎదిగిన ఆ చిన్నారులు ఇప్పుడు వారి స్థాయిని అందుకునే దిశగా దూసుకొస్తున్నారు. అగ్రశ్రేణి క్రీడాకారుల వారసత్వాన్ని అందుకుంటూ.. అంతర్జాతీయ వేదికలపై సత్తాచాటుతున్నారీ తెలుగు రాష్ట్రాల నవ యువ విజేతలు!

–వరికుప్పల రమేష్, హైదరాబాద్

టీటీ కేరాఫ్ స్నేహిత్




అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్‌లో నిలకడగా రాణిస్తున్న భారత జూనియర్ ఆటగాడు.. ఫిదెల్ ఆర్. స్నేహిత్. అంతర్జాతీయ స్థాయిలో స్నేహిత్ ఈ ఏడాది 3 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్య పతకాలు సాధించాడు.

మరింత ఎత్తుకు


రాజా రిత్విక్
చదరంగం

ఎత్తుకు పై ఎత్తు వేస్తూ, ప్రత్యర్థులను చిత్తు చేస్తూ చదరంగంలో పైపైకి ఎదుగుతున్నాడు ఆర్. రాజారిత్విక్. హైదరాబాద్‌లోని ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ అబ్బాయి ఖాతాలో వరుసగా పెద్ద విజయాలు చేరిపోతున్నాయి. ఇటీవల తమిళనాడులో జరిగిన అండర్ - 17 చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించాడు. తర్వాత నవంబర్‌లో మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్ టోర్నమెంట్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. ఐదు దేశాల పిల్లలతో పోటీ పడి ఈ విజయాన్ని సాధించాడు. 2012 నుంచి ఇప్పటి వరకు వరుస విజయాలతో ఈ ఆటలో భవిష్యత్తు ఆశాకిరణంగా ఉన్నాడు. ప్రస్తుతం గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడీ అబ్బాయి.



బ్యాటింగ్ కెరటం


నితీశ్ కుమార్‌రెడ్డి
క్రికెట్

ఒకప్పుడు జూనియర్ క్రికెట్లో పరుగుల వరద పారించిన విరాట్ కోహ్లి గురించి గొప్పగా చెప్పుకున్నాం. ప్రస్తుతం ముంబయి తరఫున పరుగుల సునామీ సృష్టిస్తున్న 19 ఏళ్ల పృథ్వీ షా గురించి మాట్లాడుకుంటున్నాం. ఐతే మనదగ్గరా ఓ విరాట్.. ఓ పృథ్వీ ఉన్నాడన్న సంగతి చాలామందికి తెలియదు. విశాఖపట్నానికి చెందిన నితీశ్‌కుమార్‌రెడ్డి.. ఆంధ్ర అండర్-16 జట్టు వైస్ కెప్టెన్. కుడిచేతివాటం బ్యాట్స్‌మన్. మీడియం పేసర్ కూడా. అఖిల భారత విజయ్ మర్చంట్ ట్రోఫీలో సౌత్‌జోన్‌లో ఆంధ్ర ఛాంపియన్‌గా నిలవడంలో నితీశ్‌దే ముఖ్య భూమిక. ప్రస్తుతం అఖిల భారత స్థాయిలోనూ నితీశ్‌దే జోరు. నాగాలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో నితీశ్ ఏకంగా 441 పరుగుల భారీ స్కోరు సాధించాడు. అంతకుముందు హైదరాబాద్‌లో జరిగిన సౌత్‌జోన్ టోర్నీలో 5 మ్యాచ్‌ల్లో.. అదీ 5 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 197 సగటుతో 788 పరుగులు రాబట్టాడు నితీశ్. అందులో ఒక ట్రిపుల్ సెంచరీ కలుపుకొని 3 శతకాలు, 2 అర్ధ సెంచరీలున్నాయి. బీసీసీఐ అధికారిక టోర్నీల్లో ఆంధ్ర తరఫున ట్రిపుల్ సెంచరీ సాధించిన నాలుగో ఆటగాడిగా నితీశ్ రికార్డు సృష్టించాడు. అమిత్ పాథక్, భరత్, సుమంత్ ఆంధ్ర తరఫున రంజీ ట్రోఫీలో ట్రిపుల్ సెంచరీలు చేశారు. ఇక అఖిల భారత విజయ్ మర్చంట్ టోర్నీలో అత్యధిక పరుగుల పట్టికలో నితీశ్‌కు.. రెండో స్థానంలో ఉన్న అర్నవ్ కిషోర్ (613- బిహార్)కు మధ్య 175 పరుగుల తేడా ఉండటం విశేషం. బంతితోనూ భళా అనిపిస్తున్నాడు నితీశ్. 5 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు నేలకూల్చాడు. 15 ఏళ్లకే పరుగుల వరద పారిస్తున్న నితీశ్.. కచ్చితంగా క్రికెట్ ఆశాకిరణమే!

సానియా బాటలో


అమినేని శివాని
టెన్నిస్

సరదాగా టెన్నిస్ రాకెట్ పట్టి.. చూస్తుండగానే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారిణి అమినేని శివాని. 8 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన శివాని.. 14 ఏళ్లకే జాతీయ స్థాయిలో అండర్-16 విభాగంలో నంబర్‌వన్ ర్యాంకు సొంతం చేసుకుంది. 2016, 2017లలో నంబర్‌వన్‌గా కొనసాగింది! కునాల్ గిర్ ప్రత్యేక ఫిట్‌నెస్ శిక్షణలో రాటుదేలుతున్న 15 ఏళ్ల శివాని.. జూనియర్ స్థాయిలో దేశంలోనే అగ్రశ్రేణి క్రీడాకారిణి. పుణె, చండీగఢ్, హైదరాబాద్‌లో జరిగిన ఆసియ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీల్లో రన్నరప్ ట్రోఫీలు గెల్చుకుంది. ఆసియా జూనియర్స్‌లో రెండు సార్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన శివాని.. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లోనూ బరిలో దిగింది. యూరోపియన్ సర్క్యూట్‌లో ఫ్రాన్స్, నెదర్లాండ్స్, జర్మనీ, బెల్జియం, చెక్ రిపబ్లిక్‌లలో భారత్ తరఫున ఆడింది. హైదరాబాద్, చెన్నై, మలేసియాలలో జరిగిన ఐటీఎఫ్ గ్రేడ్-4 టెన్నిస్ టోర్నీల్లో శివాని రన్నరప్ ట్రోఫీలు గెల్చుకుంది. జాతీయ స్థాయి ర్యాంకింగ్ టోర్నీల్లో శివాని సాధించిన టైటిళ్ళకు లెక్కేలేదు. ఆటలో సత్తాచాటుతున్న శివాని.. చదువులోనూ మేటి.

పంచ్ పడింది


నిహారిక
బాక్సింగ్

ఒకరు ఒక ఆట ఎంచుకోవడమే కష్టం! అందులో రాణించడం ఇంకా కష్టం. అలాంటిది ఆడిన ప్రతి క్రీడలోనూ సత్తాచాటితే ఆ అమ్మాయి గోనెళ్ళ నిహారిక అవుతుంది. హ్యాండ్‌బాల్‌లో అరంగేట్రం చేసి.. వాలీబాల్‌లో మెరిసిన నిహారిక.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అగ్రశ్రేణి బాక్సర్. వాలీబాల్‌లో 4 నేషనల్స్ ఆడిన నిహారిక.. 2013లో పూర్తిస్థాయి బాక్సర్‌గా మారింది. నాలుగేళ్ళలో భారత బాక్సింగ్‌పై తనదైన ముద్ర వేసింది. 2015లో ప్రపంచ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, 2016లో సెర్బియాలో నేషన్స్ కప్ బాక్సింగ్ రజతం, ఈ ఏడాది ఇస్తాంబుల్‌లో అహ్మెత్ కార్మెట్ ఛాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిసింది. ఇటీవల అసోంలో ప్రపంచ యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్ చేరుకుంది. 2020 ఒలింపిక్స్, 2024 ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా జిందాల్ స్పోర్ట్స్ అకాడమీ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్రీడాకారుల్లో నిహారిక (69 కేజీలు) ఒకరు. ప్రస్తుతం ఆసియా ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ క్రీడలకు జిందాల్ అకాడమీలో అమెరికా కోచ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న నిహారిక.. ప్రతిష్టాత్మక టోర్నీల్లో పతకాలు సాధించాలన్నది అందరి ఆకాంక్ష!

దేశంలోనే నంబర్ 1


నిత్య
రన్నింగ్

జాతీయ స్థాయిలో జూనియర్ విభాగంలో దేశంలో అత్యంత వేగవంతమైన అథ్లెట్ మనమ్మాయే అన్న సంగతి చాలామందికి తెలియకపోవచ్చు. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌కు చెందిన నిత్య గంధె జాతీయ అండర్-20 విభాగంలో తిరుగులేని అథ్లెట్‌గా ఎదిగింది. ఈ ఏడాది ఫెడరేషన్ కప్ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌లో 100 మీ పరుగులో స్వర్ణం గెల్చుకుంది. జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌లో 100 మీ పరుగులో రజతం సాధించింది. ఇటీవల గుంటూరులో జరిగిన అఖిల భారత అంతర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో 100 మీ పరుగులో రజతం నెగ్గింది. సెమీస్‌లో 11.92 సెకన్లతో కెరీర్‌లోనే అత్యుత్తమ టైమింగ్ నమోదు చేసింది. ఈ పోటీల్లో స్వర్ణం గెలిచిన అమ్మాయిది 12.08 సెకన్ల టైమింగ్. ఫైనల్లో నిత్య స్థాయికి తగ్గట్లు పరుగెత్తకపోవడంతో రెండో స్థానంలో నిలిచింది. 2020 ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన చేస్తున్న నిత్య.. అర్హత టైమింగ్ (11.2 సె)కు 0.9 సెకన్ల దూరంలో ఉంది.

రాకెట్ దూకుడు


శ్రీకృష్ణప్రియ
బ్యాడ్మింటన్

బ్యాడ్మింటన్‌లో సైనా, సింధు, రుత్విక శివానిల తర్వాత వినిపించే పేరు 19 ఏళ్ళ కుదరవల్లి శ్రీకృష్ణప్రియ. పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న శ్రీకృష్ణప్రియ అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ స్థాయిలో అడుగుపెట్టిన ఈ హైదరాబాదీది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 59వ స్థానం. జాతీయ స్థాయిలో అండర్-19లో నంబర్‌వన్‌గా నిలిచింది. ప్రపంచ అండర్-19 ఛాంపియన్‌షిప్, ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్, ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్, థాయ్‌లాండ్ ఓపెన్‌లలో పాల్గొంది. ఉక్రెయిన్‌లో జరిగిన అంతర్జాతీయ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. మలేసియా, వియత్నాం, స్విట్జర్లాండ్, ఇటలీ, అమెరికాలలో భారత్ తరఫున బరిలో దిగింది. ఇటీవల జాతీయ ఛాంపియన్‌షిప్‌లో సైనా, సింధు, శ్రీకాంత్‌లతో కలిసి దిగ్గజ క్రీడాకారిణిగా బరిలో దిగింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో అహ్మదాబాద్ తరఫున శ్రీకృష్ణప్రియ కీలక క్రీడాకారిణి.

గోల్ కొట్టింది


సౌమ్య
ఫుట్‌బాల్

ఫుట్‌బాల్‌లో ఘన చరిత్ర మన సొంతం. ప్రోత్సాహం కరువవడం.. క్రీడా సంఘంలో రాజకీయాల కారణంగా అందరి కంటే వెనుకబడ్డాం. ఐతే గుగులత్ సౌమ్య రూపంలో ఫుట్‌బాల్ ఆణిముత్యం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారత మహిళల ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక అమ్మాయి సౌమ్య. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కిషన్ తండాకు చెందిన సౌమ్యది నిరుపేద నేపథ్యం. దృఢచిత్తం.. పట్టుదలతో సాధన చేసి భారత జట్టు స్థాయికి చేరుకుంది. చైనా, మయన్మార్‌లలో జరిగిన ఆసియా అండర్-16, అండర్-19 టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఐ లీగ్‌లో ఇండియా రష్ సాకర్ క్లబ్‌కు ఎంపికై భళా అనిపించుకుంది.

రీ ప్లే


ఓడ వచ్చిందని.. మ్యాచ్ వదిలేశారు

అమ్మో ఐదు రోజులా? టెస్టు మ్యాచ్ గురించి చెబితే.. క్రికెట్‌పై అంతగా అవగాహనలేని వాళ్లు ఇలా ఆశ్చర్యపోవడం మామూలే. కానీ ఓ టెస్టు మ్యాచ్ ఏకంగా తొమ్మిది రోజులు జరిగిందంటే క్రికెట్ అభిమానులే షాక్‌కు గురికావడం ఖాయం. నిజానికి అది అసలు కాలపరిమితేలేని మ్యాచ్. అంటే ఫలితం వచ్చే దాకా ఆడతారన్నమాట. ఇక్కడ మలుపేంటంటే 9 రోజులకు కూడా ఫలితం తేలలేదు. అనుకోని కారణంతో, అనూహ్యంగా డ్రాగా ముగిసింది. ఓ 78 ఏళ్లు వెనక్కి వెళితే ఈ అరుదైన, అత్యంత విచిత్రమైన టెస్టు మ్యాచ్ గురించి తెలుసుకోవచ్చు.

దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ మధ్య 1939లో జరిగిందీ అంతులేని కథ. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ఈ మ్యాచ్‌కు వేదిక డర్బన్. మార్చి 3 నుంచి 14 వరకు జరిగింది. రెండు రోజులు విశ్రాంతికి పోగా.. ఒక రోజు ఆట సాధ్యం కాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 530 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 316 పరుగులు సాధించింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 481 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ లక్ష్యం 696 పరుగులు కాగా.. తొమ్మిదో రోజు ఆట ఆఖరికి ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసింది. అప్పటికి ఇంగ్లాండ్ గెలవాలంటే ఇంకా 41 పరుగులు చేయాలి. కానీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇంగ్లాండ్‌కు వెళ్లాల్సిన ఓడను అందుకోవడం కోసం ఇంగ్లిష్ ఆటగాళ్లు వెళ్లిపోవడమే అందుకు కారణం. ఫలితం డ్రా కావడం, అత్యంత సుదీర్ఘంగా సాగిన కారణంగా ఈ మ్యాచ్‌ను 'టైమ్‌లెస్' మ్యాచ్‌గా పిలుస్తుంటారు. టెస్టు మ్యాచ్‌ను నాలుగు రోజులకు తగ్గించాలన్న చర్చ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఓ టెస్టును కూడా ఆడేసిన ఈ రోజుల్లో ఈ కాలపరిమితి లేని మ్యాచ్‌ను ఏమాత్రం ఊహించలేం కదా!



వేసవిలో వ్యతిరేక పవనాలు



1971... క్రికెట్ ప్రపంచం భారత్ వైపు చూసి కనుబొమలు ఎగరేసింది! పటౌడీ నుంచి పగ్గాలు అందుకున్న వాడేకర్ వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లను వారి దేశాల్లోనే ఓడించి చరిత్ర సృష్టించాడు. అవి గాలివాటు విజయాలు కావని నిరూపిస్తూ 1972-73లో మన దేశంలో పర్యటించిన ఇంగ్లండ్ జట్టును మరోసారి ఓడించి అదృష్ట సారథిగా పేరుపొందాడు. అంతే! ఏడాది తిరగ్గానే కథ తల్లకిందులైంది. వాడేకర్ క్రీడా జీవితానికి అర్ధంతరంగా తెరపడింది. 1974 వేసవిలో ఇంగ్లండ్ బయల్దేరిన భారత జట్టుపై భారీ అంచనాలున్నాయి. స్పిన్ చతుష్టయం బేడీ, ప్రసన్న, వెంకట్, చంద్ర పేరు చెబితే మేటి ఆటగాళ్లు తడబడే రోజులవి. గవాస్కర్, ఇంజినీర్, వాడేకర్, విశ్వనాథ్‌లు మన బ్యాటింగ్ విభాగానికి మూల స్తంభాలు. దేశవాళీ పోటీల్లో బాగా ఆడుతున్న అశోక్ మన్కడ్, సుధీర్ నాయక్, బ్రిజేశ్‌పటేల్ లాంటి కొత్త ఆటగాళ్లపై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. ఎటొచ్చీ అంతర్జాతీయ ప్రమాణాలకు సరితూగే పేస్ బౌలర్లు మన జట్టులో లేరు. అబిద్ అలీ, ఏక్‌నాథ్ సోల్కర్‌ల వేగం అంతంత మాత్రమే. దిల్లీ కుర్రాడు మదన్‌లాల్‌కు ఇదే తొలి సిరీస్. భారత జట్టు బలాబలాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఇంగ్లండ్ వ్యూహకర్తలు తమ బౌలర్లకు అనుకూలమైన స్వింగ్, పేస్ పిచ్‌లు తయారు చేశారు. ఆరంభంలోని కౌంటీ మ్యాచ్‌లలో మెరుగ్గానే ఆడిన భారత జట్టుకు టెస్టుల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. చలి, చినుకులు, మబ్బులు ముప్పేటలా కమ్ముకున్న వాతావరణంలో ఇంగ్లండ్ స్వింగ్, పేస్ బౌలర్ల ధాటికి భారత ఆటగాళ్లు తడబడ్డారు. ఓల్డ్‌ట్రాఫర్డ్ టెస్టులో అబిద్ అలీ సహకారంతో గవాస్కర్ సెంచరీ చేశాడు. లార్డ్స్ టెస్టులో భారీగా పరుగులు సమర్పించుకుని బేడీ ఆరు వికెట్లు తీశాడు. జెఫ్రీ బాయ్‌కాట్‌ను సోల్కర్, అలీలు ముప్పు తిప్పలు పెట్టారు. ఇవి మినహాయిస్తే భారత జట్టు వరసగా మూడు టెస్టుల్లోనూ అపజయాలు మూటగట్టుకుంది. అన్నిటికన్నా దారుణం జూన్24 నాడు లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే భారత్ ఆలౌటైంది.

ఇది చాలదన్నట్లు మైదానం వెలుపలి వ్యవహారాలు మొండి మరకలుగా మిగిలాయి. టీమ్ మేనేజ్‌మెంట్ అనుమతి లేకుండా బేడీ ఓ టీవీ ఛానెల్ వారికి స్పిన్ పాఠాలు చెప్పాడు. బేడీ మిత్రుడి ఇంట్లో ప్రైవేట్ పార్టీ సందర్భంగా వాడేకర్, బేడీ గొడవ పడ్డారు. మరోవైపు భారత ఓపెనర్ సుధీర్‌నాయక్ ఓ దుకాణంలో సాక్స్ కాజేసిన కేసులో ఇరుక్కున్నాడు. లండన్‌లో అప్పటి భారత హైకమిషనర్ బి.కె.నెహ్రూ ఏర్పాటు చేసిన విందుకు జట్టు ఆలస్యంగా చేరుకోవడంతో ఆయన కోపగించుకుని కార్యక్రమాన్ని రద్దు చేయడమే కాకుండా 42 పరుగులు చేసిన జట్టు 60 నిమిషాలు ఆలస్యంగా వచ్చిందంటూ చేసిన వ్యాఖ్య పుండు మీద కారం చల్లినట్లయింది. వీటన్నిటినీ బ్రిటిష్ మీడియా పతాక శీర్షికలలో ప్రచారం చేసింది. ఈ మొత్తం వ్యవహారాల్లో జట్టు మేనేజర్ కల్నల్ హేమూ అధికారి పనితీరు విమర్శల పాలైంది. స్వదేశంలో క్రీడాభిమానులు భగ్గుమన్నారు. 1971లో విదేశాల్లో విజయాలు సాధించి భారీ స్వాగతాలు అందుకున్న వాడేకర్‌కు 1974లో నిరసన ప్రదర్శనలు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన వాడేకర్ తనలో ఆడే సత్తా ఉన్నా ఆట నుంచి అర్ధంతరంగా తప్పుకున్నాడు.

– ఓలేటి శ్రీనివాసభాను


పవన్‌కల్యాణ్

కానుక నచ్చింది


జిబిగ్స్

కొత్త యేడాది సందర్భంగా పవన్‌కల్యాణ్‌కి ఓ అరుదైన కానుక లభించింది. పోలండ్‌కి చెందిన జిబిగ్స్ (బుజ్జి) అనే బుడతడు 'కొడకా కోటేశ్వరరావు...' పాటని పాడి పవన్‌కల్యాణ్‌కి ట్విట్టర్ ద్వారా 'ఇది 2018 సందర్భంగా మీకు అందిస్తున్న కానుక' అంటూ పోస్ట్ చేశాడు. అది చూసిన పవన్‌కల్యాణ్ స్పందించారు. "డియర్ జిబిగ్స్ బుజ్జి, చిన్నారి మిత్రుడా నీ కానుకకి నా కృతజ్ఞతలు. దేవుడి దీవెనలు నీకు ఉంటాయి" అని ట్వీట్ చేశారు. కొడకా కోటేశ్వరరావు పాటని 'అజ్ఞాతవాసి' కోసం పవన్‌కల్యాణ్ స్వయంగా ఆలపించిన విషయం తెలిసిందే. ఇటీవలే విడుదలైన ఆ గీతం శ్రోతల్ని అలరిస్తోంది. పోలండ్‌కి చెందిన జిబిగ్స్ బుజ్జికి తెలుగు సినిమాలన్నా, తెలుగు భాషన్నా చాలా ఇష్టం. భాష రానప్పటికీ తరచూ తెలుగు సినిమాల్లోని పాటల్ని ఆలపిస్తూ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తుంటాడు.


శ్రుతిహాసన్

పరుగు మంచిదే కానీ...

ఎప్పుడూ నాలుగైదు సినిమాలతో... రెండు మూడు పరిశ్రమల చుట్టూ క్షణం తీరిక లేకుండా తిరిగేది శ్రుతిహాసన్. విమానాల్లోనూ, కార్‌వ్యానుల్లోనే ఎక్కువ సమయం గడిపేవారు. కానీ కొంత కాలంగా అందుకు పూర్తి భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నారు. సినిమాలు తగ్గించేసి... వ్యక్తిగతానికే కాల్‌షీట్లు కేటాయించారు. ఎందుకోసం ఇంత మార్పు? వరుసగా సినిమాలు చేసి అలసిపోయారా? అని అడిగితే... "అదేం కాదు. పనినే ఆస్వాదిస్తూ, అందులోనే సేద తీరే రకాన్ని నేను. అలసిపోవడమంటూ ఉండదు. చెప్పాలంటే నేనింట్లో ఉన్నా... సెట్‌లోకంటే ఎక్కువ పనులు చేస్తుంటా. కాకపోతే ఎనిమిదేళ్లుగా పనిలో పడి, నా గురించి నేను ఆలోచించుకొన్నది చాలా తక్కువ. పరుగు మంచిదే కావొచ్చు కానీ... అది దేనికోసం? ఎంత సంతృప్తినిస్తోంది? అనేది కూడా తెలుసుకోవాలి. కొంతకాలంగా అదే పనిలోనే గడిపా" అని చెప్పుకొచ్చింది శ్రుతిహాసన్. గతేడాది 'కాటమరాయుడు'లో నటించిన ఆమె నటన పరంగా సవాళ్లంటేనే ఇష్టం అంటోంది. "కెరీర్ ఆరంభంలో కూడా నేను ప్రాధాన్యమున్న పాత్రలవైపే దృష్టిపెట్టేదాన్ని. వ్యక్తిగతంగా నా ప్రతిభని ప్రదర్శించేందుకని కాదు. నటిగా తృప్తి కోసమే. ఒక మంచి పాత్రలో నటిస్తే లభించే తృప్తే వేరు. ఇప్పుడు కూడా ఆ తరహా పాత్రలవైపే నా దృష్టి" అని చెప్పుకొచ్చింది శ్రుతి.

ఈనాడు సినిమా


రవితేజ

కొత్త చిత్రం మొదలు

రవితేజ కథానాయకుడిగా కల్యాణ్‌కృష్ణ కురసాల దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. మాళవిక శర్మ కథానాయిక. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది. రవితేజతో పాటు, ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 'నేల టికెట్'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రం రవితేజ శైలి మాస్ అంశాలతోనూ.. కల్యాణ్‌కృష్ణ శైలి కుటుంబ నేపథ్యం మేళవింపుతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. ముకేష్ కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే 'టచ్ చేసి చూడు'తో సందడి చేయబోతున్న రవితేజ, విరామం లేకుండా కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగడం విశేషం. ఓ ప్రముఖ దర్శకుడితో మరో చిత్రం గురించి కూడా చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. చూస్తుంటే రవితేజ మునుపటిలా మళ్లీ జోరు పెంచి సినిమాలు చేయనున్నట్టు అర్థమవుతోంది.

కేసరి షురూ!


అక్షయ్‌కుమార్

వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే బాక్సాఫీసు వద్ద కాసులు కురిపించే సత్తా ఉన్న కథానాయకుడు అక్షయ్‌కుమార్. ప్రస్తుతం 'ప్యాడమ్యాన్'గా సందడి చేస్తున్నాడు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త ఏడాదిలో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అదే 'కేసరి'. ఈ సినిమా శుక్రవారం నుంచి మొదలైంది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకొన్నాడు అక్షయ్. "కేసరిలో నా లుక్‌ను మీతో పంచుకోవడం గర్వంగా ఉంది. నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కొత్త ఏడాదిలో మొదలుకావడం మరింత ఆనందంగా ఉంది"అని ట్వీటారు. తలపాగా, గుబురు గెడ్డం... తీక్షణమైన చూపులతో అక్షయ్ గెటప్ ఆకట్టుకునేలా ఉంది. 19 శతాబ్దంలో జరిగిన సారాగడి యుద్ధం నేపథ్యంలో సాగే చిత్రమిది. అనురాగ్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అక్షయ్‌తో కలిసి కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది హోలీకి ఈ సినిమాను విడుదల చేసే సన్నాహాల్లో చిత్ర బృందం ఉంది.


జాక్వెలిన్ ఫెర్నాండెజ్

సల్మాన్‌కు ఏమాత్రం తగ్గకుండా..!

కథానాయికలు నిత్యం గ్లామర్ మంత్రమే జపిస్తారు అనుకుంటాం. ఇప్పుడు వాళ్లూ రూటు మారుస్తున్నారు. హీరోలకు ఏ మాత్రం తగ్గకుండా డిష్యుం... డిష్యుం అంటూ ఫైటింగులకు సిద్ధమైపోతున్నారు. శ్రీలంక సుందరి జాక్వెలైన్ ఫెర్నాండెజ్ ఇప్పుడు అదే పనిలో ఉంది. ఆకట్టుకునే శరీరాకృతి ఉన్న బాలీవుడ్ భామల్లో జాక్వెలైన్‌ది ముందు వరసే. సల్మాన్‌తో 'కిక్'లో అందాలతో కిక్కెంచింది. ఇప్పుడు 'రేస్ 3'లో నటిస్తోంది. కాసిన్ని అందాలు ఆరబోసేస్తే చాలు అనుకోలేదు ఈ భామ. కండల వీరుడికి ఏ మాత్రం తగ్గకుండా యాక్షన్ హంగామా చేస్తోంది. ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్, కిక్ బాక్సింగ్‌తో పాటు పలు యాక్షన్ విద్యల్ని నేర్చుకొంది. "ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. అందులో జాక్వెలైన్ చేసిన యాక్షన్ సన్నివేశాలు వామ్మో అనేలా ఉన్నాయి. ఈ చిత్రంలో సల్మాన్ చేసే పోరాట ఘట్టాలే కాదు జాక్వెలైన్ పంచ్ పవర్ ఏంటో కూడా ప్రేక్షకులు చూడబోతున్నారు. కచ్చితంగా జాక్వెలైన్ చేసే పోరాటాలు గురించి అందరూ మాట్లాడుకుంటారు"అని చిత్ర బృందం చెబుతోంది. ప్రస్తుతం ఈ భామ ఇండోనేషియాలో బాలీ దీవుల్లో కుటుంబంతో విహారయాత్రను ఆస్వాదిస్తోంది.

'కలెక్టర్' కర్తవ్యం


నయనతార

నయనతార ప్రధాన పాత్ర పోషించిన తమిళ చిత్రం 'ఆరమ్'. తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. గోపీ నైనర్ దర్శకుడు. ఆర్.రవీంద్రన్, శరత్ మరార్ నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. నిర్మాతలు మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఇది. కలెక్టర్ పాత్రలో నయనతార కనిపించబోతోంది. విధి నిర్వహణలో ఆమెకు ఎదురైన అనుభవాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. తమిళంలో ఇప్పటికే మంచి విజయాన్ని అందుకుంది. తెలుగులోనూ అదే ఫలితం వస్తుందన్న నమ్మకం ఉంది. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: జిబ్రాన్

డబ్బు సంపాదించడమే కాదు... దాయటం కూడా కష్టమే!

చిత్రం: జులాయి

- పంపినవారు: మారుతి, తిరుపతి

సరదా ప్రేమకథ


రాజ్ తరుణ్

ఈ సంక్రాంతికి 'అజ్ఞాతవాసి', 'జై సింహా'లతో పాటు మరో తెలుగు చిత్రమూ వస్తోంది. అదే... 'రంగుల రాట్నం'. రాజ్ తరుణ్, చిత్రా శుక్లా జంటగా నటించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించింది. శ్రీరంజని దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా 'రంగుల రాట్నం' ముచ్చట్లని రాజ్ తరుణ్ పంచుకున్నారు.

● "ఇదో సరదా ప్రేమకథ. తల్లీకొడుకుల అనుబంధానికీ చోటుంది. పక్కింటి అబ్బాయి తరహా పాత్రలో నటించాను. అల్లరి చిల్లరగా తిరిగే పాత్ర కాదు. జీవితంలో స్థిరపడిన బుద్ధిమంతుడే. ఓ అమ్మాయి విషయంలో తనకు ఎదురైన అనుభవాలేంటో సరదాగా చెప్పాం. పెద్దలు, యువతీ యువకులు అంతా కలసి పండక్కి ఎలాంటి సినిమాకి వెళ్లాలనుకుంటారో. 'రంగుల రాట్నం' అలా ఉంటుంది"

● "అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థలో ఇది నా రెండో చిత్రం. 'ఉయ్యాల జంపాల' సమయంలో ఓ సహాయ దర్శకుడిగానూ పని చేశా. ఇప్పుడు కేవలం కథానాయకుడిగానే సెట్‌కి వచ్చా. నేను మారానేమో గానీ, అన్నపూర్ణ సంస్థ విలువలు, పాటించిన ప్రమాణాల్లో ఎలాంటి మార్పులూ లేవు"

● "దర్శకురాలు శ్రీరంజని తొలి చిత్రమిది. కథ నచ్చితే మరో విషయం ఆలోచించను. ఈ యేడు కచ్చితంగా మూడు సినిమాలు చేయాలన్న ఆలోచన ఉంది"

అమీర్‌పేట్ టు అమెరికా


తేజస్, పల్లవి


అమెరికాలో అడుగు పెట్టాలనుకొనే యువత ఆలోచనలు, ఆశయాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమే 'ఎ టు ఎ' అన్నారు చల్లా భానుకిరణ్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రమిది. అమీర్‌పేట్ టు అమెరికా... అనేది ఉపశీర్షిక. తేజస్, పల్లవి దొర, బ్రహ్మానందం, వేణుమాధవ్, తనికెళ్ల భరణి, రాజేశ్వరి, సమ్మెట గాంధీ కీలక పాత్రలు పోషించారు. మదన్ కొమండూరి, పద్మజ కొమండూరి నిర్మాతలు. స్వప్న కొమండూరి సమర్పిస్తున్నారు. హైదరాబాద్‌లో మేయర్ బొంతు రామ్మోహన్ పోస్టర్‌ని విడుదల చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "అమెరికా వెళ్లేందుకు యువతరం పడే పాట్లు ఎలాంటివనే విషయాల్ని ఆసక్తికరంగా చూపిస్తున్నాం. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు.

ఆ బయోపిక్ నుంచి తప్పుకుందా?

ఎయిర్‌హోస్టెస్ నీర్జాబానోత్ జీవిత కథతో వచ్చిన 'నీర్జా'లో టైటిల్ పాత్ర పోషించి అందరిచేత సెభాష్ అనిపించుకొంది సోనమ్ కపూర్. ఈ సినిమా ఆమె కెరీర్‌నే మార్చేసింది. దీని తర్వాత మరో బయోపిక్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది సోనమ్. ప్రముఖ భారతీయ క్లాసికల్ చిత్రకారిణి అమృత షెర్‌గిల్ జీవిత కథలో సోనమ్ నటించడం ఖాయమైంది. పాత్ర కోసం షెర్ గిల్ కుటుంబ సభ్యులను కూడా సంప్రదించింది సోనమ్. కానీ ఇప్పుడు ఈ చిత్రం నుంచి సోనమ్ తప్పుకున్నట్టు బాలీవుడ్ సమాచారం. "నేను ఆ పాత్రను చేయలేను" అని ఓ సందర్భంలో చెప్పింది సోనమ్. ఆ సినిమా కోసం ఎక్కువ రోజులు కేటాయించవలసి రావడంతోనే సోనమ్ తప్పుకుందని మరికొందరు అంటున్నారు. ప్రస్తుతం అక్షయ్‌కుమార్‌తో కలిసి నటించిన 'ప్యాడ్‌మ్యాన్' విడుదల కోసం ఎదురుచూస్తోంది సోనమ్.

పెళ్లికబురు వేసవిలోనే?

అనుష్కశర్మ వివాహం విరాట్ కోహ్లీతో ఘనంగా జరిగింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో జరిగే పెళ్లి సోనమ్‌దే అంటున్నాయి హిందీ చిత్ర సీమ వర్గాలు. ఆనంద్ ఆహుజాతో కలిసి సోనమ్ చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న ఫోటోలు సోషల్ మీడియాలో ఎప్పటి నుంచో సందడి చేస్తున్నాయి. పెళ్లి విషయంలో సోనమ్ ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయలేదు. "సోనమ్ పెళ్లి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో వేసవిలో జరగనుంది. ముఖ్యమైన అతిథుల మినహా పెళ్లికి ఎవరినీ ఆహ్వానించడం లేదు"అని సోనమ్ సన్నిహిత వర్గాలు అన్నట్టు సమాచారం.


సోనమ్‌కపూర్



పందొమ్మిదేళ్లకే న్యాయవాదిగా భారత్‌లో సంచలనం సృష్టించిన జేఎంఎం ముడుపుల కేసుని చూశారామె.. అతిచిన్న వయసులోనే దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనలో పాల్గొన్నారు! నేపాల్ రాజ్యాంగ నిర్మాణంలోనూ ఆమెది కీలకపాత్ర. ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం గుర్తించి, అక్కడ చిత్రపటం అలంకరించిన అరుదైన మేధావుల్లో తొలి భారతీయురాలు! రాజకీయనాయకులు తమ ఇష్టారాజ్యంగా ఐఏఎస్‌లని బదిలీచేయకుండా.. వాళ్లకి నిర్ణీత పాలనాకాలం ఉండితీరాలన్న సుప్రీం తీర్పు వెనకున్న వాదనా పటిమ కూడా మన మేనకా గురుస్వామిదే! 'మన' అంటారేమిటీ.. అనుకుంటున్నారా? ఈమె మన తెలుగమ్మాయే. మేనకతో వసుంధర ప్రత్యేక ఇంటర్వ్యూ ఇది..

స్త్రీకి స్వాతంత్ర్యమే..

అసలైన విప్లవం!

■ ఇంత చిన్న వయసులో ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి!

ఈ రంగంపై నాకున్న అమితమైన ప్రేమతో!! ఇంటర్‌లోనే నాలో ఈ బీజం పడింది. ఇదిగో ఇప్పటికీ తనివితీరా నేను ఈ రంగాన్ని ఆస్వాదిస్తున్నాను. నన్ను కలిసే కాలేజీ విద్యార్థులందరికీ నేను చెప్పేది ఇదే. 'మీకు ఇప్పుడు ఎన్నో ఆకర్షణలూ.. చూపు మళ్లించే అవాంతరాలూ ఉన్నాయి! వాటన్నింటినీ మించి మీదైన రంగంలో సాధించాలంటే మీరు చేసే పనిని వందకు రెండొందల శాతం ఇష్టపడండి అని. ప్రతి ఒక్కరూ కాలాన్నీ, పరిసరాలని మరచిపోయి మరీ పనిచేయగలగాలి. అప్పుడే అద్భుతాలు చేస్తారు. ఉదయం తొమ్మిదింటికి వచ్చి.. ఆరింటికల్లా పని ఆపి ఇంటికెళ్లాలని మనసు పోరుపెడుతోందా? మీకు ఆ రంగం పనికిరాదనే అర్థం!

■ రాజ్యాంగ చట్టాలపై ఆసక్తి వచ్చిందెప్పుడు?

నాకు పందొమ్మిదేళ్లప్పుడు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్(ఏజీ) కార్యాలయంలో శిక్షకురాలిగా ఉన్నాను. అక్కడ అతిచిన్న వయస్కురాలిని నేనే అప్పుడు! అప్పట్లో సంచలనం సృష్టిస్తున్న జైన్ హవాలా కేసు, జార్ఖండ్ ముక్తిమోర్చా కేసుల వాదనల్లో పాల్గొన్నా. అప్పుడే నాకు మన రాజ్యాంగంపై ఆసక్తి ఏర్పడిందీ అప్పుడే. ఇంటర్న్‌షిప్ తర్వాత ఆక్స్‌ఫర్డ్‌లో బీసీఎల్ కోర్సులో చేరా. అప్పట్నుంచే రాజ్యాంగాల రచన, నిర్మాణం గురించి అధ్యయనం చేయడం మొదలుపెట్టా.

> **ఆక్స్‌ఫర్డ్‌లో..**
>
> మిల్నర్ హాలు.. ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్న రోడ్స్ హౌజ్ అనే అధ్యయన కేంద్రంలో ఉండే ఓ అతిపెద్ద మంటపం ఇది. మేధావిగా ప్రపంచస్థాయి ప్రభావం చూపినవాళ్ల చిత్రపటాలని ఈ మిల్నర్ హాలులో అలంకరిస్తుంటారు. ఇప్పటిదాకా ఆ హాలులో ఏ భారతీయుల పటం కూడా లేదు. గత సెప్టెంబర్‌లో మేనకా గురుస్వామి చిత్రపటాన్ని అందులో పెట్టారు మరి!

అప్పుడే నాకు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం రోడ్స్ స్కాలర్‌షిప్ కూడా వచ్చింది.

■ దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనకి సహకరించే అవకాశం ఎలా వచ్చింది?

ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్నప్పుడే నేనో న్యాయవాద సంస్థలో పనిచేస్తుండేదాన్ని. వాళ్లు ఐరాసకి సహకరిస్తుండేవారు. అలా ఐరాస తరపున దక్షిణాఫ్రికా రాజ్యాంగ నిర్మాణంలో పాల్గొన్నా. ఆ తర్వాత నేరుగా ఐరాసకి సలహాదారుగానూ చేశాను. ఈలోపు అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎం పూర్తిచేశాను. ఓవైపు ఐరాసకి సేవలందిస్తూనే.. అమెరికాలోనే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశాను. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలిగా చేశాను. మూడు పడవలపై నడక! వీటన్నింటి మధ్యే భారత రాజ్యాంగంపై నాకున్న ప్రేమ.. వేధిస్తూ ఉండేది. ఇక ఉండబట్టలేక సుప్రీంకోర్టులో న్యాయవాదిగా నమోదుచేసుకున్నా.

■ నేపాల్ రాజ్యాంగ నిర్మాణంలో పాలుపంచుకున్నారట?

అవును! ఐరాస తరపున నేను అందులో పాల్గొన్నా. కానీ అక్కడ పనిచేయడం చాలా సవాలుగా అనిపించింది. ప్రతి దేశానికి రాజ్యాంగ రచనకంటూ ఓ కమిటీ ఏర్పడుతుందని తెలుసుకదా. మనదేశ రాజ్యాంగానికి అలా 142 మందితో కమిటీ ఏర్పడింది. కానీ నేపాల్‌కేమో ఆరువందల మందితో కూడిన కమిటీ! పైగా.. ఎవరికీ మెజార్టీ లేదు. దాంతో ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో తమ పాత్ర, తమ ఆలోచనా కనిపించాలని పట్టుబట్టేవాళ్లే. వాళ్లకి రాజ్యాంగ రచనపై సూచనలిచ్చి.. మొత్తానికి ఆ పనిని 2008లో ఓ కొలిక్కి తెచ్చాం.

■ ఎన్నో రాజ్యాంగాల నిర్మాణంలో పాల్గొన్న మీకు.. మన భారత రాజ్యాంగాన్ని చూస్తే ఏమనిపిస్తుంది?

అందరికీ ఓటుహక్కు కల్పించడం.. మనం సాధించిన ఓ మహాద్భుత విజయం. అమెరికా ఎన్నో ఏళ్ల తర్వాతకానీ నల్లజాతీయులకి ఆ అవకాశం ఇవ్వలేదు. స్వీడన్, న్యూజిలాండ్ వంటివి మొన్నీమధ్య వాటిని సాధించాయి. ఆ తర్వాత రిజర్వేషన్. యాభై ఏళ్లకిందటి దాకా కలిసి నీళ్లు తాగనివారు, కలిసి కూర్చోలేనివారూ, కనీసం ఎదుటపడలేని కులాల వాళ్లు కూడా కేవలం పాతికేళ్లలో పక్కపక్కనే కూర్చుని పార్లమెంటులో చర్చించగలుగుతున్నారంటే.. అది రాజ్యాంగం చలవే! మూడో అంశం.. శాసన, న్యాయ, కార్యాచరణ మూడు వ్యవస్థల నడుమ సరిసమానమైన అధికారులుండటం. ఇక్కడెవరూ ఒకరికొకరు అధికులు కారు. ఒకరు శ్రుతిమించితే ఇంకొకరు కట్టడి చేసే 'చెక్ అండ్ బ్యాలన్స్' పద్ధతుంది. ఇక్కడ 'రాజ్యాంగ పుస్తకం' ఒక్కటే అందరికన్నా శక్తిమంతమైంది!

■ ఓ నిరుపేద కన్నీటిని మన రాజ్యాంగం తుడవగలదా?

కచ్చితంగా! మన రాజ్యాంగం కల్పించే విద్యా హక్కు, జీవించే హక్కు.. ఇవన్నీ అతని ఆకలిని పోగొట్టగలవు. కావాల్సిందల్లా అతనికి ఆ హక్కులున్నాయనే విషయం తెలియడమే. ఆ చైతన్యంతో ప్రభుత్వాన్ని 'నాకు అవన్నీ ఇస్తావా? లేదా?' అని అతను నిలదీయొచ్చు. నిజానికి మన ప్రాథమిక అవసరాలు తీర్చే ప్రభుత్వ సంక్షేమ పథకాల వెనకున్న స్ఫూర్తి ఏమిటనుకుంటున్నారు? మన రాజ్యాంగమే! అవన్నీ వాళ్లు మనపై దయతలచి.. జాలిపడి ఇవ్వట్లేదని గుర్తుంచుకోవాలి. అది మన హక్కు! వాళ్లు కాదు కుదర్దు అంటే సాయపడటానికి ఎంతో శక్తిమంతమైన సుప్రీంకోర్టు, న్యాయవ్యవస్థా ఉన్నాయి.

■ అమ్మాయిలకి మీరిచ్చే సూచన..?

ఒక్క న్యాయవాద వృత్తేకాదు.. ఎందులోనైనా సరే మీరు మగవారికంటే మూడురెట్లు ఎక్కువ కష్టపడి తీరాలి అని నా దగ్గర పనిచేసే అమ్మాయిలకి చెబుతుంటాను. 'ఎదుటివాళ్లు మనలో పాల కోసమే వెతుకుంటారు. దొరికితే వెంటనే 'ఈ అమ్మాయి పనికిరాదు!' అంటూ తీర్పులు ఇచ్చేస్తుంటారు. కాబట్టి.. ప్రతి విషయంపైనా కూలంకషంగా శ్రమించమంటాను.

■ 'స్త్రీలకి పూర్తి స్వేచ్ఛ రావడమే.. భారత్‌లో రావాల్సిన చివరి విప్లవమవుతుంది!' – చాలా చోట్ల ఇదే మాట అంటుంటారు మీరు. వివరిస్తారా?

> **తెలుగు ఆమె 'తల్లి' భాష**
>
> మేనక తల్లిదండ్రులు హైదరాబాద్‌లోనే పుట్టిపెరిగారు. తండ్రి మోహన్ గురుస్వామి ఆర్థిక నిపుణుడు. తండ్రి వైపు వాళ్ల పూర్వీకం తమిళనాడులోని వేలూరు. తల్లిదేమో చిత్తూరు.. కట్టమంచి. మేనక పుట్టిందీ ఇక్కడే. ఆరో తరగతిదాకా ఇక్కడే చదువుకున్నారు. ఆ తర్వాత అమ్మానాన్నలతో దిల్లీ వెళ్లిపోయ్యారు. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ(ఎన్ఎల్ఎస్ఐయూ)లో బీఏ ఎల్ఎల్‌బీ చేరి.. బంగారుపతకంతో బయట కొచ్చారు. అతిచిన్న వయసులోనే నాటి అడ్వకేట్ జనరల్ కార్యాలయంలో పనిచేశారు. తర్వాత విదేశాలెన్ని తిరిగినా దిల్లీలోనే స్థిరపడ్డారు.

ఒక్కసారి ఉత్తరభారతదేశాన్ని చూస్తే మీకు అర్థమవుతుంది. సాయంత్రమైతే ఇక్కడిలా అమ్మాయిలు ధైర్యంగా బయటకు రాలేరు. భద్రత ఉండదు. ఆఫ్రికాదేశాల్లోనూ అలాంటి పరిస్థితి లేదు. అలాంటివాళ్లూ బయటకొచ్చేలా చూడగలిగితే.. వాళ్లు ఆర్థికంగా స్వాతంత్ర్యం సాధిస్తే దేశ భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. అంతకంటే పెద్ద విప్లవమేదీ మనకు అక్కర్లేదన్నది నా అభిప్రాయం.

■ సాధారణంగా రాజ్యాంగ నిపుణులనగానే తల 'పండినవాళ్లే' ఉంటారు కదా! మీరేమో ఇంకా పీజీ విద్యార్థినిలా ఉన్నారు!


నిజంగానా! నాకూ తల పండుతూనే ఉందండీ(నవ్వు). చూడండి.. అక్కడక్కడా నెరుపు వచ్చేస్తోంది. ఐటీ, క్రీడారంగాల్లో పాతికేళ్లకే గొప్ప అద్భుతాలు చేస్తున్నారండీ. ఒక్క మా న్యాయరంగంలోనే.. ఓ స్థాయి అందుకున్నవాళ్లందరూ వయసు పైబడ్డవాళ్లుగా కనిపిస్తున్నారు. వాళ్లమధ్య నేను కాస్త చిన్నదానిగా ఉన్నానంతే.. అదీ నలభై మూడేళ్ల వయసులో!

– జె. రాజు

రంగవల్లిక

19 చుక్కలు,
9 వరుసలు,
9 వచ్చేవరకూ.


మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.





- పండుగ మాధురి
హైదరాబాద్

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.





- అంగర గాయత్రి
ఆలమూరు

17 చుక్కలు,
17 వరుసలు.


మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అనాజ్‌పూర్,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

ఈ చాయ్‌వాలీ తెలుసా!



ఉత్తర్ ప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లా. అక్కడే పాపీ హౌస్ ఫ్యాక్టరీ ఉంది. దానికి దగ్గర నాలుగు చక్రాల బండిపై ఒక అమ్మాయి టీ అమ్ముతోంది. ఇందులో విశేషం ఏముంది అంటారా? ఆ అమ్మాయి చేసే టీ ఆ రాష్ట్ర సమాచార మంత్రికి బాగా నచ్చింది. ఆ అమ్మాయి ఆత్మవిశ్వాసం, కుటుంబం పట్ల ఆమెకున్న శ్రద్ధా ఆయనిన అబ్బురపరిచాయి. దాంతో స్వయంగా ఆ మంత్రే అక్కడకు వచ్చి టీ తాగారు. ఆ తరువాత ఆ అమ్మాయికి ప్రశంసలతోపాటు ఆమె చదువుకు కావాల్సిన నలభై వేల రూపాయల ఉపకార వేతనాన్ని కూడా అందిస్తామని మాట ఇచ్చారు. చాయ్‌వాలీ బిటియాగా అక్కడి వారందరికి పరిచితమైన ఆ అమ్మాయి పేరు ఆర్తీ గుప్తా. ఆమె తండ్రికి ఏడాదిక్రితం ఓ ప్రమాదంలో రెండు కాళ్లూ పూర్తిగా దెబ్బతిన్నాయి. తల్లి ఆరోగ్యం కూడా బాగోదు. చదువుకోవాల్సిన వయసులో కుటుంబ భారం మీద పడేసరికి అప్పుడే డిగ్రీ పూర్తిచేసిన ఆ అమ్మాయికి ఏం చేయాలో అర్థంకాలేదు. అమ్మానాన్నలతోపాటు ఇద్దరు తమ్ముళ్ల బాధ్యతలను ఆమెపై వేసుకుంది. కుటుంబ పోషణ కోసం చిన్న తమ్ముడితో కలిసి ఘాజీపూర్‌లో ఒక చిన్న టీ కొట్టును ప్రారంభించింది. తమ్ముళ్లు కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్నారు. ఈ మధ్యే ఆ రాష్ట్ర రైల్వేమంత్రి మనోజ్ సిన్హా లైవ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభ వేడుకల కోసం ఘాజీపూర్ వచ్చారు. ఆ సమయంలోనే ఆర్తి గురించి తెలిసి ఆమెను చూడటానికి టీ కొట్టు దగ్గరికి మంత్రే స్వయంగా వెళ్లారట. అక్కడి బెంచ్ మీద కూర్చుని టీ తాగారు. ఆ అమ్మాయి గురించి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. తాగిన చాయ్‌కి డబ్బు ఇవ్వడమే కాదు.. ఆర్తి పై చదువులకు అవసరమైన ఆర్థికసాయాన్ని చేస్తాననీ, కుటుంబానికి అండగా ఉంటాననీ హామీ ఇచ్చి మరీ వెళ్లారు.


బంగారం వెండి



24న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	30,480	30,420	30,400	30,400
ఆర్నమెంట్	28,470	28,440	28,300	28,300
వెండి (కిలో)	39,870	39,670	40,200	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,400	30,350	30,130	30,020
ఆర్నమెంట్	28,150	28,200	28,180	28,070
వెండి (కిలో)	39,500	39,900	39,300	39,100
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,090	30,090	-------	-------
ఆర్నమెంట్	27,980	27,980	2,818	2,806 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	42.00	41.90 గ్రా

ఏం వాడాలో చెబుతుంది



మనం రోజూ అనేక సౌందర్య ఉత్పత్తులన్నీ వాడుతుంటాం. మనం అలా ఉపయోగిస్తున్న సౌందర్య ఉత్పత్తి ఎంత వరకు సరైందో తెలియజేస్తుంది 'థింక్ డర్టీ' యాప్. ఇందులో ఉన్న బార్‌కోడ్ స్కానర్‌తో మన దగ్గరున్న వస్తువుపై బార్‌కోడ్‌ను స్కాన్ చేయగానే దాని వివరాలన్నీ సెకనులో చెప్పేస్తుంది. బార్‌కోడ్ లేకపోతే కేవలం పేరు టైపు చేసినా చాలు.. వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇందులో దాదాపు 8 లక్షలకు పైగా సౌందర్య ఉత్పత్తుల వివరాలున్నాయి. ఎలాంటి ఉత్పత్తి వాడితే మంచిదో కూడా మనకు సలహాలిస్తుంది.

నజరానా

అల్లం ముక్కలను చిన్న చిన్నగా కోసి, టేబుల్‌స్పూను తేనెలో రాత్రిపూట నానబెట్టి, పరగడుపున తినాలి. దీనివల్ల జీర్ణశక్తి మెరుగుపడటంతో పాటు చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

అక్కకి ఉంటే నాకూ వస్తుందా?

ప్ర నాకు 30 ఏళ్లు. మా పెద్దమ్మ కూతురికి రొమ్ము క్యాన్సర్ ఉందని బయట పడింది. అప్పటి నుంచి నాకూ భయం పట్టుకుంది. మా అక్కకి ఉంటే.. మా కుటుంబంలోనూ ఉన్నట్టే కదా! అంటే నాకూ కచ్చితంగా వస్తుందా? నేను వెంటనే పరీక్ష చేసుకోవాలా? కుటుంబంలో లేకున్నా వచ్చే అవకాశం ఉందా? కారణాలేమిటీ? దీన్నెలా నివారించొచ్చు?

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

జ మీరు అంతగా భయపడాల్సిన అవసరం లేదు. రొమ్ముక్యాన్సర్‌ని ముందుగానే పసిగట్టగలిగితే దాన్నుంచి బయటపడే అవకాశం 90 శాతం దాకా ఉంటుంది. మీ పెద్దమ్మ కూతురికి ఉన్నందువల్ల మీకూ వస్తుందనే ఆందోళన కూడా అనవసరమే. ఎందుకంటే ఈ క్యాన్సర్‌కి గురైనవారిలో కేవలం ఐదు నుంచి పదిశాతం మంది కుటుంబాల్లో మాత్రమే ఈ సమస్య ఉందని తేలింది. నిజానికి, రొమ్ముక్యాన్సర్ బాధితులు 50 శాతంమందిలో అది రావడానికి కారణమేంటో స్పష్టంగా చెప్పలేకపోతున్నాం. ఏవో కొన్ని అంశాలు క్యాన్సర్‌కి దారితీయొచ్చని మాత్రమే ప్రస్తుతానికి చెప్పగలుగుతున్నాం. మామూలుకంటే ముందే రుతుక్రమం మొదలుకావడం, ఆలస్యంగా పిల్లల్ని కనడం, మెనోపాజ్ జాప్యం కావడం. వీటితోపాటూ స్థూలకాయం కూడా ఇందుకు కారణం కావొచ్చని గుర్తించారు. పీసీఓడీ, కొన్నిరకాల చర్మ సమస్యలూ, మెనోపాజ్ ఇబ్బందుల కారణంగా తీసుకునే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ(హెచ్ఆర్‌టీ) కూడా క్యాన్సర్‌కి దారితీస్తోందని తేలింది. మీకూ ఇలాంటి సమస్యలున్నాయేమో చూసుకోండి. దాంతోపాటూ ప్రతి అమ్మాయి రొమ్ముల్లో ఏర్పడే మార్పుల్ని గమనిస్తూ ఉండాలి. వాటి పరిమాణంలో వచ్చే విపరీతమైన మార్పులూ, అవాంఛిత గడ్డలూ, ఎప్పుడూ లేనివిధంగా చనుమొనల నుంచి ద్రవాలు కారడం, అక్కడి చర్మం ఒక్కసారిగా మందంగా మారడం.. వీటిలో ఏవి కనిపించినా వైద్యుల్ని సంప్రదించాలి. సాధారణంగా 40 ఏళ్ల తర్వాత ప్రతి ఏడాది రొమ్ముక్యాన్సర్‌ని నిర్ధారించే మమ్మోగ్రఫీ చేయించుకోవడం మంచిది. మీ విషయానికి వస్తే.. మీ కుటుంబంలో ఇదివరకే ఉందని అంటున్నారు కాబట్టి వైద్య నిపుణులని కలవండి. ఆమె పర్యవేక్షణలో ఓసారి పరీక్ష చేసుకుంటే సరిపోతుంది. ఆందోళన అక్కర్లేదు.

అట్లకాడలా అనిపిస్తుంది కానీ..



గుండ్రంగా, వెడల్పుగా మందంగా ఉండే ఆకులతో పొట్టి కాండం చుట్టూ వరుసల్లో అమరి ఉండే ఈ అందమైన సక్యులెంట్‌కు 'ఎడారి క్యాబేజ' అనే పేరు అతికినట్లు సరిపోతుంది. ఎడారి క్యాబేజి శాస్త్రీయ నామం కాలంచో టెట్రాఫిల్లా లేదా కాలంచిక థైర్సిఫ్లోరా. ఆకుల ఆకారం అట్లకాడను పోలి ఉండటంతో ఈ మొక్కను పాడిల్ ప్లాంట్ అని కూడా అంటారు. అలాగే ఈ ఆకులు సాధారణంగా ముదురు గులాబీ లేదా ఎరుపు రంగు అంచుల్లో ఉండటం వల్ల దీన్ని రెడ్‌పాన్ కేక్ ప్లాంట్ అని కూడా పిలుస్తారు. ఈ ఎడారి క్యాబేజీకి 'ఫ్లాప్ జాక్', 'డాగ్ టంగ్' అనే పేర్లు కూడా ఉన్నాయి.

ఎడారి క్యాబేజి సులువుగా పెరిగే మొక్క. ఇంట్లోనూ, బయటా ఎక్కడైనా పెంచుకోవచ్చు. బయట అయితే పూర్తి ఎండలోనే కాదు, కొద్దిపాటి నీడలో కూడా పెంచుకోవచ్చు. ఇంట్లో అమర్చుకోవాలనుకున్నప్పుడు వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. మొక్క మొదట్లో నీళ్లు నిలవకూడదు. కంపోస్టూ, ముక్కలుగా ఉండే కోకోపీట్, ఇసుకను సమపాళ్లలో తీసుకోవాలి. గులకరాళ్లు/క్లేబాల్స్ కలిపిన మిశ్రమం దీనికి అనువుగా ఉంటుంది. నేల పూర్తిగా పొడిబారాక మాత్రమే తిరిగి నీళ్లు పోయాలి. దీని ఆకులూ, కాండం మీద తెల్లని పొడిలా ఉంటుంది. ఇది ఎండ తీవ్రత వల్ల మొక్కలో ఉండే నీరు ఆవిరైపోకుండా కాపాడుతుంది.



కుళ్లిపోకుండా...

ఈ మొక్కకు చీడపీడల ప్రమాదం తక్కువ. నీళ్లు ఎక్కువైతే మాత్రం సులువుగా కుళ్లిపోతుంది. వెలుతురు సరిగా సోకకపోతే ఆరోగ్యంగా పెరగదు. ఈ మొక్కకు ప్రత్యేకంగా ఎరువులు వాడక్కర్లేదు. మట్టి మిశ్రమంలో కలిపిన కంపోస్టు సరిపోతుంది. కావాలంటే మూడునాలుగు నెలలకొకసారి ఎన్‌పీకే ఉండే గుళికలను పావు చెంచా చొప్పున 17.17.17 నిష్పత్తిలో మట్టిలో కలిపితే సరిపోతుంది.

ఎడారి క్యాబేజీకి పిలకలు బాగానే వస్తాయి. ఈ పిలకలనే విడదీసి సులువుగా ప్రవర్ధనం చేసుకోవాలి. అంతే కాదు ఆకుల నుంచి కూడా కొత్త మొక్కలను తయారు చేసుకోవచ్చు. ముదిరిన ఆకులను కాండం నుంచి జాగ్రత్తగా విడదీసి సూటిగా ఎండపడకుండా, వెలుతురు మాత్రం బాగా పడేలా చూసుకోవాలి. ట్రేలో కొద్దిగా తేమగా ఉండే మట్టి మిశ్రమంమీద పెట్టి ఉంచితే చిన్న చిన్న మొక్కలు వృద్ధి చెందుతాయి. వెలుతురు సరిగా లేకపోతే ఎడారి క్యాబేజీ కాంతివిహీనంగా మారడంతో పాటు వడలినట్లు అవుతుంది. అలాంటప్పుడు వెంటనే మొక్కను వెలుగులోకి మార్చుకోవాలి. దాదాపు మూడు నాలుగేళ్ల వయసున్న మొక్కల్లో పూలకాడలు వస్తాయి. ఇవి నాలుగైదడుగుల పొడవులో పసుపురంగు పూలతో అందంగా ఉంటాయి. అయితే ఒకసారి పూలు పూస్తే ఇక ఆ మొక్క నెమ్మదిగా చనిపోతుంది. కానీ బెంగపడాల్సిన అవసరం లేదు. అప్పటికే బోలెడన్ని పిలకలు తయారై ఉంటాయి.

ఎడారి క్యాబేజీ మొక్కకి ఎక్కువ శ్రద్ధ అవసరం లేదు. అయినప్పటికీ మొక్క ఎండిపోయినా, పాడైపోయినా ఆకులు కోయడం, వంగిపోయిన కాండాన్ని కత్తిరించి చక్కని ఆకారంలో ఉండేలా చూసుకోవడం, సాగిపోయిన కాండాన్ని కత్తిరించి గుబురుగా పెంచుకోవడం ఇవన్నీ ఈ మొక్కను మరికొంచెం ప్రత్యేకంగా, ఎక్కువ ఆకర్షణీయంగా చేస్తాయి.

- బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

వర్చ్యువల్ వివేకం

హైటెక్‌సిటీలోని ఓ బహుళజాతి సంస్థ. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ ఉద్యోగుల కోసం.. ఇంటర్వ్యూలు చేపడుతోంది.. ఎందుకో ప్రాంగణం కోలాహలంగా ఉంది.. అభ్యర్థుల పలకరింపులే కాదు.. బీప్‌బీప్ మంటూ మిషీన్ల వింత చప్పుళ్లు.. సరదా షేక్‌హ్యాండ్లు.. 'హాయ్ బ్రో.. ది సీజ్ అప్పారావు ఫ్రం శ్రీకాకుళం' నైస్ టు మీట్ యూ.. ఐ యామ్ రోబో 5.0, ఫ్రం ఆర్టిఫిషియల్‌ల్యాబ్ కాలనీ'.. రోబో వాలకం చూశాక అప్పారావు గుండెల్లో దడ పుట్టింది. ఇంటర్వ్యూలో దాంతో పోటీపడగలమా? వెనకాముందు చూశాడు. సగం మంది తనలాంటి పట్టభద్రులుంటే.. ఇంకో సగం రోబోలే దర్శనమిచ్చాయి. అవి- సీ లాంగ్వేజ్‌ను చిన్నచూపు చూస్తున్నాయి. జావా జమానా ఎప్పుడో పోయిందని గేలి చేస్తున్నాయ్..!

అప్పొద్దున నిద్రలేస్తే వాట్సాప్.. అపరాత్రి వరకు ఫేస్‌బుక్. ఆన్‌లైన్ లావాదేవీలు చిటికెలో చేస్తాడు. 'అమ్మో! మా అబ్బాయి టెక్నాలజీలో జెమ్. మహా చురుకు' ఉత్తినే కితాబిస్తుంటారు తల్లిదండ్రులు. ఇంటర్వ్యూకు వచ్చాకే తన బండారం బయటపడింది. ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. భయం పట్టుకుంది. రోజుకొక టెక్నాలజీ వచ్చేస్తోంది? ఉద్యోగ ప్రపంచంలో- ఇవ్వాళ ఉండేది రేపు ఉండటం లేదు. మొన్నటివరకు ప్రోగ్రామింగ్‌దే రాజ్యం అన్నారు. ఆ తరువాత క్లౌడ్ కంప్యూటింగ్ మేఘాలు అలుముకున్నాయి. ఆ మధ్యన బిగ్‌డేటాను హగ్ చేసుకున్నారు. ఇప్పుడు కృత్రిమమేధ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్.. ఓరినాయనో! ఈ ఉద్యోగాల వేట వద్దు.. ఏంటీ జీవితం? మనసునిండా ఒక పెద్ద క్వశ్చన్‌మార్కు? "యువత ఇప్పుడా ప్రశ్నల కొక్కేనికి వేలాడుతూ.. కన్ఫ్యూజన్‌లో ఉంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తమలోని శక్తియుక్తులు ఏమిటో అంచనా వేసుకోలేకపోతున్నారు. దిశానిర్దేశం లేదు. ఇలాంటి సమయంలోనే యువతకు వివేకానంద బోధనలు అవసరం' అంటున్నారు రామకృష్ణమఠానికి చెందిన స్వామి శితి కంఠానంద. ఈ నెల 12న వివేకానంద జయంతి సందర్భంగా.. జాతీయ యువజనోత్సవాన్ని జరుపుకోనున్నాం. నేటి యువతకు వివేకానంద బోధనలు ఎలా ఉపకరిస్తాయో చూద్దాం.

12న జాతీయ యువజన దినోత్సవం



సెల్‌ఫోన్‌లో మెమొరీ తక్కువుంటే బెంగ పెట్టుకుంటారు. వైరస్ వస్తే అల్లాడిపోతారు. దీనినే మనసుకు వర్తింపజేద్దాం. దేవుడు మనిషికి జ్ఞాపకాలను, కల్పనాశక్తిని ఇచ్చాడు. కానీ, ఆ మెమొరీలోని చెడును మాత్రమే మాటిమాటికీ బయటికి తీసి గుర్తు చేసుకుంటుంటాం. కానీ, మంచిని గుర్తు చేసుకోవడం లేదు. ప్రతికూల ఆలోచనలను బుర్ర నిండా నింపుకోవడం వల్ల.. చదువులు, ఉద్యోగం, జీవితం దుర్భరంగా మారుతుంది. మంచిని మరువకండి. చెడును వదిలేయండి.. అన్నది వివేకం.



హౌ టు లివ్ (ఎలా జీవించాలి), వై టు లివ్ (ఎందుకు జీవించాలి) ఈ రెండు ప్రశ్నలే యువత సమస్యలన్నిటికీ పరిష్కారం. శరీరం హార్డ్‌వేర్, మనసు సాఫ్ట్‌వేర్‌లాంటివి. ఈ రెండూ కరెంటుతోనే నడుస్తాయి. దేహం, మనసు అంతే.. సృష్టిలోని శక్తితో పని చేస్తాయనుకోవచ్చు. ఈ సత్యం తెలుసుకుని ఓ నాలుగడుగులు ముందుకు వేస్తే.. ఆధ్యాత్మిక మార్గం కనిపిస్తుంది. ఆ ఆలోచన కలిగినప్పుడు.. జీవితానికున్న ప్రయోజనం ఏమిటనే అన్వేషణ ప్రారంభిస్తారు. జీవితమంటే ఖరీదైన కార్లు, ఫోన్లు, దుస్తులు కాదు. కంటికి కనిపించినదల్లా సొంతం చేసుకోవాలనే తాపత్రయం కాదు. వీటన్నిటికీ మించిన పరమార్థం ఉంది. ఆ వివేకం మనకుంటే.. ఇవన్నీ చిన్నవైపోతాయి. బతుకుపట్ల స్పష్టత వస్తుంది.

– స్వామి శితికంఠానంద, రామకృష్ణమఠం, హైదరాబాద్



'మీకు ఇష్టమైన ఉపాధిని ఎంచుకోండి. జీవితంలో ఒక్క రోజు కూడా పని చేయాల్సిన అవసరం రాదు..'

ఇష్టంలేని పని చేయొద్దన్నదే వివేకానందుని మాటలోని అంతరార్థం. ఇప్పుడున్న వర్చువల్ ప్రపంచంలో అప్‌డేట్ కాకపోతే ఆగిపోతాం. అదే ఇష్టమైన కెరీర్ అయితే ప్రత్యేకించి నేర్చుకున్నట్లు ఉండదు. ఆ పనిలోనే ఆనందం లభిస్తుంది. అప్పుడది రోబోటిక్స్, మెషిన్‌లర్నింగ్, ఎనలిటిక్స్.. ఇంకేదైనా ఫర్వాలేదు. ముందు ఇష్టంతోనే ఎంపిక చేసుకోవాలి. అప్పటికున్న డిమాండ్‌తోనో, అందరూ అటు వెళుతున్నారనో కాదు.

'జీవితమంటే ఉద్యోగమే కాదు..'

ఉద్యోగాల్లోనే జీవితాన్ని వెతుక్కోవాల్సిన అవసరం లేదు. సమాజానికి పనికొచ్చే సృజనాత్మక ఆలోచనతో ఒక స్టార్టప్ ఏర్పాటు చేయొచ్చు. పదిమందికి పనికొస్తున్నామన్న సంతోషం లభిస్తుంది. ఆత్మ చైతన్యాన్ని కలిగిస్తుంది. ఆ మంచిని రుచి చూడాలంటే పరోపకారం తప్పనిసరి. సహాయపడేందుకు డబ్బు అక్కర్లేదు. నువ్వు డిగ్రీ పట్టభద్రుడివైతే పదో తరగతి పిల్లలకు ట్యూషన్లు చెప్పినా చాలు. మంచి ఆలోచన లక్షల మందిని కదిలిస్తుంది.

'అహమే పెద్ద వైరస్..'

ఏ ఆఫీసులోనైనా బృందంతో కలిసి పనిచేయాలి. 'నేను' అనే భావనకు బదులు 'నా ప్రపంచం' అనే విశాల దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. ఒకరికి కష్టం వచ్చినప్పుడు మరికొన్ని చేతులు అండగా నిలుస్తాయి. అభద్రత తొలగుతుంది. ఒకరికొకరం ఉన్నామన్న భరోసా లభిస్తుంది. 'నేను'కే పరిమితం అయితే ఆఖరికి ఒంటరితనమే మిగులుతుంది. టీమ్‌వర్క్‌లో అహానికి తావుండకూడదు.

'ఆ కిటుకు తెలిస్తే పరిష్కారాల ప్రోగ్రామర్ మీరే..'

కంప్యూటర్ ప్రోగ్రామ్‌లను ప్రాక్టీస్ చేస్తారు. విదేశీ భాషలు నేర్చుకుంటారు. సంకల్పబలాన్ని కూడా మీకు మీరే బలపరుచుకోవాలి. అప్పుడు ఏ సమస్యకు అయినా పరిష్కారం కనిపెట్టే ప్రోగ్రామర్ కావొచ్చు. ఆ కిటుకు తెలిసినప్పుడు పడినా పైకి లేవడం సులువని చెబుతారు వివేకానందుడు. కెరటం నాకు ఆదర్శం.. పడినందుకు కాదు.. పడి లేచినందుకు అన్నది అందుకే!

'మూర్ఖులకు సెలవు దినం సోమరితనం..'

ఆ బద్ధకాన్ని స్మార్ట్‌ఫోన్‌తో పెంచిపోషిస్తున్నారు. ఒకప్పుడు టెక్నాలజీ లేదని బాధపడేవాళ్లు పెద్దలు. ఇప్పుడు కొత్తతరం సరిగా సద్వినియోగం చేసుకోవడం లేదని బాధపడాల్సి వస్తోంది. గాడ్జెట్స్‌తో నన్ను నేను ఆర్భాటంగా ప్రపంచముందు వ్యక్తపరుచుకోను. నాలోని నైపుణ్యం, సృజనాత్మకత, వివేకంతో కూడిన ఐడెంటిటీనే కోరుకుంటాను అనుకోవాలి. చేతిలో ఖరీదైన కొత్త వెర్షన్ ఫోన్ ఉంటేనే.. నలుగురిలో గొప్పని పొంగిపోవడంలో ప్రయోజనం లేదు. కొత్త వెర్షన్ ఫోన్ల వెంట పరిగెడితే.. నష్టమే తప్ప లాభం శూన్యం. గాడ్జెట్స్‌తో మీరు మరింత చురుగ్గా మారే బదులు సోమరితనంతో మూలన కూర్చుండిపోతే ఎలా..?

'ముందు నువ్వు.. ఆ తరువాతే దేవుడు'

ఒకచిన్న వైఫల్యంతోనే ఆగిపోతారు. ఇక, నా వల్ల ఏ పనీ కాదు.. అనుకుని కుంగిపోతారు. మనసు నిండా ఒకటే నెగిటివ్ ఆలోచనలు. పదే పదే తిరగతోడుకునే చేదు జ్ఞాపకాలు. ఆ స్వభావం వల్ల కుంగుబాటు వస్తుంది. కొన్నిసార్లు ఆత్మహత్యలకు దారితీస్తుంది. అందుకే వివేకానందుడు.. ముందు నీ మీద నువ్వు విశ్వాసం పెట్టుకో. ఆ తరువాతే దేవున్ని విశ్వసించు అన్నారు. ధైర్యవంతుల్ని, శక్తివంతులనే విజయం సిద్ధిస్తుంది. కాబట్టి పరీక్షల్లో ఫెయిలయితేనో, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక కాకపోతేనో జీవితం ఆగిపోదు. వెయ్యిసార్లు విఫలమైనా మళ్లీ ప్రయత్నించు.

'ఎందుకా వర్చువల్ భయం..'

వర్చువల్ ప్రపంచాన్ని సృష్టించుకున్న మనమే..దాని కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాం. నిమిషానికి ఒకసారి సెల్‌ఫోన్ చూడకపోతే భయం. ఎవరో కాల్ చేసుంటారు.. ఇంకేదో మెసేజ్ వచ్చుంటుంది.. ఇదే ఉలికిపాటు. అదొక జబ్బుగా మారితే ప్రమాదం. అందుకే ఆయన 'వస్తు వ్యామోహం వద్దు. నిస్సంగ బుద్ధి అలవర్చుకోండి' అని చెప్పారు.

గుండీ సవ్వడి

ఈ మలుపు... ఫ్యాషన్ పిలుపు



షర్ట్ అందం మొత్తం దాని బటన్‌లోనే ఉంటుందంటారు డిజైనర్లు. మరి మన చొక్కాలకు ఎప్పుడూ స్ట్రెయిట్‌ఫార్మట్‌లోనే బటన్‌లు, ఖాజాలు ఉంటున్నాయి. ఇలానే ఎందుకుండాలి? కొంచెం మార్చి చూస్తే కొత్తగా మెరవొచ్చు కదా? అనుకున్నారు కొందరు. ఆ దిశగా మార్పులు చేశారు. అంతే అదే ట్రెండ్ అయింది. సైడ్ బటన్స్, యారో, ఆఫ్‌మూన్, క్రాస్ బటన్స్ అంటూ కొత్తగా మార్కెట్లోకి వస్తున్నారు. బటన్ల వద్ద పట్టీతో అందం తెస్తున్నారు. యువతను ఆకట్టుకుంటున్నారు. నూతనత్వం కోరుకునే యువత వీటిని ఆదరిస్తున్నారు. ఈసారి మీ డిజైనర్ దగ్గరికి వెళ్లినప్పుడు షర్ట్‌ను ఇలా డిజైన్ చేయమని చెప్పండి. ■

సర్వేంతర్యామి

కాలుష్యంలో యువత



భారత యువతలో ఎక్కువ మందికి వాతావరణ కాలుష్యం, గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్‌వార్మింగ్(భూతాపం) అంశాలపై అవగాహన తక్కువగా ఉందని ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. దేశంలోని వివిధ ప్రముఖ నగరాలు, గ్రామాల్లో 18 - 25 ఏళ్ల లోపు యువతను వీరు పరిశీలించారు. 70.9 శాతం మందికి సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం, వాటి వల్ల కలిగే లాభాల గురించి తెలియదు. 68 శాతం మంది ప్రకృతి హిత ఉత్పత్తులను గుర్తించలేకపోతున్నారు. భూమి ఎందుకు వేడెక్కుతుంది? గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ ఏంటి? తదితర విషయాలపై 74.3 శాతం మందికి అవగాహన లేదు. భూమి ఎలా శుభ్రంగా, పచ్చగా ఉంటుంది? మనం వాడే ప్లాస్టిక్ ఎలా హానికరంగా మారుతుంది? అనేది తెలియని వారు 63.4 శాతం మంది ఉండటం బాధాకర విషయం. యువతలో అమ్మాయిలు ఎక్కువగా సామాజిక సేవలో భాగస్వాములవుతున్నారు. అదే అబ్బాయిల దగ్గరికి వచ్చేసరికి రక్తదానంలో ముందుంటున్నారు. ■

మనసులో మాట

నా మౌనం ఖరీదు... అన్న ప్రాణం

నా పెన్సిల్ విరిగిపోతే... చెక్కుకోవడానికి నాకు కష్టమని మా అన్న దాన్ని తీసుకుంటాడు. తన పెన్సిల్ నాకిచ్చేస్తాడు. ఆడుకునేటప్పుడు నా షర్ట్ బటన్స్ పోతే... తాను ఆ షర్ట్ వేసుకొని ఇంటికొచ్చి అమ్మతో తిట్లు తింటాడు. మా నాన్న టీచర్. మా అమ్మ గృహిణి. ఊర్లో ఉన్న పొలాన్నీ మా నాన్నే సాగుచేసేవాడు. అన్నకూ వ్యవసాయమంటే ఇష్టం. ఊర్లోనే మా మామ కూతురిని పెళ్లి చేసుకొని అక్కడి ఉండిపోయాడు. నాకు హైదరాబాద్‌లో ఉద్యోగం. నాకు పెళ్లైంది. అన్నకిద్దరు పిల్లలు. నాకు ఒక్కడే కొడుకు. ఊరెళ్లినప్పుడు నాకు, నా కొడుక్కు...నా భార్యకు ఇష్టమైనవన్నీ అన్నా, వదినా చేసేవారు. 2012 జనవరి 27... ఎంతో హాయిగా సాగిపోయే మా జీవితాల్లో



విషాదం... మా నాన్న మరణం. ఆయన మంచం మీద ఉన్నన్నీ రోజులు కంటికిరెప్పలా కాచుకున్నాడు మా అన్న. ఆ దిగులుతో ఏడాది గడవకుండానే మా అమ్మ ప్రాణాలు విడిచింది. నా భార్య ఆస్తిపంపకాలు చేయాలని పట్టుబట్టింది. నెల రోజుల తర్వాత నాకు ఫోన్ చేశాడు అన్న. ఒక రోజు ఊరికి రారా అని. ఇంతలో మా ఊరిలో మా చిన్నాన్న కొడుకు(తమ్ముడు) ఫోన్ చేశాడు. నీకు ఊరి బయట 11 ఎకరాలు రాసిచ్చి... ఆయన 12 ఎకరాలు తీసుకోవాలనుకుంటున్నాడని. ఈ విషయం తెలుసుకున్న నా భార్య మండిపోయింది. మే 23, 2013 అందరం ఊరికి వెళ్లాం. అప్పటికే నా భార్యకు ఊర్లో వాళ్లు ఇచ్చిన సమాచారం ప్రకారం అన్న నాకు ఏదో మోసం చేస్తున్నట్లు అనిపించింది. వెళ్లీవెళ్లగానే నా భార్య గొడవేసుకుంది. అన్న ఏదో నచ్చజెప్పబోయాడు. వినలేదు. 'ఇల్లూ మీకే కావాలి... ఒక ఎకరా భూమి మీకే ఎక్కువ ఎందుకలా?' అని ప్రశ్నించింది. మాకు బాబు ఉన్నాడు. వాడి భవిష్యత్తు ఏమిటి?' అని గట్టి, గట్టిగా ఏడ్చేసింది. చుట్టుపక్కల వాళ్లు అందరూ గుమిగూడారు. నేను తనని అడ్డుకోలేదు. ఒక్క మాటైనా నోరెత్తి మాట్లాడలేదు. నా కళ్లలోకి చూసిన అన్న వదినా, పిల్లల్ని తీసుకొని బయటికి వెళ్లిపోయారు. నేను అలా ఊర్లోకి వెళ్లాను. మా ఇద్దరికీ చిన్నప్పుడు పాఠాలు చెప్పిన మాస్టారు కన్పించారు. "ఏరా! చిన్నోడా బాగున్నావా? అదేందిరా... నీటి వసతి ఉండే భూమి నీకిచ్చి...మీ అన్న ఆ రాళ్లనేల తీసుకున్నాడంట. బాగున్న భూమిలోనే పంటలు పండక చస్తున్నాంరా? పైగా మీ నాన్న ఆరోగ్యం బాగాలేనప్పుడు. మీ అమ్మ ఆరోగ్య పరీక్షలకు మీ అన్న బాగా అప్పుచేశాడు. ఆ ఇల్లు తాకట్టు పెట్టాడంట. నీ వాటాకొచ్చిన డబ్బు వాడుకోమని ఎంత చెప్పినా వినలేదు. అదంతా నీ కొడుకు పేరుతో ఏటా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తాడు కదా. అయినా నువ్వు ఊర్లో ఉండి వ్యవసాయం చేసేదుందా? మీ అన్నకే ఆ సాగు భూమి ఇవ్వరా. వాడెప్పుడూ అంతే నువ్వు కష్టపడకూడదనే ఆలోచిస్తాడు." అని భుజం తట్టి నన్ను దాటాడు. నా మనసు గట్టిగా రోదించింది. అన్నను నేను ఎంత అపార్థం చేసుకున్నాను. నీటి వసతున్న భూమి ఆ 12 ఎకరాలకంటే 5రెట్లు ఎక్కువ ధర పలుకుతుంది. అందుకే అది నాకివ్వడానికి చూసి ఉంటాడు. ఆ రాళ్ల భూమి అన్న తీసుకొని కష్టపడదామనుకొని ఉంటాడు. అన్నా నన్ను క్షమించు అని అడగాలని పొలం దగ్గరికి పరుగుతీశాను. అన్న ఉన్నట్టుండి పడిపోయాడని వదినా, పిల్లలు ఎదురు పరిగెత్తుకుంటూ వస్తున్నారు. అందరం కలిసి పరుగుతీశాం. నా భార్య మాటలకు, నా మౌనానికి పగిలిపోయిన అన్న గుండె ఇక కొట్టుకోలేక... అప్పుడే ఆగిపోయినట్టుంది. 'అన్నా నన్ను క్షమించు... ఒక్కసారి బతుకు' అని ఎంతగా ఏడ్చానో... పక్కనోళ్ల మాటలు విని... బంధుమిత్రులను ఎప్పుడూ అపార్థం చేసుకోకండి. ఒక్కోసారి మీ మౌనమూ వారికి మరణశాసనం అవుతుంది. నాలా ఆత్మీయుణ్ని కోల్పోయి జీవితాంతం ఏడవకండి.

- రమేశ్, కరీంనగర్

ఇంటర్ దాటని ఇంటర్‌నెట్ గురు

స్ఫూర్తి ఛానల్

కటౌట్ లేకున్నా ఫర్లేదు కంటెంట్ ఉంటే చాలు.. యూట్యూబ్ దునియాలో దున్నేయచ్చు. తెలంగాణలోని రామగుండం ప్రాంతం (యైటింక్లయిన్ కాలనీ)లో ఉండే హఫీజ్‌కు సరిగ్గా ఈ మాటలు సరిపోతాయి. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేసిన కుర్రాడు తెలుగు టెక్ ప్రపంచంలో ఐదులక్షలకి పైగా సబ్‌స్క్రైబర్స్‌తో దూసుకెళ్తున్నాడు. ఇటీవలే 'నంబర్‌వన్ తెలుగు టెక్ కంటెంట్ క్రియేటర్' అవార్డు అందుకొని తెలుగు కుర్రాళ్ల సత్తా చాటాడు. ఈ క్రెడిట్ అంతా యూట్యూబ్‌లో వీడియో చూసినంత సులువుగా.. ఫేస్‌బుక్‌లో లైక్ కొట్టినంత హాయిగా రాలేదా కుర్రోడికి. ఆ కష్టం... ఆ తపన... ఆ విజయం గురించి... అతని మాటల్లోనే...



ఇంటర్మీడియేట్‌లో చదువు ఆపేసిన నేను పేపర్‌బాయ్‌గా, ఎస్టీడీబూత్‌లో పనిచేశాను. అక్కడనుంచి ఓ కంప్యూటర్ శిక్షణాసంస్థలో ఐదువందల జీతానికి పనిలో చేరాను. కంప్యూటర్స్‌ను చూసుకునే బాధ్యత నాదే. ఖాళీ సమయంలో ఎం.ఎస్.ఆఫీస్, ఎమ్ఎస్‌డాస్ నేర్చుకున్నాను. నేర్చుకున్న అంశాలను మిగతా శిక్షణార్థులకు అర్థమయ్యే విధంగా చెప్పేవాణ్ని. ఇది గమనించిన మరో శిక్షణాసంస్థ పిలిచి మరీ ఫ్యాకల్టీగా ఉద్యోగం ఇచ్చింది. ఐదు నెలల్లోనే ట్యూటర్‌గా నిలదొక్కుకున్నాను. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవడమనే ఆసక్తే నన్ను నడిపించింది.

అలా యూట్యూబ్‌లో పాపులర్..

2012లో ఇంటర్నెట్ ఊళ్లోకి వచ్చింది. గూగుల్‌లో 'హౌ టు లెర్న్ టాలీ' అని టైప్ చేసి టాలీ నేర్చుకున్నాను. అలానే 'సి' లాంగ్వేజ్. ఓ రోజు అడ్వాన్స్ ఎక్స్‌ఎల్ వీడియోలకోసం యూట్యూబ్‌లో వెతికితే.. ఒక్కటే కనిపించింది. దీంతో కంప్యూటర్ కోర్సులపై వీడియోలు చేస్తే బావుందనుకున్నా. స్క్రీన్‌రికార్డింగ్ సాఫ్ట్‌వేర్ నేర్చుకుని వీడియోలు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశా. నాలుగునెలల్లో వందమంది సబ్‌స్క్రయిబర్స్ వచ్చారు. ఫొటోషాప్‌లో తెలుగు టైప్ చేయటమెలా? యాంటీవైరస్‌ను ఎలా కంప్యూటర్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి? ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తు చేయటం.. ఆధార్‌కార్డులో పేరు మార్పు చేయటంలాంటి ఉపయోగకరమైనవి చెప్పేవాడిని. నెలకు ఆరువేలు వచ్చేవి. 4 జీ విప్లవంతో 'మొబైల్ సీక్రెట్ సెట్టింగ్ టిప్స్' వీడియో వైరలైంది. రెండు నెలల్లో ఇరవై లక్షల మంది చూశారు. దీంతో ఐదువేలుండే ఛానల్ సబ్‌స్క్రైబర్స్ సంఖ్య.. చూస్తుండగానే లక్ష దాటింది. 'తెలుగులో లక్ష సబ్‌స్క్రయిబర్స్ ఫీట్ సాధించిన తొలి టెక్ ఛానెల్ నాదే. ఈ ఫీట్‌కి యూట్యూబ్ 2017 ఫిబ్రవరిలో సిల్వర్ ప్లేట్ బటన్ పంపించింది. అప్పట్లో నెలకు లక్షన్నర ఆదాయం వచ్చేది. ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేయాలి?.. లాంటి ఎన్నో ఉపయోగకరమైన వీడియోలు చేశాను. క్లిష్టంగా ఉండే 'సి' లాంగ్వేజ్‌ని విద్యార్థులకోసం సరళంగా చెప్పే పాఠాలు నా ఛానల్ కన్పిస్తాయి.

తెలుగు టెక్ ట్యూట్స్

వీడియోల సంఖ్య:	2,300
సబ్‌స్క్రైబర్స్ సంఖ్య:	5,17,000
వీక్షణల సంఖ్య:	5,01,75,128

అదే నా కల..

'ఆరేళ్ల క్రితం ఎక్కువ గంటలపాటు కంప్యూటర్ కోర్సులను సాధన చేసేవాడ్ని. అది చూసి నవ్విన వాళ్లున్నారు. దుస్తులు సరిగా ఉండవని.. నువ్వు మా పెళ్లికి రావద్దన్న బంధువులూ ఉన్నారు. నాలాంటి పేద వాడికి యూట్యూబ్ ఆసరా ఇచ్చింది. ఆదుకుంది. నెట్టింట్లో గూగులమ్మ నా గురువు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల దగ్గరికి వెళ్లి నెట్‌లో చురుగ్గా ఉండటం ఎలాగో తెలియజేయాలనేదే నా కల.